UNIVERSAL LIBRARY
OU_204234
UNIVERSAL LIBRARY

OUP--552--7-7-66--10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T83/V33 E Accession No. T4122

Author వాసుదేవస్వాం వాడా

Title ఇంద్ర ధనుస్సు 1954

This book should be returned on or before the date last marked below.

1

ఉత్తరదక్షిణాలకు, తూర్పు పడమరలకు పోయేరోడ్లు ఒక యెత్తయిన దిబ్బమీద కలిసినై. రోడ్డుకు రెండుప్రక్కలా ఇళ్ళు ఒకదానినంటి ఒకటి బారులుతీరి నిలిచివున్నాయి. గ్రామంమధ్య నాలుగురోడ్లు కలిసిన చోట గంటస్తంభం ఒకటి గర్వంతో అన్నిటికంటే పైకి తలయెత్తి చూస్తున్నది. గ్రామానికి దిగువ సెలయేరు ఒకటి మెలికలు తిరుగుతూ ప్రవహిస్తున్నది. చలికి యేటి పైభాగమంతా గడ్డకట్టుకుపోయి నీలంగా కనబడుతూంది. అక్కడక్కడ మంచు పగిలినచోట్ల మాత్రం నీరు పైకి నల్లగా కనబడుతున్నది.

కావడి భుజాన వేసుకొని ఆ కావడి విసురుకి అటు యిటు ఊగుతూ, ఒక స్త్రీ అక్కడి పూరిండ్లలో ఒకదానిలోంచి బయటికివచ్చింది. మంచు మీద కాలు జారకుండా జాగ్రత్తగా దిబ్బమీదనుంచి దిగుతూ యేటిముఖం పట్టింది. యేటిదగ్గర కావడి దించి నలువైపులా పరకాయించి చూచింది. చూపుమేర దూరంలో యెవ్వరూ లేరు. గ్రామమంతా మంచు పొరలలో మరుగుపడి నిద్రపోతున్నది. ఆమె ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, యేదో అవ్యక్తమైన బాధతో గ్రామంవైపు చూచింది. కొద్దిసేపాగి కావడి అక్కడే దిగవిడిచి, యేటిఅంచునే ముందుకి నడవసాగింది.

పోతున్నకొద్దీ పాదలు దట్టమైన మంచులో నిండామునిగి ఉ [illegible] వేళ్ళ పై కొనలుమాత్రం కనబడుతున్నాయి. వాటి [illegible] ని, ఆమె నెమ్మదిగా పోతున్న[illegible]. [illegible]నికి తగులుతుంటే, రెండుచేతులతో [illegible] చటుక్కున దారికనబడటం మా[illegible] పోయి, గాజుముక్కలలాంటి జీవంలేని [illegible]డసాగింది.

ఇక్కడ భూమి కృంగిపోయిన కందకాలతోను, చిన్న చిన్న మట్టి దిబ్బలతోను, చెదురుగా అక్కడక్కడ పెరిగిన పొదలతోను కూడిఉన్నది. కాని ఆ స్త్రీ ఆ కందకాలనుగాని, ఆ దిబ్బలనుగాని, పొదలకు కాసిన పండ్లనుగాని చూడటంలేదు. చిందరవందరగా ఇనుపముక్కలు, గుడ్డ పేలికలు, వాటి మధ్య కొన్ని నల్లని ఆకారాలు పడిఉన్నచోటికి ఆమెదృష్టి పోయింది.

రెండడుగులు ముందుకివేసి ఆమె మోకరిల్లింది. అదుగో అతని శవం! నిటారుగా వెల్లికిలబడిఉన్నది. నల్లరాతితో చెక్కినట్టుగా ఉన్నది అతని ముఖము. అతని ముఖంలోని ప్రతివంపు తెలిసిన ఆమెకు - ఇప్పుడు ఆ విడిపోయిన పెదవులు, మూతబడిన కండ్లు, చెదరిపోయిన ముక్కు క్రొత్తగా కనిపిస్తున్నాయి. తలలో ఒక వైపు లోతైన రంధ్రము, దానిచుట్టు యెర్రని తోరణంలాగ రక్తమూ కనిపిస్తున్నాయి.

ఆ గాయంతో బాధపడి బాధపడి, ప్రాణాలు విడిచిఉంటాడని ఆమెకు తెలుసు. ఆ నీచులు అతని గుడ్డలు ఊడదీసుకుపోతుండగా అతడింకా ప్రాణాలు విడిచేఉండడు. చావుకంటే భయంకరమైన ఆ హంతకులే అతని శవాన్ని అట్టి ఘోరస్థితికి తెచ్చారు. యుద్ధం జరిగినరోజు - అతడు చని పోయినరోజు - నల్లటి పొగమంచు కురిసి వాళ్ళందరి శరీరాలను నల్ల రాళ్ళకుమల్లె మార్చివేసింది. ఆ రోజు వారి శరీరాలమీది వస్తువులేమీ తీయటానికి అవకాశంలేదు. అయినా అతని వస్తువులన్నీ దొంగిలింప బడ్డాయి. అతని పెద్దకోటు, బూట్లు, లాగు, మేజోళ్ళు బలవంతంగా ఆ శరీరంనుండి విడదీశారు...

ఆ తీవ్రమైన చలికి ఒక పాదం చిట్లిపోయి మాంసము వేలాడు తున్నది—

మెల్లిగా ఆమె చేతితో శవంయొక్క భుజాన్ని తాకింది. అది
ాగ ఉంది.

ది. కండ్లు పొడి ఆరిపోయినై,
తుపాకిగుండు రంధ్రంపడి. ...ళ్ళపగలే
, పడిఉన్నాడు ఆ... ముద్దుబిడ్డడు
నే పూడుకపోయింది.

అతని నల్లని
కాని నుదుటిమీద ఉ
అతని గాయందగ్గర రక్త
ఇక్కడికి వచ్చిం
కుంటుంది. కాని అట్లా
ఆ శవానికిగూడా బాధ

"నా చిట్టితండ్రీ..
అతని నల్లని బరు
అప్రయత్నంగా అన్నది.

కదలికలేకండా ఆ ముఖ
పోయిందామె. తీవ్రమైన చలిగాలి
స్ఫురించనేలేదు. చూస్తూనే ఉన్నది.

రెక్కలు రెపరెపలాడించుకుంటూ
దరిదాపునఉన్న ఒక పొదదగ్గర వాలింది. రక్త
వైపు యేదో ఆలోచిస్తున్నట్టు కొంతతడవుచూచి, మెల్ల
ఆ గుడ్లను తాకింది. చలికి ఆ గుడ్లు రాయిలాగ కఠినంగా.
చేత సన్నని శబ్దమయింది.

కొడుకు ముఖంలోకిచూస్తూ తన్నుతాను మరిచిఉన్న ఆమె మే
కున్నది.

"ఇన్స్...స్స్..."

మంచు ముద్ద ఒకటితీసి కాకిమీదికి విసిరింది. కాని ఒక గంతువేసి మెల్లదిగా యెగిరి ఒక కొమ్మమీదికి చేరుకున్నది. ఆమె లేచి మళ్ళీ కొంత సేపు కొడుకుముఖంలోకి తనివిదీర చూచుకొని వచ్చినదానినే యేటిఒడ్డుకి వెళ్ళిపోయింది.

మంచు చిల్లిఉన్నచోట యేటిలో కావడి నింపుకొని, ఆ భారంతో ముందుకి వంగుతూ, దిబ్బయెక్కింది. ప్రొద్దుబాగాయెక్కినా, యింకా మంచు దట్టంగా కురుస్తూనే ఉన్నది.

ఇంటిముందు కాపలాకాస్తున్న సైనికుడు చలికి వొణికిపోతూ, అటూ, ఇటూ గస్తీ తిరుగుతున్నాడు. కొంకర్లు తిరిగిపోతున్న చేతులను

్డు. చినిగిన బూట్ల
ఆ వచ్చే స్త్రీ 'ఫెడోసి
కి పరీక్షగాచూచి మరీ
న్నట్టు 'ఫెడోసియా'
ఎక్కడి పోయా వింత
ంతో సన్నని గొంతు

వ్యధను వెలిబుచ్చే జవాబు
య్యిదగ్గరకిపోయి దానిమీద
మంటను యెగవేసింది.

ళ్ళు తెచ్చిపెట్టు"

ళ్ళున్నాయి? కావాలంటే తీసుకు తాగ
చెప్పింది 'ఫెడోసియా'

రానీ......నీ పని పట్టిస్తా......" అని కోపం
రెండవ స్త్రీ.

'ోసియా' తనలో అనుకున్నది 'ఆయనట! భలే మగడు
కాడు...కానీ___'

పొయ్యిలో పుల్లలు యెగవేస్తూ కూర్చున్నది 'ఫెడోసియా.' తాను యేకాకి అయిపోయినందుకు విచారించసాగింది. గ్రామంలో మూడు వందల గడపవరకున్నది. ఒక్కొక్క యింటికి ఒక్కొక్కరైనా యుద్ధానికి వెళ్ళిపోయివుంటారు. వాళ్ళందరిలో తన కొడుకుమాత్రం సమీపంలో యేటిఒడ్డున జర్మన్లు నిరాకరించుటచే సమాధికూడాలేకుండా పడివున్నాడు నెలరోజులకు పైగా ఆ శవం అక్కడ పడివుంది. చలికి శిలగామారి పాదాలు విచ్చి మాంసపు ముక్కలు వ్రేళ్ళాడుతున్న స్థితికివచ్చింది. ఆ శవంతోపాటు ఇంకా అనేక శవాలు పడివున్నమాటనిజమే. కాని అందులో ఆ గ్రామస్థుల బిడ్డలుగాని, అన్నదమ్ములుగాని, భర్తలుగాని లేరు. తన కొడుకు ఒక్కడే తన స్వగ్రామమైన ఆ ఊళ్ళో, శవంపూడ్చటానికిగూడా దిక్కులేక యేటివొడ్డున పడివుంటూ, వాడిమీద కాకులు వాలి పొడుస్తుంటే చూడవలసిన దురదృష్టం తనకే పట్టింది. కాని అన్నిటికంటేగూడా ఆ

జర్మను ఆఫీసరు తన ఉంపుడుగత్తెతో పాటు తన యింటనే నివాసం యేర్పరచుకోటం, తనను మరింత యేడ్పించటానికా అన్నట్టున్నది. ఆ ఉంపుడుగత్తె పరదేశస్థురాలైతే ఆమెకు యింతబాధ అనిపించేది కాదేమో! కాని అది తన దేశస్థురాలై ఉండికూడా తనదేశానికి తన దేశస్థులకు, యెర్రసైన్యంలో ఉన్న దాని భర్తకు, వీరోచిత మరణంపొందిన ఆ యేటిఒడ్డున పడివున్న యోధులకు అపచారముచేసి, ఆ జర్మనువాని అల్ప విషయాలకు ఆశపడి ద్రోహం చేస్తున్నదని తలుచుకున్నప్పుడు 'ఫెడోసియా' రక్తం వుడికిపోయేది. అటువంటి నీచురాలు తనయింట్లో నివాసం చేస్తూ పైగా తనపైన అధికారం చెలాయించుతుంటే సహించటం యెట్లా? పైగా అది సిగ్గుపడడానికి బదులు గర్వంతో వీధుల్లో తిరుగుతూ అందరినీ బెదిరించటం!—

"ఆగు, ఆగు, నీ పని యిప్పుడుకాదు—" అనుకున్నది 'ఫెడోసియా' తనలోతాను, ఆ స్త్రీ నుద్దేశించి.

"ఉండు నీ పని పట్టిస్తాను. ఏమో అనుకుంటున్నావు కాబోలు" అని లోపలినుంచి ఆ రెండవ స్త్రీ కేకలువేస్తున్నది. కాని 'ఫెడోసియా' లెక్క చేయటంలేదు.

చరచర బరువుగా పడుతున్న పాదాల చప్పుడు వినవచ్చినా ఆమె అటువైపు తిరిగి చూడలేదు. ఆ వస్తున్నది యెవరో ఆమెకు బాగా తెలుసును. ఆమె ముఖం గంభీర రూపంతాల్చింది.

'కర్ట్ వెర్నర్' పొయ్యిదగ్గర కూర్చున్న 'ఫెడోసియాను' గమనించ కుండానే ఆ గదిదాటి పడకగదిలోనికి వెళ్ళిపోయాడు.

"ఏమిటిది? ఇంకా పక్కమీదనుంచి లేవనేలేదా?"

పడుకొనివున్న ఆ రెండవ స్త్రీ కోపంతో మూతి ముడుచుకున్నది.

లేచి "యేంచెయ్యను? నువ్వు ఎప్పుడూ యిల్లువిడిచి పోతుంటివి, కను విసుగెత్తిపోతున్నది. నీదారిని నీపన్లమీద పోయి నన్నొక్కదానిని ఈ ముసలి ముండతో వదిలేస్తావు—అదెప్పుడో నా ప్రాణాలు తింటుంది."

మంచం కొనను కూర్చున్నాడతడు.

"పిచ్చిదానా! నీకేం కొదువ చెప్పు? నువ్వీప్రాంతాలకు రాణివి. కాలంటే గ్రామఫోను పెట్టుకుని కాలం గడుపుకోరాదూ? తీరిక కలిగిన

ప్రతినిముషం నీతోనే గడుపుచుంటిని. యుద్ధమాయెను—యెప్పుడు యేదో ఒకపని తగులుతునే ఉంటుంది.”

ఆమె నిట్టూర్పు విడిచి అన్నది—“యుద్ధం! యుద్ధం!! —ఎప్పుడూ యుద్ధమేనా... సెలవు తీసుకొని నన్నిక్కడనుంచి తీసుకువెళ్ళిపోగూడదూ?”

“వెఱ్ఱిదానా, సెలవు పుచ్చుకోటానికి యిదా సమయం? ఇప్పుడు నిన్ను ఒంటరిగా జర్మనీకి పంపినప్పటికి అక్కడమాత్రం యేంచేస్తావు చెప్పు? ఇక్కడే ఇట్లా వుండటం యిష్టంలేదా నీకు?”

ఆమె జవాబుచెప్పలేదు. పక్కమీదనుంచి లేచి దుస్తులు వేసుకొన సాగింది. కర్ట్ వెర్నర్ మంచంమీదనుంచి లేచి ప్రక్కనున్న కుర్చీలో కూల బడి ‘పుస్సీ’ వైపు చూస్తూ కూర్చున్నాడు. ఆమె అంటే ‘కర్ట్ వెర్న’కి నిజంగా యిష్టమే. లేకుంటే ఆమెను మూడునెలలపాటు దగ్గర ఉంచుకో గలడా! ఇంతకుముందు తన అనుభవంలోకి వచ్చిన స్త్రీలకంటే ఆమెలో ప్రత్యేకత కనిపిస్తున్నది. అంతేగాక ఇక్కడి స్త్రీలందరికంటే యీమెలో చాలాభేదం ఉన్నది.

“అన్నట్టు, ‘పుస్సీ’ ఇక్కడి పంతులమ్మ నీ అక్కనటగదూ?”

‘పుస్సీ’ నిలువునా నీరైపోయింది. కొద్దిసేపాగి తల ఒక ప్రక్కకు వంచి ‘కర్ట్’ వైపు నాజూకుగా చూచింది. ఈ చూపే అతనిని తనవైపు ఆకర్షిస్తుందని ఆమెకు బాగా తెలుసు.

ఆమె సన్నని వ్రేళ్ళు కురులను చెవుల వెనక్కు తీసుకున్నాయి. ఆమె చెవుల పైభాగం సన్నగావుండి జంతువు చెవుల్లాగ తమాషాగా వున్నాయి. పళ్ళుగూడా మొనకొనంగా ఉన్నాయనిపించింది. ‘కర్ట్ వెర్న’కి.

“అయితే కావచ్చు—దానికేం?”

కురులమీద ఆమె వ్రేళ్ళు ఆడుతుంటే, ఆ రంగువేసిన గోళ్ళు రక్త సిక్తమైన పులిగోళ్ళలాగ మెరుస్తున్నాయి.

“అవును, ఆవిడ నా అక్క కావచ్చును. అంతమాత్రంచేత యిప్పుడేమొచ్చింది?”

“మీ అక్కకి మేమంటే కిట్టదుగదూ?”

‘పుస్సీ’ కండ్లల్లో అనుమానం స్ఫురిస్తున్నది.

“అయితే మా అక్కమీద గూడా కన్ను వేశావేమిటి!”

వికృతంగా నవ్వాడతడు.

"ఓహోహో! యేమన్నావు? దాని మొహానికితోడు దానిమీద కన్ను వేయటం కూడానా? పెద్ద పర్వతంలాగ దాని శరీరమూ అదీనూ..." అంటూ ఆగిపోయాడు. తన భార్యలాగ ఉంటుందనబోయి గుర్తుకి తెచ్చుకొని చటుక్కున ఆగిపోయాడు.

ఈ మాటలు వింటూ 'పుస్సీ' తన అందమైన శరీరాన్ని చూచుకుని మురిసిపోయింది.

"అవును—అది లావుగానే ఉంటుంది"

"నీకు యీ ప్రాంతంలోనే అక్కకూడా ఉన్నదన్న సంగతి యింత వరకు చెప్పావుగాదేం?"

"ఎందుకూ చెప్పటం? అది యిక్కడ ఉంటుంటే నే నెక్కడో ఉంటుండేదానిని. సాధారణంగా కలుసుకోటంకూడా జరిగేదికాదు. అసలు దానికీ నాకూ చాలాభేదం ఉంది..."

"భేదం అంటే?"

'పుస్సీ' ఆలోచిస్తూ తలదువ్వుకుంటూనే ఉన్నది. చెవికి తగిలించిన లోలకులలోని యిమిటేషన్ వజ్రం కళ్ళు చెదిరేటట్టు మెరుస్తోంది.

"మురికి వెధవలందరికీ యేమిటేమిటో చెప్పుకుంటూ తిరుగుతుంటుంది. యెప్పుడూ దాని కదేగోల"

"అంటే బోల్షివిక్ పార్టీ సభ్యురాలన్నమాట"

"ఏమో-ఏమిఏడుపో; అదంతా నాకేమి తెలుస్తుంది గనుక? అసలింతకూ దానివిషయం యిన్ని ప్రశ్నలెందుకూ? అదంటే అసహ్యం అని ఒకప్రక్కన అంటూనే ఉంటిరి?—"

"ఏదో, ఊరికే అడిగాను. అంతేగాని దాన్ని మోహించికాదులే."

ఈమాటల్లోని అంతరార్థం 'పుస్సీ' గ్రహించలేదు.

'కిట్టు' జేబులోనుంచి ఒక పొట్లం తీసి 'పుస్సీ'కి అందిస్తూ అన్నాడు. "ఇదిగో ఈ చాక్లెట్ యిద్దామని వచ్చి, అసలు సంగతే మరిచిపోయాను. ఇక వెళ్ళిపోవాలి. ఇవ్వాళ తొందరపనులు అనేకం ఉన్నాయి. అయినా తొందరగా తిరిగి రావటానికి ప్రయత్నిస్తాలే"

'పుస్సీ' ముఖం చిట్లించుకున్నది.

"మళ్ళీ నన్ను ఒంటరిగా విడిచి వెళ్ళిపోతారన్నమాట. ఇంతకూ యీ పాడుయుద్ధం యెప్పటికీ ముగిసేది ?"

"త్వరలోనే పూర్తవుతుందిలే"

"ఏమో, యెప్పటికో. మీకేం తేలిగ్గా అనేస్తారు." అని నిస్పృహతో అన్నది 'ఫ్రుస్సీ'. చాక్లెట్ పైనున్న కాగితంతీసి కోరలలాంటి ఆమె పళ్ళతో దానిని కొరికి తిననారంభించింది.

"నే వచ్చేదాకా గ్రామఫోనుతో కాలంగడుపుతుండు, మధ్యాహ్నం తినుబండారాలేమైనా పంపిస్తాలే. సరే, వస్తా..."

అని 'ఫ్రుస్సీ'ని ముద్దుపెట్టుకొని బయటికి వెళ్ళిపోయాడు. బయట కాపలా సైనికుడు చలికి వణికిపోతూ అటూ, యిటూ పచార్లుచేస్తున్నాడు. ఇంటినుండి బయటికివచ్చి వెళ్ళిపోతున్న ఆఫీసరుని చూచి 'ఎటెన్షన్'లో నిలబడ్డాడు. ఇంతకు మునుపు గ్రామసోవియట్ కార్యాలయంగా ఉండి, ఇప్పుడు జర్మను సైనిక కార్యాలయంగా మారిన ఇంటివైపుకి 'కర్ట్' వెళ్ళిపోయాడు. కార్యాలయంలోఉన్న జర్మను సైనికులు తమ ఆఫీసరుని చూడగానే నిలచి శాల్యూట్ చేశారు. కాని 'కర్ట్' అదంతా గమనించనట్టు నిర్లక్ష్యంగా ఊరుకుని – "దానిని లోపలికి తీసుకురండి" అని చెబుతూ తన ఆఫీసుగదిలోకి వెళ్ళిపోయాడు.

కుర్చీమీద కూలబడి ఒక ఆవులింతతీశాడు. 'ఫ్రుస్సీ' అదృష్టవంతురాలనుకున్నాడు. హాయిగా యిష్టంవచ్చినంతసేపు పడుకుంటుంది. తాను ప్రొద్దు పొడవకమునుపే లేచి పనిలో చేరబడాలి. దినమంతా వొళ్ళు నలగగొట్టుకుని పనిచేసినా, ఆపనికి యెప్పటికీ తరుగేఉండదు !

గొజ్జుతోలు కోటువేసుకున్న ఒక స్త్రీని సైనికులు లోనికి తీసుకువచ్చారు. 'కర్ట్' ఆమెవైపు తీవ్రంగా చూచి అన్నాడు :

"ఇదేనా ?"

"అవునండీ !"

ఆమె భారంగా, టేబిలుముందు నించున్నది. కప్పుకున్న శాలువాలోంచి కణతలదగ్గర తలవెంట్రుకలు నెరసిఉండటం కనిపిస్తున్నది. మోటుబారిన ముఖాన్నిబట్టి ఆమె రైతువర్గానికి చెందిన స్త్రీ అయిఉంటుందనిపిస్తున్నది.

"నీ పేరు ?"

"ఒలెనా కోస్ట్యుక్"

చేతిలో వేళ్ళమధ్య పెన్సిలు తిప్పుతూ 'కర్ట్' ఆమెవైపు చూడసాగాడు. నిశ్చలమైన ఆమె కళ్ళు, నుదుటిమీది ఆ చార చూస్తుంటే చాలా పట్టుదలగల మనిషనిపిస్తుంది.

"నీవు గెరిల్లాలతో కలిసి తిరుగుతుండేదానివా ?"

ఆమె భయపడినట్టుగాని, తత్తరపడినట్టుగాని కనబడలేదు. నిశ్చలంగా ఆఫీసరుమీద చూపులు నిగిడ్చి అన్నది :

"ఔను. గెరిల్లాలతో తిరుగుతుండేదాన్ని"

"ఆఁ! అవునా ?" - ఇంత ధైర్యంగాను సులభంగాను ఆమె ఒప్పుకోటం చూచి అతనికి ఆశ్చర్యం వేసింది. కాగితాలమీద ఏవో పిచ్చిగీతలు గీస్తున్నాడు.

"మళ్ళీ గ్రామానికి తిరిగి వచ్చేశావేం ? ఏంపనిమీద నిన్నిక్కడికి పంపించారు ?"

"నన్నెవ్వరూ పంపలేదు. నా అవసరంమీదనే వచ్చాను."

"ఓహో, అలాగునా ? ఏమిటాపని ?"

ఈ సారి ఆమె జవాబివ్వలేదు. మిలమిలలాడే తన నల్లని కళ్ళతో జీవంలేని ఆఫీసరు కళ్ళల్లోకి తదేకదృష్టితో చూస్తున్నది.

"చెప్పవేం ?"

ఆమె మౌనంగా ఉండిపోయింది.

"చెప్పు - ఇంతకాలము గెరిల్లాదళంతో తిరుగుతూ ఉండినదానివు హఠాత్తుగా గ్రామానికి తిరిగివచ్చేశావు. మీ దొంగసుతాలలో క్రమశిక్షణ అంటూ లేదా ? ఎందుకు తిరిగి వచ్చేశావో చక్కగా చెప్పేసెయ్యి"

"నా అంతట నేనే వచ్చేశాను. ఇక నక్కడ ఉండటానికి వీలు లేక పోయి వచ్చేశాను..."

"ఎందుకు వీలుపడలేదు ? అక్కడి పరిస్థితులు అధ్వాన్న మయ్యాయా ? మొన్నటి సంఘర్షణలో మీ నాయకుడు చచ్చిపోయాడా, యేం ? మీ దళం అంతా చెదరిపోయిందనుకుంటాను ?"

"మా దళంసంగతి నాకు తెలియదు. నేనుమాత్రం వచ్చేశాను."

"ఏమంత అగత్యంవచ్చింది ?"

ఆమె పెదవులు యేదో చెప్పబోతున్నట్టు కదలినై.

"ఈ గెరిల్లాల సంగతంతా వట్టి బూటకమని నీకీపాటికి తెలిసిపోయి ఉంటుంది. వాళ్ళు వట్టి బందిపోట్లు, హంతకులు, అందువల్లనే వాళ్ళను వదలి వచ్చేసి ఉంటావు.

ఆమె తల పంకిస్తూ అన్నది – "కాదు. ఇక నేను ఉండటానికి వీల్లేకపోయింది."

"ఎందువల్ల ?"

ముందు కొద్దిగా శంకించి, అతిప్రయత్నంమీద ఇలా అనగలిగింది. "పురుడు పోసుకోటానికి వచ్చాను."

"ఏమిటీ ?" – అని ఆశ్చర్యంతో అడిగాడు 'కర్ట్'

"నా బిడ్డను కనటానికి వచ్చాను !"

"అదా సంగతి !" – అని నవ్వసాగాడు. ఆ వెకిలినవ్వు ఆమెకు వణుకుపుట్టించింది.

"చలివెయ్యటంలేదుటే. అంత చక్కగా చలిమంట మండుతుంటే, కప్పుకుంటావెందుకు ? శాలువాతీసి పారెయ్యి"

ఆమె మారు మాటాడకుండా ఆ బరువైన శాలువాతీసి కుర్చీపైన పడేసింది.

"ఆ కోటుకూడా తీసెయ్యి"

ఆమె కొద్దిసేపు సంకోచించింది. తర్వాత కోటుకూడా తీసి వేసింది. ఆఫీసరు ఆమెను పరీక్షగా చూచాడు. అవును ! నిజంగా ఆమె నెలలు నిండిన మనిషే !

ఆమె ఆయాసంగా శ్వాసవిడుస్తున్నది. నిలబడటం ఆమెకు కష్టంగా ఉన్నదని గ్రహించే, అతడు ఇంకా ఆమెను ప్రశ్నలు వేస్తూ ఆ విధంగా కాలయాపన చేస్తున్నాడు.

తనకు సంబంధించిన ప్రశ్నలన్నింటికి జవాబులు చెప్పింది. తనకు వివాహమయిందట. పెనిమిటి యుద్ధంలో చచ్చిపోయాడట. విప్లవానికి పూర్వం ఒక భూకామందుదగ్గర ఊడిగంచేస్తూవచ్చింది. విప్లవంతర్వాత ఒక సమిష్టి వ్యవసాయక్షేత్రంలో పనిచేయసాగింది. ఈమధ్య గెరిల్లాదళం

నిర్మింపబడగానే అందులో చేరింది. ఇంతకాలమూ, తనస్థితి గెరిల్లాదళంలో యెవరికీ తెలియనివ్వకుండా ఉంచింది. నెలలు నిండిన తరువాత నడవటం గూడా కష్టమైపోవటంచేత తిరిగి గ్రామానికి వచ్చేసింది – ప్రసవించటానికి.

“సరే బిడ్డను కనటానికి వచ్చావుగదూ ?_పోయినవారం ఆ వంతెనను పేల్చేసింది నువ్వేనా ?”.

“అవును”

“ఎవరు సహాయంచేశారు ?”

“ఎవ్వరూ చేయలేదు. నే నొక్కదాన్నే చేశాను.”

“అదంతా అబద్ధం. మాకాసంగతంతా తెలుసులే. మర్యాదగా అన్నిసంగతులూ చెప్పేశావంటే బాగుంటుంది.”

“నేనొక్కదాన్నేచేశాను”

“సరే – మీ దళం యెక్కడున్నదో చెప్పు”

ఆమె జవాబివ్వలేదు. నిశ్శబ్దంగా జర్మను ఆఫీసరు ముఖంలోకి చూస్తూ నించున్నది. మళ్ళీ అదేకథ. మొండివాలకం – ప్రశ్నలకు జవాబు లేదు. ఎన్ని ప్రయత్నాలుచేసినా లాభం శూన్యం. సాధారణంగా యింత మట్టుకు తనయెదుట విచారణలోకి వచ్చినవారు మొదటినుంచీ మాట్లాడటమో లేక మొదటనుంచీ మౌనం వహించటమో చేసేవారు. ఈ మనిషి విషయంలో ఆమె మొట్టమొదట సులభంగా జవాబులు చెప్పటంచూచి, అన్నిసంగతులూ చెప్పేస్తుందనుకున్నాడు. కాని తన స్వంత విషయాలను గురించి తప్ప ఇతర విషయాలనుగురించి ఒక్క అక్షరంకూడా బయటికి రానివ్వటంలేదు. ప్రారంభంలో ఆమె ముఖం చూస్తూనే పట్టుదలగల మనిషని అనుమానపడ్డాడు. ఆభావమే చివరికి స్థిరమయింది.

“ పోనీ, నువ్వెక్కడ్నుంచి యీ గ్రామానికి వచ్చేవో చెప్పు. ”

మౌనం. బల్లమీద పెన్సిలుతో కొట్టి గద్దించి చూచాడు. కాని లాభంలేకపోయింది. విసుగుపుట్టింది; అక్కడినుంచి లేచిపోవాలనిపించింది. ఇంటికిపోయి హాయిగా ‘ఫ్రుస్సీతో’ కాలంగడిపితే యెంత బాగుంటుంది అనుకున్నాడు. కాని తనను అనేకవిధాల అవస్థలు పెడుతున్న ఆ గెరిల్లా దళానికి సంబంధించిన విషయాలు, ఈ ఖైదీతో చెప్పించితీరాలని పట్టుదలగా ఉన్నది.

"ఏం ? చెప్పవేమి ? మీ గొరిల్లాదళం నాయకుడి పేరు 'శర్లీ' గదూ ? అసలు పేరు అదికాదటగా ?"

మళ్ళీ మౌనమే ? ఆమె బాగా అలసిపోయివున్నదని గ్రహించాడు. ముఖమంతా చెమటలు కారుతుంటం కనిపిస్తున్నది.

"మాట్లాడతావా, లేదా ?"

చివరికి అతనే అలసిపోయాడు. ఆ పాడుపని వదిలేసి ఇంటికి వెళ్ళిపోవాలని బుద్ధిపుట్టింది. 'పుస్సీ' ఇంకా పక్కమీదనుంచి లేచిందో, లేకపోతే తాను లేనుగదా అని మళ్ళా ముసుగుతన్ని పడుకుందో ?

* * * *

'పుస్సీ' నిద్రపోవటంలేదు. అలంకరించుకుంటో చాలసేపు గడిపింది. మరికొంతసేపు అద్దంలో తన అందం చూచుకుంటూ మురిసి పోతూ కూర్చున్నది. అటుతర్వాత గ్రామఫోను పెట్టుకుంది. కాని విన్న పాటలే యెంతసేపు వినటం ? ఎవరితోనో మాట్లాడాలనిపించింది. కాని యెవరితో మాట్లాడటం ?

వంటగదిలోకి వెళ్ళి ఇన్ని మంచినీళ్ళు త్రాగింది. 'ఫెడోసియా' ఒకచోట కూర్చొని బంగాళదుంపలు తరుగుతోంది. ఆమె అలా తరుగు తుంటే ముక్కలు ముందున్న బుట్టలోకిపడ్డం చూస్తూ, కిటికీ అంచున కూర్చున్నది 'పుస్సీ'

"బంగాళదుంపలు చాలా చిన్నవిగా ఉన్నాయే - "

ఫెడోసియా జవాబివ్వకుండా ఊరుకున్నది.

"ఇక్కడ దొరికేవన్నీ ఇలానే చిన్నవిగా ఉంటాయా ?"

ఫెడోసియా ఈసారిగూడా జవాబివ్వలేదు.

"మాటాడితేనే నోటిముత్యాలు రాలిపోతాయా ?"

ఫెడోసియా తలపైకెత్తి ద్వేషంతో, నిర్లక్ష్యంగా 'పుస్సీ' ముఖం లోకి చూచింది. మళ్ళీ తలవాల్చి తన పనిలో మునిగిపోయింది.

"ఎందుకల్లా నన్ను జంతువుని చూచినట్టు చూస్తావు ? ఒక్కరూ నాతో మాట్లాడరే ? ఈ బ్రతుకుకంటే చస్తే మేలు" అని 'పుస్సీ' విచారంతో అన్నది.

"....................."

"నీకు నే నేమైనా ద్రోహంచేశానా చెప్పు?"

'ఫెడోసియా' 'పుస్సీ' మీదికి ఒక తీవ్రమైన చూపు విసిరింది. అంతే - జవాబుమాత్రం లేదు.

"ఒక్కదాన్నే యిలా కూర్చుని రోజులు గడుపుతున్నాను. 'కర్ట్' నూటికి, కోటికి ఒక్కసారి యిలా వచ్చి తొంగిచూచి వెళ్ళిపోతాడు. ఒక్కరైనా పలుకరించేవారు లేరు. బయటికి వెళదామన్నా చలి చంపేసే ట్టున్నది. ఇలా కూర్చుంటే నాకు పిచ్చెత్తేట్టున్నది—"

ఎదుటినుంచి జవాబు వస్తుందేమోనని చూచింది.

"మాట్లాడవేం? నేను దయ్యాన్నా, భూతాన్నా?"

ఈ మాటలు విని 'ఫెడోసియా' తలపైకెత్తింది.

"అంతెకంటేకూడా భయంకరమైనదానివి, చివరికి కుక్కకన్నా నీచమైనచావు చస్తావులే."

'పుస్సీ' ఉలిక్కిపడి నోరు వెళ్ళబెట్టి చూస్తున్నది. 'ఫెడోసియా' ఈ విధంగా అంటుందని యెన్నడూ అనుకోలేదు. ఏమిచేయనూ తోచ లేదు. కొద్దిగా కూడదీసుకుని అన్నది—

"ఏమిటీ గందరగోళం? చెప్పు! నన్నేమిచెయ్యమన్నావు? తిండిక మాడి చావమంటావా? ఈ జర్మనిక యెప్పటికీ ఇక్కడే ఉండి పోక మానరు. నాబాగు నేను చూచుకోకపోతే యెట్లాచెప్పు? నా భర్త 'నికోల్యాషా' ఈపాటి కెప్పుడో యుద్ధంలో చచ్చిపోయి ఉంటాడు. ఈ 'కర్ట్' మాత్రం చెడ్డవాడా? ఇక్కడ యింక యెంతోకాలం ఉండ బోడులే. కొద్దిరోజుల్లోనే నన్ను తన స్వగ్రామానికి తీసుకువెళ్తాడు. అక్కడ జీవితం హాయిగా ఉంటుంది. ఇక్కడ యేం సుఖం అనుభవిం చాను గనుక? అందమైన ఆభరణాలా, యేమైనానా—?"

"అవును, అవును, అంతేలే. మీ అక్క, పంతులమ్మ యెంత మంచిదో, నీవు - నీ పేరు చెప్పడానికిగూడా అసహ్యం వేస్తున్నది - అంతటి అధమురాలివి! నీ 'కర్ట్' యెక్కడికో తీసుకపోతాడని ఆశ పడుతున్నావుగాబోలు, చివరికి నిన్ను కుక్కని తన్నినట్టుగా తన్ని తరిమేసి వెళ్ళిపోతాడు...తొందరపడకు. హాయిగా నీజర్మను ప్రియుడితో నాపరుపు మీద పడుకుని కులుకుతో యెల్లప్పుడూ ఉందామనుకున్నావు గాబోలు?

మీ యిద్దరికని త్వరలోనే తేలుతుంది. మా సైనికులు వచ్చి మీ పని పడ్తారులే ...”

‘ఫ్రుస్సీ’ నిలువునా వణికిపోయింది. ఒక్కొక్క మాట కొరడా దెబ్బలాగ తగిలింది. కోపంతో కంఠం కంపిస్తుండగా యిలా అరిచింది - “పశేతే! ఆగు? నువ్వు నీళ్ళు తేవడానికి పోయి అంత ఆలశ్యం యెందుకు చేస్తావో ‘కర్ట్’కి చెప్పక మానాను! ఎక్కడికి పోతున్నదీ అతడు రాగానే చెప్పితీరుతాను.”

‘ఫెడోసియా’ ఒక్క గంతులో లేచింది. తరిగిన బంగాళదుంప లన్నీ చెల్లాచెదరై పోయినాయి. కత్తి కొంతదూరంలో పడిపోయింది. ‘ఫ్రుస్సీ’ మీదికి దూకుతున్నట్టుగా ఆమె మీదికి వంగింది. ‘ఫ్రుస్సీ’ వెల వెల బోతూ వెనుకకి తగ్గి చూస్తున్నది.

“నీ కట్లా తెలుసునే. నే నెక్కడికెళ్ళేదీను ?”

ఇంటిముందు కాపలా సైనికుడున్నాడని గుర్తుకువచ్చి ‘ఫ్రుస్సీ’ ధైర్యం తెచ్చుకున్నది.

“తెలుసుకోదలుచుకుంటే, నాకు అన్నీ తెలుస్తాయి.”

“ఛీ, పిశాచీ :...”

‘ఫెడోసియా’కి ‘ఫ్రుస్సీ’ గొంతు నులిపెయ్యాలన్నంత కోపం వచ్చింది. కాని తన ఉద్రేకాన్ని సంబాళించుకున్నది. అదీగాక అటువంటి నీచురాలిని తాకటమంటే ఆమెకు అసహ్యం వేసింది. కోపంకొద్దీ కాండ్రించి ఉమ్మి వేసి మళ్ళీ తన మామూలు చోటికిపోయి కూర్చుని బంగాళ దుంపలు తరగటం ప్రారంభించింది.

‘ఫ్రుస్సీ’ ‘ఫెడోసియా’ వైపు తల ఒక్కసారి యెగురవేసి గ్రామఫోను పెట్టుకోటానికి తన గదిలోకి వెళ్ళిపోయింది. మొట్టమొదట హాస్యపు పాట యేదైనా పెట్టాలనుకుంది. కాని కోపంతో వొళ్ళు మసిలిపోతున్నది. చేతికందిన రికార్డు యేదో ఒకటి తీసి గ్రామఫోనుమీద వేసింది. గ్రామ ఫోనులో విషాదగీతం ఆలాపన వినబడసాగింది.

‘ఫెడోసియా’ బంగాళదుంపలు తరుగుతూనే కూర్చున్నది. ‘ఐతే, ఈ నీచురాలికి అంతా తెలిసిపోయిందన్నమాట! ఆ జర్మను వెధవకిగూడా చెప్పితీరుతుంది. ఇంతవరకూ పామువిషం నోట్లో భద్రపరచుకొన్నట్టు

మూ విషయాన్ని తనలో దాస్తూవచ్చింది. కాని నామీద పగతీర్చుకోటానికి ఆవిషాన్నిప్పుడు ప్రయోగిస్తుంది. తన జర్మను మగడికి చెబుతుంది” అని ఆలోచించుకుంటున్నది.

హృదయాన్ని కంపింపచేస్తూ గ్రామఫోనులో విషాదగీతం విని పిస్తున్నది...

ఇక నేమి చేయటం? జర్మనువాడికీవిషయం తెలిస్తే ఊరుకోడు. అక్కడ యుద్ధంచేస్తూ చనిపోయిన యెర్ర సైనికులకు అంత్యక్రియలు జరుపకూడదన్న శిలాశాసనం ఇంకా అమల్లో ఉన్నది. ఆ చచ్చిపోయిన వారిని నక్కడే ఆస్థితిలో ఉంచి - వారి శరీరాలమీద గుడ్డలు కూడా పీకివేసికి - గ్రామస్థులందరికి ఒక గుణపాఠం నేర్పాలనుకున్నారు. మొదట్లో గ్రామస్థులు ఆ యోధుల శవాలను సమాధిచేయటానికి ప్రయత్నించారు. కాని ఆ ప్రాంతంమీద జర్మన్లు ఉంచిన నిఘావల్ల అది సాగలేదు. ‘పానొచుక్’ అనే యువకుడు ఒక రాత్రప్పుడు పారపుచ్చుకొని రహస్యంగా అక్కడికి వెళ్ళాడు. కాని ఆరాత్రి మొదలు అతడుగూడా తక్కినవారితోపాటు హృదయంనిండా తుపాకిగుండ్ల రంధ్రాలుపడి ఎండకు యెండుతూ, మంచుకి తడుస్తూ ఉన్నాడు. అందువల్ల ప్రజలు ఆ పరిస్థితిలో యేమీ చేయలేకపోయారు.

కాని అక్కడ చచ్చిపడిఉన్నవారిలో ఆ గ్రామస్థుల ఆత్మబంధువు లెవ్వరూలేరు. దురదృష్టవంతురాలైన ‘ఫెడోసియా’ముద్దుబిడ్డడు ‘వాస్యా’ మాత్రమే ఉన్నాడు. ‘వాస్యా’ ఉన్న సైనికదళం తలవని తలంపుగా తమ గ్రామంగుండా పోతుండటం తటస్థించింది. అతనిని చూచి విస్మయానందాలతో సంభ్రమించిపోయింది ‘ఫెడోసియా’. తల్లిని చూచి ‘వాస్యా’ కిలకిలనవ్వాడు. కాని అదీ యెంతసేపని? ఒక్క త్రుటికాలం. చూస్తుండగానే జర్మనుసైన్యం యేమరపాటున వచ్చి చుట్టుముట్టేసింది. వారి మధ్య చిక్కుకొనిపోయి ఊపిరున్నంతవరకు వీరోచితంగా పోరాడి ఆ యేటి వొడ్డున ప్రాణాలు విడిచినవారిలో ‘వాస్యా’ ఒకడు.

ఆదేరోజు అతని శవాన్ని ‘ఫెడోసియా’ కనుక్కున్నది. ఆమె హృదయమే తిన్నగా అతని శవందగ్గరికి తీసుకపోయింది. కాని అప్పటికే అతడు ప్రాణాలు విడవటమూ, జర్మనులు అతని వంటిమీద దుస్తులన్నీ ఊడదీసుకుపోవటమూ జరిగింది!

(3)

అది మొదలు యీ నెలరోజులు ఆమె అక్కడికి వెళ్తూనే ఉన్నది. తన కొడుకు శరీరం మంచులో శిలారూపంలోకి రావటమూ, కాలం చిట్లి పోయి మాంసపు ముక్కలు వేళ్ళాడుతుండటమూ, తన కండ్లయెదుట జరగటం చూస్తూనే ఉన్నది. వీళ్ళు తేవటానికి వెళ్ళినప్పుడల్లా—ఒక్కొక్క సారి రోజుకు రెండుసార్లుగూడా — తన బిడ్డను చూడడానికి అలవాటుపడి పోయింది. కాని యిప్పుడు ?... ఇకముందు యేమి జరుగుతుందో !...

గ్రామఫోనులో యింకా విషాదగీతం వినిపిస్తూనే ఉన్నది.

ఇక జర్మను ఆఫీసరు ఇది ఎట్లాగూ సాగనివ్వడు. చూస్తూఊరుకోడు. 'ఫెడోసియా' కు తన విషయమై తనకేమీ భయంలేదు. కాని యెంత సేపూ తన కొడుకు విషయమే ఆమె ఆలోచన. ఇక నుండి ఆశవాన్నయినా చూచుకునే భాగ్యం ఉండదుగాబోలు. ఇది జర్మన్లకు తెలిస్తే తన కొడుకు శవాన్ని తీసుకుపోయి, ఊరూ, పేరూ లేకుండా యెక్కడ పారేస్తారో ! ఇంకా ఆ శవానికి యెన్ని ఘోరహింసలు పెడతారో !...

గ్రామఫోను పాటను ఆమె సహించలేకుండా ఉన్నది.

'ఫ్రిస్సీ' పిచ్చెత్తినట్లు పదేపదే అదేఅదే పాట మోగిస్తున్నది. 'ఫెడోసియా' కోపంకొద్దీ బంగాళదుంపలు తరుగుతున్న కత్తి చేతిలో ఉండగానే పిడికిలి బిగించింది. కాని వేళ్ళు తెగినట్లు ఆమెకు గుర్తులేదు. కొద్దిసేపటికి వేళ్ళమీద రక్తం చూచుకుని, గుడ్డతో తుడుచుకున్నది.

గ్రామఫోనుమాత్రం రోదన చేస్తూనే ఉన్నది.

ఇకముందు యేమిచెయ్యాలా అని 'ఫెడోసియా' మనస్సు మథన పడసాగింది. తన కొడుక్కి యేదో ఘోరమైన విపత్తు రానున్నదనిపించింది. చావుకంటే భయంకరమైన ఆ విపత్తునుండి తన 'వాస్యా' ను రక్షించకపోతే యెట్లా ? కాని యేవిధంగా రక్షించటం ?...

ఇప్పుడున్న స్థలంనుంచి ఆ శవాన్ని తొలగించటం అసంభవమని ఆమెకు తెలుసు. కాని శిలగా మారిపోయిన ఆ శరీరాన్ని యెక్కడికి తీసుకుపోవాలన్నా సాధ్యపడేపనా ? ఆ హంతకులదృష్టి పడకుండా శవాన్ని దాయటం యెలా ?...

ఇంకా గ్రామఫోను పాడుతూనే ఉన్నది.

ఆ జర్మను పశువులు తన 'వాస్యా' శరీరాన్ని తాకుతారు. బూట్లతో తంతారు. 'కర్ట్ వెర్నర్' ఇదంతా చూస్తూ నవ్వుతూ నించుంటాడు! 'ఫెడోసియా' యివన్నీ తలుచుకుని భరించలేకపోతున్నది. తరుగుతున్న బంగాళాదుంపలసంగతీ, ఆరిపోతున్న పొయ్యిసంగతీ – అన్నీ మరచిపోయి, శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయింది.

ఇంతవరకు తన హృదయానికి తగిలిన గాయాలకంటే యెక్కువ మరేమీ ఉండబోదనుకున్నది 'ఫెడోసియా'. కాని అది వట్టి భ్రమ అయిపోయింది. అంతులేని కష్టపరంపరలు ముంచుకొస్తున్నాయి. ప్రజల ప్రశాంత జీవనంలో క్రమ్ముకున్న కారుమబ్బు ప్రళయవర్షాన్ని కురిపించబోతున్నది.

ఇంతకూ, ఆ నీచురాలికి తన విషయం యెలా తెలిసిఉంటుంది? ఎవరు చెప్పుంటారు?

ఎన్నెన్నో భావాలు మనోవీధిలో సంచరిస్తున్నాయి. పంతులమ్మ చెప్పిఉంటుందా? లేదు; ఆమె అలా యెప్పటికీ చెప్పదు. మరెవరు చెప్పిఉంటారు?

మొత్తానికీ విషయం గ్రామస్థులందరికీ తెలిసిందే. కాని అందరూ నమ్మకస్తులే. అయినా 'ఫ్రుస్సీ' బయటికైనా రాదాయె, వచ్చినా గ్రామస్థుల్లో ఒక్క మానవమాత్రుడైనా ఆమెతో మాట్లాడడు. ఐతే ఆమెకెట్లా తెలిసిందీవిషయం? దుఃఖంతో కృంగిపోతున్న మాతృ హృదయానికి ద్రోహం యెవరు చేసివుంటారు? తన 'వాస్యా'ను – తన ముద్దుబిడ్డయైన 'వాస్యా'ను జర్మన్ల కప్పగిస్తున్న ఆ నీచులెవరు?

చివరికి గ్రామఫోను కొద్దిసేపు గీపెట్టి ఆగిపోయింది. 'ఫ్రుస్సీ' చలికోటు వేసుకొని తయారయింది. కోటు కొద్దిగా వదులయింది. 'కర్ట్' గ్రామస్థుల్లో యెవరి వంటిమీద ఉండగానో అది ఊడదీయించి తెచ్చి 'ఫ్రుస్సీ'కి యిచ్చాడు. అది వేసుకుంటే ఆమెకు వెచ్చగా హాయనిపించింది.

'ఫ్రుస్సీ' బయటికివెళ్ళి చూచింది. చల్లనిగాలి వీస్తున్నది. ప్రదేశమంతా మంచుతో నిండిపోయి, సూర్యునికాంతిలో జిగజిగ మెరుస్తూ కండ్లకు బాధకలిగిస్తున్నది. ఏవైనా నీడలు పడినచోట్ల మాత్రం నీలంగా కనిపిస్తున్నది. గ్రామం ఉన్న యెత్తు ప్రదేశంనుంచి చూస్తుంటే చుట్టుపట్ల

ఉన్న బయళ్ళన్నీ తెల్లనిదుప్పటి కప్పినట్లుగా ఉన్నాయి. భూమ్యాకాశాలను మంచు తెర గుప్పిట్లో పట్టుకొని నలిపేస్తున్నదా అనిపిస్తున్నది. 'ఫ్రుస్సీ' దృష్టి గ్రామంలోని వీధుల్లోకి మళ్ళింది. అక్కడక్కడ జర్మను సైనికులు మాత్రం పనులు చేసుకుంటూ కనుపిస్తున్నారు. గ్రామం నడుమ ఉన్న చర్చి దగ్గిర మరఫిరంగులు, వాటిదగ్గిర సైనికులు ఆ తెల్లని మంచులో నల్లగా కనబడుతున్నారు, కాని గ్రామస్థులెవ్వరూ కనబడటంలేదు. 'కర్ట్'ని అతని కార్యాలయంలో కలుసుకోటానికి 'ఫ్రుస్సీ' నెమ్మదిగా బయలుదేరింది.

గ్రామానికి మధ్యఉన్న ఖాళీస్థలంలో ఉరికంబం-భూమిలో పాతిన రెండు గెడలూ వాటిని రెండింటినీ కలుపుతూ మరొక వాసం - నిలచి ఉన్నది. దానిమధ్య ఒక శవం వేళ్ళాడుతున్నది. ఆ గ్రామంమీద 'కర్ట్' యొక్క అధికారాన్ని సూచించే ఆ చిహ్నాన్ని చూచీ చూడనట్టుగానే దాటిపోయింది 'ఫ్రుస్సీ'. ఆమెకు ఆ దృశ్యాలన్నీ అలవాటైపోయినాయి. నెలరోజులక్రితం తాను 'కర్ట్'తోపాటు ఉండటానికి యిక్కడికి వచ్చినది మొదలు ఆమె ఆ ఉరికంబంనుంచి వ్రేళ్ళాడుతున్న కుఱ్ఱవాడిని చూస్తూనే ఉన్నది. ఇప్పుడాశవం చలికి బిగుసుకుపోయి ఒక పెద్ద మొద్దులాగ ఉరికంబాన్నుంచి వ్రేళ్ళాడుతున్నది.

స్మశానవాటికలాగ ఉన్న ఆ వీధులవెంట నడుచుకుపోతున్నదామె. పాదాలక్రింద మంచు గాజుపగిలినశబ్దంచేస్తూ పోతున్నది. అక్కడక్కడ మాత్రం యిండ్లపైన పొగ కనిపిస్తున్నది. ఆ యిండ్లు జర్మను సైనికులు నివాసం యేర్పరుచుకున్నవయి ఉండాలి. తక్కిన యిండ్లలో వంటలే లేనట్లున్నది. అసలు వంటచేయటానికి మనుష్యులేలేరేమో, కొన్నిట్లో...

ఒక యింటి తలుపు తెరచి యెవరో బయటికి తొంగిచూచారు. కాని 'ఫ్రుస్సీ'ని చూడటంతోటే దఢాలున తలుపు వేసేసుకున్నారు. గ్రామస్థులంతా ఆమెను చూస్తే కుష్ఠురోగిని చూచినట్టుగా తొలగిపోతారు. బజారులో ఆమె కనబడిందంటే పిల్లలు యిండ్లకు పారిపోతారు. పోతే పోనీ వెధవలు. ఎవరు లెక్కచేస్తారు? తిండికీ గుడ్డకీ లేక చస్తారులే పందులు. నా మట్టుకు నేను హాయిగా ఉంటాను. నాకు కావలసినవన్నీ 'కర్ట్' తెచ్చిపెడుతుంటాడు. కొద్దిరోజులు పోతే 'కర్ట్'తో పాటు దివ్యంగా జర్మనీ చేరుకుంటాను. తెలివితక్కువ కుంకలు కాకపోతే; యెర్రసైనికులు యెప్పటికో వస్తారని ఆశలు పెట్టుకు కూర్చుంటారా? వారి ఆశలన్నీ

నిరాశలు కాకుండా పుట్టాయా? జర్మన్లు యేవిధంగా జయంపొందక మానరో, అందువల్ల జర్మన్లకు పూర్తిగా సహాయం చేయకపోతే యేవిధంగా మనం నాశనం కావలసివస్తుందో అంతా నాకు నచ్చచెప్పాడు 'కర్ట్.' కానీ యీ రైతుపీనుగులకు అవన్నీ తలకెక్కవుగా. ఇంకా ఆ యెర్రసైనికుల కోసం యెదురుచూస్తున్నారు. వాళ్ళేట్లాపోతేమాత్రం నాకేం? నాకు గడవకపోతుందా? వాళ్ళందరికంటే యిప్పుడు నేనే హాయిగా బ్రతుకు తున్నాను. అని ఆలోచించుకుంటూ నడుస్తున్నది 'ఫ్రుస్సీ'.

కాళ్ళక్రింద మంచు కరకరలాడుతున్నది. మంచు వెదజల్లుతున్న వెలుతురుకి కళ్ళు జిగేలుమంటున్నాయి. అబ్బ! ఈపాడుచలిగాలి యెన్ని రోజులుంటుందో!

గుమ్మందగ్గిర కాపలా సైనికుడు ఆమెను నిరాటంకంగా లోపలికి పోనిచ్చాడు. 'కర్ట్' ఉన్న గది తలుపుమీద ఒకసారి తట్టి, జవాబు రాకముందే. చొరవచేసుకుని తలుపు నెట్టుకు లోపలికివెళ్ళింది. లోపల ఉన్న సైనికులంతా గాభరాపడిపోయారు.

"ఏమిటీ, సంగతి!" – అని 'కర్ట్' అడిగాడు.

"అబ్బే, యేమీలేదు. మీరు లేకపోతే యేమీ తోచక యిట్లా వచ్చేశాను." అని జవాబిచ్చి టేబిలుముందు నిలబడివున్న స్త్రీవైపు చూడ సాగింది. తలవెంట్రుకలు నెరసిపోతూ మధ్యవయస్సుగల ఆస్త్రీ కడుపుతో ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రక్కకువెళ్ళి 'ఫ్రుస్సీ' కుర్చీ మీద కూర్చున్నది.

"ఇంకా చాలాసేపౌతుందా?" – అని 'కర్ట్'ని అడిగింది.

"ఇంతకుముందే చెప్పలేదూ?...ఎంత తొందరపనిమీద ఉంటు న్నానో కనబడటంలేదూ?..." అని కొద్దిగా కోపంతో అని, మళ్ళీ ఆమె దగ్గరకు జరిగి "ఎన్నిసార్లు నిన్నిక్కడికి రావద్దని చెప్పాను? వినుపించు కోవుగదా! ఎంతపనిలోఉన్నానో చూడు...పని పూర్తికాగానే ఇంటికి రాకమానానా?..."

చిన్నపిల్లలాగ గారాబం చూపెట్టసాగింది 'ఫ్రుస్సీ'.

"నాకు విసుగెత్తిపోతున్నది. పోనీ మధ్యాహ్నం భోజనానికైనా రారు. ఈ ముసిల్దానితో నువ్వే మాట్లాడాలా? ఇంతమందున్నారు; వాళ్ళెవరూ చూచుకోలేరా?"

"అల్లా వీల్లేదు. ఈ ముసిల్ది గెరిల్లాదళంలోని మనిషని తెలుసునా?"

'ఫ్రస్సీ' నిశ్చేష్టురాలై పోయింది.

"ఏమిటీ, గెరిల్లాదళపుమనిషా! చూస్తుంటే యీ క్షణంలోనో, మరు క్షణంలోనో కనేటట్టున్నది!"

"సరేలే; ఇక యింటికి వెళ్ళు, కొద్దిసేపట్లో నే వచ్చేస్తాను"

గారాబంతో అతనివైపు చూస్తూ – "కొద్దిసేపు యిక్కడే ఉంటాను. ఏం? నేనుండకూడదా?" అన్నది 'ఫ్రస్సీ'.

"సరే, నీకిష్టముంటే ఉండు. కాని నీకు కాలం యిక్కడైనా సరదాగా గడువదు" అని సమ్మతించాడు 'కర్ట్'.

'ఫ్రస్సీ' తన కోటు బొత్తాములు విప్పి విశాలంగా కూర్చున్నది. టేబిలుముందు నిల్చున్న ఆ స్త్రీ వైపు తన కళ్ళు వప్పజెప్పి చూస్తున్నది. ఆమె గెరిల్లాదళం మనిషని తెలుసుకుంటుంటే 'ఫ్రస్సీ' కి నవ్వొచ్చింది. 'కర్ట్' తా నెవ్వరికీ జడవనని యెన్ని గొప్పలు చెప్పుకున్నప్పటికీ, గెరిల్లాలంటే హడలిపోతాడు. అయితే 'కర్ట్' ని భయపెట్టే వ్యక్తులంగూడా ఉన్నారన్నమాట. ఈ విషయం తెలుసుకుంటే 'ఫ్రస్సీ' కి యేదో అర్థం కాని తృప్తికలిగింది.

గెరిల్లాసైనికులు యిట్లా ఉంటారని 'ఫ్రస్సీ' యెన్నడూ అనుకోలేదు. రాక్షసుల్లా భయంకరంగా పొడుగాటి జుట్టుతోను, పెద్ద పెద్ద గడ్డాలతోను ఉండి, గొడ్డళ్ళు చేతుల్లో పుచ్చుకొని ప్రపంచాన్నంతటినీ గడ గడ లాడించేస్తున్నా ఆ చలికిగూడా లెక్కచేయకుండా, అడవుల్లో తిరుగుతుంటారని అనుకున్నది. కాని యీ మనిషి సర్వసాధారణంగా – 'ఫెడోసియా' విధంగానే ఉన్నది. అందులోను నిండు గర్భవతి! అబ్బే, అంత పొట్టవేసుకొని యెంత అసహ్యంగా ఉంది. 'ఫ్రస్సీ' తన సన్నని దేహాన్ని చూచుకొని మురిసిపోయింది. గ్రామఫోను మ్రోగించుకుంటూ, 'కర్ట్' తోపాటు యీ సన్నని శరీరంతో నాట్యమాడుతుంటే యెంత హాయిగా ఉంటుంది!...

'కర్ట్' చాలా విసుగుతో ప్రశ్నలు వేస్తున్నాడు. ఆ రైతు స్త్రీ జవాబు లిస్తున్నది. మొదట్లో ఆ సంభాషణను 'ఫ్రుస్సీ' వింటూ వచ్చింది. కాని 'కర్ట్' అన్నట్లు త్వరలోనే విసుగు పుట్టింది. 'కర్ట్' ఆ స్త్రీని ఒకేరకమైన ప్రశ్నలు పదేపదే వేస్తుంటే, ఆమెకూడా యిచ్చిన జవాబులే మళ్ళీ మళ్ళీ వల్లిస్తుండటం చూస్తుంటే 'ఫ్రుస్సీ'కి యేమీ అర్థంకావటంలేదు - వట్టి తెలివి తక్కువతనంగా కనిపిస్తున్నది.

ఆ స్త్రీ - 'ఒతెనా' - బాగా అలసిపోయింది. కండ్లు చీకట్లు క్రమ్మ నారంభించాయి. నలువైపులనుంచి చుట్టుముట్టుతున్న పొగమంచులో ఉక్కిరిబిక్కిరౌతున్నది. టేబిలుమీది కాగితాలు, తనను ప్రశ్నలువేస్తున్న ఆఫీసరు మసకమసకగా కనిపిస్తున్నారు. ముఖంనిండా పోసిన చెమట కంపరమెత్తిస్తున్నది. చేతులు ఉక్కువాటిమాదిరిగా బిరువెక్కిపోయినై. కాళ్ళుఅమితంగా పీకటం ప్రారంభించాయి. ఒకటికాదు, రెండుకాదు. మూడు గంటలకు పైగా ఆ విధంగా నిలచిఉండటంచేత కాళ్ళు బాగా వాచిపోయినై. కాలం యెంతయిందోగూడా ఆమెకు తెలియటంలేదు.

శరీరంలోని నరాలన్నీ తెగిపోతున్నట్లవుతున్నది. వీటన్నిటికంటే గూడా తనముందు కూర్చున్న ఆ నీచురాలు - 'ఫ్రుస్సీ' - ని చూడటం మరీ దుర్భరంగా ఉన్నది, 'ఓతెనా' కి. ఆమెకు 'ఫ్రుస్సీ' సంగతంతా తెలుసు. 'కర్ట్' కొల్లగొట్టుక వచ్చిన చలికోటుధరించి, ఇమిటేషన్ వజ్రాలు పొదిగిన లోలకులు ధరించి కులుకుతూ అక్కడ కూర్చున్న 'ఫ్రుస్సీ'ని చూస్తుంటే 'ఓతెనా' కు ఒళ్ళు మండిపోతున్నది. శరీరంలో సత్తువలేక క్రిందపడిపోయేటట్టున్నాదామెస్థితి. కాని ఆ నీచురాలు-జర్మను ఆఫీసరుకి తన శరీరాన్నమ్ముకని తన ప్రజలకు ద్రోహంచేస్తున్న, ఆయసము రాలు - ముందు తాను శక్తిహీనురాలై పడిపోదలుచుకోలేదు. తనలోనున్న శక్తినంతా కూడదీసుకుని, నిలబడటానికి ప్రయత్నిస్తున్నది...

'ఫ్రుస్సీ' తనలోతాను నవ్వుకుంటున్నది. కాని 'ఓతెనా' కు 'కర్ట్' కు మధ్య జరుగుతున్న సంభాషణలు మాత్రం ఆమె మనస్సు కెక్కటంలేదు. గ్రామంలోని ప్రజలందరు 'కర్ట్' యొక్క సాయుధులైన సైనికుల కాపలాతో అతనివద్దకు లాక్కురాబడుతుంటే, తానో క్కర్తె-గ్రామానికంతా తానొక్కర్తె.యేలాంటి ఆటంకమూ లేకుండా స్వేచ్ఛగా విహరించగలుగుతున్నందుకు గర్వపడసాగింది. వాళ్ళంతా

అతన్నిచూచి భయపడటం ఆమెకు సంతృప్తికరంగా ఉన్నది. తనకు మాత్రం ఏమీ భయంలేదు; తానెంత గారాబంచేసినా 'కర్ట్' కోపగించుకోడు. పైగా తాను అతని ముద్దులమిఠారి అని తనను బుజ్జగిస్తాడు!—

"నువ్వు తల్లివికాబోతున్నావు తెలుసా?" – అన్నాడు 'కర్ట్'. ఈ మాటలు ఓలెనాకు సముద్రమధ్యంలో మునిగిపోతుండగా తెప్ప దొరికినట్టనిపించినై.

అవును, తాను తల్లికాబోతున్నది! మనోబలం సడలిపోయి, యే అగాధంలోకో జారిపోతున్నట్టుగా ఉన్న ఆమెకు ఈ విషయాన్ని గుర్తుకి తెచ్చి యెంతో మేలుచేసినట్టు 'కర్ట్' కలలోనైనా అనుకోని ఉండడు. నిస్సారమైన ఆమె జీవితంలో యేదో ఆశాంకురం కలిగింది.

"నీవు తల్లివి కాబోతున్నావు."

'ఓలెనా' యిప్పుడు తన గర్భంలోవున్న బిడ్డనుగురించి ఆలోచించటం లేదు. తనను 'అమ్మా' అని పిలుస్తూవుండిన ఆ అడవులమధ్య యుద్ధం చేస్తున్న గెరిల్లాయోధులు ఆమె తలంపుకి వచ్చారు. ఆ గెరిల్లాదళంలో అందరికంటే ఆమె పెద్దది. తాను వంతెన పేల్చివేయడంలోను, మరికొన్ని యితరవిషయాలలోను పనిచేసినప్పటికి తన యొక్క ముఖ్యమైన పని అదికాదని ఆమె అనుకునేది. గెరిల్లాయోధులకు గుడ్డలుతకటం, గుడ్డలు కుట్టిపెట్టటం, వంట వండటం, వారికి తగిలిన గాయాలకు కట్లుకట్టటం, వారివద్ద రాత్రింబగళ్లు కూర్చుని ఉపచారాలు చేయటం మొదలగు పన్లు–మాతృదేవికి సహజమైన పనులన్నీ తన విద్యుక్తధర్మంగా నిర్వర్తిస్తుండేది. అందువల్లనే వాళ్ళందరూ 'అమ్మా' అని ఆప్యాయంగా పిలుస్తుండేవారు.

"నీవు అమ్మవు..."

అని అడవులలోని ఆ యోధులు అంటున్నట్లనిపించింది. వాళ్లందరి జీవితాలు తన ఒక్కమాటమీద ఆధారపడి ఉన్నాయి. తన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చమని యెవరో హెచ్చరిస్తున్నట్లనిపించింది.

"మీదళం యెక్కడ దాక్కున్నదో చెప్పు!"

'ఓలెనా'కు ఆ అడవిప్రాంతంలోని ప్రతి కోన తేటతెల్లంగా తెలుసును. తన మనోవీధిలో అంత తేటతెల్లంగా అగుపడుతున్న

ఆ ప్రాంతాలను జర్మను ఆఫీసరు యెక్కడ కనిపెట్టేస్తాడో అన్నట్టు ఆమె భయపడింది. అందువల్ల ఆ తలంపును పారదోలి ఇతరవిషయం యేదైనా ఆలోచించటానికి ప్రయత్నిస్తున్నది. కాని ఆ అడవి, అందులోని తమ రహస్య ప్రదేశాలు, వికసితవదనాలతో ఆ పదహారుగురు గెరిల్లాయోధులు, వుంగరాలజుట్టుతో వారి నాయకుడు, మొదలగువాటిమీదతప్ప ఆమె మనస్సు అన్యథా నిలవటంలేదు. ఆ పదహారుగురుయోధులు, వారితల్లి, ఆమె మనోఫలకంనుండి తొలిగిపోవటంలేదు. అవును! ఆ పదహారుగురు గెరిల్లాలు, వీరవరులైన తన ముద్దుబిడ్డలు.

"దళంసంగతి నాకు తెలియదు. వాళ్లెక్కడికి వెళ్ళిపోయిందీ నాకు తెలియదు."

'కర్ట్' కోపంపట్టలేక బలంకొద్దీ బల్లమీద గుద్దాడు. నాలుగు గంటలబట్టి ప్రయత్నిస్తున్నప్పటికి ఒక్కటంటే ఒక్కసంగతైనా ఆపాడు ముండనుంచి తెలుసుకోలేకపోయానుకున్నాడు. టేబిలుమీద కాగితాలన్నీ తీసి డ్రాయరులో తోసేశాడు.

"ఎవరక్కడ?"

తక్షణమే ఒక సైనికుడు వచ్చి నిలుచున్నాడు.

"దీనిని తీసుకుపోయి, ఆ కొట్లో తగలెయ్యి." అని సైనికుడితో, చెప్పి, 'ఓతెనా' వంక తిరిగి మళ్ళీ అన్నాడు. "చలికైనా నీ తల తిరిగి నోటికివస్తుందేమో ఆలోచించుకో, నీ మతం యెప్పుడు మార్చుకుంటే అప్పుడు కాపలామనిషికి చెప్పు. వాడు నాకు వెంటనే తెలియజేస్తాడు."

'కర్ట్' లేచి నిల్చున్నాడు.

"పుస్సీ! రా, భోజనానికి పోదాము."

'పుస్సీ' ఆనందంతో ఒక్క గంతువేసింది. తానిక్కడికి రావడం యెంత మంచిదయింది; లేకపోతే 'కర్ట్' ఇంటికిరావటానికి ఇంకెంత ఆలశ్యం చేసేవాడో!

మంచు మీదపడుతున్న కాంతివల్లి కళ్ళు జిగేలుమంటున్నాయి. బరువైన 'కర్ట్' పాదాలక్రింద మంచు 'పుస్సీ' పాదాలక్రిందకంటేగూడా యెక్కువశబ్దంతో నలిగిపోతున్నది. ఆకాశంలో ఒకప్రక్క రంగురంగుల

ఇంద్రధనుస్సు కనబడుతూంది. ఆ దృశ్యం చూడటానికి యెంతయినా ఆహ్లాదకరంగా ఉన్నది.

"అదుగో ఇంద్రధనుస్సు! ఇక్కడ ఈకాలంలోకూడా ఇంద్రధనుస్సు పొడుస్తుందా?" అన్నాడు 'కర్ట్' ఆశ్చర్యంతో.

'పుస్సీ' కొద్దిసేపాలోచించింది.

"అబ్బె! నేనెప్పుడూ యీ కాలంలో చూచినట్టు గుర్తులేదు."

భూమ్యాకాశాలకి కలిపే సూత్రంలాగ కనబడుతున్న ఆ రంగు రంగుల ఇంద్రధనుస్సును చూస్తూ నిలబడిపోయాడు 'కర్ట్ వెర్నర్'

"అబ్బ! రండి; చలికి నా కాళ్ళు రాళ్ళయిపోతున్నాయి".

"ఇంద్ర ధనుస్సు శుభశకునం అంటారుగాదు..."

"ఇంద్రధనుస్సంటే, ఇంద్రధనుస్సే ... అంతకంటే అందులో యేమీలేదు..." అని 'కర్ట్'ని పదమని ముందుకి లాగింది 'పుస్సీ'.

ఇంద్రధనుస్సు అంతకంతకు పెద్దదయి స్పష్టంగా కనబడసాగింది. ప్రపంచానికి అలంకారంగా వేసిన గాజుకప్పులాగ కనబడుతున్నది ఆకాశం. ఊరిమధ్య చర్చి దగ్గర ఫిరంగుల దగ్గర ఉన్న సైనికులు తలలు పైకెత్తి ఆ సుందర దృశ్యాన్ని చూస్తున్నారు.

'కర్ట్', 'పుస్సీ'లు యింటికి చేరుకునేటప్పటికి 'ఫెడోసియా' బయటనిల్చుని గంభీరవదనంతో ఇంద్రధనుస్సుని చూస్తున్నది.

"ఇంద్రధనుస్సు కనబడటం మంచి శకునం అంటారు" అని 'కర్ట్' మళ్ళీ అన్నాడు.

'ఫెడోసియా' ముఖం ముకళించింది.

"అవును ఇంద్రధనుస్సు శుభాన్ని సూచిస్తుంది" అని భావగర్భితంగా పలికి, వాళ్ళ నిద్దర్ని లోపలికి పోనివ్వటానికి ప్రక్కకు తొలిగి నిల్చుని తదేకదృష్టితో ఇంద్రధనుస్సుని చూస్తున్నది. చలిబాధకూడా ఆమెకు తెలియటంలేదు. తమచుట్టూ క్రమ్ముకున్న అంధకారంలో ఆశాజ్యోతివలె కనిపిస్తున్నదా ఇంద్రధనుస్సు ఆమెకు. ఆజ్యోతిలో ఆమె మనస్సు లీనమైపోయింది...

2

'ఫ్రెస్సీ' బంతిలాగ ముడుచుకుని 'కర్ట్' చేతిమీద తలమోపి నిద్రపోతున్నది. ఒకేస్థాయిలో నెమ్మదిగా ఊపిరి పీలుస్తూ విడుస్తున్నది. 'కర్ట్' వెల్లికితల పడుకుని గురకలు పెడుతూ నిద్రపోతున్నాడు. వంటింట్లో పడుకున్న 'ఫెడోసియా' ఆ గురకలువిని సహించలేకుండా ఉన్నది. ఆ గురకలే ఆమెకు నిద్ర పట్టనివ్వకుండా చేస్తున్నవనిపిస్తున్నదామెకు. కిటికీ మీద పేరుకున్న మంచుమీద పడి ప్రతిఫలిస్తున్న వెన్నెలను రెప్ప వాల్చకుండా చూస్తున్నది. బాల్చీలు, స్టూలు, మొదలయినవాటివల్ల వికారమైన నీడలు పడుతున్నాయి.

అబ్బ! ఇప్పటికి రాత్రయింది. చివరికి ఒకరోజు గడిచిపోయిందన్న మాట. 'ఫెడోసియా'కు జర్మను ఆఫీసరువల్లా, వాడి ఉంపుడుకత్తెవల్లా దినమంతా విరామంలేకుండా పోయింది. ఆమె మనస్సు ప్రతిరోజుకంటే ఇవ్వాళ యెక్కువ మథనపడింది. 'ఫ్రస్సీ' చూచే చూపులు ఆమెకు బల్లెపు పోట్లలాగ తగులుతూవచ్చినై. అటు బ్రతుకనివ్వకుండా ఇటు చావనివ్వకుండా ఆమెను యేడ్పించి కొంత ఆనందాన్ని పొందదలచుకున్నది 'ఫ్రస్సీ'. "ఇదిగో, కర్ట్‌తో చెప్పేస్తాను" అన్నట్లు 'ఫెడోసియా' వైపు మాటిమాటికి చూచి వికృతంగా నవ్వి హేళన చేస్తున్నది. తనను గుప్పెట్లో పెట్టుకుని ఆడిస్తున్నట్టుగా ఉన్నది 'ఫెడోసియా'కు. అక్కడ మంచంలో పడివున్న బాలునిగతి తనగుప్పెట్లో పెట్టుకుని 'ఫెడోసియా' మాత్ప హృదయాన్ని యే క్షణాన్నయినా మట్టుపేయటానికి సిద్ధంగావున్నది. 'ఫ్రస్సీ' ఏ నిముషాన్నయినా జర్మను తోడేళ్ళకు ఆ బాలుని అప్పగించి అతడు మృత్యువులో పొందుతున్న గాఢనిద్రను, శాంతిని భంగపర్చగలదు......

ఆ రోజంతా 'ఫెడోసియా'కు హృదయం బండబారినట్లనిపించింది. ఆ నిశీథంలో ప్రక్కగదినుంచి వస్తున్న గురకలు వింటుంటే ఆమె శరీరం

కోపంతో వణికిపోయింది. సహనం కట్టుదాటిపోతున్నది. ఇంకా యేం చేస్తారో చెయ్యనివ్వమనుకున్నది. తన కొడుక్కి యెంత చెయ్యాలో అంతా చేశారు. అంతకంటే యిప్పుడేం చేయగలరు? అతన్ని తల్లికి లేకుండా చేశారు. తలలో గుండు పేల్చారు. శరీరంమీద ఉన్న గుడ్డలు కూడా ఊడదీసుకున్నారు. అంతకన్నా యింకేం చేస్తారు! చివరికి అతని ప్రాణాలే వాళ్ళ పొట్టను పెట్టుకున్నప్పుడు. ఆ శవాన్ని యేంచేస్తే మాత్రం పోయేదేముంది? వాళ్ళెన్ని చేస్తేమాత్రం తాను పుట్టి పెరిగిన గ్రామాన్ని మితిలేని ఉత్సాహంతో రక్షిస్తూ ప్రాణాలు విడిచిన తన ముద్దుబిడ్డడిని గ్రామస్థులు మరిచిపోతారా? ప్రజల భద్రతకోసం, ప్రజల సౌఖ్యంకోసం, ప్రాణాలు అర్పించిన యోధులను ప్రజల మనస్సులనుండి తొలిగించటానికి జర్మన్లు యెన్ని ప్రయత్నించినా లాభం ఉండదని ఆమె సంతృప్తిపడ్డది. తమను రక్షిస్తూ ప్రాణాలు విడిచిన యోధులకు చచ్చిపోయిన తర్వాతకూడా శాంతి చేకూరనివ్వని జర్మనులను ప్రజలు యెప్పటికీ మరిచిపోరు. క్షమించరు. తన కొడుకు 'వాస్యా' శరీరంనుంచి కారిన ప్రతి రక్తబిందువుకి, అతని శవాన్ని తన్నిన ప్రతి తాపుకి, అతన్ని మంచులో ఉంచిన ప్రతి క్షణానికి ప్రజలు ప్రతీకారం తీసుకొని తీరుతారు!

ఇక యెప్పుడు ప్రొద్దు పొడుస్తుందా అని కాచుకు కూర్చున్నది 'ఫెడోసియా'. ఆమె గుండె రాయిబారిపోయింది. ఆ నీచురాలు 'పుస్సీ' దాని జర్మను మగడికి అంతా చెప్పనీ; ఎంత త్వరగా చెప్పేస్తే అంత మంచిది. 'ఫెడోసియా'ను లొంగదీయటానికి మిగిలిన చివరి సాధనం, అక్కడ మంచులో బండబారిఉన్న కొడుకు విషయం జర్మనువాడికి చెప్పనీ, అప్పటికిగూడా 'ఫెడోసియా' లొంగదని, వాళ్ళకి తెలిసిపోతుంది!

'ఫెడోసియా' మాతృహృదయానికి రంపపుకోత పెట్టటానికి ఆ రహస్యాన్ని సాధనగా పెట్టుకొని ఆడుతున్నది 'పుస్సీ'. కాని ఆ రహస్యంకూడా దానికి పనికిమాలినదే అవుతుందని తెలియదు. 'ఫెడోసియా' దానిని గాని, దాని జర్మను మగణ్ణిగాని దయచూపమని యెన్నటికీ ప్రాధేయపడదు!

'ఫెడోసియా' హృదయం కఠినమైపోయింది. ఆమె నెవ్వరూ యిక లొంగదీయలేరు. హాని చేయలేరు. శత్రువుయెడల ద్వేషం ఆమెకు కవచమయింది!

అప్పుడప్పుడు కిటికీమీద ఒక క్రీనీడ పడుతున్నది. ఇంటిముందు కాపలా సైనికుడు గస్తీ తిరుగుతున్నాడు. అతని బూటుకాళ్ళక్రింద మంచు నలుగుతున్న శబ్దం వినవస్తున్నది. 'ఫెడోసియా' తనలోతాను నవ్వుకున్నది. పాపం! ప్రజల నోళ్ళల్లో మన్నుగొట్టి తెచ్చుకున్న పరుపులు, మంచాల మీద తన ఉంపుడుకత్తెతో హాయిగా నిద్రపోతున్న తన జర్మను ఆఫీసర్ని రక్షించటానికి, యెంత శ్రమపడుతున్నాడు! వీడు రాత్రింబగళ్ళు యీ విధంగా రక్షించితేమాత్రం వాడి ప్రాణాలు నిలుస్తాయని గాబోలు వీడి భ్రమ. ఇటువంటి వాళ్ళు వందమందికాదు లక్షమంది రక్షించుతున్నా యెర్ర సైనికులు రాకమానరు. ఈ జర్మను వీరుణ్ణి, వాడి ఉంపుడుకత్తెను గొంతునొక్కి చంపేకాలం రాకపోదు. ప్రజల్ని హింసలుపెట్టి చంపిన వారందరిమీద పగతీర్చుకునే సమయం వస్తుంది. నిండు గర్భిణీ అయిన 'ఓలెనా'ను పెడుతున్న యమయాతనలకు తగిన ఫలితం అనుభవించే కాలం వచ్చితీరుతుంది...

'ఓలెనా!' 'ఓలెనా' మాట తలుచుకుంటుంటే ఆమె హృదయం మళ్ళీ బాధపడసాగింది. ఆమె సంగతి యెవరు బయటపెట్టి ఉంటారు? ఎవ్వరికీ అనుమానం కలుగకుండా రహస్యంగా వచ్చి ఆమె తన యింట్లో చేరిందే; జర్మన్లకు ఆ విషయం యెలా తెలిసి ఉంటుంది? గ్రామస్థులందరిని లెక్క వేసుకుని ఉన్నారంటే అదీ లేదు. పోనీ ఆమె బయట తిరగనైనా తిరగలేదే! అయినా, పాపం, వచ్చిన రెండు రోజులలోనే జర్మన్లు ఆమె యింటికివచ్చి ఈడ్చుకుపోయి, నానా హింసలు పెడుతున్నారు. దీనినిబట్టి చూస్తే గ్రామంలో జరుగుతున్న విషయాలన్నీ గ్రామస్థుల్లోనే యెవరో జర్మన్లకు తెలియజేస్తున్నట్టు తోస్తున్నది. ఎవరో రహస్యంగా 'ఓలెనా'కు 'వాస్యా'కు ద్రోహం చేస్తున్నారన్నమాట. గ్రామస్థుల్లోనే ఉంటూ, వారికెవ్వరికీ తెలియకుండా ఒక విరోధి తిరుగుతున్నాడు. జర్మన్లకన్నీ పూసగుచ్చినట్టు చెప్పేస్తున్నాడు. ఎవరైవుంటారు?

'ఓలెనా' గ్రామంలోకి వచ్చి చేరుకున్న సంగతి 'ఫెడోసియా'కు మొదటినాడే తెలిసింది. ఇంకా అనేకమందికికూడా ఆ విషయం తెలుసును. కాని వాళ్ళందరూ సమిష్టి వ్యవసాయక్షేత్రంలో సభ్యులు, యెర్ర సైనికుల ఆత్మబంధువులు అయినవారే. తమ పవిత్ర మాతృభూమిపై పుట్టి పెరిగి,

ఈనాడు ఆ పవిత్ర మాతృదేవినే కాటు వేయదలచుకున్న విషసర్పం యెక్కడ దాగియున్నది ?

దూరంనుంచి కొన్ని కంఠాలు వినుపించినై. ‘ ఫెడోసియా ’ కు, మంచు దట్టంగా కురుస్తున్న ఆ నిశీథంలో చిన్న శబ్దం కూడా స్పష్టంగా వినిపిస్తున్నది. కొద్దిసేపటికి పెద్ద కేకలుగూడా వినబడసాగినాయి. పడక మీదనుంచి ఒక్క గంతువేసి లేచి కిటికీదగ్గరకు వెళ్ళింది. కిటికీ అద్దంమీద పేరిన మంచు గీకివేసి బయట జరుగుతున్నవన్నీ గమనించసాగింది. పూర్వం గ్రామ సోవియట్ కార్యాలయంగా ఉండి ఇప్పుడు జర్మను సైనిక కార్యాలయంగా మారిన యిల్లు, దానికి తూర్పున ఉన్న ధాన్యపుకొట్టు మొదలైనవన్నీ కనిపిస్తున్నాయి.

వెలుగు పట్టపగలులాగ ఉన్నది. చంద్రకాంతితో ప్రపంచమంతా నీలిరంగు పూసుకున్నట్టుగా అగుపడుతున్నది. గ్రామంమధ్యనున్న ఖాళీస్థలం దగ్గరనుంచి, వంటిమీద సరిగ్గా దుస్తులు కూడా లేని ఒక స్త్రీ పరుగున వస్తున్నట్టు కనిపించింది. కాదు, పరుగెత్తటం కాదు! ముందుకి వంగి భారంగా నడుస్తున్నది. ఆమె పెద్దకడుపు వెన్నెల్లో స్పష్టంగా కనిపిస్తూ ఉన్నది. ఆమె వెనుక తుపాకీతో ఒక సైనికుడు వస్తున్నాడు. అతని తుపాకిమీది విచ్చుకత్తి వెన్నెట్లో మెరుస్తున్నది. ఆమె యెక్కడైనా ఆగిందంటే ఆ కత్తివచ్చి ఆమె వీపులో నాటుకుంటున్నది. ఆ సైనికులు ఏదో కేకలు పెడుతున్నారు. ప్రక్కనవున్న ఇద్దరు సైనికులు తిరిగి కేకలు పెడుతుంటే ఆ గర్భిణీ స్త్రీ ఆయాసంతో ముందుకి కదులుతున్నది. ఒక యాభై గజాలు ముందుక పోగానే, మళ్ళీ యాభై గజాలు వెనుకకు తిప్పి తీసుకపోయేవారు; అదేవిధంగా వెనుకకి, ముందుకి ఆ స్త్రీని పశువుని తోలినట్టు తోలుతున్నారు. మధ్య మధ్య వికటాట్టహాసాలతో ‘ ఫెడోసియా ’ చెవులు గింగురుమని పోతున్నాయి.

కిటికీమీద చేయి బిగించి తీక్షణంగా చూస్తున్నది ‘ ఫెడోసియా ’. ఈ జర్మను ఆఫీసరు తాను ఉంపుడుగత్తెతో హాయిగా నిద్రబోతూగూడా రాత్రులు తన సైనికులద్వారా యిటువంటి హత్యాకాండ సాగిస్తున్నాడన్నమాట ! ...

అయినా, ఆమె 'ఓలెనా' యే! చాలాకాలంక్రింతం 'ఓలెనా' తనూ కలిసి ఖూకామందు దగ్గర పాలేరుతనం చేశారు. వాళ్ళతో పని చేయించే మేస్త్రీనిచూచి యిద్దరూ హడలిపోతుండేవారు. వాడు వీళ్ళమీద కన్నువేసి నానా అవస్థలు పెడుతుంటే, యిద్దరూ కలిసి ఒకరిసంగతి ఒకరికి చెప్పుకుని యేడ్చేవారు. అసలు కూలీయువతుల గతి అందరిదీ అలానేఉండేది.

అటుతర్వాత సమిష్టి వ్యవసాయక్షేత్రంలో గూడా యిద్దరూ కలిసి పనిచేస్తూ వచ్చారు. తమచేతిలో పంటబంపండి పొంగిపోతుంటే ఇద్దరూ అమితానందాన్ని పొందేవారు. విప్లవం తర్వాత కలిగిన నూతన జీవితాన్ని యిద్దరూ ఆనందంతో చవిచూచారు.

ఈనాడు 'ఓలెనా' కు ఇటువంటి భయంకరమైన దుర్గతి పట్టింది. ఈ క్షణమో, మరుక్షణమో ప్రసవించే ఆమెను విచ్చుకత్తులు యెక్కుబెట్టి శరీరం మొలకలు తిరిగిపోతున్న చలిరాత్రిలో గుడ్డలన్నీ ఊడపెరికి జోళ్ళు లేని పాదాలతో తిప్పుతున్నారు? వెనుకనుంచి యమకింకరులాగ జర్మను సైనికులు అట్టహాసం చేస్తూ విచ్చుకత్తులతో పొడుస్తున్నారు!! ...

'ఫెడోసియా' కేకలు వెయ్యలేదు; ఏడ్వనూలేదు. ఆమె హృదయంలోని రక్తం గడ్డకట్టుకుపోయినట్టయింది. ఈ జర్మను పశువులు యిక్కడున్నంతకాలం యీ ఘోరాలు యిలానే సాగుతూంటాయనుకున్నది. తాము యెంతటిపని చేయటానికైనా వెనుకాడమని తమ ప్రజ్ఞ చూపెంచుకుంటున్నారు. ఆ బాధలన్నీ 'ఓలెనా' కు పెడుతున్నట్టనుపించలేదు తననే ఆ విధంగా కటికి మంచులో వివస్త్రనుచేసి విచ్చుకత్తులతో పొడుస్తూ నడిపిస్తున్నట్టనిపిస్తున్నది 'ఫెడోసియా' కి. ఆ జరుగుతున్న చిత్రవధ, అవమానం, ఒక్క 'ఓలెనా' కే గాక, గ్రామానికంతటికీ జరుగుతున్నట్టుగా తోచిందామెకు.

ఆ విధంగా కిటికీలోంచి గంభీరంగా చూస్తున్నది 'ఫెడోసియా' జర్మన్లు తమయొక్క నిజరూపం గ్రామస్థులకి చూపిస్తున్నారు. అంతేగాక జర్మను సైనికులు గ్రామస్థులకు పరోక్ష సత్యాన్నిగూడా వెల్లడిచేస్తున్నారు. వీళ్ళ నీచకార్యాలతో గ్రామస్థులు సోవియట్ విధానంయొక్క ఉత్కృష్టతను తెలుసుకొనేటట్లుచేస్తున్నారు. జర్మన్లు ఏగ్రామంలోగాని కనీసం ఒక్క దినమైనా తమ రక్తపాతపు రాజ్యవిధానాన్ని ప్రజలకు చూపించియుంటే,

గ్రామస్థుల్లో యే సోమరిపోతుకిగూడా జన్మ జన్మాలకు సోవియట్ విధానం అంటే నిర్లక్ష్యం యేర్పడదు, అనుకున్నది 'ఫెడోసియా'. మళ్ళీ తమ జీవితాల్లో యీ విషయాలు మరిచిపోలేరు! ఈ మన్యగ్రామంలో జరిగిన స్త్రీల సభలు 'ఫెడోసియా' స్మృతిపథంలోకి వచ్చినాయి. వారి జీవితవిధానం ఏ విధంగా అన్ని భయంకర సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నదో ఆమెకు తేటతెల్లమైనది.

'ఓలేనా' క్రిందపడి మళ్ళీ లేచింది. అదంతా సహించటానికి 'ఓలెనా'కు యింతటిశక్తి యెక్కడినుంచి వచ్చింది? 'ఫెడోసియా'కు తెలుసును. తన హృదయంలాగే 'ఓలెనా' హృదయంకూడా ఎట్టి బీభత్సాన్నయినా ఎదుర్కొనగలిగే మహత్తరశక్తినిచ్చే ద్వేషంతో నిండివున్నది.

ప్రతియింటిలోనివారు కిటికీల అద్దాల్లోంచి ఆభయంకర దృశ్యాన్ని చూస్తూనే ఉన్నారు. 'ఓలేనా'తోపాటు వారందరి హృదయాలు ఆ మంచులో క్రిందపడుతూ లేస్తూ ఉన్నాయి. విచ్చుకత్తుల పోట్లను పొందుతూ ఉన్నాయి; అలా చిత్రవధ చేస్తున్న రక్కసుల నవ్వులు అందరి చెవులను బ్రద్దలు చేస్తున్నాయి!!—

గ్రామస్థులందరి కండ్లు తనవైపే ఉన్నవని 'ఓలెనా'కి గూడా తెలుసును. ఇదే ఆమె స్వగ్రామం. ఇక్కడే ఆమె అనేక కష్టసుఖాలనుభవించింది. ఇక్కడే తన ఆనందమయజీవితాన్ని సృష్టించుకన్నది...

మంచుముక్కలు గుచ్చుకునిపడ్డ గాయాలనుంచి రక్తం స్రవిస్తున్నది. సహించలేనిబాధ! తల తిరిగిపోతున్నది. తూలిపోయి, క్రిందపడిపోతున్నది. తుపాకి మడమలతో తగులుతున్న దెబ్బలు ఆమెకు తెలియటమేలేదు! క్రిందపడుతున్నప్పటికీ, సైనికులు కొడుతున్నారనిగాక— జర్మను నీచుల కాళ్ళదగ్గర తన శరీరం ఉంచటానికి యిష్టపడక—అతి ప్రయత్నంమీద లేస్తున్నది. తన సహనశక్తిని వాళ్ళు ఓడించామని గర్వపడకూడదని ఆమె పట్టుదల! నిజానికి తన శరీరానికి యేమి జరుగుతున్నదీగూడా తెలియని స్థితిలో ఉన్నదామె. అంతా కలలాగ కనిపిస్తున్నది. శరీరంనుంచి రక్తపుచుక్కలు జారి మంచుమీదపడి గడ్డకట్టుకుపోతున్నాయి. అడవికిపోయే రోడ్డు, సైనికులు లీలగా కనిపిస్తున్నారు. చెవిలో యేదో సంగీతం వినిపిస్తున్నట్టుగావుంది. 'కర్లి' 'అమ్మా' అని చిరునవ్వులో

పిలుస్తున్నాడు! చుట్టూ అడివి కనిపిస్తున్నది. ఒకచోట తాను పేల్చివేసిన వంతెన కాలుతుండటం కండ్లకగుపడుతున్నది. భర్త 'మికోలా' యుద్ధానికిపోతూ కడసారిగా ఆమెనుచూచి రోడ్డు మలుపుతిరిగి పోతుండడం కండ్లకు కట్టినట్టుగా ఉంది...

'ఓలెనా' మళ్ళీ కిందపడ్డది, ఈసారి చాలా ప్రయత్నంమీద లేచి నిలుచోగలిగింది.

"త్వరగా!" అని ఆమె వెనుకనున్న సైనికుడు కేకపెట్టాడు.

"పొట్టమీద ఒక్క టివ్వరా...హుషారు పుడుతుంది" అని సలహా యిచ్చాడు ఒక జర్మను పశువు.

"అట్లాగితే యీ లోగానే చచ్చి ఊరుకుంటుందోయ్. దీన్నుంచి ఇంకా యెన్నిసంగతులు లాగాలనుకున్నావు...ఇంతవరకు ఒక్క అక్షరమన్నా బయటపెట్టిందికాదు ముండ" అని నవ్వి బిచ్చుకత్తితో ఒక్క పోటు పొడిచాడు రెండవవాడు.

"మన కెప్టెన్ దీన్ని యింతటితో వదిలాడనుకుంటున్నావా? దీన్ని పీకకొరికి మరీ చెప్పిస్తాడు అన్ని సంగతులూ"

"అదీ నిజమేలే...ఒసే. నడువు..." అని అరిచాడు ఆమెను నడిపిస్తున్న జర్మను సైనికుడు.

"పొడవరా! ఒక్క పోటు పొడువు"

అంటుండగా బిచ్చుకత్తి ముందుకి పోయింది. 'ఓలెనా' వీపు నుండి రక్తపుచుక్కలు కారసాగాయి.

"నడువు. త్వరగా...రంకుమగడితో షికారుకెళుతున్నట్టుగా నడుస్తున్నావే?..."

తాము మాట్లాడుతున్నది 'ఓలెనా'కు అర్థం అవుతున్నదా లేదా అను ప్రశంస వారికి లేనేలేదు. నోటికివచ్చినట్టు వాగుతూ తమలోని పశుత్వాన్ని వెకలినవ్వుద్వారా వెలిబుచ్చుతున్నారు. చివరికి వాళ్ళకేవిసుగు, కోపము పుడుతున్నాయి. ఈ ముండ లేకపోతే హాయిగా యింటిలో వెచ్చగా కూర్చుందుము గదా అనుకున్నారు. రాత్రి గడుస్తూన్నకొద్దీ చలి భయంకరరూపం దాల్చుతున్నది. తమలో రేగుతున్న కోపాన్నంతా 'ఓలెనా' మీద చూపిస్తున్నారు.

(5)

ప్రపంచాన్నంతటినీ కప్పివేసిన పొగమంచు ఆకాశంలోకిగూడా చొరుచుకుపోయి, చంద్రుణ్ణికూడా మంచుగా ఘనీభవింపజేసిందా అని పిస్తున్నది. పండు వెన్నెల్లో లీలామాత్రంగా కనిపిస్తున్నది ఆకాశంలో ఒకమూల ఇంద్రధనుస్సు.

"పదవేముందు!" – అని జర్మను సైనికులు వెంఱటుగా కేక వేశారు. ఊరికే అరవాలనేగాక, ఆ నిశీథంలో గుండెలు పీచు పీచు మంటుంటే భయం పోగొట్టుకోటానికి మరి కొంత అలా అరుస్తున్నారు. అటువంటి భయంకరమైన రాత్రి ఆ జర్మన్లు యెప్పుడూ చూచి ఉండలేదు. గ్రామమంతా నిశ్శబ్దములో మునిగి ఉన్నది. వెన్నెల మంచుమీద తళతళ ఆడుతూ మెరుస్తున్నది. ఆ కాంతిలో నల్లగా గంభీరంగా కనిపిస్తున్నాయి యిండ్లు. నిర్మానుష్యమైఉన్న వీధుల్లో ఆ యిండ్లు జర్మన్లను హుంకరించి చూస్తున్నట్లుగా ఉన్నాయి. అసలు చీకటిరాత్రులైతే జర్మన్లు బయట అడుగైనా పెట్టి ఉండేవారుకాదు. బయట కాలుపెడితే ప్రతి వీధి మలుపులో, ప్రతి పొదచాటున, ప్రతి క్రీనీడలో చావు వారికోసం పొంచి ఉంటుందని వారికి తెలుసు. మెఱుపులాగ యే క్షణాన్న తన్నుకుపోతుందో! కాని యివ్వాళ్ళ వెన్నెట్లో అన్నీ తేటతెల్లంగా కనిపిస్తున్నప్పటికి ఆజర్మన్ల హృదయాలు పీచు పీచు మంటూనే ఉన్నాయి. ఒక్కొక్కసారి హఠాత్తుగా ఆగిపోయి ఇండ్ల ప్రక్కపడే నీడలవైపు భయంతో తేరిపారచూస్తూ కేకలు పెడుతుండేవారు. చలికి వారికి ముఖాలు పగిలిపోతున్నాయి. అరచేతుల్తో చెవులు రుద్దుకుంటూ బెదురుగుండెల్తో అడుగులు వేస్తున్నారు.

చివరికి వాళ్ళకే విసుగెత్తిపోయింది. "ఓలెనా" తూలి పడిపోవటం మరీ యెక్కువయింది. మళ్ళీ లేవటంకూడా మహా కష్టంగా ఉన్నది. అన్ని బాధలు పడుతూగూడా యేడ్వటం లేదు. చివరికి నోటివెంట ఒక్క శబ్దమన్నా రానివ్వటంలేదు. ఆ బాధలకు లొంగి, వారికి అవసరమైన సంగతులు చెప్పే సూచన యెక్కడా కనబడటం లేదు. కాని చలిమట్టుకు మరీ భయంకరమైపోతున్నది. కాళ్ళు చేతులు ముఖాలు పగిలిపోతుండటమే గాక, ఊపిరిపీల్చటంకూడా కష్టసాధ్యమైపోతున్నది. గొంతుకలుకూడా బాధపెడుతున్నాయి. కండ్లల్లో నీళ్ళు తిరుగనారంభించినవి. శరీరాలు గజగజ వణికిపోతున్నాయి.

"హుషారుగా నడవాలి. ఇంటిముఖం...త్వరగా నడువ్..."

ఈలలు వేసుకుంటూ, కేకలు పెడుతూ పశువును తోలినట్టు ఆమెను ధాన్యపు కొట్టువైపుకి తోలుకు పోయారు. గుమ్మందగ్గర గుమ్మం తగిలి ధాన్యపు కొట్టులోపల బోర్లబడిపోయింది. కడుపుకి దెబ్బ తగలకుండా చేతులు పెట్టి ఆపుకున్నది. తల గోడకేసి కొట్టినట్టు బాధపడుతున్నది. గుండె విపరీతంగా కొట్టుకుంటున్నది. కొద్దిసేపటికి చలి తన భయంకర కౌగిట్లో 'ఓలెనా'ను చిక్కించుకుని నలిపివేస్తున్నట్టనిపించిందామెకు. ఇంత వరకు యెక్కడ తగిలినవో కూడా తెలియని గాయాలు కారం జల్లినట్టు భగ్గున మండసాగాయి. అతి ప్రయాసమీద లేచి కూర్చుని భుజాలు, నడుము, కాళ్ళు చలితో బండబారిన చేతుల్తో రుద్దుకోనసాగింది. చెక్కల సందు ల్లోంచి చంద్రకాంతి అక్కడక్కడా చారలుగా పడుతున్నది. ఎండు గడ్డి ఒకమూల కనపించింది. 'ఓలెనా' అక్కటికి దేకుకుంటూపోయి గడ్డిలో మేను వాల్చింది.

"చలితో బండబారి చచ్చిపోతాను" - అనుకున్నదామె. అట్లా తలచుకున్నప్పుడు కొంత హాయి అనిపించింది.

ఆమె తోలుకోటు, శాలువకూడా జర్మను ఆఫీసరు ప్రొద్దుట లాక్కు న్నాడు. తక్కిన గుడ్డలన్నీ యిందాకనే జర్మను సైనికులు ఊడతీసి, మంచులో యింతసేపు గొడ్డుని తోలినట్టు తోలారు. ఒకవేళ ఆ గుడ్డలు అక్కడ్నే మరిచి వెళ్ళిపోయారేమోనని గదిఅంతా కలియజూచింది. లేదు! ఒక్కటికూడా వదిలిపెట్టి పోలేదు. అక్కడ పడివున్న యెండుగడ్డే ఆమెకు ఆధారమయింది.

బయట అంతా నిశ్శబ్దంగా ఉన్నది. బహుశా, కాపలా ఉండటం అనవసరమనుకున్నారు గాబోలు - తలుపుతాళంమాత్రం వేసి వెళ్ళిపోయారు సైనికులు.

'ఓలెనా'కు శరీరమంతా కారం చల్లినట్టు భగ్గుభగ్గున మండు తున్నది. నిద్ర రావటం లేదు. నిద్ర పట్టేస్తుందేమోనని భయంకూడా వేసింది. నిలువుగుడ్లు వేసుకుని చెక్కల సందుల్లోంచి పడుతున్న వెన్నెల వైపు చూస్తున్నది.

హఠాత్తుగా యేదో శబ్దం వినుపించింది. చెవులు నిక్కపొడుచుకుని వినసాగింది 'ఓలెనా'. భూమిమీద మంచు చితుగుతున్న శబ్దం వినుపిస్తు

న్నది. జర్మను సైనికుల బరువైన పాదాలశబ్దంమాత్రం కాదది. ఎవరో నెమ్మదిగా జాగ్రత్తగా ఇటువైపే వస్తున్నట్టున్నది. కొద్దిసేపు శబ్దం వినుపించి ఆగిపోతున్నది. మళ్ళీ వినవస్తున్నది. ఎవరో పాకుకుంటూ దగ్గరికి వస్తున్నారు. 'ఓలెనా'కు భయం పుట్టింది. ఏమిటది? ఎవరై ఉంటారు?

అంతలోనే సవ్వడి ఆగిపోయింది. బహుశా తాను భ్రమపడుతున్నానేమోననుకున్నది. కాని శబ్దం మళ్ళీ వినబడసాగింది. సందేహం లేదు – యెవరో వస్తున్నారు! అటు నిరీక్షిరిస్తూ కూర్చున్నది, 'ఓలెనా'. శబ్దం సమీపించసాగింది. ధాన్యపు కొట్టువెనక అటువైపునుంచి వస్తున్నదా శబ్దం. చివరికి యెవరోవచ్చి కొట్టు బయట చెక్కగోడలప్రక్క నిల్చున్నారు. ఆ వ్యక్తి ఊపిరి పీలుస్తున్న శబ్దంకూడా వినబడసాగింది. ముందుకి వంగి చెక్కసందుల్లోంచి చూస్తున్నట్టుగాకూడా తెలుస్తున్నది.

ఎవరది? విరోధులో, స్నేహితులో? లేక దారినపోతున్నవారా? చీకటిపడ్డతర్వాత బయట కాలుపెట్టడమంటే మృత్యువుతో చెలగాటమైన యీరోజుల్లో బయట తిరిగేవారు కూడా ఉంటారా?

“అత్తయ్యా!”– అని ఒక సన్నని కంఠం వినుపించింది.

'ఓలెనా' నిశ్చేష్టురాలైపోయింది. గోడవెనుక పసికంఠం వినుపిస్తున్నది. జవాబివ్వాలనుకున్నది. కాని ఒక మూల్గుమాత్రం ఆమె గొంతు నుండి వినిపించింది.

“'ఓలెనా' అత్తా!”

'ఓలెనా' పొరుగింటివారి పిల్లవాడు దొంగతనంగా వచ్చి పిలుస్తున్నాడు. ఆమె మళ్ళీ ఒకసారి మూల్గింది.

“ఓలెనా, అత్తా! నీకోసం రొట్టె తెచ్చాను.”

రొట్టె! రెండురోజులబట్టి ఆమె రొట్టెముఖం చూడలేదు. ఒక ముక్క రొట్టెకుగాని, గుక్కెడు నీళ్ళకుగాని నోచుకోలేదు. ఆకలిమాట అటుంచి, దాహంమాత్రం విపరీతంగా వేస్తున్నది. ప్రొద్దుట 'కర్ట' ప్రశ్నలు వేస్తున్నప్పుడే అమితంగా దాహం వేసింది. ఇందాక జర్మను సైనికులు ఆమెను విచ్చుకత్తులతో పొడుస్తూ తిప్పుతుండగా, క్రిందపడినప్పుడల్లా యింతింతేసి మంచుముద్ద నోట్లో వేసుకుంటూవచ్చింది. ఆ విధంగా ఆమెనోరు కొంత తడిపడ్డది. కాని అది జర్మన్ల కండ్లపడి అది

కూడా సాగనిచ్చారుకారు. చివరికి పెదిమలమీద పడుతున్న మంచుతో నాలిక తడిచేసుకుంటూ వచ్చింది. ఇప్పుడు ఆకలికూడా తీవ్రంగావున్నది.

తనకూ, ఆ పిలుస్తున్న పిల్లవానికీ యెంత దూరమున్నదో చూచుకొని, తనలో ఉన్న శక్తినంతా కూడదీసుకని "వస్తున్నాను" అన్నది.

నిలబడటానికి శరీరంలో శక్తిలేకపోతున్నది. కాళ్ళు చేతులమీద దోగాడుతూ అటు వెళ్ళింది. వీపు కాళ్లు అపరిమితంగాబాధ పెడుతున్నాయి. అట్లానే ప్రాకింది. ఇంతలో నిశ్శబ్దాన్ని భేదించుకుంటూ హఠాత్తుగా చెవులు చిల్లులు పడేటట్టు ఒక తుపాకి శబ్దం వినిపించింది. వెంటనే ఒక పెద్దకేక. 'ఓలెనా' కదలకుండా కూలబడిపోయింది. గోడవతల యేమి భయంకరమైన సంఘటన జరిగిందో కొంతసేపటికిగాని అర్థంకాలేదు. నోరువెళ్ళబెట్టి ఆ నల్లటి గోడవైపు పిచ్చిగా చూస్తున్నది. కొద్దిసేపటికి జర్మన్లు తిట్టుకుంటూ అటువైపు రావటము, యేదో మెత్తని వస్తువుమీద తుపాకి మడమలతో బాదటము వినబడింది. 'ఓలెనా' నిశ్శేష్టురాలై వినసాగింది.

ఇంకేదైనా శబ్దం వినబడుతుందేమోనని చూచింది. కాని యేమీ వినబడటంలేదు. బాగా గురిచూచి తుపాకి పేల్చివుంటారు...

ఈ రెండురోజులబట్టి శరీరంమీద పడిన గాయాలన్నీ ఒక్కసారిగా బాధపెట్టి శరీరాన్ని మెలికలు తిప్పేస్తున్నాయి. కండ్లు చీకట్లు క్రమ్మసాగినాయి. స్పృహతప్పి ఆ కటిక నేలమీద పడిపోయింది.

తుపాకి పేల్చిన శబ్దం, దానివెంటనే వచ్చిన కేక గ్రామమంతటా ప్రతిధ్వనించాయి. 'ఓలెనా'ను బంధించిన ధాన్యపు కొట్టుకి సమీపంలో ఒక యింటి కిటికీలోంచి మూడు ప్రాణులు బయట జరుగుతున్నదంతా ఆత్రుతతో చూస్తున్నవి—

"అమ్మా! మిష్కా. అమ్మా, మిష్కా!!" — అని అమాయకపు పిల్ల 'జినా' యేడుస్తున్నది.

కేకలు పెట్టొద్దన్నట్టు 'మాల్యూచికా' ఆ పిల్లచెయ్యి గట్టిగా నొక్కింది.

"అరవొద్దు!"

"అమ్మా! 'మిష్కా'ని వాళ్ళేం చేశారు?"

"కనబడటం లేదూ ? 'మిష్కా'ని చంపేశారు" అని ఆమె గద్గద కంఠంతో అన్నది.

ఎనిమిదేళ్ళ 'సాషా' కిటికి దగ్గర్నుంచి ముందుకి పరుగెత్తుకు వచ్చి, "అమ్మా ! 'ఓలెనా' అత్తయ్యకి నేను రొట్టె పట్టుకెళతాను" అన్నాడు.

"వద్దు! తెల్లవారిందాకా బాగా కాపలా కాస్తుంటారు" అని కాసేపాగి 'అయినా యింట్లో రొట్టె లేదు. ఉన్న కొద్దిరొట్టెముక్కా 'మిష్కా' ఇందాక తీసుకెళ్ళాడు" అన్నది గంభీరవదనంతో.

"సాషా" మళ్ళీ కిటికీదగ్గరకు వెళ్ళిచూశాడు. కాని యేమీ కనబడలేదు.

ధాన్యపుకొట్టు చెక్కగోడలదగ్గర 'మిష్కా' బోర్లపడి ఉన్నాడు. తుపాకిగుండు భుజందగ్గర వీపులోంచి దూసుకుపోయింది. కికెట్టే వ్యవధి కూడా లేకుండా ప్రాణాలు యెగిరిపోయినాయి. జర్మను సైనికుడు బూటు కాలితో శవాన్ని ఒక ప్రక్కకి తోశాడు. అతని గుప్పెట్లోంచి ఒక రొట్టెముక్క దొర్లింది.

" పంది ముండాకొడుకు దానికోసం రొట్టె పట్టుకొచ్చాడు " అని మళ్ళీ శవాన్ని యింకొకతాపు తన్నాడు.

" ఇంకొక్క నిముషమైతే దాని చేతిలో పడిపొయ్యేదే ! బయటికి వస్తూనే యేదో యిక్కడ కదలుతుండటంచూచి తుపాకి యెక్కుపెట్టి ఒక్కయేటు వేశాను. "

" మొత్తానికి బలే గురిపెట్టి కొట్టావురా !..." అన్నాడు రెండవ సైనికుడు.

" కాదుమరీ ! నా గురి యేనాడూ తప్పిపోదే...అయితే వీడ్నిప్పుడేం చేద్దామంటావు ? ఇక్కడ వదిలేద్దామా ? "

"కాదు ఆ పక్క కందకంలోకి యీడ్చేస్తే మంచిది."

ఇద్దరూ ఆ కుఱ్ఱవాడికాళ్ళు చెరి ఒకటి పట్టుకుని ఈడ్చుకుపోయి ఒక్క విసురుతో రోడ్డు ప్రక్కనున్న కందకంలోకి విసిరేశారు.

" ఇక్కడ పడుంటాడ్లే...ఎక్కడ్నుంచి వచ్చిపడ్డాడో ఆశ్చర్యంగా వుంది సుమా ! "

"కెప్టెన్ రేపు కనుక్కుంటాడులే. అయినా అందరూ ఒకటే విషంగా మూగదయ్యాల్లా కూర్చుండే వీళ్ళనుంచి మనకేం తెలుస్తుంది."

"మనకెందుకొచ్చింది. కెప్టెన్ యెవర్నో ఒకళ్ళను పట్టుకు తంటాలు పడతాడు."

"అదే కాదోయ్. అసలిక్కడపరిస్థితులే బాగుండలేదంటున్నాను" అన్నాడు.

సన్నని పొడుగాటి రెండవ సైనికుడు తన తుపాకిమీద ఆనుకొని నిలబడి మాట్లాడుతున్నతని వైపు అనుమానంగా చూచాడు. అతని ముఖంలో నమ్మకం గోచరించినట్లుగా వుంది.

"అవును, పరిస్థితులేమీ బాగుండలేదు. ఇంటిమీద యావపోయింది నాకు. మా అబ్బాయి 'మైకేల్' యీ పాటికి పది సంవత్సరాలవాడై యుంటాడు. వాణ్ణి చూచి అప్పుడే రెండు సంవత్సరాలు దాటిపోయింది.

రెండవ సైనికుడు సానుభూతితో తల ఊపాడు.

"పోయిన వానాకాలంలో నేను యింటికెళ్ళొచ్చాను".

"పోయిన తడవ యింటినుండి తిరిగివస్తూ మా 'మైకేల్'కి సైకిల్ తెచ్చిపెడతానని వాగ్దానం చేశాను. కాని రెండు సంవత్సరాలు దాటిపోయింది. ఇక్కడ్నుంచి పంపుదామంటే, వీలుపడదు." అన్నాడు మొదటి సైనికుడు.

"ఏమీ? మనసార్జెంటు తనయింటికి రెండు సైకిళ్ళు పంపలేదూ?"

"అయితేమాత్రం? సార్జెంటు, సార్జెంటే—అతనికీ మనకీ పోలికేనా? మనలాంటి సాధారణ సైనికుడు యింటికి సైకిలు పంపుతానంటే ఒప్పుకుంటారా?" — అంటుండగా యిద్దరూ బయలుదేరారు.

జర్మను సైనిక కార్యాలయంముందు అటూ యిటూ తిరుగుతూ కాపాలా కాస్తున్నారు. లోపటినుంచి దీపపుకాంతి కనిపిస్తున్నది.

"టైము యెంతయి ఉంటుంది?" అని ప్రశ్నించాడు వారిలో ఒకడు.

"ఇంకొక అరగంటలో మన డ్యూటీ పూర్తవుతుందిలే".

నిముష నిముషానికి చలి భయంకరరూపం దాల్చుతున్నది. పొడుగాటి సైనికుడు తలకు ఊలుగుడ్డ చుట్టుకున్నాడు. కాని రెండవ సైనికుడు

చలికి తికమకలు పడుతూ చెవులూ, ముఖమూ అరిచేతుల్తో రుద్దు కుంటున్నాడు.

"అబ్బ! ఇంతటిచలిలో యిక్కడివాళ్ళు యెట్లా బ్రతుకున్నారో?"

"ఈ పశువులకు చలన్నమాటే లేనట్లు కనబడుతుంది ?"

"ఇంద్రధనుస్సు పొడిచింది చూచావూ ?"

"ఓ చూశాను."

"దానిభావమేమయ్యుంటుంది ?"

"ఏముంది ? ఈ దేశంలో చలికాలంలోకూడా ఇంద్రధనుస్సు పొడుస్తుందన్నమాట" అంటూ పొడుగాటి సైనికుడు బుజాలు యెగుర వేశాడు.

"ఎంత అందంగావుందో చూడు ?"

"అవును" — అని సమాధానం చెబుతూ త్రుళ్ళిపడి పొట్టి సైనికుడు దేనికోరకో కలియజూచాడు.

"ఏమిటది, అలా చూస్తున్నావు ?"

"అబ్బే! యేమీ లేదు."

కాని పొడుగాటి సైనికుడికికూడా యేదో భయంగానే ఉన్నది. బిత్తరపోతూ చుట్టూ చూచుకున్నాడు.

"ఏమిటోయ్, చూస్తున్నావు ? ఎక్కడా యేమీ కనబడందే—" అని కోపంతో అడిగాడు.

"భలేగావుంది. నువ్వు మాత్రం అలా చూడటంలేదూ ?"

"ఎవరో రోడ్డుప్రక్కన నడుస్తున్నట్లనిపించింది. తిరిగి చూద్దును గదా యేమీ ఉండదు. ప్రతి తఫా అలానే అనిపిస్తుంది.. మళ్ళీ చూస్తే యేమీ ఉండదు."

ఇద్దరూ భయపడిపోయారు. అందువల్ల దూరంపోకుండా సైనిక కార్యస్థానం సమీపంలోనే పచార్లు చేస్తున్నారు. ఇంతలో కార్యాలయం తలుపు తెరుచుకున్నది—

"ఎవరా తుపాకి పేల్చింది ?"

"నేనే వేల్చాను. ఒక పిల్లవాడు ఆ ఖైదీకి రొట్టె యివ్వటానికి ప్రయత్నిస్తుంటే చంపేశాను"—అని పొడుగాటి సైనికుడు ముందుకొచ్చాడు.

"ఎక్కడున్నదా శవం ? — అని బయటికివచ్చిన సార్జెంటు మళ్ళీ ప్రశ్నించాడు.

"రోడ్డు ప్రక్కనున్న గోతిలో పారేశాము"

"ఏదీ, పోయి చూద్దాము పదండి."

ముగ్గురూ కలిసి రోడ్డుప్రక్కనున్న కందకం దగ్గరకువెళ్ళారు.

"అదుగో, అక్కడే" అని ఒక సైనికుడు అటువైపు వేలితో చూపించాడు.

సార్జెంటు ముందుకు వంగి పరీక్షగా చూచాడు.

"ఏదీ, ఏమీ కనబడదే ?"

"అక్కడే ఉండాలే ! ఈడ్చుకొచ్చి యిందులోనే పారేశాము" అని ఆశ్చర్యపోతూ అన్నాడు పొడుగు సైనికుడు.

ఆ యిద్దరు సైనికులూ కందకంలోకి దిగి అటూ, ఇటూ వెతుక నారంభించారు.

"అంతదూరం వెళ్ళి లాభం లేదు. అసలు అంతవరకు పోకనే పోతిమే......"

సార్జెంటు వాళ్ళిద్దరి ముఖాలు అనుమానంతో చూడసాగాడు.

"ఏమిటిది ? నాకేమీ అర్థం కావటంలేదు." అని వాళ్ళను గద్దించాడు.

"అదికాదండీ; నా ప్రమాణపూర్వకగా చెబుతున్నాను. ఈడ్చుకు వచ్చి ఆ శవాన్ని యిక్కడే పారేశాము. మామాటల్లో నమ్మకం లేకపోతే ఇదిగో, యిప్పైనా చూడండి..." అని మంచుమీదనున్న రక్తపుమరకలు చూపించాడు ఒక సైనికుడు.

అవి పరీక్షగాచూచి—"ఇదంతా తొక్కి ఆచోకీ దొరకటానికి అణుమాత్రమైనా సాక్ష్యం లేకండా చేసేశారు. చాలా గొప్పగా కాపలా కాస్తున్నారన్నమాట. మీకళ్ళముందునుంచే శవాన్ని యెవరో యెత్తుకు పోయారు. కాని, యింతకూ మీమాటలెవరు నమ్మగలరు ?" అని సార్జెంటు విసుక్కున్నాడు.

"నిజంగానండీ; తెచ్చి యిక్కడేగదూ పారేసింది !..."

"దద్దమ్మలు; ఇంకా ప్రాణాలుండగానే పారేసుంటారు. మీ కళ్ళు మరిపించి చక్కా పోయుంటాడు."

"లేదు, లేదు ! ఒకటే దెబ్బతో గుండు వీపులోంచి దూసుకు పోయి ప్రాణాలు విడిచాడు. ఒక్క నిముషంలో చచ్చి ఊరుకున్నాడంటే నమ్మండి"

సార్జంటు ధాన్యపు కొట్టుదగ్గరికి వెళ్ళాడు. మంచులో రక్తపు మరకలు ఒక రొట్టెముక్కా కనుపించినై. చిన్న పాదాలగుర్తులు గూడా కనుపిస్తున్నది.

"ఇక్కడే అది జరిగింది. తర్వాత ఆ గోతిలోనికి యీడ్చివేశాము. ఇంకా కావాలంటే ఆ గుర్తులన్నీ చూడండి."

"అవును."

సార్జంటుకి నమ్మకం కలిగింది. ఆ యిద్దరు సైనికులు నిజం చెబుతుండడం ఆశ్చర్యంగానే ఉన్నది.

"సరే పదండి. మిమ్మల్నిద్దర్నీ అరెస్టు చేస్తున్నాను" అన్నాడు సార్జంటు.

"అరెస్టా ! ఎందుకు ?" అని యిద్దరు సైనికులు నిశ్చేష్టులై పోయారు.

"ఎందుకా నోరు వెళ్ళబెట్టటం ? ఈప్రాంతం కాపలా కాయటం మీదంతా కాదా ? అలాంటప్పుడు యిదేసలంలో మీ ముందే యిలాంటి సంగతులు జరిగిపోతున్నాయంటే అర్థం ? నేరస్థుడి శవం దొంగిలించుకు పోయినా మీ యిద్దరికీ యేమీ తెలియనేలేదు ! ఛీ లేకాపలా కాస్తున్నారు. మిమ్మల్ని నమ్ముకుంటే, యెవడైనా వచ్చి నిద్రపోతుండగా మా అందరి గొంతుకలు తెగగోసినా దిక్కుండదు.

సైనికులిద్దరూ తలలు క్రిందికి దించుకుని సార్జంటువెంట వెళ్ళసాగారు.

"దరిద్రపుదేశం" అని గొణిగాడు పొడుగు సైనికుడు నిట్టూర్చుతూ.

"అసలెవ్వరూ కనబడనేలేదే! ఎవరు దొంగిలించుకుపోయుంటారు చెప్మా!"

పొట్టి సైనికుడు భయంతో వణికిపోతున్నాడు. వంటిమీది రోమాలన్నీ నిక్కబొడుచుకుంటున్నాయి. నిజమే-అసలు అటువైపు యెవ్వరూ వచ్చినట్టేలేదు. చివరికి మంచు చితికిన అలికిడిగాని, నీడగాని కనబడనే లేదే? అయినా శవం మాయమైపోయింది! ఎలా జరుగుంటుంది? -

తన ప్రశ్నలకు తాను సమాధానం చెప్పుకోటానికే భయంగా ఉన్నది. అడుగులు తొందరగా వేయసాగాడు. భయంకరమైన చలినుంచి తప్పించుకుని వెచ్చగానున్న సైనిక కార్యాలయంలోకి చేరుకునేటప్పటికి ప్రాణం కొంత హాయనిపించింది. తాను అరెస్టులోనున్నానన్న సంగతి కూడా మరచిపోయాడు, కొంతసేపు. ఆ ఇంటి నాలుగుగోడలు ఆ భయంకరమైన రాత్రిని ఓడించేసాయని తృప్తిపడ్డాడు.

"కెప్టెన్ వచ్చింతర్వాత మీ విషయం విచారిస్తాడు ప్రొద్దుపొడిచే వరకు మీ రిక్కడ్నుంచి కదటానికి వీల్లేదు" అన్నాడు సార్జెంటు.

గదిలో ఒకమూల, నేలమీద యిద్దరు సైనికులూ కూలబడ్డారు. మొత్తానికి వెచ్చగా హాయిగానే ఉన్నది. పొడుగాటి సైనికుడు గోడ కానుకుని మగత నిద్రలో పడ్డాడు. కాని నల్లులు తెగ కుడుతున్నాయి. కొంతసేపు మగతలోనే గోక్కొని చివరికి కోపంతో తిట్టుకుంటూ లేచిపోయాడు.

"బయట చలితో చావు. లోపలికొస్తే నల్లుల్లో చావు."

ఇద్దరూ చలిమంట దగ్గరికి చేరుకున్నారు. ఒక్కొక్క నల్లినే తీసి చంపసాగారు.

*   *   *   *

'మాల్యూచికా' రొప్పుకుంటూ కూలబడ్డది. కందకిందగ్గర్నుంచి మూడువందల గజాలకుపైగా పొట్టమీద ప్రాకుకుంటూ రావటమంటే సామాన్యవిషయంకాదు. జర్మను సైనికులదృష్టి పడకుండా ఉండటానికి అనేకసార్లు మంచులో కూరుకుపోయి భూమిని కరుచుపోవలసివచ్చింది. కాని యేమైనప్పటికీ తన కొడుకు శవాన్ని దిక్కులేని కుక్క శవానికి మల్లే వదిలివేయ దలుచుకోలేదు.

ఎంతవరకు తవ్వాలో గీట్లు గీసుకొని పార భూమిలో గుచ్చింది. భూమి చాల గట్టిపడి ఉన్నది. ఆమె కొద్దిసేపట్లోనే అలిసిపోయింది.

" 'సాషా' కొద్దిసేపు తవ్వుబాబూ..."

'సాషా' పార తీసుకొని తన బలంకొద్దీ తవ్వుతున్నాడు. 'జీనా' క్రింద కూర్చొని చేతులతో మట్టి తోడుతున్నది.

ఒకరి తర్వాత ఒకరుగా ఆ గట్టి నేలను తవ్వసాగారు. గట్టిగా వున్న పైభాగం తవ్వగానే తక్కినదంతా కొంత సులభంగానే సాగిపోయింది. చివరికి ఒక లోతు గొయ్యి తవ్వగలిగారు.

'సాషా'! అన్నయ్య శవం అట్లానే గోతిలో పెట్టేస్తామా ?"

ఆమె నీళ్ళు తెచ్చి 'మిష్కా' శరీరంమీద రక్తమంతా కడిగింది. పెట్టెలోంచి ఒక చొక్కా తీసి ఆ బిగిసిపోయిన శరీరానికి దిగవేసింది.

"అన్నయ్యా, నీకెంతగతిపట్టింది !" అని చిన్నపిల్ల 'జీనా' యేడుస్తున్నది.

"ఏడవొద్దు. మన 'మిష్కా' యోధ్ర సైనికుడిమల్లే వీరమరణం పొందాడు తెలుసా ? దేశంకోసం చచ్చిపోయాడు."

అని 'మాల్యూచికా' 'జీనా'కు చెబుతున్నది. కాని ఒకవిధంగా తనకు తానే చెప్పుకొని సమాధానపడుతున్నదని చెప్పాలి. దుఃఖం పొంగి పొరలి వస్తున్నది. తన కొడుకుమీద పడి గ్రామమంతా మారుమ్రోగే టట్టుగా — తాను పది సంవత్సరాలు పెంచి పెద్దవాణ్ణి చేసిన ముద్దుబిడ్డడు జర్మన్ల తుపాకిగుండుకి యెర అయ్యాడన్న ఆమె దౌర్భాగ్యం అందరికీ తెలిసేటట్టుగా — యేడవాలనిపిస్తున్నది.

"మీ నాన్న గెరిల్లా దళంలోచేరి వెళుతున్నప్పుడు 'మిష్కా'ను పిలిచి "నా గౌరవం నిలబెట్టాలిసుమా !" అని చెప్పి మరీవెళ్ళారు. చివరికి ఆయనమాట నిలబెట్టాడు. నా చిట్టితండ్రి !"

"అవును..." అని 'జీనా' వెక్కి వెక్కి యేడుస్తున్నది.

"ఏడవకు తల్లీ ! అట్లా మనం యేడిస్తే మన 'మిష్కా'కి యీ సమాధిలోకూడా శాంతి ఉండదు. ఏడవకు...ఇదిగో, ఈ గుడ్డ యిటు పట్టుకో, పైన కప్పుదాము..."

'మిష్కా' శవాన్ని ఒక తెల్లదుప్పటితో చుట్టివేసి, నెమ్మదిగా గోతిలోకి దించారు.

" 'జినా' యింతమట్టి తీసుకుని మీ అన్నమీద వెయ్యితల్లీ..." అన్నది 'మాల్యూచికా'.

'జినా' క్రింద కూలబడి, యింత మట్టితీసి 'మిష్కా' శవంమీద నీరసంగా జారవిడిచింది. 'సాషా' కూడా యింత మట్టితీసి అన్నగారి శవంమీద వేశాడు. తర్వాత తల్లి పారతో మట్టితీసి గొయ్యి నింపేసింది. గొయ్యి నిండిపోగా పైన ఒక చిన్న దిబ్బ యేర్పడింది.

"ఈ దిబ్బ కనబడకుండా కాళ్ళతో మట్టి వెయ్యాలి. లేకుంటే రేపు జర్మన్లు వచ్చి యీ దిబ్బచూచారంటే, అంతా కనుక్కుంటారు" - అన్నదామె.

ముగ్గురూ కలిసి జాగ్రత్తగా ఆ దిబ్బను తొక్కసాగారు. ఎవ్వరూ, యెన్నడూ కనీ విని యెరుగనటువంటిపని తాను చేస్తున్నందుకు - తన ముద్దుబిడ్డడి సమాధిని తానే తొక్కుతున్నందుకు - దఃఖభారంతో క్రుంగి పోతున్నది. తన 'మిష్కా' శరీరంమీద - తాను పెంచి పెద్దచేసిన బిడ్డడి మృదువైన శరీరంమీద యెక్కి తొక్కుతున్నట్టనుపించింది...

"చెయ్యక తప్పదు..." అని గొణుగుకున్నది.

"ఇంక చాలదా, అమ్మా !" అని 'సాషా' అడిగేడు.

"చాలదు, బాబూ; ఇంకా తొక్కాలి. దిబ్బ యింకా యెత్తుగానే ఉన్నది. భూమి మట్టం అయ్యేవరకు తొక్కాలి.

మిగిలిన మట్టినంతా భద్రంగా చేర్చి తీసుకెళ్ళి పొయ్యిమూలపోసింది. సమాధిదగ్గర అంతా ఊడ్చివేసి యెవ్వరికీ తెలియకుండా ఉండటానికి ఇంత యెండుగడ్డి, చెక్కపేళ్ళు తెచ్చి అక్కడ చిందరవందరగా వేసింది.

"ఏమైనా అనుమానం కలిగేటట్టున్నదా ?"

'సాషా' సూక్ష్మంగా పరిశీలించి "లేదు...ఇప్పుడుమట్టుకేమీ కనబడటంలేదు...అయినా ప్రొద్దుపొడిచాక మళ్ళీ ఒకసారి చూద్దాము" అన్నాడు.

'మాల్యూచికా' తన కొడుకు సమాధిని చూచుకుంటూ నిలబడి పోయింది. కొన్ని గంటలక్రితం తన ముందున్న ముద్దుబిడ్డ యిప్పుడు

గురుతైనా లేకుండా తన కళ్ళముందునుండి మాయమైపోయాడు. ఇంతకు ముందు యెంతో మంది బాలురు చనిపోయినప్పుడు ఆమె కళ్ళారా చూచింది. కాని వాళ్ళందరికీ గౌరవంగా సమాధులు జరిగేవి. ఈనాడు తన బిడ్డ అటువంటి వేమీ లేకుండా అజ్ఞాతంగా తాను పుట్టిన యింట్లోనే యీ మూల తవ్విన గోతిలో ఉండవలసి వచ్చింది!

"పోయి పడుకోండి" - అని పిల్లల నుద్దేశించి అన్నదామె.

"మరి, నువ్వో?"

"నేనుకూడా పడుకుంటాను. ఇంక కొద్దిసేపట్లో తెల్లవారనే తెల్లవారుతుంది! పడుకోండి"

కాని 'మాల్యూచికా' కి కన్ను మూతపడలేదు. 'మిషా' సంగతి తన భర్త 'ప్లాటన్' సంగతి ఆలోచిస్తున్నది. 1918 నాటి యుద్ధంలో ఆమె భర్తకు చేతి రెండు వేళ్ళు తెగిపోయినై. అందువల్ల సైన్యంలోకి పనికిరాలేదు. కాని గెరిల్లా దళంవారు అతనికి రెండు వేళ్ళు తక్కువైనప్పటికీ అతను చూపే ఉత్సాహాన్ని చూచి తమ దళంలో చేర్చుకున్నారు.

'ప్లాటన్' యింటికి తిరిగిరాగానే 'మిషా' యేదని అడుగుతాడు. 'మిషా' అంటే ఆయనకు అమితమైన ప్రేమ. కాని తాను యేం జవాబుచెప్పగలదు? "అదుగో, అక్కడున్నాడు." అని చెప్పాలా!

కాని 'ప్లాటన్' మాత్రం ఈ మాటలు ప్రశాంతంగానే వింటాడు. పైగా "ఏడవకు 'మాల్యూచికా!' మన 'మిషా' జర్మన్లతో పోరాడుతూ వీర మరణం పొందాడు. దేశంకోసం చనిపోయాడు. మనం గర్వపడాలి!" అని ధైర్యం చెబుతాడు. !

'ప్లాటన్' యుద్ధరంగానికి వెళ్ళిపోతూ అన్న మాటలు ఆమె చెవిలో ప్రతిధ్వనించినై - " 'మాల్యూచికా' నువ్వు ధైర్యంతో పని చేస్తుండాలి, స్త్రీలు, పిల్లలు, ముసలాళ్ళుకూడా తమ శక్తివంచన లేకుండా కష్టబడి దేశాన్ని రక్షించుకోవలసిన రోజులొచ్చాయి. చేతికేదొరికితే అది ఆయుధంగా గ్రహించి దేశాన్ని రక్షించుకోటం మరచిపోవద్దు!" -

'మాల్యూచికా' కి యేమైనా రావటంలేదు. నిలువు గుడ్లతో నడవలోని తన కొడుకు సమాధివైపు చూస్తున్నది......

* * * *

వీధుల్లో కాపలాకాస్తున్న సైనికులు అప్పుడు జరిగిన విషయాన్ని గురించే యింకా మాట్లాడుకుంటున్నారు.

"దరిద్రపుదేశం. ఆ శవాన్ని యెవరెత్తుకు పోయుంటారబ్బా? కాలం కదిపితే మంచు పరపరలాడుతుంటుంది. అలాంటిది యిక్కడున్న వారికి అలికిడైనా కలుగకుండా శవం మాయంకావటం ఆశ్చర్యంకదూ?"

"ఏమో, యేంచెప్పగలం? ఈ దేశంలో యేదీ అర్థంకాదు" అని అందులో ఒక సైనికుడన్నాడు.

ఈవిధంగా మాట్లాడుకుంటూ భయంతో చుట్టూ చూసుకుంటున్నారు. ఏదో పాదాల చప్పుడు వినిపించినట్టు చెవులు నిక్కపొడుచుకొని వింటున్నారు. కాని యేమీ కనబడటంలేదు. చంద్రునిచుట్టూ పెద్దవలయాకారం యేర్పడింది.

"కొద్దిగా చలితగ్గినట్టుందికదూ?"

"చలితగ్గిందా? – ఇంకా నయం; నా చెవులు చలికి ఊడిపోయేట్టున్నాయి–"

"అలా ఊడిపోయినా కొంతనయం. హాయిగా హాస్పటల్‌లోపడి ఉండవచ్చు."

"ఆ మాట అసలే యెత్తవద్దు. మొన్న 'మల్హోర్'ని హాస్పటల్‌కి పంపారా? వాడికాళ్ళు పగిలి పాడైపోవటం చూడలేదు?"

"గట్టిగా అనకోయ్ – నీ పుణ్యముంటుంది."

"ఎవ్వరూ లేరు లెద్దూ..."

"అలానే అనుకుంటావు; కాని రేపటికల్లా అంతా సార్జంటు చెవిని పడి ఉంటుంది."

"నువ్వు చెబితేనే తెలియాలి"

"మళ్ళా ఆ మాటన్నావంటే బాగుండదు సుమా"

"అప్పుడే అంత కోపమా? ఏదో మాటవరసకంటే"

పొగమంచు అంతకంతకూ దట్టమై చంద్రునికి తెరగా యేర్పడ్డది. అందమైన నీలివర్ణంలో కనిపిస్తున్నాడు చంద్రుడు.

"నువ్వు యేమన్నా అను – చలి అంతకంతకు యెక్కువవుతున్నదే గాని తగ్గటంలేదు—"

ఆ యిద్దరు సైనికులు కొంతసేపు మౌనంగా అటూ యిటూ తిరిగారు.

"అన్నట్టు—ఆమనిషి యింకా ధాన్యపు కొట్లోనే ఉన్నదా ?"— అని అందులో ఒకడు ప్రశ్నించేడు.

"ఊఁ"

"చలికి బండబారి చస్తుందిలే"

"అరి! ఇక్కడి ఆడవాళ్ళను, పిల్లల్ని కూడా ఆపలేకుండా ఉన్నాంరా !"

"అహా - ఆ ఆడముండవైపు కన్నెత్తి చూశావంటే, నీ ప్రాణాలు యెగిరినవన్నమాటే. చిన్న పిల్లలా ? ఎక్కడ చూచినా వాళ్ళే నక్కుకుంటూ వచ్చి తయారవుతారు. మన సంగతులు తెలుసుకోటానికి గ్రామస్తులు వాళ్ళనట్లా పంపుతుంటారు."

మళ్ళీ కొద్దిసేపు యిద్దరూ మౌనం వహించారు.

"వీళ్ళను నాచేతికి స్తే-ఆ గ్రామంలో కెప్టెన్ చేశాడు చూశావూ?- అలా చేసి వదుల్తాను" అని ఒకడు ప్రారంభించాడు.

రెండవవాడు అవునన్నట్టు తల ఊపాడు.

"మనకు వాళ్ళు సహాయంచెయ్యరు. వాళ్ళ సంగతంతా నాకు తెలుసు. ఎంత ప్రయత్నంచేసినా లాభం ఉండదు. ఇంత అనవసర ప్రయత్నం చేసేబదులు మొదటగానే తెగనరికితే వొదిలిపోతుంది. పైగా భద్రంగా ఉండొచ్చు."

"అంతా అంతే నంటావా ?"

"అంతా అంతే. ఎలాంటివారో నువ్వు మాత్రం చూడటంలేదూ ? చిన్నపిల్లలతోసహా యెందుకూ పనికిగాకుండా అయిపోయారు. వాళ్ళను మంచిమార్గానికి తీసుకురావటం అసాధ్యం. అనవసరమైన శ్రమేగాని యెందుకూ పనికిరారు ?"

రెండవసైనికుడు ఒక నిట్టూర్పువిడిచి ఊరుకున్నాడు. ఇంతలో చంద్రుడ్ని మబ్బు కప్పేసింది. రోడ్డుప్రక్కనున్న చెట్టుకొమ్మలు ఊగనారంభించాయి. కొమ్మలమీది మంచు జల్లుగా పడుతున్నది.

"ఇంత వెన్నెలా ఒక్క క్షణంలో యెట్లామాఱిపోయిందో చూడు! గాలి మారుతున్నట్టున్నదికనూ ?"

"గాలిదుమారం లేచేట్టున్నది."

గాలి తీవ్రంగా వీచ నారంభించింది. అక్కడక్కడా సుడులు తిరుగుతా మంచును పైకి లేపుతున్నది. గాలితోపాటు మంచువచ్చి తీవ్రమైన వడితో శరీరాలకు తగులుతున్నది.

"టైమెంతయింది ?"

"అబ్బో, పొద్దు పొడవటానికి చాలా టైమున్నది."

మంచు కప్పిఉన్న పొలాలమీదుగా ఒక గంభీరమైన శబ్దం అంత కంతకూ దగ్గరగా యెక్కువవుతూ వినబడసాగింది. అది గ్రామం సమీపించేటప్పటికి 'క్రీ' మను శబ్దంలోకి దిగింది. చెట్లు ఊగులాడిపోతున్నవి. మంచు గాలితో పైకి లేచి వెండిపరదంలాగ కిందికి పడుతున్నది. కాపలా సైనికులు కాలు ముందుకి కదపలేక గాలివైపు తలలు వంచి నిల్చున్నారు. గాలి ఒక్కొక్కతడవ ఒక్కొక్కవైపునుండి వీచసాగింది. వెనుకనుండి వీస్తున్నప్పుడు సులభంగా ముందుకి పోగలుగుతున్నారు.

"నాశనపు చలికాలం. మళ్ళీ గాలిదుమారం ప్రారంభించింది. యే వస్తువూ కనుపించదీ గాలిలో"

ఇద్దరూ ఒక్కసారిగా భయంతో వెనక్కితిరిగి చూశారు. కాని యేమీ కనపించలేదు. అంతాశూన్యం.

3

"ప్రేయసీ, 'లూయిసా' !"

కెప్టెన్ 'కర్ట్ వెర్నర్' తాను వ్రాస్తున్న ఉత్తరంమీదినుంచి దృష్టిని కిటికీవైపుకి మరల్చాడు. బయట తీవ్రమైన గాలిదుమారం లేచింది. గ్రామంలోని యిండ్లన్నీ కదలిపోతున్నట్లుగా ఉన్నాయి.

విచారంతో 'కర్ట్' హృదయం బాధపడసాగింది. ఇతర ప్రపంచంతో సంబంధం లేనట్లు; మంచుయెడారిలాగఉండే యీ భయంకర చలి దేశంలో భార్యా, బిడ్డలకు దూరమైపోయి ఉండడం కష్టంగానున్నది. 'డ్రెస్ డెన్' లోని తనభార్యా, బిడ్డల్నిచూసి చాలాకాలమయింది. ఫ్రాన్సునుంచి తనదళం ఇక్కడికి మారివస్తున్నప్పుడు ఒకరోజుపాటు అయినా యింటికి పోయివచ్చేటట్లు యేర్పాటు చేసుకుందామనుకున్నాడు.

కాని ఈ రంగానికి ఆదర బాదరగా మార్చేటప్పుడు 'డ్రెస్ డెన్' మీదుగా వచ్చినప్పటికీ, అక్కడ ఎవ్వరూ దిగకూడదన్న కఠినమైన ఆజ్ఞ అధికారులు యివ్వటంవల్ల, చివరికి గ్రామంలోకి ఒక్కసారివెళ్ళిరావటానికైనా వీల్లేకపోయింది. రైలుపెట్టె కిటికీలోంచి తన యింటివైపు చూచుకొని ఒక నిట్టూర్పు మాత్రం విడిచాడు. ఇప్పుడు చివరికి ఒకగంట, అలాకాకపోతే ఒక పది నిముషాల పాటయినా ఇంట్లో కుటుంబంతోపాటు హాయిగా ఉండాలని హృదయం తపించి పోతున్నది. అక్కడ ఈ గాలిదుమారాలు, ఏ నిముషాన్నయినా తన్ను కబళింపజూచే మృత్యువు వుండవు. తన కుటుంబము యిప్పుడు వెచ్చగాకూర్చొని కాఫీ త్రాగుతూ ఉండాలి. 'లూయిసా' అందరికీ రొట్టె పంచుతుంటుంది. ఆమె మృదువైన హస్తంతో యిచ్చే కాఫీ త్రాగే భాగ్యం తనకు మళ్ళీ యెప్పుడు కలుగుతుంది ?

ఇక్కడ తన జీవితమంతా అసహ్యమనిపించింది. మధ్యాహ్నం వరకూ పక్కమీదినుంచి లేవకుండా, యేదానికీ మూతి ముడుచుకుంటూ ఉండే 'ఫ్రన్సీ' ని చూస్తే రోతపుడుతున్నది. ఇల్లు ఊడవటంరాదు. చివరికి పక్కసర్దటానికికూడా వళ్ళొంగని మనిషి. ఇంటినిండా చెత్త, చిందర వందరగా పడివున్న వస్తువులు చూడటానికి అసహ్యమనిపిస్తున్నాయి. ఎప్పుడూ యిల్లు చక్కజేడుతూ, అన్నీ శుభ్రంగాఉంచే 'లూయిసా' జ్ఞాపకానికివచ్చింది... అన్నిటికంటే యిక్కడి ప్రజల్ని చూస్తుంటే మరీ వొళ్ళు మండిపోతున్నది. ప్రతివాడు తనను ద్వేషించేవాడే గాని, ఒక్కడూ గౌరవించేవాడు కనబడడు. దారిని పోతున్నవాళ్ళు తమ దృష్టిని భూమి మీదే ఉంచుతారుగాని తనవైపు మరల్చటానికి యిష్టపడరు. తనకు ఆనందం కలిగించే... తానంటే భయంగాని, గౌరవంకాని — యే కోశాన చూపించరు.

"మీ పని పట్టిస్తా ఉండండి" అని పళ్ళు బిగించాడు. సగం వ్రాసిన ఉత్తరం కనుపించగానే మళ్ళీ చర చర వ్రాయ నారంభించాడు.

"మీ మధ్యకు వచ్చి మళ్ళీ యెప్పుడు చేరుకుంటానా అని నా మనస్సు తహతహ లాడిపోతున్నది. ఈ భయంకరమైన అనాగరకత దేశంలో యెడతెరిపి లేకుండ ముందుకి సాగి పోతున్నాము. 'లూయిసా' త్వరలో మా యుద్ధం విజయవంతంగా ముగిసి పోతుంది."

'లూయిసా' సంతోషపడాలని అతని ఆశ. నెలరోజులబట్టి వారి సైన్యదళం యిక్కడే ఉండిపోయిందనీ ఆమెకు చెప్పకూడదనుకున్నాడు. ఈ వెధవ గ్రామాన్ని గురించి చెప్పకపోయినా నష్టంలేదు. పాడు చలి ప్రాణాలు తోడేస్తుందని, జర్మన్లకోసం యెక్కడబడితే అక్కడ గెరిల్లాలు పొంచిఉన్నారనీ, తన సైనికులు రోజు రోజుకీ విరక్తి చెందుతున్నారనీ, ఫ్రాన్సునుంచి వచ్చిన తన దళంలో చివరికి ఒక్కడైనా బ్రతికిలేదనీ, తన స్వగ్రామం వారిలో 'చెచెర్' మాత్రం మిగిలి ఉన్నాడనీ ఆమెకు వ్రాయటం యిష్టంలేదు. ఆమెకివన్నీ తెలియనవసరంలేదు. ఎందుకూ, అనవసరంగా? యుద్ధరంగంనుంచి వచ్చే ఉత్తరాలు ధైర్యాన్ని కలిగించేవిగా ఉండాలి. అంతేగాక ఆమెకు చేరేలోగా అనేకమంది చదివే యీ ఉత్తరాలు తన మనస్థితిని ప్రతిబింబిస్తాయికదా!

'చలి యిక్కడ భయంకరంగా ఉన్నమాట నిజమే. ఇంతటి చలికి మేము అలవాటు పడకపోయినా, హెర్ హిట్లర్ పలుకులు మాకు ఉత్సాహాన్నిచ్చి, చలిని తరిమేసేటట్లు చేస్తున్నాయి. అతని కార్యక్రమాన్ని ఆచరిస్తూ జర్మనీకి సేవచేసే భాగ్యం మాకు కలిగినందుకు గర్వపడుతున్నాము.'

మరికొన్ని వాక్యాలు వ్రాసి ఉత్తరాన్ని మొదటినుంచి చదివి చూచుకున్నాడు. మొత్తానికి బాగానే ఉన్నది. ఇక్కడి సైనికులకు పంచటానికి జర్మనీనుంచి వచ్చే కరపత్రాలకంటే యెన్నోరెట్లు నయంగా ఉందనిపించింది.

కలంపుల్ల నోటితో కొరుకుతూ కొంతసేపు ఆలోచించి అందులో యేమీ మార్చటం అవసరం లేదనుకున్నాడు. చివరికి తన పిల్లల్నిగురించి కొంత వ్రాయవలసి ఉంటుందనుకున్నాడు. తను కేవలం కష్టపెనేగాక ఆదర్శమైన భర్త, ప్రేమమయుడైన తండ్రి అని తెలియచేయకపోతే యెట్లా ? –

"ప్రేయసీ! యింటిదగ్గర అన్నీ సవ్యంగా జరుగుతున్నట్లు వ్రాయి. 'ఫ్రిజ్' యెట్లాగున్నాడు ? 'విల్లీ' కి జబ్బు నయమైనట్లేనా ? వాడి జబ్బు శరీరానికి పనికొచ్చే కో కోకటి పంపిస్తాను. నీకు మేజోళ్ళు కావాలని వ్రాసావుకదూ ? కాని యేం చెయ్యను? ఇక్కడ అవి దొరకటం కష్టంగా ఉన్నది. ఇప్పటివరకు మేం వచ్చినవన్నీ చిన్న చిన్న గ్రామాలే; కాని పెద్ద పట్టణాలు మా వశంకాగానే నీకు పంపటానికి ప్రయత్నిస్తాను. పోయినవారం నీకు వెన్న పంపించాను. అది. యితర సామాన్లు అందినట్టు వ్రాయించు. వచ్చేవారం మీకు తేనె పంపిస్తాను, 'విల్లీ' కి గూడా అది చాలామంచిది."

ఇంతలో తలుపుతట్టిన శబ్దమయింది.

"ఏమిటది ?"

"గ్రామాధికారి వచ్చేడండీ"

"సరే, ఉండమను" – అని మళ్ళీ ఉత్తరం వ్రాయటానికి పూనుకున్నాడు. కాని అతని మనసు 'డ్రెస్‌డెన్' నుంచి మళ్ళీ వచ్చి యీ భయంకర గ్రామంలో పడటంచేత, దానిని ఉత్తరంమీద లగ్నం చేయ

లేకపోయాడు. పిల్లలికి ముద్దులు, భార్యకు ఆశీర్వాదాలు తెలియజేస్తూ ఉత్తరం పూర్తిచేసి, సంతకంచేసి కవరులో పెట్టాడు.

"సరే; యేదీ? అతన్ని లోపలికి పంపించు"

కొద్దిగా నడుము వంగిన ఒక పొడుగాడి మనిషి లోపలికివచ్చాడు.

"నా కోసం కబురు పంపేరటకదూ!"

"అవును. పిలిపించాను"

టేబిలుక్రింద కాళ్ళు పూర్తిగా చాపుకొని క్రొత్తగావచ్చిన మనిషి వైపు పరీక్షగాచూస్తూ యిలా అన్నాడు:

"ధాన్యం సిద్ధంగా ఉన్నట్టేనా?"

గ్రామాధికారి గిరుక్కు మని తల వంచుకున్నాడు.

"నా శక్తికొద్దీ ప్రయత్నిస్తున్నానండీ; కాని ధాన్యం యెక్కడా లేదు."

"ఏమిటీ ధాన్యమే లేదా? మూడువందల గడపగల గ్రామం — సారవంతమైన భూములూ అయితే — ధాన్యమే లేవంటావూ? అంతా దాచేసుంటారు; అంతే."

"అవును, దాచేసారు"—అని ఒక నిట్టూర్పు విడిచాడు గ్రామాధికారి. మళ్ళీ బయట వీస్తున్న గాలిదుమారంమువైపు చూపిస్తూ "ఈ మంచు దుమారంలో వెతికి పట్టుకోవడం సాధ్యమయ్యేటట్టుకూడా లేదు. ఇంక నేనేం చెయ్యను" అన్నాడు.

"ఇదిగో! 'గ్లాప్లక్' నే చెప్పేమాట సరిగ్గావిను. గట్టిగా ప్రయత్నిస్తే యెటువంటవ్వాడైనా పట్టుకోవచ్చు. ముందు కూర్చో చెబుతాను."

'గ్లాప్లిక్'ఒక కుర్చీ కొనను నమ్రతతో కూర్చున్నాడు.

"నీపని నాకేమాత్రమూ తృప్తిగాలేదు. అసలు నిన్నేవుద్దేశంతో యిక్కడికి పంపించారో అర్థంకావటంలేదునాకు. ఈ గ్రామం మనిషయితే బాగుండుననిపిస్తుంది. ఏంలాభం, నువ్వు నెలరోజులైనా యిక్కడి ప్రజ అంతు పట్టలేకపోయావు. పోనీ, చివరికి యీ గ్రామస్థుల్లో ఒక్కడైనా పరిచయమయ్యాడా?"

గ్రామాధికారికి కొంత ధైర్యం కలిగినట్లయింది. తలపంకిస్తూ యిల అన్నాడు "అవునండీ, నాకెవ్వరూ తెలియదు. పెద్దగ్రామము: అంద

లోనూ నాతో యెవ్వరూ కలిసి మాట్లాడడు. ఇక్కడి మనిషయితే చాలా సులభంగా వుండేదేమో —"

"ఐతే, యీపని చేయటం నీకు యేమీ యిష్టం లేదన్నమాట" అన్నాడు కెప్టెన్ 'కర్ట్ వెర్నర్.'

'గాప్లిక్' చేతిలోవున్న టోపీని గట్టిగా నొక్కుతూ మౌనంగా ఉండిపోయాడు.

"నేనే గాని నీ స్థితిలోవుంటే, మేము లేకపోయేటట్టయితే యెర్ర సైనికులు యేనాడో కాల్చిచంపేసి ఉండేవారన్నమాట మరిచిపోను. అంతకంటే ఘోరమేమిటంటే, యీ రైతులు నిన్ను గడ్డపారల్తో పొడిచి చంపేసుందురు... నీ ప్రాణాలు రక్షిస్తున్నందుకు నీవు జర్మను అధికారులకు కృతజ్ఞుడవై ఉండాలి. వాళ్ళ ఆజ్ఞలను శిరసావహించాలి. నిన్ను యెంతో పెద్దసహాయం కోరటంలేదు. ఆమాత్రమైనా చేయలేవా ?"

'గాప్లిక్' ఒక నిట్టూర్పు విడిచాడు. కాని మాట్లాడలేదు.

"నీవు వుత్సాహంతో పనిచేయడంలేదు. 'బోల్షివిక్కులు నీ భూమి లాక్కుని, నిన్ను జైల్లో పెట్టారు. నువ్వు మాకెంతో సహాయం చేస్తావనుకున్నాము. కాని నువ్వుచేసిందేమీలేదు. నా సైనికులు ప్రయత్నించి తెచ్చిన ధాన్యంతప్ప నువ్వు తెచ్చింది శూన్యం. పోనీ విలువగల వార్తలైనా నీనుండి మాకు లభించలేదు."

ఎక్కడో పొంచివుండివిన్న యీ వార్త జర్మనులకు తెలియజేసి వాళ్ళ ప్రాపకం సంపాదించి తనను ప్రమాదంనుంచి రక్షించుకోవాలనుకున్నాడు 'గాప్లిక్'.

"సరే; అంతకంటే యింకేం సహాయంచేశావో చెప్పు ?"

"బడి పంతులమ్మ సంగతో..." అని 'గాప్టిక్' గొణిగాడు.

"పంతులమ్మ సంగతిమాత్రం యేం చెప్పావని ? చెప్పిన కొద్దయినా రూఢికాలేదాయె."

"ఈ గ్రామస్థుడెవడైనా అయితే అన్నీ బాగా తెలిసేవి..."

"అవును లేవయ్యా ! దొరికితే, బాగానేవుండును. కాని దొరికేదెలా ? ఉన్న మూడువందల గడపలో అంతా సమిష్ఠి వ్యవసాయ క్షేత్రంలోనివారే. విడిగా వ్యవసాయం చేసుకునేవాడు ఒక్కడూ, కన

బడదు. దమ్మిడీకానని యీ దరిద్రపు ముండాకొడుకులకు 'బొల్షివిక్కు'లం మర్యాదస్థులైన గొప్పవారందరిదగ్గర్నుంచి భూమి గుంజుకుని పంచి పెట్టారు. విప్లవానికి పూర్వం రోజుకూలి చేసుకుంటూ బ్రతికిన యీ ముండాకొడుకుల్లో నమ్మకస్థుడెవడు దొరుకుతాడు?" అంటూ 'కర్ట్' కోపంతో బల్లగుద్ది "'గ్లాపిక్'! యికనుంచయినా నువ్వు మెలకువతో పనిచేయక తప్పదు. లేకపోతే నీయెడల నేను వేరుగా ప్రవర్తించవలసి వస్తుందిసుమా! నీకు నేను, మూడు - అంతేకాకపోతే నాల్గు - రోజుల గడువిస్తాను. ధాన్యం సంపాదించటానికి, సైనికులకు తిండి అందాలి. ఈ రైతులదగ్గర నీ చాతగానితనంవల్ల నా సైనికులు తిండిలేక చావటానికి వీల్లేదు:"

"నా అంతట నేను యేమీ చెయ్యలేను. సైనిక సహాయంవుంటేనే యేమైనా సాధ్యపడుతుంది." అన్నాడు చిఱచిఱలాడుతూ.

"సైనిక సహాయం నీకేనాడైనా నిరాకరించానా చెప్పు? నీకవసరమైన సహాయమంతా యిస్తాను. కాని నువ్వుకూడా నీబుద్ధిని ఉపయోగించి పని చేయాల్సిఉంటుంది. ఏదైనా మార్గం ఆలోచించు..."

'గ్లాపెక్' ముఖం వికసించింది.

"సరేనండీ; తగినమార్గం ఒకటి ఆలోచించి మీకు నివేదించుకుంటాను."

"సరే; కాని ఆలస్యం చెయ్యబోకు, ఇంకా నాల్గు రోజులుమాత్రమే గడువున్నదని గుర్తుంచుకో! మరొకసంగతి: నిన్నటి శవం యెత్తుకుపోయినవాళ్ళనుగూడా పట్టివ్వాలి. వాళ్ళుదొరకకపోతే నిన్నే బాధ్యుడ్నిగా యెంచుతాను. అందుకుగూడా నాల్గురోజుల వ్యవధిమాత్రమే యిస్తున్నాను."

'కర్ట్' ఈ విధంగా చెప్పి అటువైపు తిరిగి కిటికీ అవతలికి చూడనారంభించాడు. గాలి జోరుగా వీస్తున్నది. మంచు పొడిసుడిగాలిలో మేఘాల్లాగ ఆకాశానికి లేస్తున్నది. ఆ తుఫానులో ఇల్లు ముక్కముక్కలై పోతుందా అనిపిస్తున్నది. తనతో పని పూర్తయిందని గ్రహించి, 'కర్ట్'కి సలాంచేసి, గదివిడచి బయటపడ్డాడు 'గ్లాపిక్'.

బయటికి వచ్చినతర్వాతగాని టోపీ నెత్తిన పెట్టుకోటానికి ధైర్యం కలుగలేదు. ఈ తలపొగరు గ్రామస్థులదగ్గర్నుంచి యేవిధంగా

ధాన్యం సేకరించాలాఅని దారిపొడుగునా ఆలోచించసాగాడు. ఆలోచనతో ఆలాగే నడిచి పోతుండగా యెదురువచ్చే ఒక మనిషికి గుద్దుకునేంతటి పని జరిగింది. భయంతో ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. తలనెరిసిన ఆ రెండవమనిషి మొదట యితనెవ్వరో తెలియక, క్షమించమనబోయి, ముఖంబాగా పరిశీలించి గుర్తుపట్టి, అసహ్యంతో కాండ్రించి ఉమ్మేసి, యిండ్లతట్టు వెళ్ళిపోయాడు.

‘గాప్లిక్’ యింటికి చరాచరా వెళ్ళి, బల్లముందు కూర్చొని, కాగితం మీద యేదో వ్రాయనారంభించాడు. ఆలోచనతో తల ఇటు, అటువంచుతూ కలంతో నెత్తిగోక్కుంటూ, వ్రాసింది మళ్ళీ కొట్టేస్తూ ఒక నిట్టూర్పు విడిచాడు. చెమటపట్టిన బట్టబుఱ్ఱ తుడుచుకున్నాడు. బయట వీస్తున్న గాలి శబ్దం సహించలేకుండా ఉన్నాడు. మాటిమాటికి జ్ఞప్తికివస్తున్న ‘క్లెపెన్’ కఠినమైన పలుకులు, దానికి మించి తనయెడల గ్రామస్థుల మనోనిబ్బరాన్ని తలుచుకుంటుంటే వళ్ళు మండిపోతున్నది. గ్రామస్థుల మనోనిబ్బరాన్ని నాశనంచేసి, యీతడవైనా ‘కర్ట్’ ని తృప్తిపరచకపోతే తనకు మూడిందనుకున్నాడు.

గాలిదుమారంలో మంచుసుళ్ళు తిరిగి పైకిలేస్తున్నది. గ్రామస్థులందరు తమ ఇండ్లలో కూర్చొని ఆ గాలి రొదను వింటున్నారు. ఒక్క ముసలి ‘యాడోకిమ్ ఒఖాబ్కో’ మాత్రం యేకాంతాన్ని సహించలేక, ఆ గాలి దుమారంలోనే పొరుగువారింటికి వెళ్ళాలనుకున్నాడు. గాలిలో అతిప్రయత్నంమీద ‘మాల్యుచికా’ యింటిగుమ్మం ముందుకి చేరుకొని చెప్పుల కంటుకున్న మంచు దులుపుకున్నాడు. లోపలంతా నిశ్శబ్దం. ‘యాడోకిమ్’ తలుపుకొట్టి, జవాబు రాకముందే త్రోసుకొని లోపలికి వెళ్ళాడు. లోపల తల్లీ పిల్లలు భయంతో నివ్వెరపోయి చూడసాగారు.

“అంతా బాగున్నారా ?”

‘మాల్యుచికా’ ఒక నిట్టూర్పు విడిచింది. ఆమెగుండె దడదడ కొట్టుకోసాగింది.

“నువ్వా, ‘యాడోకిమ్’ తాతయ్యా !”

“అవును తల్లీ, ఎందుకట్లా గాభరాపడతారు ?”

ఆమె జవాబు చెప్పలేదు. 'యూడోకిమ్' తాత యింకా అట్లానే తనచేతికఱ్ఱను ఆనుకొని నిల్చున్నాడు.

"ఏమిటీ, అలాగున్నారు? కూర్చోమ్మనైనా అనటంలేదే?"

"ఈ యింట్లో కూర్చోకపోవటమే మంచిది" అని ఆమె గంభీర వదనంతో అన్నది.

"ఏమిటో, నాకేమీ అర్థంకావటంలేదు" అంటూ 'యూడోకిమ్' తాత కిటికీ అంచుమీద కూలబడ్డాడు.

"గాల్యా, నువ్విట్లా కూర్చున్నావేం? వొంట్లో బాగుండలేదా? 'మిష్కా' యేడీ?"

'జినా' బావురన యేడ్వటం ప్రారంభించింది.

"అసలు సంగతి చెప్పరేం?"

"ఏడవకు 'జినా'" అని తల్లి 'జినా'ను ఊరుకోబెడుతున్నది.

'యూడోకిమ్' తాతకు యేమీ అర్థంకాక తల గోక్కున్నాడు. చేతికఱ్ఱమీద గడ్డం ఆనించి 'మాల్యూచికా' వైపు చూడసాగాడు.

"ఏదో జరిగినట్టేవున్నది. మీ 'మిష్కా' యేడీ? ఈ గాలి దుమారంలో యెక్కడికి పోయివుండడే..."

"'మిష్కా' పోయాడు. తాతయ్యా!"

"పోయాడు? ఎక్కడికి?"

"ఎక్కడికీలేదు......జర్మన్లు రాత్రికాల్చి చంపేశారు!"

"ఏమిటీ, నువ్వనేది? 'మిష్కా'ని చంపేశారు?" — అని నివ్వెర పోయాడు.

తుపాకిదెబ్బ వినబడలేదూ? 'ఓలెనా'కు రొట్టె యివ్వటానికి వెళ్ళాడు. వాళ్ళు కాల్చేశారు...

'యూడోకిమ్' తాతచూపులో యేదో ప్రశ్న గుర్తించిందామె.

"లేదు — నాబిడ్డను జర్మన్లకు వదిలెయ్యలేదు — కందకంలోంచి రహస్యంగా వీపుమీద వేసుకు వచ్చేశాను. జాగ్రత్తగా సమాధి చేసేశాము. ఎవ్వరూ కనిపెట్టలేరు..."

"అసలు యెవరైనదీ, వాళ్ళు గుర్తుపట్టేరా?"

"ఎలా తెలుస్తుంది ? చంపటంతోటే కక్కాను యీడ్చిపారేసి నట్టుగా, ఒక కందకంలోకి యీడ్చిపారేశారు. ఇంతవరకు చూచుకొని ఉండరు. శవం కనబడ పోవటం కనిపెట్టగానే బయలుదేరక మానరు. నువ్వు తలుపుతట్టినప్పుడు వాళ్ళేననుకున్నాము"

'యాడోకిన్' తాత తల పంకిస్తూ అన్నాడు: "అదా సంగతి ? ఎంత మంది నశించిపోతున్నారు ! ... చివరికి పిల్లలుగూడా...'సాషా'. నీవీ సంగతి యెన్నటికీ మరువగూడదు."

అవునన్నట్టుగా 'సాషా' తల ఊపాడు.

"మీ నాన్నా, వాళ్ళు వచ్చినప్పుడు యివన్నీ - నువ్వుచూచినవన్నీ చెప్పాలి"

"ఇవన్నీ వాళ్ళకు మాత్రం తెలియవా_" అన్నది 'మాల్యూచికా'.

"అవును; తెలుసునన్నమాట నిజమే. వాళ్ళు తమ కళ్ళార అనేకం చూచారు. అయినా యిదివేరు...ఇంతకముందు నీ భర్త 'ప్లాటన్' యితరులకొరకై జర్మన్లమీద పగ సాధిస్తున్నాడు. కాని యిప్పుడు తన 'మిషా' - తన ఆత్మీయుడు - కొరకు వాళ్ళమీద పగతీర్చుకుంటాడు..."

"కాని యేం లాభం......"అన్నది నెమ్మదిగా, 'మాల్యూచికా'.

"అది నిజమే. కాని యెంతైనా స్వంతకొడుకుగదా ? పోయిన యుద్ధంలో జర్మన్లు నా కొడుకుని చంపేశారు. అన్ని విషయాలకంటే అది నాకు యిప్పటివరకు బాగా గుర్తున్నది. ఎంత దగ్గరివారైతే అంతగా బాధపడతాము. ఏకాకినై పోయాను నేను......వాడే బ్రతికుంటే, మనుమలతో యిల్లు యెంత కళకళలాడుతూ ఉండేది !"

"మేం లేమా, తాతయ్యా ?"

"అది నిజమే. కాని యెంతైనా కడుపుకన్న కొడుకంటే..."

"ఆగండి !...అదుగో, గంటవాయించు తున్నారు. అంటే. యేదో సభపిలుస్తున్నారన్నమాట !..."

'మాల్యూచికా' ముఖం కళ తప్పిపోయింది.

"తప్పకుండా 'మిషా' విషయమయ్యే ఉంటుంది"

'ఏమో, యేమిచెప్పగలం ? ఇంకా ఎన్ని కారణాలు లేవుగనుక ?" అని సమాధానమిచ్చాడు. 'యాడోకిన్' తాత.

గంట మ్రోగుతూనే ఉన్నది.

"వెళ్ళక తప్పదు ... లేకుంటే బలవంతాన యీడ్చుకుపోతారు. నువ్వూ వస్తున్నావా, తాతయ్యా?"

"ఏంచేస్తాము... వెళ్ళక మానగలమా..." అని 'యకాడ్లోకమ్' తాత తన కఱ్ఱ నానుకొని ఆయాసంతో లేచాడు.

"'సాషా' నువ్వు చెల్లెల్ని కనిపెట్టుకొని యిక్కడే వుండు. అది ముగిసిపోగానే, నేను వచ్చేస్తాను."

గాలిలో లేస్తున్న మంచుగూడా కాళ్ళీడ్చుకుంటూ రోడ్డువెంట బయలుదేరారు. అలా పోతుండగా ఒక్కొక్క యింటిలోంచి ఆడవాళ్ళు, ముసలివాళ్ళు వచ్చి చేరుకోసాగారు.

"ఏమిటో సంగతి, నీకేమైనా తెలుసా?"

"నాకు మాత్రం యేమి తెలుస్తుంది? గంటవిని నీలాగే బయలుదేరి వస్తున్నాను."

"ఓరి, దేవుడా! ఈసారి యేమి ముంచుకువస్తుందోగదా!" అని ఒక స్త్రీ నిట్టూర్చింది.

"ఊరుకోవమ్మా! వినకముందే యింత గొడవచేస్తే యెట్లా?" అని 'ఫెడోసియా' ఆమెను మందలించింది.

"తప్పకుండా యేదో కష్టమేవచ్చిపడుతుంది."

"కష్టాలుగాక, సుఖాలు తెచ్చి పెడతారనుకున్నావా? నీకు యేమాత్రం సుఖం తెచ్చిపెట్టారుతల్లీ?"

"అంతేలే. అంతేలే."

"అలాంటప్పుడు అనవసరంగా గోలపెట్టేమిలాభం?" అన్నది 'ఫెడోసియా'.

ఎవ్వరూ జవాబివ్వలేదు. 'ఫెడోసియా' సంగతీ, ఆమె కొడుకు 'వాస్యా' సంగతీ గ్రామస్థులందరికీ తెలుసు. ఆమెకు నుదుటిమీద ఆ ముడతలు యెందువల్ల యేర్పడ్డవో అందరికీ తెలుసు. నిట్టూర్పులు విడవటానికి, అది యెవరికీ సమయంకాదని చెప్పటానికి ఆమెకు ప్రత్యేకహక్కు ఉన్నది. ఇతరులకు, ఎర్రసైన్యంలోగాని, గెరిల్లాదళాలలోగాని ఉన్న తమ భర్తలు,

బిడ్డలు తిరిగి రాగలరనే ఆశ అయినా ఉన్నది. కాని 'ఫెడోసియా'కి అటువంటి ఆశాకిరణంగూడా లేదు. అయినప్పటికి ఆమె తన దుస్థితిని గురించి యితరులతో యెన్నడు మొరపెట్టుకొని యెరుగదు!

అన్ని వైపులనుండీ స్కూలు భవనంలోకి ప్రజలు చేరుకొనసాగారు. మునుపటి అలవాటుప్రకారం దానిని స్కూలు భవనం అంటున్నారు. విశాలమైన గదులు. యెత్తయిన కప్పు. చక్కని కిటికీలుకలిగి యెంతో కళగా వుండేది. కాని యిప్పుడది స్కూలుకాదు. జర్మన్లు బల్లలు, కుర్చీలు విరుగగొట్టి వంటచెరుకుగా వాడుకున్నారు. మ్యాపులు, చిత్రాలు మొదలైనవి చించిపారేశారు. ఆ భవనాన్నే యిప్పుడు సభలు జరుపటానికి ఉపయోగిస్తున్నారు. స్త్రీలు, ముసలివాళ్ళతో కూడుకున్న ప్రజాసమూహమంతా నెమ్మదిగా లోపలికి చేరుకున్నది.

వచ్చినవారందరిలో 'మలాషా' మాత్రం తనకూ యితరులకూ మధ్య పెద్ద అఘాతం — ఎవ్వరు దాటలేనటువంటి అఘాతం — యేర్పడినట్టు దూరంగా నిల్చున్నది. పాలిపోయిన ముఖంతో గోడప్రక్క నిలబడి శూన్యదృష్టితో యెటో చూస్తున్నది. తలమీదనుంచి కప్పుకున్న శాలువా లోంచి ముంగురులు చిందరవందరగా ముందుకు పడుతున్నాయి. వాటిని వెనక్కి దువ్వుకునే ప్రయత్నమైనా చేయటంలేదు—

వేదికమీద ఒక చిన్న బల్లవెనుక 'గాప్లిక్' కూర్చుని ఉన్నాడు. అతని ప్రక్క ఒక జర్మను సార్జంటు అవలింతలుతీస్తూ, అక్కడ మూగిన ప్రజలవైపు నిర్లక్ష్యంగా చూస్తున్నాడు.

"అందరూ వచ్చినట్టేనా?" అని 'గాప్లిక్' కేకవేశాడు.

"ఆఁ, అంతా వచ్చారు." అని యెవరో తలుపుదగ్గర్నుంచి గొణిగారు.

'గాప్లిక్' టేబిలుమీద కొన్ని కాగితాలుపెట్టి, వణుకుతున్న చేతులతో ఒక్కొక్కటే తిరుగవేయసాగాడు.

"బట్టబుఱ్ఱవాడికి చేతులు యెందుకో వణుకుతున్నాయి" అని గుంపులో యెవరో గుసగుసలాడుతున్నారు.

"ఏదో కిందా మీదా చెయ్యటానికివె తలపెట్టి ఉంటాడు."

"వాడికీ తెలుసు - మన వాళ్ళు వస్తే వాడ్ని ప్రాణాలతోనే చర్మం వొలుస్తారని".

"అంతవరకెందుకు? ఈలోగా మనమే చేసేస్తే కాదూ? వాడికి పట్టిన గ్రామాధికార జబ్బు కుదిరిపోతుంది..."

"ఎలా చేస్తాము?" అని సమిష్టి వ్యవసాయక్షేత్రపు గుఱ్ఱాలకాపరి, కుంటి 'అలెగ్జాండర్' అడిగేడు.

"దిగులుపడకు ఎలా చెయ్యాలో మాకు తెలుసులే" అని 'ఫ్రోస్యా' జవాబిచ్చింది.

"నిశ్శబ్దం! ఎవరక్కడ, మాట్లాడేది? సభ ప్రారంభమయింది" - అని 'గ్లిక్' కోపంతో కేకలేస్తూ గుంపునంతటిని కలియజూచాడు.

"ప్రారంభించినట్టు నాకేమీ కనపళ్ళే" - అని 'యూడోకిమ్' గొణిగాడు.

"ఇంకేం కావాలినీకు? శ్రీ శ్రీ శ్రీ గ్రామాధికార్లుంగారు వచ్చేరు. మహా ఘనతవహించిన వారి ప్రభువులుగూడా వేంచేశారు. అంతకంటే యేంగావాలిచెప్పు?" అని యెవరో జవాబిచ్చేరు.

"నోరుముయ్యండి! మాట్లాడవద్దని యెన్నిసార్లుచెప్పాలి. ఆ గుసగుసలు కట్టిపెట్టండి" అని 'గ్లిక్' గర్జించేడు.

"హుమ్! ఉండండర్రా. కథయేమిటో విందాము —" అని 'బెర్ఫిలిఖా' మందలించింది.

'గ్లిక్' గొంతు సవరించుకొని, జేబులోనుంచి కళ్ళజోడు తీసి తుడిచిపెట్టుకొని, కాగితాలు చదవటానికి తీశాడు.

"ఓహో, ఏవో కాగితాలు చదివేట్టున్నాడు"

కళ్ళజోడు నుదుటిపైనుంచుకొని తీవ్రంగా గుంపువైపు చూడసాగాడు 'గ్లిక్'. అంతా ఊరుకున్నారు. మళ్ళీ గొంతు సవరించుకొని, చిన్న కీచుగొంతుకతో చదువనారంభించాడు - "ఈ గ్రామనివాసులు యెవ్వరూ యింతవరకు తమమీద వస్తురూపంగా విధింపబడిన పన్నును - అనగా ధాన్యాన్ని - యిచ్చియుండలేదు -"

గుంపులో కలవరం బయలుదేరింది. కాని అది మరుక్షణంలోనే తగ్గిపోయింది.

"ఈ ప్రకటన చేసిన మూడురోజుల లోపల ధాన్యం చెల్లించవలసిన గడువు దాటిపోతుంతని మళ్ళీ హెచ్చరిస్తున్నాను."

మళ్ళీ కలవరం—

"మాతృదేశంయొక్క, జర్మను సైన్యంయొక్క యీ అవసరాన్ని గౌరవించి మూడురోజుల్లో ధాన్యమివ్వక ఆజ్ఞను ఉల్లంఘించినవారు..."

చదవటం కొద్దిగా ఆపి విజయం పొందినవాడిలాగ గుంపుమీదికి ఒక్క చూపు విసిరేడు. అంతా నిశ్శబ్దంగా అతనివైపు చూస్తూ వింటున్నారు.

"ఆ విధంగా ధాన్యం యివ్వక అధికారుల ఆజ్ఞలను ఉల్లంఘించిన వారు, ప్రస్తుత ప్రభుత్వాన్ని విధ్వంసం చేయటానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పూనుకొన్న నేరంక్రింద... "

"అదంతా మాకు తెలుసులే –" అని యెవరో బిగ్గరగా ద్వేషంతో పలికారు.

జర్మను సార్జంటు లేచి, ఆధ్వని వచ్చినవైపు తీవ్రంగా చూడ సాగాడు. కాని గ్రామస్థులెవ్వరూ చలించకుండా 'గాప్లిక్' వైపు చూస్తున్నారు.

"...మరణదండన విధించబడుతారు." అని గుక్కతిప్పు కున్నాడు 'గాప్లిక్!'.

దీర్ఘంగా ఒకసారి శ్వాసవిడిచి, ఆ ఆజ్ఞాపత్రంయొక్క సంతకంచేసిన కెప్టెన్ కర్ట్ వెర్నర్ పేరు చదివి, దానిని మడిచిపెట్టా

"అందరూ విన్నారా ?"

"ఆఁ అందరిం విన్నాము."

"అందరికి అర్థమయిందా ?"

"ఓ, చక్కగా అర్థమయింది" అని సభాప్రేక్షకముందే నించున్న 'టెప్పిలిషా' జవాబు చెప్పింది.

'గాప్లిక్' ఆమెవైపు అనుమానంతో చూశాడు. కాని ఆమె మాత్రం ప్రశాంతంగా అతనివైపు చూడసాగింది.

"ఐతే అక్కడికది పూర్తయింది. –"

గుంపంతా వెళ్ళిపోతున్నది. అప్పుడే కొందరు గడపదాటిపోయారు.

" ఆగండి ! ఎక్కడికి, అప్పుడే పోతున్నారు ? "

" ఇంకా పూర్తి కాలేదా ? "

" మరొక సంగతున్నది – " అని 'గాప్లిక్' అనే సరికి 'మాల్యూచికా' గుండె దడదడలాడటం ప్రారంభించింది.

" సంగతేమిటంటే – "

అందరూ నిరీక్షిస్తున్నారు.

" రాత్రియెవరో, నిర్బంధంలోనున్న ఒక ఖైదీకి రొట్టె దొంగతనంగా తీసుకెళ్ళి యివ్వటానికి ప్రయత్నించారు... "

'మాల్యూచికా' తనప్రక్కనిల్చున్న 'చెకోరికా' చెయ్యిగట్టిగా పట్టుకున్నది. 'చెకోరికా' ఆశ్చర్యంతో ఆమెవైపు చూచింది.

" ఏమిటి సంగతి ? "

" ఏమీలేదు......ఏమీలేదు...... "

కాని 'చెకోరికా' చెయ్యి యింకా విడువలేదు.

" ఆ ప్రయత్నం చేసినవాడు షుమారు పదిసంవత్సరాల కుఱ్ఱవాడై ఉంటాడు...... "

గుంపులో గుసగుసలు బయలుదేరినై. ఒకరిముఖాలు ఒకరు చూచుకొన సాగారు.

" మాట్లాకండి ... ఆ పదిసంవత్సరాల కుఱ్ఱవాణ్ణి కాల్చివేయటం జరిగింది... "

'చెకోరికా' వెలవెలబోతున్న 'మాల్యూచికా' ముఖంవైపు ప్రశ్నార్థకంగా చూచింది. తర్వాత ఆమెచేతికి తనచెయ్యి ఆధారంగా యిచ్చింది.

"జాగ్రత్తగా ఉండమ్మా. ఏమాత్రం అనుమానం కలిగినా కొంప మునిగిపోతుంది......" అని ఆమె 'మాల్యూచికా' చెవిలో రహస్యంగా చెప్పి ధైర్యం కలిగిస్తున్నది.

కాని 'గాప్లిక్' దృష్టిమాత్రం యిటుపడలేదు. నసుగుతూ చదువ నారంభించాడు. "ఆ అపరాధికవాన్ని యెవరో దుర్మార్గులు రహస్యంగా

యెత్తుకుపోయి దాచేశారు. ఆ అపరాధిశవాన్ని గుర్తించగలవారుగాని, శవాన్ని దొంగిలించుకుపోయినవార్ని గురించి తెలిసినవారుగాని, తక్షణం జర్మను సైనిక కార్యాలయానికి వచ్చి వాఙ్మూలాన్ని యివ్వాలి.”

‘గ్రాప్లిక్’ చదవటం పూర్తిచేసి, జర్మను సార్జెంటు వైపుచూచి ఒకసారి దగ్గాడు. సార్జెంటు లేచి అందరినీ తొలగించుకొని ముందుకివచ్చి నిల్చున్నాడు. బైట సాయుధులైన సైనికులు తయారుగా ఉండటం అందరికీ కనుపించింది. ఒకరి నొకరు చూచుకొని, గుసగుస లాడుకొంటున్న వారంతా మౌనం వహించారు.

“...దేశరక్షణ బాధ్యత ననుసరించి, జర్మను సైనికాధికార వర్గం యీ విధంగా ప్రకటిస్తున్నది...”

ఎటువంటి భయంకర శాసనం విరుచుకుపడనున్నదో అని ప్రజలంతా మంత్రముగ్ధులవలె నిల్చున్నారు.

ఈ దిగువ నుదహరించిన గ్రామస్థులను నేరస్థులకు జామీనుగా బంధించడ మౌతున్నది...”

అందరూ చెవులు నిక్కపొడుచుకొని వింటున్నారు. ‘యాడోకస్’ తాత ముందుకివంగి మరీ వింటున్నాడు.

“పలాన్‌చుక్, ఓల్గా......”

తలుపుదగ్గర నిల్చున్న ఒక యువతి భయంతో వణికిపోయింది. ఏదో కేక వేస్తున్నట్టు నోరు తెరిచింది; కాని శబ్దం రాలేదు.

“ఒఖాబ్‌కో యాడోకిమ్...”

‘యాడోకిమ్’ తాత వెలవెలబోతూ తనచుట్టూవున్నవారిని చూడసాగాడు.

“ఎవరు ?”

“ఒఖాబ్‌కో యాడోకిమ్” అని మళ్లీ ఆ పేరు నొక్కిచెప్పి తర్వాత పేరు చదివాడు — “గ్రోఖాచ్ డనిల్...”

బలమైన శరీరంగల ఒక ఒంటికాలిరైతు విచారంతో తలఊపాడు.

“నెకోరికా మరియా...”

‘మాల్యూచికా’ తన ప్రక్కనున్న మనిషి చెయ్యి హఠాత్తుగా [illegible]

"పరవాలేదు, 'మాల్యూచికా,' నన్నుగురించి చింతపడకు. కాని నాకు పసిబిడ్డలున్నారు. వాళ్ళను జాగ్రత్తగా చూస్తుంటావుగా ?" అన్నది 'చెకోరికా' ప్రశాంతంగా !

"వ్యాస్పినెవా మలాన్యా..."

ఈ యువతి ముఖంలోమాత్రం యేమీ చలనం కనబడలేదు. అర్థం లేని దృష్టులు శూన్యంలోకి చూస్తూ నిల్చున్నది.

ధాన్యంవిషయంలోకూడా వీరినే జామీనుగా ఉంచటం మంచిదనిపించింది గ్రామాధికారికి. చావుకి భయపడేవారు లేరన్నమాటమాత్రం నిజం. అయినప్పటికి తమ కొరకు యితరుల ప్రాణాలు బలికావటం యిష్టపడనివారు నిజం తెలియచేయటానికి ముందుకి రావటం జరుగుతుంటుంది. అలాంటిది 'గ్లిక్' ఇంతకుముందు చూచాడు. అందువల్ల యీ పన్నాగం పన్నాడు. "మూడుదినాలలోపల ధాన్యం అందజేయటము, ఆ శవం యెత్తుకుపోయినవారిని పట్టివ్వటము జరుగనట్లయితే, జామీనుగా బంధించినవారిని ఉరితీయటం జరుగుతుంది..." అని చదివేడు 'గ్లిక్'.

గుంపులో అలజడి కలిగింది. గుసగుసలు ప్రారంభమయినై.

"అంతేనా ?... ఇక మేం పోవచ్చునా ?" – అని 'ఫెడోసియా' గంభీరంగా అడిగింది.

గుంపులో అందరూ ఒక్కసారిగా నిట్టూర్పు విడిచారు.

"సభ ముగిసింది. ఇప్పుడు పేర్లు చదివినవారు తప్ప తక్కినవారందరు దయచేసి వెళ్ళిపోవచ్చును."

ఒకరి తర్వాత ఒకరుగా అందరూ బయటికి నడిచారు. జామీనుగా గ్రహింపబడ్డ ఐదుగురూ, యెవ్వరూ చెప్పనవసరంలేకుండానే టేబిలు ముందుకిపోయి నుంచున్నారు. బయటికి వెళ్ళిపోతూ గ్రామస్థులలో కొందరు వారిముఖాలు చూడలేకపోయారు. కొందరుమాత్రం జాలితో వారివైపు చూచి వెళ్ళిపోయారు.

కాని ప్రజలు వారి యిళ్ళకు పోకుండా స్కూలుభవనంముందే గుమికూడి నిల్చున్నారు. తీవ్రంగా వీస్తున్న ఆ మంచుతుఫానులోనే దేని కొరకో వేచివున్నారు. కొంతసేపటికి 'గ్లిక్,' బంధించిన అయిదుగురు జామీను ఖైదీలను సాయుధ సైనిక పహరాతో తీసుకొని బయటికి

వచ్చాడు. 'చెకోరికా', ఓల్గాలు ఒకరిభుజంమీద ఒకరు చేతులు వేసుకొని నడుస్తున్నారు. 'యాడ్లోకిమ్' తాత తన ఊతకర్ర కిందకొట్టుకుంటూ నడుస్తున్నాడు. గుంపు దాటేవరకు నిశ్శబ్దంగా ఉన్నారు. హఠాత్తుగా 'చెకోరికా' వెనక్కి తిరిగి ప్రజలనుద్దేశించి అన్నది:

"మీరేమి విచారపడకండి. ఇంతమాత్రందానికే లొంగిపోకండి. మమ్మల్నిగురించి మీరేమీ దిగులుపడనక్కర్లేదు. కాని ధైర్యంగా నిలబడండి!"

ఒక జర్మను సైనికుడు బలవంతంగా ఆమెను ముందుకి తోశాడు. ఆమె తూలిపోయి, మళ్ళీ తనను తాను సంభాళించుకొని, నిర్లక్ష్యంగా ముందుకి నడువసాగింది.

గ్రామస్థులు నిశ్శబ్దంగా యెవరిదారిని వారు పోసాగారు. జర్మను సైనికుల నడకతో కలిసిపోటానికి 'గాప్లిక్' వేగంతో ఉరుకుతున్నాడు. బ్రహ్మాండం తల్లక్రిందులైనా అతడు యీ సమయంలో వెనుకబడడు. తనను 'గ్రామాధికారి'ని చేసినతర్వాత బహిరంగంగా ప్రజలను ఆజ్ఞాపించటం యిదే మొదటిసారి. గ్రామస్థుల ముఖాలు గుర్తుకివచ్చేటప్పటికి వణుకు పుట్టింది. కాని ప్రొద్దుట జర్మన్ కెప్టెన్ బెదిరించిన బెదిరింపులు తలంచుకుంటే, యింతకంటేకూడా యెక్కువ భయం పుట్టుకు వస్తున్నది. అయినా గ్రామస్థులంటే స్త్రీలు, పిల్లలు, ముసలివాళ్ళతో కూడుకున్న విషయమే గదా అనుకున్నాడు. కెప్టెన్ 'కర్ట్' అంటే జర్మను అధికారం యొక్క ప్రతినిధి; అతని మాటలకు వెనుక సాయుధబలం ఉన్నది. మొదట్లో యివన్నీ యెలాగో తప్పించుకోవాలని ప్రయత్నం చేశాడు 'గాప్లిక్'. కాని యికముందు అలా ప్రయత్నంచేసి కూడా లాభం ఉండదని తేలిపోయింది. పైగా తనకు ముప్పువచ్చిపడేటట్టున్నది. 'రాస్టావ్' నుంచి పారిపోయి వస్తున్నప్పుడు జర్మన్లతో కలుసుకున్న దినం తలుచుకొని తనను తాను తిట్టుకున్నాడు. ఎక్కడైనా కొంతకాలం దాగుకొని, ఆ తర్వాత యెక్కడికైనా వెళ్ళిపోయి వుంటే బాగుండేదనుకున్నాడు. అటుతర్వాత యేదో ఒక విధంగా బ్రతుకవచ్చు. అనవసరమైన కష్టాలు నెత్తిని తెచ్చిపెట్టుకున్నట్టయింది. జర్మన్లకు, అడవుల్లోను, బురద ప్రదేశాల్లోను తానేదారిచూపించి యిక్కడికి తీసుకువచ్చాడు.

ఒకవేళ జర్మన్లు విజయం పొందుతారే అనుకున్నప్పటికీ, చిన్న పిల్లలతో సహా తనను ద్వేషించే యీ గ్రామంలో ఉండటమంటే శరీరం కంపిస్తున్నది. దీర్ఘమైన ఒక నిట్టూర్పు విడిచి, సైనిక కార్యాలయంలోకి సభయొక్క వివరాలు తెలియజేయటానికి వెళ్ళాడు.

గ్రామస్థులంగూడా యిళ్ళకి చేరుకున్నారు. 'మాల్యూచికా' యిందాకటి భయంనుంచి యింకా తేరుకోలేదు. జీవచ్ఛవంలాగ, నిస్పృహతో నడిచిపోతున్నది.

'సాషా', చెల్లెలు 'జినా'ను ఆడిస్తున్నాడు. ఆ పిల్లల ముఖాలు చూచేటప్పటికి, ఆమె హృదయంలోని బాధ మరీ యెక్కువయింది.

"బాబులూ! జినా అల్లరిచేయ లేదుగా!"

"అబ్బే, లేదమ్మా... సభ ముగిసిందా?"

"ఆఁ, ముగిసింది. నేను 'చెకోరికా' యింటికివెళ్ళి యిప్పుడే వస్తాను ఉండండి—"

"మళ్ళీ యిప్పుడే యెందుకే అమ్మ – 'చెకోరికా'గారింటికి?"

"'చెకోరికా'ను జర్మన్లు అరెస్టుచేశారు. ఆమె పిల్లల్ని యిక్కడికి తీసుకురావాలి" అన్నది 'మాల్యూచికా'. ఆడుకుంటున్న 'సాషా' నివ్వెరపోయి చూడసాగాడు.

"అరెస్టు? ఎందుకు?"

"జర్మన్ల సంగతి యింకా తెలియలేదా?" అని తల్లి జవాబుచెబుతూ బయటికి వెళ్ళిపోయింది. కొద్దిసేపట్లో 'చెకోరికా' ముగ్గురుబిడ్డల్ని వెంటతీసుకొని వచ్చింది. అందులో పెద్దపిల్లవాడికి యెనిమిది సంవత్సరాల వయస్సుంటుంది. అనగా 'సాషా' యీడువాడన్నమాట.

"అమ్మా! అమ్మా!!" అని మూడేళ్ళబిడ్డ 'నైనా' పెద్దగా యేడుస్తున్నది.

"ఏడ్వకు తల్లీ! మీ అమ్మ యిప్పుడే వస్తుందిలే. కూర్చో; నీకు తినడానికి యేదైనా తెచ్చిపెడతాను."

పొయ్యివెనుక దాచిపెట్టిన బంగాళాదుంపలు కొన్ని తీసి, కడిగి తుడిచి జాగ్రత్తగా ఉడకబెట్టసాగింది. దాచిఉంచిన యీ బంగాళదుంపలు,

కొద్దిగా రాగులు తప్ప యింట్లో మరే ఆహారపదార్థాలు లేవు. వున్న ఆహారపదార్థాలన్నీ — ధాన్యము, బంగాళదుంపలు, తేనెసీసాలు మొదలైనవన్నీ — దూరంగా, భూమిలో దాచివేయవలసి వచ్చింది.

" ఈ బంగాళాదుంపలతో సరిపుచ్చుకోవాలి. రొట్టెగిట్టె మనవాళ్ళు వచ్చేవరకు దొరకవు."

" ఉత్త బంగాళాదుంపలేనా ? " అని జినా గునిసింది.

" ఇంతకన్నా యేంకావాలి ? ఇంకా ఆ మాత్రం తినటానికి దొరికినందుకు సంతోషించక, అవి కావాలి, యిది కావాలని కోర్కెలు కూడానా !... " అని కోపంతో కూతురువైపు చూచింది. కాని చిక్కిపోయిన ' జినా ' శరీరం కంటబడేటప్పటికి మనస్సు చివుక్కుమన్నది. హృదయం దుఃఖభారంతో క్రుంగిపోయింది.

" ఏడవబాకు తల్లీ ! మన సైనికులు వచ్చాక అన్నీ బాగుంటాయి. రొట్టెలు కాల్చుకుని తేనెతో నీ యిష్టమొచ్చినంత తిందువుగాని. ఇప్పుడు మాత్రం అల్లరి చెయ్యబోకు... "

" అవును; బంగాళాదుంపలతోనే తృప్తిపడాలి... " అని విచారంతో అన్నాడు ' సాషా '.

" అవును, అవును " అని తృప్తిపడ్డది ' జినా '.

బంగాళాదుంపలు ఉడకబెడుతూ, పిల్లలతో మాట్లాడుతున్నప్పటికి తనలో అధిక మౌతున్న భయాన్ని అణుచుకోలేకపోతున్నది ' మాల్యూచికా '. మతిమరుపుతో ఒకటిచేసి మరొకటి చేయటం మరిచిపోతున్నది. ' జినా ' కి ఉడకపెట్టిన బంగాళదుంపలివ్వబోయి పచ్చిముక్కలే యిచ్చేసింది. ఇది చూచి పిల్లలు ఆమెవైపు వింతగా చూస్తున్నారు.

" ఏమిటే, అమ్మా అట్లాగున్నావు ? " — అని ' సాషా ' చివరికి అడిగేడు. కొడుకువంక చూచి ఆమె భయపడిపోయింది.

" అబ్బే, యేమీలేదు... "

" తలనెప్పా ? "

" ఆఁ. అవును. తలనొప్పిగావుంది " అని ఒక సాకుచెప్పింది

"మీటింగువల్లే నీకు తలనొప్పివచ్చింది" – అన్నాడు 'సాషా'.

"కావచ్చు జనం యెక్కువైపోవటంతో అక్కడ ఉక్కపోసేసింది. అందువల్లనేమో..."

పిల్లలు అదినమ్మి తమంతట తాము ఊరుకున్నారు.

'మాల్యూచికా' గిన్నెలు కడుగుతూ, పొయ్యిదగ్గర ఆడుకుంటున్న పిల్లల్ని చూచింది. ఆమె దుఃఖం కట్టలు దాటిపోతున్నది. అయ్యో! ఈ చిన్నిబిడ్డల కెన్నిపాట్లువచ్చినై!! తండ్రి దారిన తండ్రి యుద్ధానికి పోయాడు. తల్లి జర్మన్ల పాలిట బడ్డని...

ఆమె ఆందోళన యింకా యెక్కువవుతున్నది. మాటిమాటికి దేని కోరకో కటికీదగ్గరకువెళ్ళి చూస్తున్నది.

"అక్కడెవరున్నారమ్మా?"

"ఎవ్వరూ లేరుగాని, నేను కొద్దిసేపు బయటికివెళ్ళిరావాలి. ఇప్పుడే వచ్చేస్తాను."

"అబ్బా, యెప్పుడూ నువ్వు యెక్కడికో వెళ్ళిపోతూనేవుంటావు" అని 'జీనా' బిక్కమొగంవేసింది.

"ఊరుకోవే! వెళ్ళక తప్పదు" అని 'మాల్యూచికా' కోపంతో అన్నది.

"శాలువాతీసుకెళ్ళవే అమ్మ" అని ఉత్తనేవెళ్ళిపోతున్న 'మాల్యూచికా' కు 'సాషా' గుర్తుచేశాడు.

'గ్రోశాచ్' యిల్లు చాలాదూరంలో ఉన్నది. గాలి జోరుగా వీస్తున్నది. మంచు విసురుగా లేచి ముఖానికి కొడుతున్నది. మంచుముక్కలు గాజుముక్కల్లాగ ముఖంలో గుచ్చుకుంటున్నాయి. గాలిలో ఊపిరి సలపక ఉక్కిరి బిక్కిరవుతూ 'గ్రోశాచ్' యింటిముందుకి చేరుకున్నది 'మాల్యూచికా'. రొప్పుతూ లోపలికి పోవటం యిష్టంలేక కాసేపు గుమ్మందగ్గరే నిలబడిపోయింది. కాని కొంతవరకు 'గ్రోశాచ్' కుటుంబంయొక్క ముఖం చూడలేకే అలా ఆగిపోయిందనవచ్చు. బహుశా అతని భార్య, యిద్దరు బిడ్డలు రేపు ఉరికంబంనుంచి వ్రేళ్ళాడబోయే 'గ్రోశాచ్' ని తలంచుకుని యేడుస్తున్నారుగాబోలు! వారి మొఖాలు చూడటం యెట్లా?

కాని ఆమెకు యేడ్పుకిబదులు, రంపంతో యేదో కోస్తున్న శబ్దం వినవస్తున్నది. 'గ్రోశాచ్' యింటిలో, యీ సమయంలో యెవరు పని చేస్తుంటారా అని ఆశ్చర్యపోయి లోపలికి వెళ్ళింది.

లోపల 'గ్రోశాచ్' భార్య, పెద్దకూతురు కలిసి ఒక పెద్ద కర్రను రంపంతో కోస్తున్నారు. 'మాల్యూచికా' ను చూడగానే ఆశ్చర్యపోయారు. ఆ రోజుల్లో ఒకరిళ్ళకు మరొకరు వెళ్ళటం చాలా అరుదు. గ్రామస్థులందరు తమ తమ యిండ్లలో కూర్చొని, ఇకముందు జర్మన్లు యేం చేస్తారో అని ఆలోచిస్తూ పడివుండేవారు.

"మీతో ఒక సంగతి మాట్లాడటానికి వచ్చాను."

"వచ్చి యిట్లా కూర్చోండి –" అన్నది 'గ్రోశాచ్' భార్య.

'మాల్యూచికా' గ్రోశాచ్ పిల్లలకేసి చూస్తూ అన్నది: "మీతో యేకాంతంగా మాట్లాడాలి."

"ఏకాంతంగా మాట్టాడాలా ?"

"ఏకాంతంగానా !" అని 'గ్రోశాచ్' భార్య కొంచెం ఆశ్చర్యపడి బిడ్డల్నుద్దేశించి అన్నది: "మీరు కొద్దిగా అగదిలోకి వెళ్ళండమ్మా. కొంచెం రహస్యం మాట్లాడాలి".

ఇద్దరుపిల్లలూ వెళ్ళిపోయారు. 'మాల్యూచికా' నీరసంతో కూలబడ్డది. 'గ్రోశాచ్' భార్య ఆశ్చర్యంతో మౌనంగా అంతా చూస్తున్నది.

"గాలిదుమారంలో వచ్చారే ?"

"అవునండీ" అన్నది చివరికి 'మాల్యూచికా', కాని మళ్ళీమౌనం. 'గ్రోశాచ్' కోటు చిలుకకొయ్యనుంచి వ్రేళ్ళాడుతున్నది. ఒక జేబు చినిగిపోయింది. అన్నిచోట్లా అతుకులే. ఒక గుండీ దారపుపోగున వ్రేళ్ళాడుతున్నది.

"ఏమిటో చెప్పవచ్చారే ?" అని 'గ్రోశాచ్' భార్య చివరికి అడిగింది.

'మాల్యూచికా' ఆమెవైపు అర్థంలేని చూపులు చూడసాగింది.

"మీ ఆయనను పట్టుకుపోయారు" అని నెమ్మదిగా అన్నది.

“అవును, పట్టుకుపోయారు. ఏంచేస్తాము చెప్పండి. వీలైనంత మందిని యిట్లానే హతమార్చటానికి ప్రయత్నిస్తారు. వాళ్ళు జర్మన్లుగాక మరొకరా?...ఇదేనా మీరు చెప్పవచ్చారు?”

“ఊఁ అదే! మరొక విషయంగూడా...”

“చెప్పండి. మొదట్లో యీవార్త వినగానే అక్కడే పడిచచ్చిపోతానేమోననిపించింది. తర్వాత, యేదో ఒకపని చేస్తూవుంటే, ఆ దుఃఖం మరిచిపోవచ్చునని యింటికి వచ్చి ఈపని చేయటం ప్రారంభించాను. ఏడ్పుమాత్రం యేం లాభం చెప్పండి? పరిస్థితులిలానేవుంటే యివ్వాళ మా ఆయనకు పట్టినగతే రేపు అందరికీ పట్టేటట్టుంది. ఒకరితర్వాత ఒకర్నిగా అందర్నీ హతమార్చేస్తారు.”

“కాని యిట్లా యెక్కువకాలం సాగుతుందనా?”

“అబ్బే, యిలాగే ఉండిపోతుందనిగాదు. ఉండేపక్షంలో సర్వమూ నాశనమైపోక తప్పదంటున్నాను. కాని యింతమట్టుకు యేమీ జరుగుతున్నట్టు కనబడటంలేదు. ఏమాత్రం అలికిడి కలిగినా మన సైనికులే వస్తున్నారనుకుంటాను. అబ్బ! ఒక్క నెల గడిచేటప్పటికే ఒక సంవత్సరం గడిచినట్టుగావుంది!! — ఈ నెలలో యెంతమంది నశించిపోయారు!... గ్రామాధికారి మా ఆయనపేరు చదువుతూ నా ముఖం చూచాడు. అది గమనించి నాలో నేను యిలా అనుకున్నాను: ‘ఓరి, కుక్కలకొడకా! నేను యేడుస్తున్నానా, లేదా అని చూస్తున్నావా? నీ తాతలు దిగిరావాలి, నన్ను నువ్వు యేడ్పించటానికి!. కాని చివరికి నువ్వే వలవల యేడ్చే రోజు ఒకటి రాకమానదు. రైతుస్త్రీలను నువ్వు మోసగించలేవు.’”

‘మాల్యూచికా’ ఉండి ఉండి బావురుమని యేడ్వసాగింది. ఈమె వింతప్రవర్తన ‘గ్రోఖాచ్’ భార్యకి యేమీ అర్థంకావటంలేదు.

“ఏమిటిది? అలా పిచ్చిదాన్లాగ యేడుస్తావు.”

“అమ్మా! రాత్రి జర్మన్లు మా ‘మిష్కా’ను చంపేశారు!”

“ ‘మిష్కా’నా?”

“అవును; నేనే వాడి శవాన్ని రహస్యంగా యెత్తుకువచ్చి సమాధి చేశాను. నావల్లనే, నీభర్త, తక్కినవారు జర్మన్ల చేతుల్లో పడ్డారు—”

'మాల్యాచికా' నిలువునా వణికిపోతున్నది. కాని యేదో మహా భారాన్ని దింపివేసికొన్నట్టు కొంత కుదుటబడ్డది.

"ఇవన్నీ నాకెందుకు చెప్పటానికి వచ్చావు? నాకేం అవుసరం వాటితో" అని 'గ్రోశాచ్' భార్య అడిగింది.

'మాల్యాచికా'కు ఆమె మాటలేమీ అర్థంకాలేదు.

"ఎందుకు చెప్పటమా? నావల్ల నీ భర్త జైల్లోపడ్డాడు గాబట్టి చెబుతున్నాను. నేను వెళ్ళి జర్మను ఆఫీసరుకి తెలియజేసి వాళ్ళందర్నీ విడిపిస్తానంటున్నాను."

'గ్రోశాచ్' భార్య కోపంతో లేచి నిలబడింది.

"ఏమంటావ్? జర్మన్లకు చెబుతావూ! నీకు మతిపోయిందా యేం?"

"ఏం జరిగిందో చెప్పెయ్యాలి. అన్యాయంగా వాళ్ళను నేరస్థులుగా చెయ్యకూడదు."

"ఏం? నువ్వుమాత్రం యేం తప్పుచేశావని వెళ్ళి వాళ్ళకు పట్టు పడతావు? నీ పల్లాడిశవం వాళ్ళకు వదిలెయ్యటం మంచిదా? నువ్వు చేసేపనిలో యేమైనా అర్థంవున్నదా? చెప్పు! నువ్వు రైతుస్త్రీవికావూ! గ్రామాధికారి నిన్నుమాత్రం దయతలిచి ఊరుకుంటాడనుకుంటున్నావా! వాళ్ళచేతుల్లో వున్నపనిగాబట్టి అయిదుగుర్ని పట్టుకపోయారు నువ్వు చేసేపని యెలా పరిణమించుతుందో యేమైనా ఆలోచించావా? వాళ్లకన్నీ నేర్పిస్తావన్నమాట! ఈనాడు నువ్వుపోయి పట్టుబడతావనుకో; మర్నాడు మళ్ళీ యేదైనా జరిగిందంటే అప్పుడో యావైమందిని పట్టుకుపోతారు. కొద్దిగా ఆలోచించు, ఇంతవరకు మేమెవ్వరమూ జర్మన్లకు లొంగలేదు: నువ్వొక పని మొదలుబెట్టాలనుకుంటున్నావా?"

"కాని నావల్ల యితర్లు బాధపడటం..."

"నీవల్ల యెన్నటికీకాదు. మన దురదృష్టమువల్ల. ఈ యుద్ధంవల్ల, యీ జర్మన్లవల్ల మనం యీ బాధలన్నీ పడుతున్నాము. కాని నీవల్ల యెంతమాత్రమూ కాదు."

'మాల్యాచికా' విస్తుపోయి చూస్తున్నది.

"ఐతే..."

"ఏతే లేదు, యేమీలేదు. ఆలోచించవలసిందేమీ లేదు. మాట్లాడకుండా చక్కగా యింటికెళ్ళిపో. ఈమాట మళ్ళీ యెవ్వరికీ చెప్పబోక. అందరూ మనవాళ్ళే నైనప్పటికీ, యేసమయం యెట్లాగుంటుందో యేం చెప్పగలం? మన వాగుడే మనకు శత్రువవుతుంది. కాబట్టి పిచ్చిపిచ్చిగా ప్రవర్తించక యింటికిపోయి యేదైనా పని చేసుకో."

"కాని అనవసరంగా మీ ఆయన..."

"అదే మళ్ళీ అనవద్దనేది. నేను ఊరుకోగాలేంది నీకెందుకు చెప్పు? జరిగేదేదో జరుగుతుంది. అతను బతకాలనిరాసివుంటే యెలాగో బ్రతికి బయటపడతాడు. లేకపోతే జర్మన్ల కైదీ అవుతాడు. ఆమాటకొస్తే జర్మన్ల క్రింద బ్రతికేకంటే చావేమేలు."

"ఎప్పటికీ వీళ్ళక్రింద ఉండబోతామా—"

"ఇలాగే ఉండిపోతామని నేననుకుంటే, యింతవరకు నేనుంటా ననుకున్నావా? ఏనాడో ఉరిబోసుకు చచ్చిపోయేదాన్ని. కాని ఒకటి మాత్రం నిజం. ఇది మనకాలంగాదు. వాళ్ళ రాజ్యం నడుస్తున్నది. ఎన్నయినా జరగటానికి అవకాశం వున్నది."

'గ్రోషాచ్' భార్య ముఖంలో యేదో ఒక దివ్యతేజం కనిపించింది. 'మాల్యూచికా' ఒక నిట్టూర్పు విడిచి అన్నది:

"నేననుకున్నవన్నీ నువ్వు తలక్రిందలు చేసేశావు."

"కాదు. నువ్వు నాదగ్గరకు రాకముందే, నీ ఆలోచనలు తలక్రిందలుగా ఉన్నాయి. ఇప్పుడు వాటిని నేను చక్కబర్చాను. నువ్వు యేదైనా పనిచేసేముందు నీవిషయమే గాక యితర విషయంగూడా ఆలోచిస్తుండాలి. అట్లా మనుష్యులందర్నీ గురించి ఆలోచించినదానివైతే జర్మన్లకు పట్టుబడతానవు. నీయంతట నీవు జర్మన్ల దగ్గరకుపోయి ఉరితాడు మెడకు తగిలించుకోడానికి గూడా నీకు హక్కు లేదంటాను. వారి యిష్టం వచ్చినట్టు మనల్ని హింసించనీ, కాల్చనీ, ఉరతీయనీ, కాని మనంతట మనం వాళ్ళకి అవకాశం యివ్వకూడదు. వాళ్ళెంతచేసినా మనం చలించకూడదు. మహా చంపితే కొద్దిమందిని చంపవచ్చు. అందర్నీ హతమార్చటం వారి తరంకాదు. మనం చేయగలదంతా యేమిటంటే, యేవిధాన్నయినా మన సైనికులు వచ్చేవరకు ధైర్యంతో నిలబడి వుండాలి."

'మాల్యాచికా' తల ఊపుతూ విన్నది. ఆమెకు చాలా నీరసంగా ఉంది. శరీరంలోని బలమంతా ఒక్కసారిగా మాయమైపోయినట్టయింది. 'గ్రోషాచ్' భార్య కాళ్ళముందు కూలబడి బావురుమని యేడ్వాలనిపించింది. 'మిష్కా'ని 'గ్రోషాచ్'ని, ఇంటిదగ్గర 'సాషా'తో విడిచివచ్చిన 'చెకోరికా' ముగ్గురు బిడ్డల్ని, యేటిఒడ్డున పడివున్న 'వాస్యా'ని - ఇంకా యెందరెందర్నో తలుచుకొని హృదయభారం తగ్గేవరకు యేడ్వాలనిపించింది.

"నువ్విక చురుగ్గావుండాలి. ఇలా యేడుస్తూ కూర్చుంటే లాభం లేదు" అన్నది 'గ్రోషాచ్' భార్య.

'మాల్యాచికా' లేచి సెలవు తీసుకున్నది నడవలో పనిచేస్తున్న 'గ్రోషాచ్' యిద్దరు బిడ్డలతో మాట్లాడటానికి ఆమెకు మనస్కరించలేదు. 'గ్రోషాచ్' భార్య చేసిన చీవాట్లతో ఆమె తలతిరిగిపోతున్నది. 'గ్రోషాచ్' భార్యకి ఒకరిపొత్తు గిట్టదనీ, అందరితో కయ్యానికి కాలుదువ్వుతుందనీ, గయ్యాళిగంప అని అందరూ చెప్పుకుంటారు. కాని ఆమె హృదయాంతరాళంలో యెంతటి దివ్యమైన గుణాలు యిల్లు కట్టుకున్నాయి!

'మాల్యాచికా' యింటిదగ్గర పిల్లలంతా కలిసి ఆడుకుంటున్నారు. 'సాషా' పుల్లలతో ఒక పొలం కట్టాడు. అందులో ఒకమూల పశువుల శాలొకటి, అందులో పశువుల్ని ఉంచాడు. 'జీనా' కూడా యేడ్పుమాని అందరితో కలిసి ఆడుకుంటున్నది.

"ఇక్కడేం పెడదాము?"

"కొత్తగాకొన్న గొఱ్ఱెల్ని"

"హాఁ బావుంది"

"బొగ్గులు తీసుకురండి. గొఱ్ఱెలు నల్లగావుంటాయికదూ - అవి పెడదాము." అన్నాడు 'సాషా'

"మరి పిల్లి వుండద్దూ?" - అని అడిగింది 'నైనా'

"పిల్లి బయటికి కెక్కడికో వెళ్ళిపోయిందట - పిల్లులు యెప్పుడూ తిరుగుతునే వుంటాయిగదూ?" అని 'జీనా' సమాధానం చెప్పింది. 'నైనా' ఒప్పుకున్నది.

"అదుగో జర్మన్లు వస్తున్నారట; మన పశువుల్ని తోలుకుపోవాలి" అని 'ఓస్యా' ప్రకటించాడు.

"సరే యెవరు తోలుకెళతారు?"

"నేను తోలుకెళ్ళి మన గెరిల్లాల దగ్గర ఉండిపోతాను" అని 'ఓస్యా' సమాధానం.

బొగ్గుముక్కలన్నీ బయటికి తోశారు.

"ఎక్కడికి తోలుకుపోదాం?"

"నది దాటించి, అడివిలోపలికి తోలుకుపోదాం. మనవాళ్ళు జర్మన్లను నది దాటనివ్వరులే" అన్నాడు 'సాషా'

"నది దాటుతుండగా బాంబులు వేస్తే?"

"ఫరవాలేదు. రాత్రిపడ్డాక దాటుదాము." అని నిశ్చయించాడు. 'సాషా'

అంతలో తలుపు దభాలున తెరుచుకున్నది. పిల్లలంతా అటుతిరిగి చూచారు. 'సాషా' వెలవెలబోతున్నాడు

గుమ్మంముందు ఒక జర్మను సైనికుడు కనిపించాడు. నిప్పుల్లా ఉన్న కళ్ళతో పిల్లల్ని పరీక్షగా చూచాడు. ఒంటిమీదంతా మంచు కరుగుతున్నది. పెద్దవాళ్ళెవరూ లేరని తెలుసుకొని యేవో ప్రశ్నలు వేస్తున్నాడు. గుండెల్లో 'సాషా' నిశ్చేష్టుడైపోయాడు. తమ రహస్యమంతా తెలిసిపోయిందనీ, అమ్మను పట్టుకన్నారనీ, ఇప్పుడు 'మిష్కా' సమాధి తవ్వటానికి వీడు వచ్చాడనీ అనుకున్నాడు. జర్మను సైనికుడు యేదో ప్రశ్న పదేపదే అడుగుతున్నాడు. అనేకసార్లు అడిగినతర్వాతగాని, వాడు పాలు కావాలని అడుగుతున్నట్టు తెలియలేదు.

"పాలు మాదగ్గరలేవు" - అని జవాబిచ్చాడు 'సాషా'.

కాని జర్మను సైనికుడు ఇంకా అదేప్రశ్న వేయసాగాడు.

'సాషా' ఏమీ మాట్లాడకుండా దొడ్లోకి వెళ్ళాడు. నడవలోంచి, అన్నను సమాధిచేసిన స్థలంమీదుగా నడిచివెళుతుంటే, అన్న శరీరంమీద నడుస్తున్నట్లనుపించింది. 'సాషా' వెళ్ళినవైపే చూడసాగాడు జర్మను సైనికుడు. గొడ్లశాల తలుపుతెరచి అందులో యేమీలేదని చూపించాడు

‘సాషా’. ఉన్న ఒక్క ఆవుని మొదటిరోజునే తోలుకుపోయి చంపుకు తిన్నారు, జర్మన్లు. అట్లాంటప్పుడు యింకేం మిగులుతుంది ?

జర్మను సైనికుడు గొడ్లశాల అంతా కలియజూశాడు. ఏమీ కన బడలేదు. అక్కడక్కడ గడ్డిమాత్రం కనిపిస్తున్నది. రొచ్చువాసన కొడు తున్నది. పాలు దొరికే అవకాశం యేమీ కనబడలేదు.

‘సాషా’ కూడా లేకపోవటంచూచి ‘జీనా’ యేడ్వటం ప్రారం భించింది. ఆ పిల్లతోపాటు ‘సైనా’ కూడా యేడువసాగింది.

జర్మను సైనికుడు తిరిగి లోపలికివచ్చి అర్థంలేని చిరునవ్వుతో యేడుస్తున్న పిల్లలవైపు చూశాడు.

“ఏయ్, యేడువకండి !” అన్నాడు పళ్ళికిలిస్తూ.

‘జీనా’ యింకా బిగ్గరగా యేడ్వసాగింది. జర్మను సైనికుడు తుపాకితీసి ఆ పిల్లవైపు గురిపెట్టాడు. ‘సాషా’ ముందుకి ఒక్క గంతు వేసి చెల్లికి అడ్డంగా నిలబడి వాడి ముఖంలోకి తీవ్రంగా చూడసాగాడు.

“హా, హా. హా” - అని జర్మను సైనికుడు వికృతంగానవ్వుతూ ‘సైనా’ వైపు తన తుపాకి తిప్పాడు. కాని ఆ చిన్నపిల్ల ‘సైనా’ కు యేమీ తెలియక యేడుపుమాని అమాయకంగా జర్మనివాడివైపు చూస్తున్నది.

“కాల్చేస్తా !...”

‘సైనా’ కి ఆ మాటలేమీ అర్థకావటంలేదు. కాని యేదో భయం కరమైన సంఘటన జరిగేటట్టున్నదని గ్రహించింది. ‘జీనా’ కూడా యేడ్పుమాని అటువైపు చూస్తున్నది. ‘సాషా’ జర్మను సైనికుడు చూపిస్తున్న తుపాకి గొట్టంవైపు భయంతో చూస్తున్నాడు. జర్మను సైని కుడు తుపాకి గొట్టాన్ని అటూ, ఇటూ తిప్పసాగాడు.

‘సాషా’కి హఠాత్తుగా ఆలోచన తట్టింది. ఒక్కసారి మీదికి ఉరికి తుపాకి లాక్కుంటేనో ? తుపాకి యెట్లా కాలుస్తాడు ? జర్మను సైనికుడు చచ్చిపోయింతర్వాత యేం జరుగుతుంది? అన్నిటికంటే, వాడి దగ్గర్నుంచి తుపాకి లాక్కోటం సాధ్యమవుతుందా ?......

జర్మను సైనికుడు, తన అసహ్యమైన పళ్లు కనపడేటట్టు యికి లిస్తున్నాడు. పిల్లలు భయపడుతుంటే చూడటం వాడికి సరదాగా వున్నది.

ఊరికే వాళ్ళను యేడ్పించటానికి అట్లా వాడు చేస్తున్నాడని 'సాషా', గ్రహించాడు.

పెద్దవాడు గాబట్టి తననే ముందు చంపుతాడనుకున్నాడు. 'సాషా' దానికోసం యెదురుచూస్తూ నిలబడ్డాడు. ఎంత ముందుగా చంపేస్తే అంత మంచిదనుకున్నాడు.

చివరకి జర్మను సైనికుడికి విసుగుపుట్టింది. ఒక్కతడవ నవ్వి. తుపాకి భుజాన వేసుకొని, వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు. పిల్లలంతా నిశ్చేష్టులై తలుపువైపు చూస్తూ ఉండిపోయారు. వాడు తలుపు వెనుక దాక్కున్నాడేమో? వాళ్ళు కదలటం కనిపెట్టి, మళ్ళీ లోపలికివచ్చి కాలుస్తాడేమో అని నిరీక్షిస్తున్నాడు. 'సాషా'. చివరికి 'నైనా' కూడా శిలాప్రతిమలాగ కదలకుండా కూర్చొని చూస్తున్నది. అడుగో, మళ్ళీ అడుగుల చప్పుడౌతున్నది! వాడు వస్తున్నాడేమో?...

మెల్లిగా తలుపు తెరచుకున్నది. '**మాల్యూచికా**' లోపలికివచ్చింది. ఆమెను చూడగానే చిన్నపిల్లలంతా ఒక్క పెట్టున యేడ్చారు. 'సాషా' మాత్రం చలించకుండా మౌనంగా తల్లిముందు నుంచున్నాడు.

"ఏమిటిది? ఏంజరిగిందే?—" భయంతో కంపిస్తున్న కంఠంతో అడిగింది.

"ఏమీలేదు. జర్మనువాడొకడు వచ్చేడిక్కడికి" అని 'సాషా' జవాబిచ్చాడు.

"జర్మనువాడా? ఎందుకొచ్చాడు?"

"అబ్బే, యేమీలేదు. పాలకోసం వచ్చేడు."

"ఐతే?"

"మనకు ఆవుల్లేవని దొడ్డి చూపించాను.

"అంతటితో వెళ్ళిపోయాడా?"

"ఆఁ వెళ్ళిపోయాడు."

"మరెందుకు అట్లా యేడుస్తున్నారు? పోయాడుగా లేక మిమ్మల్నేమైనా కొట్టాడా?"

"ఊఁ హూఁ కొట్టలేదు." అని 'సాషా' మెల్లిగా జవాబిచ్చాడు. 'మాల్యూచికా' బయటికి వెళ్ళి తన శాలువామీద మంచు దులుపుకున్నది.

"అబ్బ ! యేమి గాలిదుమారం !!"

దూరంనుంచి బాధను వెల్లడించే ఒక పెద్దకేక వినుపించింది.

"ఏమిటది ?"

" 'ఓలెనా' అత్తయ్య పాపని కంటున్నది" అని 'మాల్యూచికా' జవాబిచ్చింది.

'ఓలెనా' ప్రసవవేదన పడుతూ కేకలుపెడుతున్నది. మౌనంగా అంతా వినసాగారు.

★

4

అరెస్టుచేసిన ఖైదీలను జర్మను సైనిక కార్యాలయంలోని ఒక గదిలో బంధించారు. పెద్ద పెద్ద మొద్దులతో దాని గోడలు నిర్మించబడి ఉన్నాయి. జర్మన్లు రాకముందు ఆ గదిలో గ్రామ సోవియట్ యొక్క గ్రంథాలయం ఉండేది. ఇప్పుడు జర్మన్లు ఆగది కిటికీలన్నీ బలంగా బిగించేశారు. అందువల్ల అంతా చీకటిగావుంది. దాని ప్రక్కనేవున్న కాపలా సైనికులగదిలో వెలుగుతున్న దీపపుకాంతి మాత్రం తలుపుసందులోంచి సన్నగా కనిపిస్తున్నది.

లోపల కూర్చోటానికి యేమీలేదు. మొదట్లో ఆ అయిదుగురు ఖైదీలకు చీకట్లో యేమీ కనుపించలేదు. కొద్దిసేపటికి వారికళ్ళు ఆచీకటికి అలవాటుపడిపోయినై. గోడల నానుకొని ఒక్కొక్కరే కూలబడ్డారు. 'గ్రోషాచ్' వట్టి నేలమీద తలక్రింద చెయ్యిపెట్టుకొని చేరగిలబడ్డాడు. కొద్దిసేపట్లోనే నిద్రకూడా పట్టేసింది.

కాని తక్కినవాళ్ళు నిద్రపోలేకపోయారు. 'ఓల్గాపలాన్‌చుక్' 'చెకోరికా'కు దగ్గరగా కూర్చున్నది. ఆమెకు ఆగదిని, ఆ చీకటిని చూస్తుంటే భయంవేస్తున్నది. ఇకముందు యేమి జరుగబోతుందోనని ఆమె మనసు ఆరాటపడుతున్నది. అందువల్లనే 'చెకోరికా'ను ఆనుకొని మరీ కూర్చున్నది.

ఒక్క 'మలాషా' మాత్రం అందరికీ దూరంగా ఉన్నది. ఒకమూల గోడకానుకొని చేతులతో మోకాళ్ళు చుట్టి కూర్చొని తదేకదృష్టితో గాఢాంధకారంలోకి చూస్తున్నది. ఆమె మనస్సు తక్కిన ఖైదీలవలె లేదు. నిశ్చేష్టురాలై, రెప్పవాల్చకుండా ముందుకి అంధకారంలోకి చూస్తూ, నెమ్మదిగా ఊపిరితీస్తూ యేదో వింటున్నది. ప్రక్కగదిలోంచి వచ్చే

శబ్దాలుమాత్రం ఆమెకు వినుపించటంలేదు. గ్రామంలోంచి వచ్చే యితర శబ్దాలయినా ఆమె చెవికెక్కటంలేదు. కనుబొమ్మలు ముడిచి తనలోనే యేదో వినటానికి ప్రయత్నిస్తున్నది. ఒక వారంరోజులు అప్పుడే దాటి పోయినై. అహఁ, కాదు. కాదు...పదిరోజులు దాటిపోయినై. ఒక భయంకరమైన ప్రశ్న ఆమెను వదలకుండా బాధిస్తున్నది. నిజమా?... వట్టిదేనా? నిజమా? ... వట్టిదేనా? కండల్లో రక్తం జేవురించింది. హృదయం వేగంగా కొట్టుకుంటున్నది. తన శరీరంలో ప్రవహిస్తున్న రక్తంయొక్క శబ్దం సమ్మెటలతో కొడుతున్న శబ్దంలాగ వినిపిస్తున్నది. చివరికి యెట్లా తెలుసుకోటం?...ఏదిదారి?...

మళ్ళీ ఒకసారి రోజులు లెక్కవేసుకున్నది. ఒకవేళ పొరపాటు పడదేమో? ఊఁ హుఁ — లేదు. ఎన్నిసార్లు లెక్కవేసినా పదిరోజులే తేలుతున్నది. పదిరోజులు గడిచిపోయినై!... ఈరోజుకీ, 'ఆ' నాటికి—తనను రండుగా చేసిన 'ఆ' నాటికి—మధ్య జరిగిన సంఘటనలన్నీ కళ్ళ ముందు తిరుగుతున్నాయి. 'ఆ' నాటిని తలుచుకుంటే యేదో బాధతో ఆమె శరీరం కంపించిపోయింది! పిడికిళ్ళు బిగించి, కాళ్ళు పొత్తికడుపులోకి లాక్కుని ముద్దలాగ కూర్చున్నది. భయంకరమైన బాధ నరాల్లో ప్రవేశించింది. ఇక నెమాత్రం భరించలేక తనకు తెలియకుండానే పెద్ద పెట్టున యేడ్చేస్తానేమో అనిపించిందామెకు. తన బాధనంతా యేడుపులోముంచెయ్యాలనిపించింది.

అమితమైన బాధతో కృంగిపోతున్నది. ఇక భరించలేక అక్కడే పడి చచ్చిపోతుందేమో అనిపిస్తుంది. కాని చావు రాదుగదా! పైగా యిక్కడ కూర్చొని, అంటరాని తన జీవితాన్ని, ప్రజలకు, గ్రామానికి, ప్రపంచ జీవిత సర్వస్వానికి వెలియైపోయిన తన జీవితాన్ని, గురించి తలుచుకోటం మరీ దారుణం!!—తనలాంటి అంటరాని వాళ్ళెవ్వరూ ఉండరు... ఉండకూడదు...

'మలాషా'కి గదిలోని చీకటి కనుపించడంలేదు. పశుతుల్యులైన ముగ్గురు ముష్కరుల ముఖాలు తనమీదికి వంగుతున్నట్లు కనుపిస్తున్నాయి. ఆ ముగ్గురు ఆమె మనోఫలకంమీద, జీవితంలో యెన్నడూ మరువలేనట్టి—మరువరాని—భయంకర చిత్రాన్ని ముద్రించేశారు. ఏనుగుదంతాల్లాగముందుకు

పొడుచుకువచ్చి, కనుపించే పళ్ళిగిలిస్తూ మాసిన గడ్డాలతో, ఆ మొరటు ముఖాలు యెన్నటికీ మరపుకిరావు....

మొన్న మొన్నటివరకూ ఆమె తన భర్త 'ఐవన్'తో ఆదేగదిలో కాపురంచేస్తూ వచ్చింది. ఆదే పడకమీద పడుకుంటుండేది. కాని, 'ఆ' నాటి రాత్రి చింకిన తలగడలోంచి దూదిఅంతా గదినిండా యెగురుతూ, పగలగొట్టిన పువ్వులు పెట్టుకునే 'వాస్' ముక్కలు యింటి నిండాపడి యెంతైనా అవహ్యమైపోయింది. ఆ విషయం తలుచుకుంటుంటే ఆమె హృదయం వ్రక్కలైపోతుంది. కాని ఆ తలంపు దూరంచేయటానికి ఆమెకు సాధ్యంకావటంలేదు. క్షణిక కాలమైనా ఆమెను విడువకుండా ఆ తలంపు ఆమెను వెంటాడుతున్నది. ముగ్గురు! – మాసినగడ్డాలతో, ఆ మొరటుముఖాలతో, వెకిలినవ్వులు నవ్వుతూ, కేకలు పెడుతూ, తమ యినుప హస్తాలతో ఆమె చేతులు వెనుకకు విరిచి, కాళ్ళు అదిమిపట్టి అడవి మృగాల్లాగ ప్రవర్తించి ఆమెను అక్కడ పడేసి తలుపు ముఖం మీద కొట్టినట్టుగా విసిరికొట్టి వెళ్ళిపోయారు. అది మొదలు ఈ పిశాచం ఆమెను క్షణమైనా విడునకుండా వెంటాడుతున్నది. ముఖ్యంగా యీ మధ్య గడచిన పదిరోజులు నిద్రాహారాలుకూడా లేకుండా – రాత్రింబగళ్ళు, పిచ్చెత్తిపోయేసితిలో, తన అంతర్యంనుండి యేదో వినటానికి ప్రయత్నిస్తూ, ఒక్కొకరోజు గడుస్తుంటే ఒక్కొక్క మహాపర్వతంమీదికి దొర్లిపోతున్నట్టుగా హింసపడుతున్నది.

గ్రామంలో యెంతోమంది బాధపడ్డమాట వాస్తవమే! అనేకులు ప్రాణత్యాగులైన మాటకూడా నిజమే. 'శివాన్యుక్' ఉరికంబంనుంచి వ్రేళ్ళాడుతున్నాడు. 'ఓలెనా' నిండుగర్భిణి అయికూడా యమయాతనలకు గురియవుతున్నది. కాని వారెవ్వరికీ తనకు కలిగినటువంటి భయంకరానుభవం కలుగలేదు. ఇప్పుడు తాను, తనలోనే ఒక జర్మను విత్తనాన్ని పోషిస్తున్నది! ఇతర్లు యెంతటిబాధలు అనుభవించినప్పటికీ, తనలాగ తన శత్రువునే తమలో పెంచవలసిన భయంకరస్థితి ఎవ్వరికీపట్టలేదు...

ఒకమూల 'ఓల్గా' చిన్నబిడ్డలాగ యేడుస్తూ కూర్చున్నది. 'మలాషా' కి తీవ్రమైన కోపంవచ్చింది. ఆ తెలివితక్కువమనిషి యెందుకట్లా యేడ్వాలి? ఆమె యేడ్వవలసినంత కష్టమేమి వచ్చింది. జర్మన్లు తన

శీలాన్ని చెరిచేటంతటి దురదృష్టానికి ఆమె పాల్పడలేదుగా ? ఇంకెందుకూ భయం ? చంపేస్తారనా ? అలా చేస్తారని ఆమె నమ్మలేకపోయింది. అలా ఒక్కసారి చంపివేస్తే ఇంకా కావలసిందేముంది ? ఊఁహూఁ. అలా యెప్పటికీ చేయరు. ఇంకా వారిని యెన్నెన్నో ఘోరమైన కష్టాలు - చావుకంటే కూడా భయంకరమైన కష్టాలు - పెడతారు. ఒకేసారి చంపేస్తే అదృష్టమే కదూ ?......

మళ్ళీ ఆమె రోజులు లెక్కపెట్టసాగింది - ఒకటి, రెండు, మూడు. పదివరకు లెక్కించుకొని వణికిపోయింది. హృదయం పగిలిపోయేటట్లున్నది. భరించలేకపోతున్నది. ఇక ఒక నిముషంకూడా భరించటం అసాధ్యం. కాని ఆమె హృదయం పగిలిపోలేదు. తన శరీరంలో పరుల రక్తం ప్రవహించటం వినపిస్తున్నది. ఛీ ! ఈ బ్రతుకెందుకు ? ఎర్ర సైనికయోధుని భార్యఅయిన 'మలాషా' ఒక జర్మను శిశువును కనటానికేనా బ్రతికున్నది !!...

ఆమెపరీక్షగా వింటున్నది. హృదయంలోను, కణతల్లోను రక్తం సమ్మెటలతో కొట్టినట్టుగా వినబడుతున్నది. చేతితో తన గర్భాన్ని తాకింది. అక్కడకూడా అదేశబ్దం ! -

'మలాషా' కి తనశరీరం చూచుకుంటే తనకే భరింపలేని అసహ్యం వేస్తున్నది. అది యిక తన శరీరం కాదు - పుట్టబోయే ఒక జర్మను శిశువుని పెంచుతున్న నీచగృహం ! ఇప్పుడు తాను భోజనం చేస్తుంటే తానొక్కర్తే ఆ ఆహారాన్ని పొందటంలేదన్నమాట. తన జీవితాన్ని సర్వనాశనంచేసే జర్మను శిశువు ఆ ఆహారంతో పెరిగి పెద్దదవుతున్నది. ఆమె నిద్రిస్తుంటే, 'మలాషా' విశ్రాంతిని పొందట లేదన్నమాట. ఆమెలోని జర్మను శిశువు విశ్రాంతిని పొందుతున్నది. తన శరీరంలో పెరుగుతున్న 'దానిని' ఒక శిశువుగా ఆమె భావించలేకపోతున్నది. ఇప్పుడు బాధతో పెడబొబ్బ పెడుతున్న ఆ 'ఓలెనా' కు పుట్టబోయే శిశువే శిశువు. రాత్రి జర్మను తుపాకికి గురియైనలాంటి బాలుడే బాలుడు ! 'ఫెరోరికా' కు కలిగిన సంతానంలాంటి సంతానమే సంతానము. రూపసులో, కురూపులో - ఆ తల్లులు ఆ బిడ్డల్ని ఆనందంతో తొమ్మిది నెలలూ మోసి కన్నారు. కాని తాను తన గర్భంలో పెంచుకున్నది, తాను

కనబోయేది శిశువుకానేరదు. అదొక జర్మను తోడేలు పిల్ల అనటం బాగుంటుంది. ఇక దానిని మార్చేవిధంలేదని తెలుసుకుని ఆమె భయకంపితురాలై పోయింది. అది - తన గర్భంలో నున్నది - చనిపోయినప్పటికి - తాను స్వయంగానే పిసికి పారేసినప్పటికి - యేం లాభం ? భేదమేమీ ఉండదు. ఒక నీచుడా జర్మనువాడికి సంబంధించిన శిశువుని, తన గర్భంలో, తన రక్తంతో పెంచినపాపం తనను యెన్నటికీ వదలదు. ఆ గర్భాన్ని-దినదినం వృద్ధిచెందే ఆ గర్భాన్ని - చూచినవారు యెంతైనా అసహ్యించుకొంటారు. పెరిగిన తన గర్భాన్ని, తనను చూచి, కుష్ఠురోగిని చూచి తొలగిపోయినట్టుగా తొలగిపోతారు.

ఆమెకు కలిగిన ఘోరదుస్థితి సంగతి గ్రామస్థులందరకీ తెలిసింది. ఆమెపట్ల అందరూ సానుభూతిచూపించి, ఆ జర్మన్ల పాపం బ్రద్దలయ్యే రోజు రాకపోదన్నారు. తాము పగతీర్చుకొనక మానమన్నారు. కాని అది అసాధ్యమని 'మలాషా'కి తెలుసు. ఇతరులకు జరిగిన అన్యాయాలకు ప్రతీకారం తీసుకొనటం సాధ్యమవుతుంది. 'లివాన్స్క్', 'ఓలెనా' మొదలైన వారికి కలిగిన అన్యాయాలకు పగతీర్చుకోటం వీలవుతుంది. కాని తనకు జరిగిన అన్యాయంలో ప్రతీకారం తీసుకోటానికి తావులేదు. ప్రజలు అసహ్యించుకోనప్పటికీ, కుష్ఠురోగి శరీరంలాంటి తన శరీరంతో యీ ప్రపంచంలో బ్రతకటం యెట్లా? తనకూ, తన ప్రజలకూ, ఆ నాడు - ఆముగ్గురు జర్మను పశువులు తన శీలాన్ని చెరిచిననాడే—ఒక పెద్ద ఆఘాతం యేర్పడిపోయింది ! ఈ యమయాతన అనుభవించటానికి యింకా బ్రతికివున్నది. శీలంచెడి, శరీరం మలినమై పోవటమేగాక, యీవిధంగా భయంతో ఒక్కొక్క రోజే లెక్కించుకోటానిక యింకా ప్రాణాలు మిగిలాయి. తాను లెక్కవేయటం పొరపాటేమోననీ, ఇలాంటి ఆలస్యాలు సాధారణంగా అప్పుడప్పుడు జరగటానికి అవకాశముందనీ, పిచ్చి ఆశ ఒకమూల ఉన్నప్పటికీ, తాను గర్భవతి అయినదని యేదో ఆమె అంతర్యంనుండి ఘోషిస్తున్నది......

చక్కని సూర్యరశ్మితోను, అందమైన పువ్వులు, వాటి సువాసనలతోను నిండిన యెండాకాలపు ఆనందమయ దినాలు గుర్తుకొచ్చాయి. వెండి పూతపూసినటువంటి ఆ వెన్నెలరాత్రుల్లో, ఎత్తుగా పెరిగిన పొలాలు,

అవి విరజిమ్మే సువాసనలు కోతలుకోసి కళ్ళల్లోవేసి, అక్కడ చిన్న చిన్న గుడిసెలు వేసుకొని గడిపిన ఆ మధురమైన రాత్రులు జ్ఞప్తికొచ్చాయి. ఆ రాత్రుల్లో, ఆ ఆలింగనాల్లో ఆమె గర్భందాల్చలేదు. మధురమైన రాత్రులు, ఆనందం వెల్లువలై ప్రవహించినసమయాలు, పెదవులు పెదవుల కలిసిన ఆ క్షణాలు, హృదయం ఉప్పొంగి గంతులువేసిన ఆ అనుభవాలు, యెలాంటి చిహ్నంకూడా లేకుండా, అసలు జరుగనట్టుగానే గడిచిపోయినై. పైగా ఆ నూర్పుల కాలంలో యెన్నెన్ని రాత్రులు గడిపింది! తన ప్రియుడికి తన సర్వస్వాన్ని అర్పించి, అతనిలో కరిగిపోయింది – కాని ఆమెకి అటుతర్వాత యేమీ కలుగలేదు.

కాని యీనాడు, కొన్ని క్షణాలలో కలిగిన ఆ భయంకరానుభవం, ఆమె జీవితానికి మాయని మచ్చ కలిగించింది; ఒక నీచుడి ప్రతిబింబాన్ని తన గర్భంలో పెంచే దౌర్భాగ్యానికి దారితీసింది.

'ఐవన్'తో తనకు వివాహం జరిగినప్పటి విషయాలు గుర్తుకి తెచ్చుకున్నది. ఆమె వివాహజీవితం యెక్కువకాలం జరుగకపోయినా, ఆకాశంలో నక్షత్రాలు ముసిముసినవ్వులు నవ్వే మధురాతి మధురమైన అనేక రాత్రులు భర్తతో గడిపింది. తర్వాత అతడు సైన్యంలోకి వెళ్ళిపోవటంతో ఆమె వివాహజీవితం అంతరించిపోయింది. అటుతర్వాత గూడా ఆమె తీవలాంటి తన అందమైన శరీరంతోను, నాగుబాములాంటి నడుముతోను, ఉబికి వస్తువలెన వక్షంతోను, వీధుల్లో నడుస్తుంటే, ఆమె 'ఐవన్' సొత్తు అయిపోయి యెంతోకాలమైనదని తెలిసిగూడా యువకులు ఆమెనుచూచి మందహాసం చేయకుండా వుండలేకపోయేవారు. మిలమిలలాడే ఆమెకళ్ళు, తీర్చిదిద్దిన పలువరుసా చూడటానికి వారెంతైనా ఆనందపడేవారు.

కాని ఒక కాళరాత్రిలోని కొన్ని క్షణాలు వాటినన్నింటిని తారుమారు చేసినాయి. ఇంతవరకు ఆ విషయం యెవ్వరికీ తెలియదు. పైకి కనబడటంకూడా లేదు. అయినా రోజులు గడచిన కొద్ది గ్రామస్థులకీ విషయం బయటపడుతుంది. ఆమెకు జరిగిన ఘోరం చాలదన్నట్టు, ఈ జర్మను శిశువును తన శరీరంలో పెంచేనైచ్యం, బాధ ఆమెకు పాల్పడ్డాయి. తాను నొప్పులుపడేవేళ, ఆ శిశువును కనేవేళ యెవరు సహాయంచేస్తారు? ఒక

తోడేలుపిల్లను, హంతకుని బిడ్డను కనబోయే తనకు పురుడుపోయటానికి గ్రామంలో యే స్త్రీ అంగీకరించగలదు?... పైగా 'ఓల్గా' ఆ మూల కూర్చుని చావుకి భయపడుతూ యేడుస్తుంది. ఆ ఖైదీలు చావరనిమాత్రం 'మలాషా'కి తెలుసు. వారి ప్రాణాలను యేదిరక్షిస్తుందోమాత్రం తెలియదు. ఆ చనిపోయిన పిల్లవాడివిషయం, అతని శవాన్ని జర్మనుపాల్పడకుండా రక్షించిన వారివిషయం జర్మన్లకు యెవ్వరైనా తెలియచేస్తారనటం కలలో నైనా జరుగదనికూడా ఆమెకు తెలుసు. జర్మన్లకు ద్రోహం యెవ్వరైనా అందజేస్తారనుకోటం అంతకంటే అసాధ్యమైన విషయం. ఏమిజరుగుతుందో యేవిధంగా జరుగుతుందో తెలియకపోయినా, తాను చావననీ, తనను వాళ్ళు చంపరనీ యెందుకో అనిపిస్తున్నదామెకు. ఆమెను చంపనప్పుడు, తక్కినవాళ్ళుకూడా బ్రతికి వుండటానికి వకాశముంది ...

మొదట్లో 'వెరోనికా' 'ఓల్గా'కు ధైర్యం కలిగేటట్లు ఆమె చెయ్యి నిమురుతూ కూర్చున్నది. కాని ఓల్గా యింకా యేడుస్తుంటే, ఆమె సహించలేకపోయింది.

"ఎందుకట్లా యేడుస్తావు? జరిగేదేదో జరుగుతుంది. అలా యేడ్వటానికి సిగ్గెయ్యటంలేదూ?" అని కసురుకున్నది.

"ఏం చెయ్యను? యెంత ప్రయత్నించినా దుఃఖం దానంతటదే వచ్చేస్తున్నది" అని చిన్నపిల్లలాగ వెక్కి వెక్కి యేడుస్తున్నది. ఆ యేడుపు వింటుంటే 'వెరోనికా'కి తన చిన్నకూతురు నైనా జ్ఞాపకంవచ్చింది.

"సరే, ఊరుకో, ఇంకా యేమీ నిశ్చయంకాలేదుగా –"

'మలాషా' ఆ చీకట్లో తనలోతానే వెఱ్ఱినవ్వు నవ్వుకున్నది. అంతా నిశ్చయమైపోయిందని ఆమెకు తెలుసు. చావుకలిగే ఆశలేదు.

"నా ముగ్గురుబిడ్డల్ని యింటిదగ్గర వదిలివచ్చేశాను. వాళ్ళగతి యేమయిందో తెలియదు. అయినా నేను, నీలాగ యేడుస్తూకూర్చున్నానా?" అని అన్నది 'వెరోనికా'. ఆ మాటలు అంటున్నదేగాని, ఆమె హృదయం దుఃఖభారంతో నలిగిపోతున్నది. పిల్లల్ని ఒకసారి, ఒక నిముషంపాటైనా చూడాలనిపించింది. ఏంచేస్తున్నారో? ఎట్లాగున్నారో? 'మాల్యూచికా' వాళ్ళయింటికి తీసుకుపోయిందో, లేక తన యింట్లోనే ఉండిపోయారో? చీకట్లో, వీధిలో వినబడే అడుగుల చప్పుళ్ళువిని, భయపడి, గుండెపగిలి

చేజారిపోయారేమో ? ఆనాడు జర్మను సైనికులు వచ్చి, తమ యింటినుంచి తమనే వెళ్ళగొట్టినప్పటినుండి పిల్లలు యెన్నడూలేని భయాన్ని పొందు తున్నారు.

“పో. బయటికి !” అని ఒక పొడుగాటి సార్జెంటు వాళ్ళు తమను బయటికి గెంటేసున్నప్పుడు, చలిలో పిల్లలు గడ్డకట్టిపోకుండా కాపాడుకో డానికి ఆమె కొన్ని గుడ్డలు తీసుకోటానికి ప్రయత్నిస్తే, తుపాకిమడమతో కొట్టాడు. “వెళ్ళిపోండి !” అని వాడు మళ్ళీ గర్జించేటప్పటికి పిల్లలు భయంతో ఆ కటికి చలిలోకి పరుగెత్తారు...

కాని తర్వాత వాళ్ళకా యిల్లు నచ్చక అది వదిలేసి మరొక యింటికి వెళ్ళిపోయారు. అందువల్ల తనకూ, తన పిల్లలకూ తలదాచు కోటానికి మళ్ళీ యీతస్థలం దొరకింది. కాని యిల్లంతా బాగుచేసుకునే టప్పటికి కడుపులో పేగులు తోడేసినై. జర్మన్లు బైలుకికూడా నడవ లోనే కూర్చున్నారు. తన యిల్లు నచ్చక అట్లాచేసేసి వెళ్ళిపోయారేమో అనుకున్నది ‘చెకోరికా’. కాని కొన్ని రోజులు గడిచాక గ్రామంలో జర్మన్లున్న అన్ని యిళ్ళల్లోను అదేవిధంగా జరుగుతున్నదనికూడా తెలి సింది. చలికి బయటికి పోలేక అలా చేస్తుండేవారు. జర్మను పశువులు ఆ రోతలో యెలాగుండేవారో ఆమెకు అర్థమయ్యేదికాదు...

‘మాల్యూచికా’ దగ్గర పిల్లలు చేరికగా ఉంటారో లేదో ? ‘ఓస్యా’, ‘మాల్యూచికా’ కొడుకు ‘సాషా’ తో కీచులాడతాడేమో ! ‘ఓస్యా’, ‘సాషా’ కంటే చిన్నవాడు. బలంతక్కువవాడైనప్పటికి పౌరుషంలోమాత్రం తీసిపోడు. వయస్సులో తనకు రెండింతలు పెద్ద వాళ్ళతోకూడా కయ్యానికి తయారౌతుంటాడు. బయటికి వెళ్ళాడంటే యెక్కడో ఒకచోట దెబ్బలుతినే వస్తుంటాడు. ‘సోన్యా’ మట్టుకు అల్లరిచెయ్యకుండా బుద్ధిగానే ఉంటుంది. కాని తక్కిన యిద్దరు ‘ఒస్యా’, ‘సైనా’ లతోనే పేచీవస్తుంది...పాపం ! ‘మాల్యూచికా’ ఈ పిల్ల లందరితో యెట్లా తంటాలుపడుతుందో ! ఈ రకపు రోజుల్లో వాళ్ళ నెట్లా పోషించగలుగుతుందో ! —

'యాడోకిమ్' తాత ఉండి ఉండి ఒక్క నిట్టూర్పు విడిచి యిలా అన్నాడు: "'గ్రోషాచ్'ని చూడండి. ఎంతహాయిగా గుఱకలుపెట్టి నిద్ర పోతున్నాడో?"

'గ్రోషాచ్' ఆ నిశీథంలో నిశ్చలంగా గుఱకలు పెడుతూ నిద్ర పోతున్నాడు.

"తాతయ్యా, నీకు నిద్రరావటంలేదూ? - అని 'చెకోరికా' తన ఆలోచనలు పిల్లలమీదనుంచి మరల్చుకోటానికి ప్రయత్నిస్తూ అడిగింది.

"నిద్ర? నిద్రయేనాడో మరచిపోయాను. ఏదో అప్పుడప్పుడు యింత కునుకుతీస్తాను."

"ఇప్పుడు టైము యెంత అయ్యుంటుందో?" అని 'ఓల్గా' అడిగింది.

"ఏమో? చెప్పటం కష్టం. ఇట్లా కూర్చుంటే టైముసంగతి కూడా తెలియదు......ప్రక్కగదిలో దీపం వెలిగించారు. బహుశ రాత్రి పడి ఉండవచ్చు."

"ఇంతేనా?" - అని 'ఓల్గా' నిరుత్సాహపడింది - "ఎంతో కాలమైపోయిందనుకున్నాను."

"అవును; యెంతో కాలం గడవలేదు. కాని అలా నిరుత్సాహపడితే యెట్లా చెప్పుపిల్లా? ఇంకా యెంతకాలం ఉండవలసివస్తుందో?"

"'ఓల్గా' ఇంకా చిన్నది. ఐనా మీ ఆడవాళ్ళకు తగని తొందర" అన్నాడు 'యాడోకిమ్' తాత.

'చెకోరికా' ఆ చీకట్లోనే 'యాడోకిమ్' తాతవైపు తిరిగి చూడ సాగింది. ఆమె కళ్ళు ఆ చీకటికి బాగా అలవాటుపడిపోయినై. ప్రక్క గదిలోనున్న తలుపుసందులోంచి సన్నని వెల్తురు లోపలికి వస్తున్నది. ఆ కొద్ది వెల్తుర్లోనే ముగ్గుబుట్టలాగ పండిపోయిన 'యాడోకిమ్' తాత తల కనిపిస్తున్నది.

"తొందరెందుకు తల్లీ! ఇక్కడ గడిపే క్షణాలే మనవి. ఆతర్వాత యేమైపోతామో, యేం చెప్పగలం?"

"మన సైనికులు యీలోగావచ్చేస్తే" - అని 'ఓల్గా' అడిగింది. ఆ బందిఖానానుండి మృత్యుముఖంలోకేతప్ప, వేరుచోటుకి పోలేమని ఆమె మనస్సు ఊహించలేకుండావుంది.

"కాని జర్మన్లు మనకిచ్చిన గడువు మూడురోజులేగా ?"

"ఇక మూడురోజులు చాలదూ ?"

"గాలిదుమారం యిట్లాలేస్తుంటే యేం చెప్పగలం ? మనవాళ్ళు మెషిన్‌గన్నులు మొదలైనవాటితో రావటం సాధ్యమవుతుందా ? గజం దూరంలో ఉన్నవార్ని చూడటమే దుస్సాధ్యంగా ఉందాయె-అలాంటప్పుడు దారీ, డొంకా యేం తెలుస్తుంది ?" అని 'చెకోరికా' నిశ్చలంగా పలుకుతున్నది. కాని తన మాటల్లో తనకే నమ్మకం కలుగలేదు.

గాలిదుమారం జోరుగా ఉన్నమాట నిజమే. కాని అలాంటప్పుడు గూడా వారు అచంచలమైన నమ్మకంతో ఎర్రసైనికుల రాకకోరకు యెదురు చూస్తున్నారు. ఆనాళ్ళ ప్రొద్దుటే 'చెకోరికా' ఎర్రసైనికులు వస్తున్నారేమోనని యెంతోసేపు నిరీక్షిస్తూ కూర్చున్నది. ఈ తుపాను యెర్రసైనికులకు ఒక లెక్కలోనిదా ? ఎక్కడపడితే అక్కడ ప్రజలు వారికి సహాయంచేసి, దారిచూపిస్తారు. అలాంటప్పుడు యెందుకు రాకూడదు ?

'ఓల్గా' అన్నమాట నిజమే. వాళ్ళు యేక్షణాన్నైనా రాగలరు. మృత్యువుకీ తమకూ మధ్యగల యీ మూడురోజుల్లో యేక్షణాన్నైనా రావచ్చు. హఠాత్తుగా ఆ చీకటికూపం తలుపులు తెరుచుకొని, ఆమె కాంతిమయ ప్రపంచంలోకి పరుగెత్తి ఎర్రసైనిక యోధులను కలుసుకొని, 'మాల్యాచికా' దగ్గరఉన్న తన బిడ్డలదగ్గరికి వెళ్ళటం జరుగవచ్చు.

ఒకవేళ యితర శబ్దాలు యేవీ వినబడనివ్వకుండా జేసే యీ గాలి దుమారాన్ని, చీకటిని ఆధారంగా చేసుకొని గ్రామానికి చేరుకుంటున్నారేమో ? ఒక్కసారిగా, మెఱుపు మెరిసినట్టు వచ్చిపడి తమ రక్తం పీలుస్తున్న యీ జర్మను జంతువుల్ని తుదముట్టించలేరూ ?

"వాళ్ళువస్తే రానూవచ్చును. మనం బ్రతికి బయటపడటానికి గూడా అవకాశమున్నదేమో ?" - అని ఆమె బిగ్గరగా అన్నది.

"వస్తారని నమ్మకమేనా ?" - 'ఓల్గా' అడిగింది.

"ఏమో ? - ఇప్పటికే కాలం మించిపోయింది"-అని 'యాడోకిమ్' తాత గొణిగాడు.

"వాళ్ళు వచ్చిన తక్షణమే మనను విడిపించటానికి వస్తారు. గ్రామస్థులకు మనం యెక్కడున్నదీ తెలుసుగా - " అని ఉద్రేకంతో

అన్నది 'ఓల్గా', ఇక ఒక్కక్షణంకూడా అక్కడ కూర్చోలేనిస్థితిలో ఉన్నది ఆమె. తమ సైనికులు యెప్పుడు వచ్చి తమను విడిపించుతారా అని ఆమె మనస్సు తపించిపోతున్నది.

"వచ్చినప్పటి మాటగద...అప్పుడే గ్రామంలోకిగూడా వచ్చేసినట్లు మాట్లాడతావే –" అన్నది 'చెకోరికా'.

"ఏమో వచ్చేశారేమో ?"

'మలాషా' ఇంకా అదేవిధంగా కూర్చుని చీకట్లోకి వెఱ్ఱిచూపులు చూస్తున్నది. అవును–వాళ్ళందరు విముక్తి పొందటానికి ఆశతో వేచి ఉండగలరు. కాని తన విషయం ? ఎవ్వరూ సహాయంచేయలేరు; ఎవ్వరూ రక్షించలేరు. ఎర్రసైనికు లొస్తేమాత్రం ? తాను పోయి ఆనందంతో వారిని ఆహ్వానించటానికి నోచుకోలేదు. ఇంతకూ వారి ముఖాలు యెలా చూడగలను ?...తానెవరు ? ఒక జర్మను శిశువును తన గర్భంలో పెంచుతున్న నీచురాలు ! పాపాత్మురాలు...యుద్ధం ముగిసి 'ఐవన్' ఇంటికి తిరిగి వచ్చినప్పటికి, అతనిని ఎలా కలుసుకోగలుగుతుంది ? తన పాడుముఖం 'ఐవన్' కి చూపించటం యెట్లా ? ఎక్కడైనా కనబడ్డా అసహ్యంతో ముఖంమీద ఉమ్మి వేయడూ ?...

'చెకోరికా' చెవిలో 'ఓల్గా' యేదో రహస్యంగా చెబుతున్నట్టు అనిపించింది 'మలాషా' కి. 'అవును–అదుగో ! వాళ్ళు చూడు, నాకు యెంతదూరంగా కూర్చున్నారో ?' అని తనలో తాను కృంగిపోతున్నది, 'మలాషా'. మొదట్లో అందరూ కూర్చున్న తర్వాత తానే అంతదూరం వచ్చి కూర్చున్నమాట మర్చిపోయింది. అవును, 'ఓల్గా' ఆశతో కూర్చోగలదు. చావంటే ఆమెకు భయం వుండవచ్చు. ఆమెకు జీవించి ఉండాలన్న ఆశకలగటం ధర్మమే. తన ప్రియుడు 'ఓస్టప్' సైన్యంలోంచి తిరిగి రాగానే, అతన్ని వివాహమాడి, యెప్పటికిమల్లేనే హాయిగా ఉండగలదు 'ఓల్గా'. చక్కగా సంసారం చేసుకోగలదు. కాని తనమాటో ? ఇక ఎన్నిమారినప్పటికి తన జీవితం యెప్పటిలాగ ఉండటం అసంభవం. మళ్ళీ తమ గ్రామంలో అందరికంటే అందగత్తెననీ, చురుకైన పిల్లననీ, మునుపటి 'మలాషా'గా తలయెత్తుకు తిరుగలేదు—

'ఫెడోసియా' కొంతకాలంవరకు తనకొడుకు 'వాస్యా' కోసం యేడుస్తుంది. కాని ఆ తర్వాత ఆమె దుఃఖం చల్లారిపోతుంది. జర్మనులు కూలగొట్టిన యిండ్లు మళ్ళీ కట్టుకోటము సాధ్యమవుతుంది. ప్రజలకు తగిలిన దెబ్బలు కొంతకాలానికి నయమై పోతాయి. కాని తన హృదయానికి తగిలినగాయం యెన్నటికీ మానే అవకాశంలేదు. ఆమెకు కలిగిన భయంకరానుభవం యెన్నటికీ మరపుకి రాదు !!......

గ్రామంలో అందరు యువతులకంటే అందకత్తె అనీ, సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో అందరికంటే చురుకైన పనికత్తె అనీ, అందరూ మెచ్చుకుంటుంటే ఒకప్పుడు ఆనందపడేది. పాటపాడుతుంటే యితర యువతుల కంఠాల్లోలేని మాధుర్యం ఆమె కంఠంలో కనుపించేది. తన అందమైన కళ్ళు, ఆ కేశాలు, గులాబిబుగ్గలు యితర్లు చూస్తుంటే తాను ఆనంద డోలికల్లో ఊగిపోతుండేది.

కాని ఆ అందమే నేడు తనకు గర్భశత్రువైనట్టు కనిపిస్తున్నది. కురూపి అయివున్నా తనకీ ఘోరం సంభవించేదికాదేమో ? అందగత్తె అయి ఉండటంవల్లనే ఆ ముగ్గురు జర్మను సైనికులు ఆమెను అధోగతికి ఈడ్చారు.

అప్పుడప్పుడు ప్రక్కగదిలోంచి జర్మను సైనికుల అడుగుల చప్పుడు వినవస్తున్నది. అదుగో ! జర్మను పశువులు గ్రామ సోవియటు కార్యాలయంలో తమ స్వంతయింట్లోలాగే హాయిగా కులుకుతున్నారు. ఆ యింటికి యజమానుల్లాగే ప్రవర్తిస్తున్నారు ! 'మలాషా' కోపం పట్టలేక పిడికిలి బిగించింది. 'వాళ్ళు' యిక్కడేకాదు — తాను ఒకసారి వస్తు ప్రదర్శనశాల చూడటానికి వెళ్ళివచ్చిన 'కీవ్' నగరంలోకూడా ఉన్నారు. ఉన్నతమైన బంగారుభవనాలతో కళకళలాడే ఆ నగరంలో 'వీళ్ళు' తిరుగుతున్నారు. ఒక్క 'కీవ్' నగరంలోనే గాక, 'ఖార్కోవ్' మొదలైన అన్నిప్రదేశాల్లోనూ—'ఉక్రేనియన్' దేశమంతటా—చేరారు ఈ నీచులు. ఒక్క 'మలాషా'నే గాక వారు యావత్తు 'ఉక్రేనియన్' భూతలాన్నంతా హింసించారు—చెరిచారు. 'ఉక్రేనియన్' గ్రామాలన్నీ భూమిమట్టం చేశారు. 'ఉక్రేనియన్' మాత బిడ్డలను వేనకువేలు చిత్రవధచేసి, చివరికి సమాధికూడా చేయనివ్వకుండా తమ పైశాచాన్ని వెల్లడిస్తున్నారీ జర్మను. 'ఉక్రేనియన్' భూమండలమంతా రక్తపాతంతోను, అశ్రుధారలతోను వరదలై పారింది !...

కాని జర్మని దేశం విడిచి వెళ్ళిన మరుక్షణమే, అక్కడి పవిత్ర నదీజలాలతో అంతా పావనమైపోతుంది. దేశమంతా సౌందర్య శోభితమై పోతుంది. ప్రజలంతా సౌఖ్యసీమలను చేరుకుంటారు.

మరి తన సంగతో ?—అధోగతికి పాల్పడిన తన జీవితానికి యింకెక్కడి ఆశ ?... తాను పతితురాలు...

ఈ విధంగా మనస్సులో మథనపడుతూ 'మలాషా' అప్రయత్నంగా ఒకసారి మూల్గింది.

"నిద్రపోవటంలేదా, 'మలాషా' ?" అని అడిగింది 'చెకోరికా'

'మలాషా' ఉలిక్కిపడ్డది. తన సంగతి వీళ్ళకెందుకూ, అని అర్థంలేని కోపం తెచ్చుకున్నది.

"లేదు ! నీకెందుకూ ఆ గొడవ !" అని కటువుగా జవాబిచ్చింది.

"ఊరకనే అడిగాను."

"నా సంగతి మీ కనవసరం !"

"ఏం ? అందరమూ ఒకే కష్టంలో ఉన్నామని నిన్ను పలకరించాను."

'మలాషా' అర్థంలేని నవ్వు నవ్వింది.

"మీ అందరిదీ ఒకేరకమైన కష్టమే కావచ్చును. కాని నా కష్టం, మీ కష్టాలలాంటిది కాదు."

"ఐనా, నీదీ కష్టమేగా..."

"మహా తెలుసులే, నీకు కష్టాలు ! అట్టే వాగకుండా కూర్చోలేవూ ?"— 'మలాషా' అర్థంలేని కోపంతో మండిపోతున్నది. తన ప్రవర్తన తనకే తెలియటంలేదు.

"ఆమెతో మాట్లాడకు...ఆమె యెంతటి దీనావస్థలో ఉన్నదో తెలియటంలేదూ ?" అని 'ఓల్గా' 'చెకోరికా' చెవిలో రహస్యంగా అన్నది.

కాని 'మలాషా' కి ఆ మాటలు వినబడ్డాయి.

"అవును ! నేను అంటరాని దానిని. నాతో మాట్లాడబోకండి"

'మలాషా' కి యెవరూ జవాబివ్వలేదు. దీర్ఘంగా నిట్టూర్పులు విడుస్తూ, చీకట్లోకి తదేకదృష్టితో చూస్తున్నది.

కోతలకాలంలో తన చిత్రం ఒకసారి పత్రికల్లో పడినప్పటి సంగతి జ్ఞాపకానికి వచ్చింది. అప్పుడు ఆమెను యెవరూ అంటరానిదిగా యెంచ లేదు. గ్రామంలోని యువతులు, స్త్రీలు ఆమెను ఆనందంతో కౌగిలించు కున్నారు. సమిష్టి వ్యవసాయక్షేత్రంలో అందరికంటే ఉత్సాహంగా పని చేస్తుందని ఆ చిత్రంక్రింద వ్రాశారు. అది నిజమే కాని అట్టి 'మలాషా' నేడు జర్మను శిశువును తన గర్భంలో పెంచుతున్నది!...

బయట వీస్తున్న పెనుగాలిరొద, అన్నివైపులా విరిగించివేసిన ఆ గది లోకికూడా స్పష్టంగా వినిపిస్తున్నది. 'గ్రోశాచ్' హఠాత్తుగా లేచిపోయి ఒక ఆవలింత తీశాడు.

"మొత్తానికి హాయిగా నిద్రపోతున్నావయ్యా" అని 'యూడో కిమ్' తాత ఒక విధంగా ఈర్ష్యతోనే అన్నాడు.

"మనసుతీరా యివ్వాళే నిద్రపోవాలి. రేపు యేంజరుగుతుందో యేం చెప్పగలం ?"

"తెలియకేం ? రేపు జరుగబోయేది అందరికీ తెలిసిందే -"

"మన సైనికులు వస్తారేమో !" - అని 'ఓల్గా' మధ్యలో కల్పించు కొని అన్నది. 'గ్రోశాచ్' తన మాటకేమి జవాబు చెబుతాడోనని చూస్తున్నది.

"రావటంమాట నిజమే...కాని ఇంతలోవస్తారని యేంనమ్మకం ?

"పోనీ. మన గెరిల్లాదళమే వస్తుందేమో ?" అని తన నమ్మకాన్ని విడిచిపెట్టలేక 'ఓల్గా' మళ్ళీ అన్నది.

"అచ్చే. వాళ్ళు వచ్చే నమ్మకమేమీలేదు. ఈ మంచుతుపానులో యెట్లా రాగలరు ? అడవులు విడిచి బయకివస్తే జర్మన్లదృష్టిలో పడతారు. ఎండాకాలం అంటే యెక్కడ... అక్కడ దాక్కొని రావచ్చుకాని ఈ పరిస్థితుల్లో కష్టం అన్నాడు 'గ్రోశాచ్'.

"మరి యెర్రసైన్యంమాత్ర మెట్లారాగలదు ?"

"సైన్యం సంగతి వేరు. ఎటువంటిదైనా వాళ్ళు లెక్కచేయకుండా వచ్చెయ్యగలను..."

"అబ్బ ! వెధవగాలి యెట్లా వీస్తుందో !" అని ఒక నిట్టూర్పు విడిచింది 'ఓల్గా'.

"ఇటువంటి గాలిలో మృత్యువు నృత్యం చేస్తుందంటారు." అన్నాడు 'యాడోకిమ్'.

'ఓల్గా' భయంతో వణికిపోయింది. అసలు గదిలోని చీకటిని చూస్తుంటేనే ఆమెకు భయం వేస్తున్నది. అందులో యీ ముసలాడుచావు మాట యెత్తుకున్నాడు..

"మనదేశంలో నేడు మృత్యువు ప్రళయతాండవమాడుతున్నమాట నిజమే" అని 'చెకోరికా' తాతను బలపర్చింది.

ఆ కాళరాత్రిలో నడుస్తున్న మృత్యువు పాదాలచప్పుడు వింటు న్నట్టు అందరూ కొద్దిసేపు నిశ్శబ్దం వహించారు.

"ఈనాడు మృత్యువు రెండురూపాల్లో ఉన్నది" - నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ 'యాడోకిమ్' తాత పలికాడు.

"రెండురూపాలంటే ?"

"జర్మన్లవల్ల మనలాంటివాళ్ళకు కలిగే మృత్యువు ఒకవిధం. ఇక ముందు జర్మన్లకు రాబోయే మృత్యువు ఇంకొకవిధం."

'ఓల్గా' భయంతో ఇంకా 'చెకోరికా' దగ్గరికి జరిగింది.

"తాతయ్యా. ఆమాటలెత్తకండి. నాకు భయంవేస్తున్నది."

"ఈమాత్రందానికే భయపడితే యెట్లా ? ఈనాడు ప్రపంచమంతా కూడా భయంకరంగానే ఉన్నది. అయినా ఆమాత్రందానికి భయపడాలా? అలా భయపడితే మనను అసలు నిలువనే నిలువనివ్వరు" అని 'గ్రోషాచ్' గంభీరంగా అన్నాడు.

"ఎవరు ?"

"ఇంకెవరు ? - జర్మన్లు మనను భయపెట్టటానికి అనేక ప్రయత్నాలు చేస్తారు. భయపడ్డామంటే మనను లొంగదీశారన్నమాటే. కాని భయానికి లొంగిపోకుండాఉంటే, జర్మన్లుకారు, వాళ్ళతాతలు వచ్చినా మనను లొంగదీయలేరు."

" 'వాస్యా' వాళ్ళంటే భయపడలేదు. కాని అతనిని చంపెయ్యలేదూ ?"

"వాళ్ళు చంపరని నేను అన్నానా ? అసలు వాళ్ళకనే అదిగా, వాళ్ళ తుపాకులు ఉన్నదే అందుకు. నేను ఆ విషయం అనటంలేదు. మనకు ధైర్యాన్ని, బలాన్ని యిచ్చేది అదికాదు..."

"మరేది ?"

"నీకు తెలియదా ?"

ఆమెకు యేమి చెప్పటానికీ తోచక మౌనం వహించింది.

"మనం లొంగకుండా ఉండటంలోనే మనబలం ఉన్నదన్నమాట. వాళ్ళకు యేదైనా అవసరమై మనలను ప్రశ్నలు వేసినప్పుడు మౌనం వహించటంలోనే బలం ఉన్నది. ఇంతకూ ముఖ్యంగా గమనించవలసిందేమిటంటే, ఇలాంటి పరిస్థితులు యెల్లకాలమూ సాగవు. ఒక్క జర్మనువాడుకూడా ప్రాణాలతో తప్పించుకుపోలేని కాలంవస్తుంది. ఇక మన వాళ్ళని చంపటంమాట అంటావూ ?... నువ్వింకా చిన్నదానివి...పోయిన యుద్ధంలోను, అంతర్యుద్ధంలోను యెంతమంది చచ్చిపోయారో నీకు తెలియదు. అయితేమాత్రం ? జర్మన్లు మచ్చుకైనా లేకుండా యిక్కడ్నుంచి తొలగిపోయారు. మనం - మన ప్రజలం - మాత్రం మిగిలాము. మన భూముల్లో మనం యెప్పట్లాగా ఉన్నాము."

"కాని అప్పటికంటే చాలామందిని చంపెయ్యటంలేదూ ?"

"అవును - చాలామందిని చంపేస్తున్నమాట నిజమే. కాని అందర్నీ చంపటం వారి తరంకాదు. పంటలు పండించటానికీ ఇండ్లు కట్టటానికీ యింకా అనేకమంది మిగిలివుంటారు. అదృష్టముండి, బ్రతికి బయటపడితే, మనదేశం మునుపటికంటే బలంగాను, సౌఖ్యవంతంగాను - మహాద్భుతంగాను తయారవటం మనం చూస్తాం"

'ఓల్గా' ఒక నిట్టూర్పు విడిచింది.

"అది చూడాలని నాకు యెంతో ఆశగావున్నది."

'గ్రోషాచ్' ఉద్రేకంతో ఒక్కసారిగా లేచాడు.

"అంతేకాదు ! నే. బ్రతికుండి ఈ గ్రామంలో అడుగుపెట్టిన ప్రతి జర్మనువాడు, ఇక్కడే సమాధి అయ్యేటట్టు చూడాలని ఆశగా

ఉన్నది. ఒక్క జర్మనువాడుకూడా మనదేశంలో మిగలకుండా ఉరికించాల నుంచి వెళ్ళేదుతుంటే చూడాలనివుంది. జర్మనీలో ఉంటూ, ఈ సర్వ నాశనంచేసే భూతాలకు తోడ్పడుతున్నవారు మనదేశం వచ్చి ఇక్కడ కూలిపోయిన భవనాలన్నీ కడుతుంటే నా కళ్ళారా చూడాలనివుంది.''

''వాళ్ళను ఇంకా కళ్ళముందు చూస్తూ ఉండవలసిన ఘోరంకంటె స్వయంగా మనమే మన భవనాలు తిరిగి కట్టుకోటం మేలు అనిపిస్తుంది నాకు.'' అన్నది 'వెరోనికా'

'యారోస్లావ్‌' తాత ఒక నిట్టూర్పు విడిచి యిలాఅన్నాడు :

''మన ప్రజలు చాలా జాలిగుండె కలవారు. ఒక క్షణంలో కోప మొచ్చినా, మరుక్షణంలో అదంతా మరిచిపోతారు. తమ హృదయాల్లో క్రోధాన్ని యెక్కువకాలం ఉంచుకోలేరు.''

''తాతయ్యా, నువ్వక్కడే పొరపాటు పడుతున్నావు. మనవాళ్ళు ఉదారస్వభావులన్నమాట నిజమే. కాని వాళ్ళు సామాన్యులుకారు. ఒక సారికనుక వారి హృదయానికి నాటిందంటే వారి జన్మాంతరం మరువరు. ఇప్పుడు వారి క్రోధం కట్టుదాటిపోయింది. ఇక వారు మరచిపోవటం అసాధ్యం. వారి జీవితాలలో మరువలేని సంఘటనలు జరిగినాయి.''

'మలాషా' నిశ్శబ్దంగా వింటున్నదీమాటలు. తన మనస్సులోని కొన్ని భావాలనే 'గ్రోషాచ్‌' పలుకుతున్నట్టనుపించింది. కాని జర్మన్ల మీద యెంత ప్రతీకారం తీసుకున్నప్పటికీ తనకేంలాభం? ఇతరులు సంతృప్తిపడి, వారి హృదయాలు శాంతింపవచ్చు. కాని తన హృదయాని కింకెక్కడ శాంతి? ఇక నెంతటి రక్తపాతమైనా, యెంతటి ప్రతీకారమైనా, యెంతకాలం గడిచినా ఆమె ఆభయంకరానుభవాలను మరచిపోవటం అసంభవం. తన హృదయంలో కలిగిన గాయం, దుర్గంధంతో ఉంటూనే ఉంటుంది, తాను బ్రతికున్నంతవరకు.

''లేదు! మనప్రజలు వారి జీవితాంతాలవరకు, జర్మన్లుచేసిన రాక్షస కృత్యాలు మరువలేరు.'' అని చివరికి గంభీరంగా పలికాడు 'గ్రోషాచ్‌.'

''ఎప్పటికీ మరువరు ?'' అని 'మలాషా' అదే ధోరణిలో అన్నది.

''నాకు దాహం వేస్తున్నది.'' అని మెల్లిగా అన్నది 'ఓల్గా'

"నీళ్ళమాట యెత్తకు కావాలంటే మాత్రం వాళ్ళు మనకు నీళ్ళిస్తా రనుకున్నావా ? నీళ్ళు లేకపోయినా మూడురోజులపాటు ఉండవచ్చు. అందులోను ఊరికే కూర్చున్నాము కాబట్టి, దాహానికి కొంత ఓపికపట్ట వచ్చు. కాని అస్తమానం నీళ్ళమాటే ఆలోచిస్తూ కూర్చోబోకు. అలా చేస్తే దాహం మరీ యెక్కువవుతుంది."

"అబ్బా !"

"అలా భయపడటానికి నీకు సిగ్గువెయ్యటంలేదూ ? నీతోటివాళ్ళం అంతా అట్లా భయపడుతున్నామా ! నువ్వొక్కదానివే కష్టాల్లో ఉన్నావను కుంటున్నావా ? గ్రామంలోఉన్న వారందరుకూడా మన స్థితిలోనే ఉన్నారు" అని 'ఓల్గా' ని 'చెకోరికా' మందలించింది.

"కాని మనం ఖైదీలం కదూ !..."

"అయితేమాత్రం ? మూడురోజుల్లో మనను కాల్చివేస్తామన్నారు. అయితే యేం ? కాని జర్మన్లకు ధాన్యంమాత్రం యెవ్వరూ యివ్వరు. అందువల్ల మృత్యువు మనతలమీద యెంతగా కూర్చొని ఉన్నదో, బయట ఉన్న వారి తలలమీదకూడా అంతగానే కూర్చొనిఉన్నది."

అంతా మాట్లాడకుండా కూర్చున్నారు. 'ఓల్గా' భయంతో చీక ట్లోకి చూస్తున్నది.

గాలిదుమారం లేపుతున్న మంచుమేఘాల్లో నిద్రపోతున్నట్లుగా ఉన్నది గ్రామం. గ్రామప్రజలందరూ గాఢనిద్రలో ఉన్నట్టుగా తుఫాను శబ్దమూ, ప్రసవవేదనపడుతూ అప్పుడప్పుడు 'ఓలెనా' వేసే కేకలుతప్ప మరేశబ్దమూ వినబడటంలేదు.

కాని గ్రామస్థులు మాత్రం నిద్రపోవటంలేదు. 'యెూడోకిమ్' తాత అన్నట్టు, మృత్యువు చేస్తున్న భీకర నృత్యాన్ని చూస్తూ యిండ్లల్లో కూర్చొని ఉన్నారు. జోరుగా సుడిగాలిలో లేస్తున్న మంచు మేఘాల్లో గ్రామం మూలమూలల్లో, తన భీకర నృత్యాన్ని కనబరుస్తున్న మృత్యువు యొక్క వికటాట్టహాసం అంతటా ప్రతిధ్వనిస్తున్నది ! –

లోయలో యేటివొడ్డున మృత్యువు ! ప్రతిరోజూ 'ఫెడోసియా' వచ్చి తుడిచి శుభ్రంచేసే 'వాస్యా' మృతకళేబరంమీద 'గీ' పెడుతూ

మంచుపోస్తున్నది మృత్యువు. ఆలోయలో వీరమరణంపొందిన రెడ్ ఆర్మీ సైనికులందరిమీద రాజ్యంచేస్తున్నది.

'గెరిల్లా' దళందగ్గరికి వెళ్ళటానికి ప్రయత్నిస్తూ పట్టుకోబడి ఉరి తీయబడిన 'లివాన్స్యక్' శవాన్ని ఉరికంబమునుంచి అటూ యిటూ ఊపు తున్నది, మృత్యువు. అతని శరీరంకూడా శిలారూపందాల్చింది. ఉరి కంబంనుంచి గాలివిసురికి ఊగులాడుతుంటే 'కర్' మను శబ్దం వినబడు తున్నది. ఉరికంబపు గెడలను అతని కాళ్ళు తగులుతూ 'డుబ్బ' మంటున్నాయి.

ప్రసవవేదనపడుతూ, 'ఓలెనా' ఉన్న ధాన్యపుకొట్టు తలుపుల ముందు నృత్యం చేస్తున్నది, మృత్యువు.

మృత్యువు గ్రామమంతటా యీవిధంగా చేస్తున్న వికటాట్టహాసం మధ్య గ్రామస్థులెవ్వరూ కన్నుమూయలేకుండా ఉన్నారు. తమ తమ పక్కలమీద పడుకొని శూన్యదృక్కులతో అంతా గమనిస్తున్నారు. వికటాట్టహాసంతో తన కోరలు పదును పెట్టుకుంటూ, కత్తుకనిండా మెయ్య డానికి బలికోసం కూర్చున్నది జర్మను మృత్యువు. ఏటిఒడ్డున 'వాస్యా' ను, గ్రామంమధ్య వ్రేళ్ళాడుతున్న 'లివాన్స్యక్' లను పొట్టబెట్టుకోవటమే గాక, గ్రామస్థులందరి మెడలను ఉరితాడుతగిలించి తయారుగా కూర్చున్నది, జర్మనుమృత్యువు...

*　　*　　*　　*

గ్రామస్థులందరూ యేమైతే ఆలోచిస్తున్నారో అదే మాట్లాడు తున్నారు, జర్మను సైనిక కార్యాలయంలోని గదిలో బంధింపబడిన ఆ అయిదుగురు ఖైదీలు. మృత్యువు వికటాట్టహాసంచేస్తూ నృత్యంచేస్తున్న ఆ కాళరాత్రిలో గ్రామస్థులందరికీ కనుమూత పడనివ్వకుండా చేస్తున్న విషయాలనుగురించే వాళ్ళు మాట్లాడుతున్నారు.

చివరికి 'యకాడోకిమ్' తాత యిలా అన్నాడు :

"అందర్నీ చంపలేరుగదా ?... గ్రామస్థులందర్నీ చంపినప్పటికీ వాళ్ళకు మన గుట్టు దొరకదు. ఒక్కరింజయినా వాళ్ళకు చేజిక్కదు."

"అవును. మన ప్రజలకది కొత్తకాదు. 'సొడ్యా', 'లివనెవ్‌కా', 'కోస్టిన్‌కా' మొదలైన గ్రామాలన్నిటిలో యిదేవిధంగా జరిగింది." అన్నాడు 'గ్రోశాచ్'.

నేలమట్టం అయిపోయిన గ్రామాలు వారి కళ్ళకు కట్టినట్టుగా కనబడసాగినై. ఒక జర్మను సైనికునివైపు తుపాకి పేల్చిన నేరానికి 'లివనెవ్‌కా' గ్రామం పూర్తిగా పరశురామప్రీతి చేయబడ్డది. జర్మన్లు ఆ గ్రామానికి నాలుగుమూలలా నిప్పంటించారు. మంటల్లోంచి తప్పించుకోటానికి ప్రయత్నించిన గ్రామస్థులను తుపాకిగుండ్లకు యెరచేశారు. తల్లులముందు పిల్లల్ని మంటల్లోకి విసిరారు. 'నూటయాభైమందిని ఒకచోట చేర్చి బాంబులతో హతమార్చి, నేలమట్టంచేసిన 'సొడ్యా' గ్రామం వారి కళ్ళముందు కనబడసాగింది. మగవాళ్ళనందర్నీ చంపి, స్త్రీలను, పిల్లన్నీ వారి గుడ్డలు ఊడదీసుకొని, కటికి చలిలో యిండ్లలోంచి వెళ్ళగొట్టి, నేలమట్టం చేసిన 'కోస్టిన్‌కా' గ్రామం వారికి గుర్తుకివచ్చింది.

"'సొడ్యా', 'లివనెవ్‌కా', 'కోస్టిన్‌కా', మన జిల్లాలోనివే! ఇక తక్కిన జిల్లాలలో మాటో? 'కీవ్', 'ఒడెస్సా' మొదలైన పట్టణాలనేం చేశారు? మన గ్రామాలు ఏమాత్రం మిగిలివున్నాయి? 'యశాడోకిమ్' తాతయ్యా, పోయిన యుద్ధంలోకూడ యింతే జరిగిందా?"

రెండుచేతులతోను ముఖం కప్పుకొని 'ఓల్గా' నిశ్శబ్దంగా కూర్చున్నది. ఇప్పటివరకు తాను 'గెరిల్లాల' అరుపులు వింటున్నట్టూ, వాళ్లు వచ్చి తమ నందర్నీ విడిపిస్తారన్నట్టూ భావించుకుంటున్నది. కాని వీళ్ళందరు ఇప్పుడు మృత్యువుని గురించి – మృత్యువు తప్పదన్నట్టు మాట్లాడుతున్నారు. మృత్యువునిగురించి వారు అంత ప్రశాంతంగా మాట్లాడటం చూస్తుంటే 'ఓల్గా' శరీరం మరీ కంపించిపోతున్నది. 'వాళ్ళకేం. చావటం చులకనగానే ఉంటుంది. 'యశాడోకిమ్' తాత యనభైయేళ్ళు జీవితం గడిపాడు. ఇప్పుడు హాయిగానే ప్రాణాలు విడువగలడు. 'గ్రోశాచ్', 'చెకోరికా'లు సంసారాలు అనుభవించారు, పిల్లల్ని కన్నారు. వాళ్ళకు మాత్రం లోటేమున్నది? వాళ్ళుగూడా హాయిగా చావగలరు. కాని తానో? జీవితంలో యే సుఖాలు అనుభవించింది?' అని ఆలోచించుకో సాగింది 'ఓల్గా'.

"ధాన్యం యెవ్వరూ యివ్వరు" అన్నాడు 'యశాడోకిమ్'.

"ముమ్మాటికీ, నిజం" అని బలపర్చింది 'చెకోరికా'.

గ్రామస్థులందరిలోను ఇదే నమ్మకం దృఢంగా నాటుకొని ఉన్నది. మంచువల్ల రాయిలాగ మారిపోయిన భూమి త్రవ్వి ధాన్యమంతా దాచేశారు గ్రామస్థులు. ఎర్రసైనికులకు తీసుకుపోయి యివ్వటానికి వీలుపడని ధాన్య మంతా భూమిలో దాగుని వున్నది. ఈ తుపానులో ఆ ధాన్యపుగాదెలు యెక్కడున్నవో పరుతెవ్వరూ తెలుసుకోటం అసాధ్యం. గ్రామం చుట్టు పట్ల ఉన్న నేలంతా త్రవ్వితే కాని జర్మన్లకు ఆ ధాన్యం పట్టుపడదు.

భూదేవి ప్రసాదించిన ధాన్యాన్ని, జర్మను బందిపోట్లకు భయపడి భూదేవి హృదయంలోనే దాచిపెట్టారు. రైతుబిడ్డలకు భూమాత ప్రసా దించిన ధాన్యంకంటే అధికం మరేదీలేదు. అట్టి మహాప్రసాదాన్ని జర్మన్ల కిచ్చి, వారి సైన్యాన్ని పోషించటమా! జర్మన్లకు ధాన్యం వదలటమంటే, వాళ్ళప్రాణాలు రక్షించటమన్నమాట. జర్మన్లకు ధాన్యమివ్వటమంటే, మంచులోను, అడవుల్లోను తమకై సర్వస్వము త్యాగంచేసి పోరాడుతున్న వీరులను వెన్నుపోటు పొడవడమన్నమాట. జర్మన్లకు ధాన్యమివ్వటమంటే తమ మాతృదేశమైన 'ఉక్రేనియా'కి ద్రోహంచేసి, జర్మన్లను దానికి అధి పతుల్ని చేయటమన్నమాట. జర్మన్లకు ధాన్యం అందనివ్వటమంటే, తమ దేశమంతటా, అందరి హృదయాల్లోను ప్రతిధ్వనించిన 'శత్రువులకు ఒక్క ధాన్యపు గింజకూడా అందనివ్వరాదు' అను నినాదాన్ని పెడచెవినిబెట్టి, తమను తమజాతిని శత్రువులకి అమ్ముకోవట మన్నమాట. జర్మన్లకు ఆహార మివ్వటమంటే, నేటి యుద్ధంలో పోరాడుతున్న యోధులకు, అంతర్యుద్ధంలో చనిపోయిన వీరులకే గాక, యావత్తు ప్రపంచమంతటా మానవస్వాతంత్ర్య సమరం సాగిస్తున్న వారందరికి ద్రోహం చేయటమన్నమాట.

గ్రామంలో ఒకానొకప్పుడు రోజుకూలి చేసుకున్నవారుకూడా తమ సమిష్టి వ్యవసాయక్షేత్రాల్లో హాయిగా నివసిస్తూవచ్చారు. తాము పోయిన తర్వాత పరిస్థితులేవిధంగా నడుస్తాయోనని గ్రామంలోని స్త్రీ లందరు ఆలోచిస్తున్నారు.

ముసలిదైన 'కోవాల్‌చుక్' ఆ చీకట్లో నిద్రపోతున్న తన ఎన మండుగురు బిడ్డల్ని తలుచుకొని ఆలోచిస్తున్నది. అందరికంటే పెద్దపిల్ల

'లీనా' ఇంటిపన్లు చూచుకుంటూ, చిన్నపిల్లల్ని సంబాళించుకో గలదని నిశ్చయించుకున్నది. ఎఱ్ఱసైన్యం తిరిగివస్తే, వారికి తగినంత ఆహారం సురక్షితంగా దాచి ఉంచామనుకున్నది. అంతవరకు అందరిలాగానే, తామకూడా ఉండకతప్పదు.

'విషన్‌కోవా' ఊయలలోనున్న తన బిడ్డను పరీక్షగాచూస్తూ తాను పోయినతర్వాత యీ పసికూనను యెవరు సంరక్షిస్తారా అని మధన పడుతున్నది.

'గ్రోషాచ్' భార్య చీకట్లోకి నిరీక్షిస్తూ ప్రశాంతంగా ఆలోచిస్తున్నది. 'గ్రోషాచ్'ని జామీను ఖైదీగా పట్టుకుపోయారు. ఇప్పుడు ధాన్యం యివ్వకపోవటానికి తానా, లేక అతడా నేరస్థుడని ఆమెకు ఆలోచనపడ్డది. చివరికి తానే, నేరస్థురాలనని నిశ్చయించుకున్నది. కాని ఆమెకు మాత్రం యేమీ బెంగలేదు. చిన్నపిల్ల లెవ్వరూలేరు. ఉన్నయిద్దరూ తమంతట తాము బ్రతుకగల యీడుకివచ్చారు.

నవయౌవనంలో ఉన్న 'వస్యుక్' భార్య తన భర్తవిషయమై ఆలోచింపసాగింది. ఈ పరిస్థితులనుబట్టిచూస్తే ఇక తన ప్రియుడిముఖం కనబడే ఆశలేనట్టే ఉన్నది. ఒక నెలక్రితం తాను యుద్ధంలో గాయాలు తగిలి హాస్పటల్‌లో ఉన్నాననీ, బహుశా నెలవుమీద యింటికి రాగల నేమోననికూడా వ్రాశాడు. కాని యీలోగా జర్మన్లు గ్రామాన్ని వశపర్చుకున్నారు. చివరికి ఎఱ్ఱసైనికులువచ్చి గ్రామం విడిపించినా, తాను వెళ్ళిపోవాలని అనుకుంటున్నది. తనకంటే తన భర్తవిషయము ఆమె చాలా వ్యథపడుతున్నది. అసలే కోమలహృదయుడు. ఈ కష్టాలను యేవిధంగా భరిస్తున్నాడో ?—

వారివారి అభిరుచుల్నిబట్టి, వారివారి ఆలోచనలు నడుస్తున్నాయి. ప్రజల్లో వారివారి ఇండ్లలో వేరువేరుగానే కూర్చొని ఆలోచిస్తున్నారు. కాని వారందరి హృదయాల్లోను ఒకటిమాత్రం నిశ్చయమైపోయి,దృఢంగా నాటుకపోయిఉన్నది. ఏమైనాసరే, ధాన్యం భూమిలోనేఉండాలి. భూదేవి యిచ్చిన ఆ పవిత్ర ప్రసాదాన్ని, జర్మన్ల మలినహస్తాలు తాకటానికి వీలు లేదు ! ఇది తమ జీవితాలకంటే ముఖ్యమైన సమస్య !!

మృత్యువు - జర్మను మృత్యువు - గ్రామమంతటా వికటాట్టహాసం చేస్తూ నృత్యంచేస్తున్నది. ఇండ్లల్లో కూర్చొని గ్రామస్థులందరూ ఆ వికటాట్టహాసాన్ని వింటున్నారు. కాని గస్తీ తిరుగుతున్న జర్మను సైనికులు గూడా, గాలిదుమారం లేపే మంచుమబ్బుల్లో మృత్యువుయొక్క వికటాట్టహాసం విని కంపించిపోతున్నారు. మృత్యువు! ఎక్కడో? ఏమూల దాగి ఉన్నవో తెలియటంలేదు. ఇండ్లచాటునుంచి, సందుగొందుల్లోంచి మృత్యువు తొంగిచూస్తున్నట్టుగా ఉన్నది వారికి. వెయ్యికళ్ళతో పరిశీలిస్తున్నది, వారిని. ఏమూలచూచినా మృత్యువే ప్రత్యక్షమవుతున్నట్టున్నది జర్మను సైనికులకు! తన కౌగిట్లో చేర్చుకోటానికి 'యుక్రేనియన్' మృత్యువు చేతులు చాస్తున్నట్టుగా ఉన్నది వారికి!!...

★

5

గాలిదుమారం భయంకరంగా వీస్తున్నది. 'ఓలెనా' ను బంధించి పెట్టిన ధాన్యపుకొట్టు కప్పు ఎగిరిపోయేటట్లు ఊగిపోతున్నది. కప్పు పైనుంచి చెత్త రాలుతున్నది.

'ఓలెనా' ప్రసవవేదన పడుతున్నది. నొప్పులకు భరించలేక అప్పుడప్పుడు కేకలు పెడుతున్నది. దీనికితోడు జర్మను సైనికులు వీధుల్లో తిప్పుతూ, విచ్చుకత్తులతో పొడిచిన గాయాలబాధ, దాహం అధికమయింది. శరీరమంతా బల్లాలతో పొడుస్తున్నట్లు బాధగా ఉన్నది.

ఆమె బాధతో యిప్పుడు కేకలు పెడుతున్నది. ఇప్పుడు కేకలు పెట్టవచ్చుననుకున్నది. ఇది ప్రసవవేదన గాబట్టి, ఇందాకా అన్నిబాధలు పడుతూకూడా నోరు మెదపని 'ఓలెనా' యిప్పుడు బాధతో కేకలు పెడుతున్నది. జర్మన్లు యెన్నిచేసినప్పటికీ, ఆగర్భంలోని శిశువు మాత్రం చావ లేదు. బ్రతికేవున్నది. ఇప్పుడు-కాంతిలోకి, ప్రపంచంలోకి రావటానికి ప్రయత్నిస్తున్నది. 'ఓలెనా' ప్రసవవేదన పడుతున్నది.

ఆమె అరుస్తుంటే, అడవి మృగం బొబ్బలు పెడుతున్నట్లున్నది. కాని ఆ అరుపులే ఆమెకు కొంత తేలిక నిస్తున్నాయి. బయటవీస్తున్న గాలి దుమారపు రొదను దూరం చేస్తున్నట్లుగా ఉన్నది.

తలుపు తెరిచిన శబ్దమయింది. కాని ఆమె అటు తిరిగి చూడలేక పోయింది. నొప్పులు అంతకంతకీ తీవ్రమవుతుండడంచేత ఇంకా యెక్కు వగా అరవటం ప్రారంభించింది.

జర్మను సైనికుడు తలుపు దగ్గర నిలబడి, యేదోకేక వేయబోయాడు. కాని అంతటితోనే 'ఓలెనా' ప్రసవించే సమయానికి వచ్చిందని తెలుసు కున్నాడు. ఇంతలో ఇంకొక సైనికుడు వచ్చి మొదటివాడి ప్రక్కచేరాడు.

ఇద్దరూ మాట్లాడుకుంటూ, ఆమెవైపు చూచి నవ్వుకొని సాగారు. 'ఓలెనా' మాత్రం తాను దివస్త్రగా ఉన్నదన్న సంగతి, సిగ్గు మాలిన జర్మను పురుషులు తనవైపు చూస్తూ అపహాస్యం చేస్తున్నారన్న సంగతీ కూడా తెలియని స్థితిలో ఉన్నది. తన బాధలో తానున్నది. బహుశ బిడ్డను కంటున్నదని గాబోలు, ఆమె దగ్గరికి చేరకుండా నిల్చున్నారు జర్మను సైనికులు.

'ఓలెనా' కేకలు అంతకంతకూ యెక్కువవుతున్నాయి. చుట్టు పట్ల యిండ్లలో ఉన్న స్త్రీలందరు విచారంతో బయట చెలరేగుతున్న తుపానులోకి చూస్తున్నారు. 'ఓలెనా' ఒక్కతే నిస్సహాయురాలై ధాన్యపుకొట్టులో ప్రసవిస్తున్నది! చలికి, జర్మన్ల దెబ్బలకు ఆమె యెప్పుడో చచ్చిపోయి ఉంటుందనుకున్నారు, గ్రామస్థులు. అలా కాకపోయినా, ఆమె గర్భంలోని శిశువు యెంతో కాలం క్రితం చనిపోయి ఉంటుందనుకున్నారు. కాని యిప్పుడు 'ఓలెనా' దాహం యివ్వటానికికూడా యెవ్వరూ దిక్కులేకుండా, యేకాకియై ప్రసవవేదన పడుతున్నది. గ్రామస్థులు మునుపెప్పుడూ కని, విని యెరుగని విధంగా—దారుణమైన పరిస్థితులలో— ప్రసవిస్తున్నది 'ఓలెనా', దేవుడికి ప్రార్థనలు చేస్తూ. 'ఓలెనా' అరుపులను నిరాశతో వింటున్నారు, గ్రామంలోని స్త్రీలందరు.

చివరకి ఆ అరుపులు పెద్ద యేడ్పులోకి మారి కొంతసేపటికి ఆగిపోయినై.

"'ఓలెనా' ప్రసవించింది!" — తన యింట్లో కూర్చుని 'ఓలెనా' కేకలువింటున్న 'మాల్యూచికా' నోటివెంట వెడలినై యీ మాటలు.

"పాప పుట్టిందా?" — అని అడిగింది 'జినా'.

కొంతసేపటివరకు 'ఓలెనా' స్పృహలేకుండా పడిపోయింది. మెలకువవచ్చి చూసుకునేటప్పటికి ప్రక్కన మగశిశువు కనిపించాడు.

శిశువుని చేతుల్లోకి తీసుకున్నది. సహాయం చేసేవారెవ్వరు లేరు. పళ్ళతో బొడ్డుకొరికి, తన శాలువలోని గుడ్డపేలిక కట్టింది. బిడ్డ శరీరం కడగటానికి యిన్ని నీళ్ళుంటే యెంతో బాగుండుననిపించింది. చివరికి బండబారిన తన వట్టిచేతులతోనే శిశువు శరీరాన్నంతా తుడిచింది.

ఆమె నలభైయేళ్ళకు యిదే మొదటికాన్పు, అందులోను మగ శిశువు ! ఎన్ని కష్టాలుపడినా చివరికి ఆ కొడుకుని కనగలిగినందుకు అమితా నంత భరితురాలై పోయింది 'ఓలెనా.'

“ఇదిగోనండీ, మన బిడ్డడు !” _ అని తన భర్త 'మికోలా' బ్రతికుంటే చూపించి, అతనిని ఆనందపర్చేదానిని గదా అనుకున్నది. అతనికి పిల్లలంటే చాలా యిష్టం కాని యీ బిడ్డడు పుట్టేటప్పటికి ఆయన యీ ప్రపంచం వదిలిపోయాడు.

నలభై సంవత్సరాల వయస్సులో గర్భవతావటమంటే మొదట్లో 'ఓలెనా' తనకుతానే నమ్మలేకపోయింది. కాని చివరికి అది నిజమే అయింది.

అంతలోనే యుద్ధము రావటమూ, తన భర్త సైన్యంలోకి వెళ్ళి పోవటమూ జరిగింది. కాని తనకు కలుగబోయే శిశువుని చూడకుండా వెళ్ళిపోవటానికి ఆమె భర్త మనస్సు చాలా ఆరాటపడ్డది.

దురదృష్టంవల్ల భర్త యుద్ధరంగంలో పోరాడుతూ చనిపోయాడు. ఆయన ఆశించిన శిశువు ఈనాడు ప్రపంచంలోకి వచ్చింది. బ్రతికిఉంటే యెంత ఆనందపడునో !...

అక్కడి యెండుగడ్డిలోనే ఆ పసిపాపడ్ని తన ప్రక్కన పడుకో బెట్టుకున్నది. చలి తగలనివ్వకుండా బిడ్డను దగ్గరికి లాక్కున్నది. ఇన్ని బాధలకు ఓర్చి కన్నబిడ్డను చివరికి చలి పిశాచానికి వదిలివెయ్యటమే ! బిడ్డను ఇంకా దగ్గరికి లాక్కున్నది.

ఇందాకటి సైనికులిద్దరు ఇంకా తలుపుదగ్గరే ఉన్నారు. ఏదో మాట్లాడుకున్న తర్వాత ఒకడు వెళ్ళిపోయి కొద్దిసేపట్లో మళ్ళీ తిరిగి వచ్చాడు.

“ఇదుగో !” అని, యింతకుముందు ఆమె శరీరంమీదినుంచి ఊడ దీసిన దుస్తులు తెచ్చి అక్కడ పడేశాడు. వాళ్ళు నిజంగా ఆ దుస్తులు యివ్వటానికి ప్రయత్నిస్తున్నారన్నమాట ఆమె నమ్మలేక పోయింది. 'ఓలెనా' కొద్దిసేపు శంకిస్తూ చూచి, గబాలున దుస్తులను అందుకున్నది. ఆత్రంతో తన బిడ్డను ఆ గుడ్డల్లో పడుకోబెట్టి కప్పింది. మిగిలిన మరొక గుడ్డతీసి తన నగ్నశరీరానికి చుట్టుకున్నది. ఆమె చలికోటు, శాలువాకూడా

జర్మను ఆఫీసరు నిన్న గుంజుకున్నాడు. పోనీ తన బిడ్డను చలినుంచి రక్షించుకోటానికి యీ మాత్రం గుడ్డలైనా దొరికినందుకు సంతోషపడా లనుకున్నది. జర్మన్లు తన గుడ్డల్ని గొందుకల్ల తిరగియిచ్చారో, తెలియక ఆశ్చర్యపడుతున్నది.

తలుపు మూసివేసిన శబ్దమయింది. ఒక దూలానికి ఆనుకొని 'ఓలెనా' మగతనిద్రలో పడ్డది. శరీరం సలసల మరుగుతున్నట్టు వేడిగా ఉన్నప్పటికి ఆమెకు వణుకు పుడుతున్నది. కన్నుమూయగానే భర్త 'మికోలా' కనుపించసాగాడు. అదుగో, అతనిప్రక్క జర్మను ఆఫీసరు ఉంచుకున్న ముండ, 'ప్రుస్సీ' కూడా ఉన్నదే! 'మికోలా' యేదో మాట్లాడు తున్నాడు !!—హృదయంమీద యెవరో తన్నినట్లయి గభాలున మేల్కొని చుట్టూ చూచుకున్నది. అబ్బే! ఎవ్వరూ లేరు. అంతా తన భ్రమ పసిబిడ్డ మాత్రం అమాయకంగా నిద్రపోతున్నాడు. 'ఓలెనా' బిడ్డను దగ్గరకి లాక్కున్నది. మళ్ళీ అంతలోనే మగత వచ్చింది.

...... ఎర్రసైనికులు ముందుకి ఉరుకుతున్నారు. అదుగో! 'మికోలా' తుపాకి పట్టుకొని ముందుకి దూకుతున్నాడు... 'కర్గ్!' గెరిల్లా దళ నాయకుడుకూడా యిక్కడే ఉన్నాడే! ఆ ముఖంలో ఉట్టిపడే సాహసం చూడండి!

అదుగో 'ఓలెనా' నీ బిడ్డ నడుస్తున్నాడు!" అని 'ఫెడోసియా' అంటున్నట్టనిపించింది. 'ఓలెనా' ఆశ్చర్యంతో లేచి చూచుకుంది...

దాహం అపరిమితంగా వేస్తున్నది. పెదవులు తడి ఆరిపోయినై. వేళ్ళతో పెదవులు తాకి చూచుకున్నది. వ్రేలికి ఒక రక్తపుచుక్క అంటు కోటం కనుపించింది. చెవులు గింగురుమంటున్నాయి. శరీరం కదలటానికి వీలులేకుండా నొప్పులు పెడుతున్నది.

...నిర్మలమైన నీటితో నిండిఉన్న సరస్సు కనబడింది. బాల్చీతో నీళ్ళు ముంచటానికి ప్రయత్నిస్తున్నది, 'ఓలెనా'. అయ్యో! బాల్చీకి అడుగులేదే!! ......లోపలికి దిగి దోసిలితో నీళ్ళు త్రాగపోతున్నది. అమ్మయ్యో! లోపలికి కాలుజారిపోతున్నది ... హఠాత్తుగా మెలుకువ వచ్చింది ...భయం వేస్తున్నది....

పాపం! బిడ్డ యింకా నిద్రపోతున్నాడు. దాహం కాలేదు. ఇంకా నయం. దాహమయి, యేడుస్తే పాలు కుడిపేదెట్లా? అసలు పాలు వస్తాయా అని?...

...అదిగో! గ్రామానికి నాలుగువైపులలా నిప్పంటుకున్నది. అమ్మో! బిడ్డను రక్షించాలి. ఇదిగో! తన శాలువాకి అప్పుడే నిప్పంటుకున్నది. అంటుకుంటే అంటుకోనివ్వండి. బిడ్డనుమాత్రం ముందు రక్షించాలి....కొడుకని హృదయానికి అదుముకొని పరుగెత్తుతున్నది ... పరుగెత్తుతున్నది ... ఆరే వంటేనకూడా అంటుకున్నదే!! ఇంకెట్లా తప్పించుకోటం? పిల్లవాడు చేతిలోంచి జారిపోయాడు. మంటలు చుట్టుకున్నాయి ... అమ్మో! ఏం చేసేది!!...

ఏదో పెకిలించబడి మేల్కొన్నది 'ఓలెనా'. ఒక జర్మను సైనికుడు బూటుకాలితో తన్ని లేపుతున్నట్టు అప్పుడు తెలిసింది.

తన బిడ్డను వక్షానికి అదుముకొని ఆయాసంతో లేచి నిలబడ్డది. తలుపువైపు నడువమని జర్మను సైనికుడు తుపాకి మడమతో అటు నెట్టాడు. బయట ఆ మంచుని చూడగానే ఆమెకళ్ళు జిగేలుమన్నాయి. నడుస్తున్నదే గాని, నీరసంతో తూలిపోతున్నది.

'ఓలెనా'ను చూడటంతోటే కెప్టెన్ 'కర్ట్ వెగ్నర్'కి అమితమైన అసహ్యం వేసింది. తెల్లగా పాలిపోయివున్నది. పగిలిన పెదవులనుంచి రక్తం స్రవించి బుగ్గమీద గడ్డకట్టింది. దెబ్బలవల్ల కలిగిన కదుములు, ముఖంనిండా అసహ్యంగా కనిపిస్తున్నాయి. తల వెంట్రుకలు చిందరవందరగా యెగురుతున్నాయి.

బల్లమీద వ్రేలితో కొట్టి సైనికుడ్ని పిలిచి 'ఓలెనా'కు ఒక కుర్చీ నివ్వమని సంజ్ఞ చేశాడు 'కెప్టెన్ కర్ట్'. ఓలెనాకు ఆశ్చర్యంవేసింది. కాని మారు మాటాడకుండా, కుర్చీమీద కూలబడి 'కర్ట్' ముఖంకేసి తదేకదృష్టితో చూడసాగింది.

"పిల్లా, పిల్లడా?" అని 'కర్ట్' ప్రశ్నించాడు.

"కొడుకే" – నెమ్మదిగా జవాబిచ్చింది. 'ఓలెనా'.

ఒక సైనికుడ్ని పిలిచి 'ఓలెనా'కు మంచినీళ్ళు తెచ్చివ్వమని ఆజ్ఞాపించాడు. ఆమెకు యిదంతా కలకంటున్నట్లున్నది. మంచినీళ్ళగ్లాసు చేతికివ్వగానే ఆత్రంతో గబగబ తాగేస్తున్నది—

"ఇకచాలు"—అని 'కర్ట్' నోటివెంట మాటరాగానే, ప్రక్కనున్న సైనికుడు గ్లాసు ఆమె నోటిదగ్గర్నుంచి లాగేశాడు. 'ఓలెనా' కళ్ళు నిరాశాపూరితాలై ఆ గ్లాసువైపు తిరిగినై. ఆమెకు దాహం యింతకుముందు కంటే యెక్కువయింది...

"ఐతే కొడుకుపుట్టాడన్నమాట..." అని మళ్ళా ఆరంభించాడు 'కర్ట్'.

ఆమెకు 'కర్ట్' ప్రవర్తన యేమీ అర్థంకావటంలేదు. కూర్చోటానికి కుర్చీ యివ్వటం — గుక్కెడు నీళ్ళు యిప్పించటం — ఏమీ అర్థం కావటంలేదు. మొత్తంమీద యేదో ప్రమాదం రానున్నదనిమాత్రం ఆమెకు అనిపిస్తున్నది. ఇంకా యేమిగానున్నదో నను భయంతో 'కర్ట్' వైపు చూస్తున్నది.

"ఇప్పటికైనా నీ తల తిరిగి నోటికివస్తేచాలు. ఇప్పుడు నీకు నిన్ను గురించిన బాధ్యతేకాక, నీ కొడుకుని గురించిన బాధ్యతకూడా వచ్చిపడింది. ఆ శిశువుని బ్రతికించుకోవాలన్నా, చంపుకోవాలన్నా నీ చేతిలోనే ఉన్నది." అన్నాడు 'కర్ట్'.

ఈ మాటలు అంటూంటే తన బిడ్డను హృదయానికి యింకా దగ్గరికి లాక్కున్నది. 'ఓలెనా' ఆమాటలు ఆమెలో తీసుకువస్తున్న మార్పులను 'కర్ట్' జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు.

"రాత్రి యెవరో నీకు రొట్టె తెచ్చియివ్వటానికి ప్రయత్నించారు కదూ! ఎవరది ?"

"నాకు ఏమీ తెలియదు"

"తెలియదంటే ?"

"నాకేమీ తెలియదు" — అని మళ్ళీ అదేజవాబిచ్చింది 'ఓలెనా'.

"మీ ఇరుగు పొరుగువాళ్ళల్లో యెవరికి పిల్లలున్నారు ?"

"పిల్లలు ?...ఒకరికేమిటి ? అందరికీ పిల్లలున్నారు" — అని జవాబిచ్చింది 'ఓలెనా.' నిజంగానే ఆ చుట్టుపట్ల తనకుతప్ప అందరికీ పిల్ల

లున్నారు. ఇప్పుడు తనకుగూడా ఒక బిడ్డ పుట్టాడు. 'జర్మన్లు' అంటే యేమిటో తెలియక అమాయకంగా తనచేతుల్లో నిద్రపోతున్నాడు, తన బిడ్డడు

"పోనీ, నీకు రొట్టె యెవరు తేవటానికి ప్రయత్నించి ఉంటారో ఊహించి చెప్పగలవా?...షుమారు పది, పదకొండు సంవత్సరాల పిల్లవాడై ఉంటాడు..."

ఆ పిల్లవాడు ఎవరై ఉంటాడా అని ఆలోచింపసాగింది 'ఓలెనా.' ఆ రహస్యం జర్మన్లకు తెలియకోద్దామన్న ఉద్దేశంతో మాత్రంకాదు. తన ఆపదసమయంలో, తనకై అంతటి ఆపదలో పడటానికికూడా సాహసించినవారు యెవరా అని ఆలోచింపసాగింది. మొత్తానికి యిరుగుపొరుగు వాళ్ళందరికి పిల్లలున్నారు - పది, పదకొండు సంవత్సరాల కొడుకులు అనేకమందికి ఉన్నారు.

"నేనేమీ చెప్పలేను. ఆ వయస్సుపిల్లలు అనేకమంది ఉన్నారు. గ్రామస్థులందరికీ పిల్లలు ఉండనే ఉన్నారు."

'కర్ట్' ఒకసారి ఛీత్కారం చేశాడు. నిజంగానే 'ఓలెనా' కు ఆ సంగతి తెలియదనుకున్నాడు.

"పోనీ, 'కర్ల్' - మీ గెరిల్లాదళ నాయకుడు - ఇప్పుడెక్కడ ఉన్నాడో చెప్పు?"

'ఓలెనా' కొయ్యబారిపోయినట్లయింది. 'కర్ట్' మళ్ళీ మొదటికి వచ్చాడు! తన బిడ్డను వక్షంలోకి లాక్కొని అదుముకున్నది. ఈసారి తానేగాక, ఇరవై సంవత్సరాలు నిరీక్షించి, అనేక ప్రయాసలకు ఓర్చి కన్న తన ముద్దుబిడ్డడుకూడా ప్రమాదంలో ఉన్నాడుగదా అనుకున్నది.

"బహుశ యే ప్రాంతాల్లో ఉంటాడనుకుంటావు?"-అని మెల్లగా అడిగాడు. కాని ఆ ధ్వనిలో, 'చెబితేకాని వల్లగాదు' అన్న భావం స్ఫురిస్తున్నది.

"నాకు తెలియదు" - మళ్ళీ 'ఓలెనా' జవాబు యిదే.

"నువ్వు అక్కడ్నుంచి తిరిగి వచ్చేటప్పటికి యెక్కడున్నాడు?"

"నాకు తెలియదు... అడవిలో యెక్కడో ఉన్నాడు".

"ఏ అడవిలో?"

"ఆ అడవిలో."

ఈ సమాధానంలో అర్థమే లేదు. మంచుమయం అయిఉన్న గ్రామానికి చుట్టుపట్ల ఉన్న ప్రదేశాలన్నీ అడవులతోనే నిండిఉన్నాయి. ఈ ప్రాంతాలలోకల్లా దట్టమైన అడవి సమీపంలో లేనిది ఆగ్రామమొక్కటే. అందువల్లనే 'కర్ట్' అతని సైన్యం గెరిల్లాచేతుల్లో పడకుండా యింత కాలం ఉండగలిగాడు. యితర ప్రాంతాలలోని జర్మను సైనికులకు గెరిల్లాలతో దినదినగండాలు గడుస్తున్నాయి. ఈ కారణంవల్ల జర్మను సైన్యాధికారులు గెరిల్లాదళం యెక్కడున్నదీ త్వరగా ఆ చూకీ తీయవలసినదని 'కర్ట్' ని మాటిమాటికి దబాయిస్తున్నారు.

"చుట్టుపట్ల అన్నీ అడవులేగా... నువ్వు యెటువైపునుంచి వచ్చావో చెప్పు..."

"నాకు తెలియదు... గుర్తులేదు. మంచులోపడి వచ్చాను. గుర్తేముంటుంది..."

"పోనీ, ఏరోజున పడివచ్చావో చెప్పు."

"ఊఁ హూఁ గుర్తులేదు."

"అంతటి మతిమరుపా? నాలుగురోజుల క్రితమేగా వచ్చింది?"

నిజంగానే ఆమె తిరిగివచ్చి ఆరురోజులన్నా తిరుగలేదు. చాలా ఆశ్చర్యంవేసింది. ఐతే, జర్మన్లకు తన సంగతంతా స్పష్టంగా తెలిసిపోయిందన్నమాట! ఆరురోజులే ఐనప్పటికి 'ఓలెనా'కి అవి ఆరు సంవత్సరాల్లా గడిచినై.

'కర్ట్' సిగరెట్టు ముట్టించి నెమ్మదిగా పీలుస్తున్నాడు. తర్వాత కళ్ళుపైకెత్తి, గాయాలతో నిండివున్న 'ఓలెనా' ముఖంలోకి చూస్తూ అన్నాడు:

"ఇప్పుడు నీతోపాటు కొడుకుగూడా ఉన్నాడు సుమా..."

కొడుకుసంగతి యెత్తేటప్పటికి ఆమె ముఖం వికసించింది. అవును! తనకు మగపిల్లవాడు కలిగాడు.

"ఆ పసికూన పెరిగి పెద్దవాడై, వృద్ధిపొందాలని నీకు తప్పకుండా ఉండితీరుతుంది..."

అవును. ఆబిడ్డ పెరిగి పెద్దవాడై, వృద్ధిపొందాలని ఆమెకు సహజంగానే ఉంటుంది. చిట్టిచేతులతో యిల్లంతా బంగిరుసుంటే ఆమె కెంత ఆనందం! తప్పటడుగులు వేస్తూ తోటలోని మొక్కలు లాగేస్తాడు. ఊరకలు వేస్తూ, కుక్కలవెంటా, పిల్లులవెంటా పరుగెత్తుతాడు. ఈడొచ్చిన తర్వాత బడికి వెళ్ళి చదువుకుంటాడు... పెద్దవాడౌతాడు. ఆ తర్వాత... ఏమో, ఈ పసికూన అంతపెద్దవాడై పెళ్ళిచేసుకొని బిడ్డల్ని కనేదాకా తాను బ్రతికే అదృష్టం ఉంటుందో లేదో!...

"నీకు చివరిసారి అవకాశమిస్తున్నాను. నిన్నేగాక నీబిడ్డని రక్షించుకోటంకూడా నీచేతిలో ఉన్నది. కాబట్టి తెలివితక్కువగా ప్రవర్తించక నీబిడ్డనీ, నిన్నూ కాపాడుకో—"

'ఓలెనా' యేమీ అనలేదు. అసలు జర్మను ఆఫీసరుయొక్క ఉద్దేశ్యం యేమిటో ఆమెకు అర్థంకావటంలేదు. కాని యేదో భయంకరమైన సంగతి జరగేటట్టున్నదని మాత్రం ఆమె హృదయానికి తెలుస్తూనే ఉన్నది.

"ఇవ్వాళ కాకపోతే యింకొకనాడైనా గెరిల్లాదళం మాచేతికి చిక్కకమానదు. బాగా ఆలోచించుకో. ఎర్రసైన్యం పూర్తిగా నాశనమై పోయింది. అడివిలోనున్న గెరిల్లాదళానికి బయట యేమి జరుగుతున్నదో తెలియటంలేదు. వారిని అన్నివైపులనుంచి చుట్టుముట్టేశామన్న సంగతి వారికింకా తెలియలేదు. త్వరలోనే మాచేతికి చిక్కి శిక్షను అనుభవించి తీరుతారు. కాని నీ విషయం చూస్తే నాకు చాలా జాలిగా ఉన్నది. అందులోనూ ఇప్పుడు బిడ్డ తల్లి వయ్యావు. నువ్వు వంతెన పేల్చివేసిన నేరాన్ని కూడా క్షమిస్తాను. ఇంతకూ వాళ్ళ దుర్బోధనలవల్ల అట్లాచేశావు. కాబట్టి ఇప్పటికైనా బుద్ధితెచ్చుకొని మెలిగితివంటే, నీబిడ్డలతోపాటు నీవుకూడా సుఖంగా బ్రతికి ఉండవచ్చు—"

'కర్ట్' ముఖంకేసి నిశ్చలంగా చూస్తూ వింటున్నది 'ఓలెనా'

"నువ్వేమీ భయపడనవసరములేదు. నేను ఘాతాన్నికాను. సైనికుడిగా నాదేశంపట్ల నా ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాను...కాని నిన్ను, నీ బిడ్డను చూస్తే నాకు చాలాజాలివేస్తున్నది. పోనీ, నీ ప్రాణంమీద నీకు

తీపిలేకపోయినా, ఆ పసిబిడ్డ సంగతైనా ఆలోచించు, కన్నదానివి చేతులారా చంపుకుంటావా?..."

"ఏమిటి ?...చంపెయ్యటమేమిటి?" అని చటాలున అడిగింది 'ఓలెనా'.

'కర్ట్' కోపంతో సిగిరెట్టు అవతల పారేశాడు—

"నే నడుగుతున్న ప్రశ్నలకు జవాబు సరిగా చెప్పకపోతే నీ బిడ్డ ప్రాణాలు తియ్యటానికి నువ్వే కారణ మవుతావన్నమాట. కొంతకాలం వ్యవధికూడా యిస్తున్నాను. బాగా ఆలోచించుకో. వారి ఉనికి చెప్పకపోయినందువల్ల నువ్వు గెరిల్లాలకు చేయబోయేమేలు యేమీలేదు. పైగా చెప్పినందువల్ల నీ బిడ్డను రక్షించుకోగలుగుతావు. బాగా ఆలోచించుకొని చెప్పు"

మళ్ళీ ఒక సిగరెట్టుతీసి ముట్టించాడు. సిగరెట్టుపొగలు ఉంగరాలుగా తిరుగుతుంటే వాటివైపు చూస్తున్నాడు.

"ఏమంటావ్ ?"

'ఓలెనా' జవాబివ్వలేదు.

"నా ప్రశ్నలకు జవాబివ్వవన్న మాటేనా ?

"నా కేమీ తెలియదు."

'కర్ట్' గభాలున లేచి కోపంతో ముఖం ధుమధుమలాడించుకుంటూ 'ఓలెనా' వైపు వంగి అన్నాడు: "ఐతే నీపనిట్లా ఉన్నదన్నమాట! నిన్ను మనిషిని చూచినట్లు మర్యాదగా చూస్తుంటే, నీ కళ్ళు నెత్తికెక్కిపోతున్నాయి. సరె. నీ పనిపడతానుండు—'హాన్స్,' ఇటురా..."

ఆ మాట వింటూనే ఒక సైనికుడు లోనికివచ్చాడు. అతని వెనుకనే మరిద్దరు సాయుధులైన సైనికులు తయారయ్యారు. తానిందాక ప్రసవిస్తున్నప్పుడు మానవత్వంగూడ మరచి, తనవైపు చూస్తూ నవ్వినవారే ఆ యిద్దరు సైనికులని 'ఓలెనా' గుర్తుపట్టింది.

"దాన్ని పట్టుకోండి...ఆ గుంటడ్ని ఇటివ్వండి"

ఏమిజరుగుతున్నదో తెలుసుకొనేలోగానే ఒక సైనికుడు పసివాడ్ని ఆమె చేతుల్లోంచి చటాలున గుంజుకున్నాడు. తన బిడ్డను తిరిగి గుంజుకో

టానికి ఆమె ముందుకి ఉరకబోయింది. కాని వెనుకనుంచి ఇద్దరు బలమైన సైనికులు, ఆమె రెండుచేతులు పట్టుకొని ఆపేశారు. పిచ్చిదానిలాగ బిడ్డకోసం చూస్తున్నది.

"గుంటడిన్ టేబిలుమీద ఉంచు"

ఆ సైనికుడు పసిబిడ్డను టేబులుమీద ఉంచాడు. ఈ అలజడిలో పిల్లవాడు నిద్రనుంచి మేల్కొని యేడవటం ప్రారంభించాడు. ముఖమంతా కందిపోయింది. అది చూడలేక 'ఓలెనా' జర్మను సైనికులనుంచి తన చేతులు విడిపించుకోటానికి ప్రయత్నిస్తున్నది. కాని ఆ యినుప చేతుల క్రింద కదలలేకపోయింది.

"నీతో కాలయాపన చేసుకుంటూ కూచోటానికి వీల్లేదు. చివరి పర్యాయం అడుగుతున్నాను; చెప్పు, నే నడిగినవాటికి సమాధాన మిస్తావా లేదా" అని కటువుగా పలికాడు 'కర్ట్'.

కొడుకు మీదినుంచి దృష్టిమరల్చి విచారంతో అన్నది 'ఓలెనా': "లేదు! ఏమీ చెప్పలేను ?!"

టేబిలుమీద పైన గుడ్డయినా లేకుండా, కాళ్ళుచేతులు తన్నుకొని కేరుకేరుమని యేడుస్తున్నాడు పిల్లవాడు. ఆ యేడుస్తున్న పిల్లవాడిని 'కర్ట్' పిడికిట్లో గొంతుచిక్కించుకొని కుక్కపిల్లను యెత్తినట్టు పైకెత్తాడు, పిల్లవాడు గాలిలో కాళ్ళు చేతులు కొట్టుకుంటున్నాడు.

"ఏమంటావ్ ?" – అని 'కర్ట్' జేబులోంచి పిస్తోలుతీశాడు.

'ఓలెనా' నిశ్చేష్టురాలై నిల్చున్నది. 'కర్ట్' పెనుభూతం లాగ కనబడుతున్నాడు. అతని చేతిలో తన ముద్దుబిడ్డడు గిలగిల కొట్టుకొంటున్నాడు. చేతులు, కాళ్ళు గాలిలో అల్లల్లాడుతున్నాయి. ఏడ్పు కట్టిపోయింది. పిచ్చిదానిలాగ 'ఓలెనా' గుడ్లువప్పజెప్పి చూస్తున్నది.

"చెప్పు ? నువ్వు బోల్షివిక్ లంజవా. లేక ఈ బిడ్డ తల్లివా ? చెప్పు ?"

'ఓలెనా' స్పృహలోకి వచ్చింది.

"చెప్పవే ?"

"... బిడ్డతల్లిని ..." ఈ మాటలు పలుకుతుంటే తనను 'అమ్మా!' అని గెరిల్లాదళ యోధులు పిలుస్తూఉండిన విషయం గుర్తుకొచ్చింది.

"ఐతే వాళ్ళెక్కడుంటున్నారో చెబుతావా ?"

గాలిలో ఊగులాడుతూ ఉన్న కొడుకువైపు జాలిగా చూస్తూ అన్నది—"ఏమీ చెప్పలేను..."

'కర్ట్' తన పిస్తోలు బిడ్డముఖం దగ్గరికి తీసుకొచ్చాడు. ఆపిస్తోలు తన ముఖంలోకే తెస్తున్నట్టుగా ఉన్నది 'ఓలెనా' కు.

"వీడొక్కడే గదూ, నీకున్న బిడ్డ ?" - అని అడిగేడు 'కర్ట్'.

'ఓలెనా' తల పంకించి అన్నది "ఊఁ హుఁ."

'కర్ట్' ఆశ్చర్యపోయాడు. పిస్తోలుతోపాటు అతని చెయ్యి క్రిందికి జారిపోయింది.

"ఏమిటి ? ... ఇంకా నీకు పిల్లలున్నారా ? ఏక్కడ ? ఈ గ్రామంలోనే !"

పగిలి రక్తం కారుతున్న ఆమె పెదవులమీద చిరునవ్వు చిందులాడింది.

"అవును ... అనేకమంది బిడ్డలున్నారు ... వాళ్ళంతా వీరులు ... 'కర్లీ' మొదలైన గెరిల్లాలంతా నా బిడ్డలే..."

ఈ మాటలు 'కర్ట్' సహించలేక పోయాడు. పిస్తోలు పేల్చేశాడు— తిన్నగా పసిబిడ్డముఖంలోంచి దూసుకుపోయింది, గుండు. 'ఓలెనా' ను పట్టుకునిఉన్న సైనికులిద్దరు ఉలిక్కిపడ్డారు.

"చూచుకో, తల్లివి !"

పిల్లవాడికి కాళ్ళు చేతులు తిత్తుల్లాగ వేలబడి ఉండిపోయినై. మునుపు అందమైనముఖం ఉన్నచోట, రక్తం స్రవిస్తున్న పెద్ద రంధ్రం యేర్పడింది.

"చూడు ! నీబిడ్డగతి యేంచేశావో ?" అని 'కర్ట్' ఆ రక్తపు ముద్దను ఊపాడు.

ఆమె తల ఊపింది - కాని యెందుకో ఆమెకే తెలియదు. ఎక్కడో అడివిలో ఉన్నట్టు, జర్మను సైనికకార్యాలయాన్ని చుట్టుముడుతున్నట్లు,

ఇంకా యేమేమో కనబడుతున్నాయి ఆమె కళ్ళముందు. ఎక్కడున్నదో, ఏమి చేస్తున్నదో ఆమెకే తెలియడంలేదు.

చనిపోయిన పిల్లవాడి శరీరంనుంచి రక్తం కిందికి ధారలుగా కారుతున్నది. అది చూస్తుంటే 'కర్ట్'కి అసహ్యంపుట్టింది.

"తీసెయ్యండి, ఈ పీనుగను!"

సైనికులు సందేహిస్తూ నిలబడ్డారు.

"చెప్పేది వినాకుగాదూ? తీసుకెళ్ళండి దీన్ని" అని కోపంతో అరిచేడు. ఒక సైనికుడు ముందుకొచ్చి ఆ శవాన్ని తీసుకున్నాడు.

"ఇదిగో ఇది ఆఖరిసారి అడుగుతున్నాను. చెబుతావా లేదా?"

'ఓలెనా' నోరు మెదపలేదు—అసలు ఆ ప్రశ్న విన్నట్టేలేదు. ఆమె బయటవీస్తున్న పెనుగాలివైపు అర్థంలేని చూపులు చూస్తున్నది.

"చెప్పకపోతివా, నీ ప్రాణాలుగూడా తీస్తాను"

ఈ మాటలుగూడా ఆమె చెవిని బడలేదు. ఇరవై సంవత్సరాలపాటు నిరీక్షించి కన్న బిడ్డకూడా పోయాడు. హృదయం శూన్యంగా ఉన్నదిప్పుడు. ఇక ఆశలు అంటూ ఆమెకులేవు. భయం అంతకన్నా లేదు—

"దీన్ని తీసుకపోయి, దీని పనికూడా పూర్తిచెయ్యండి. గ్రామంలో మాత్రం చంపకండి. ఇప్పటికే గలభాగా ఉన్నది. ఏటిదగ్గరకు తీసుకుపోయి, అందులో పారవేయండి—" అని ఆజ్ఞాపించాడు 'కర్ట్'

తుపాకి మడమలతో యెటుతోస్తే అటువెళ్ళుతూంది, 'ఓలెనా'. ఆమె యిదే గ్రామంలోపుట్టి పెరిగింది. ఇక్కడే వివాహమాడింది. చివరికి ఇదే గ్రామంలో తనబిడ్డను కన్నది కాని ఆ బిడ్డను ఒక్కమాటకోసం, తుపాకికి అర్పించింది. తానే, తన చేతులార తుపాకి గుండుకి అర్పించింది.

"చిట్టితండ్రీ, నేనామాటలు చెప్పలేకపోయాను"—అని చనిపోయిన ఆ పసిబిడ్డ వింటున్నదన్నట్టుగా తనలో తాను గొణుగుకున్నది. బిడ్డశవాన్ని చేతిలో తలక్రిందులుగా వేళ్ళాడవేసి పట్టుకొని నడుస్తున్నాడు జర్మను సైనికుడు. శవాన్ని తనకు అందివ్వమన్నట్టు చెయ్యి జాచింది ఆమె. సైనికుడు మొదట్లో శవాన్ని ఆమెకివ్వటానికి సందేహించాడు. కాని దానిని పట్టుకోటం అసహ్యమనిపిస్తున్నది. ఆమెకు అందించాడు శవాన్ని. ఆతురతతో, హృదయానికి హత్తుకున్నదా శవాన్ని.

ఎక్కడికి పోతున్నదికూడా తెలియకుండానే ఆ యిద్దరు సైనికుల కాపలాలో వెళుతున్నది 'ఓలెనా'. జర్మను ఆఫీసరు ఇచ్చిన ఆజ్ఞ ఆమె వినలేదు. బహుశ యెక్కడికో తీసుకుపోయి చంపుతారనుకుంటున్నది. కాని ఆమెకు యేమాత్రమూ బెంగలేదు. తన బిడ్డమాపుతోనే ఈ ప్రపంచంతో ఆమెకు అన్నిసంబంధాలూ వదిలిపోయినై.

గాలి తీవ్రంగా వీస్తున్నది. మంచు బాగా గాలిలోకిలేచి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. ఎక్కడా ఒక్క ప్రాణికూడా కనబడటంలేదు. ఈ కడపటి ప్రయాణం - మృత్యుముఖంలోకి ఏకాకిగా నడిచిపోవాలి!

తుపాకి మడమదెబ్బ సంజ్ఞతో ఆమె రోడ్డువిడిచి ఒక్క చిన్నబాటను పడ్డది. అసలు యెక్కడికి తీసుకుపోతున్నారో ఆమెకు తెలియటంలేదు. తుపాకి మడమలతో యెటుతోస్తే అటునడుస్తున్నది. గ్రామం మధ్యలో ఉన్న గంట స్తంభం దగ్గరకు తీసుకుపోయి ఉరితీస్తారేమో ననుకున్నది. కాని వాళ్ళు పోయేది ఆ దిశగా కాదు. కొంతదూరం పోయేటప్పటికి యేటి దగ్గరికి తీసుకపోతున్నట్లు తేలింది. ఆమె కాళ్ళు గాయాలతో నిండి పోయినై. రక్తం ప్రవహిస్తున్నది. నడవటం కష్టమైపోతున్నది.

ఏటి పైభాగమంతా చలికి మంచుగా గడ్డకట్టుకుపోయి ఉన్నది. గ్రామస్థులు నీళ్ళతోడుకునే చోటమాత్రం మంచు పగిలి ఒక పెద్దరంధ్రం యేర్పడి, ఆ తెల్లనిమంచు వాతావరణంలో నల్లగా కనిపిస్తున్నది. కాని ఇంతవరకుగూడా తనను యెక్కడికి తీసుకుపోతున్నారో తెలియటంలేదు 'ఓలెనా'కు. మరికొంతదూరం పోతే, యుద్ధం చేస్తూ చనిపోయి, జర్మన్ల నిషేధంవల్ల సమాధికూడా చేయటానికి వీల్లేకపోయిన యోధుల శవాలున్నాయి. తనను అక్కడికి తీసుకుపోయి తుపాకితో కాలుస్తారేమో? సాధారణమైన, తనలాంటి రైతు స్త్రీ, ఎర్రసైనిక యోధులతో సమానంగా చావటం!...

"ఒసేవ్, ఎటుపోతున్నావ్ ?"

ఆ జర్మను భాష ఆమెకు అర్థంకాలేదు. తుపాకి మడమతో పొడిచిన దెబ్బతో, నదిమీద కట్టిన మంచులోని రంధ్రంవైపు పొమ్మంటున్నారని తెలుసుకున్నది.

"దానిని ఇటివ్వు" అని పసిబిడ్డ శవంకోసం ఒక సైనికుడు చేయి జాచాడు. భయంతో ఆ శవాన్ని తన హృదయానికి ఇంకా దగ్గరగా కరుచుకున్నది.

"ఇటివ్వు!" అని ఆమెను గదిస్తూ, ఆమె చేతిని తోసేశాడు. శవం క్రిందబడిపోయింది. మళ్ళీ శవాన్ని తీసుకోటానికి ఆమె వంగింది. కాని అంతలోనే సైనికుడు శవాన్ని తన తుపాకిలోని బిచ్చుకత్తితో పొడిచి గాలిలోకి యెగురవేశాడు. అది వెళ్ళి సరిగ్గా మంచులోని రంధ్రందగ్గర పడ్డది. రెండవసైనికుడు ముందుకి ఉరికి తన బిచ్చుకత్తితో మళ్ళీ ఆశవాన్ని గుచ్చి సరిగ్గా కన్నంలోకి త్రోసివేశాడు. చిన్న శబ్దంతో శవం నీళ్ళల్లో మునిగిపోయింది. లోపలినుండి పైకి నీటి బుడగలు తేలుతున్నాయి.

బిడ్డను తీసుకోటానికి మోకరిల్లిన 'ఓలెనా' అట్లాగే శిలలాగ ఉండి పోయింది. శవం మొదటిసారి పడ్డచోట యెర్రని రక్తపుచుక్కలు మెరుస్తున్నాయి. రంధ్రంలోంచి బుడగలు వస్తున్న ఆ నీటిమీద ఆమె చూపులు నిలిచిపోయినై. ఆ జలం తన బిడ్డను మింగేసింది. తన ముద్దుబిడ్డ అంతరించి పోయాడు. అతని చిహ్నమల్లా, అక్కడ మెరుస్తున్న ఆ రక్తపు చుక్కలే. ఆ జలం మంచుక్రిందనుంచి తన బిడ్డను యెక్కడికో అజ్ఞాతవాసానికే తీసుకుపోతూన్నది. కాని తూర్పుదిశకే యేరు ప్రవహిస్తున్నది. ఐతే సంతోషమే! తనబిడ్డ మళ్ళీ తన ప్రజల్లోకి – స్వతంత్ర రష్యాలోకి చేరుకుంటాడు! అక్కడి ప్రజలు ఆ శవంయొక్క రూపంచూచి, ఆక్రమితదేశాల్లో జర్మన్లు చేస్తున్న రాక్షసకృత్యాలు గ్రహించుకుంటారు. గౌరవంతో తన బిడ్డకు అంత్యక్రియలు జరుపుతారు!..

ఇద్దరు సైనికులూ యేదోవిషయమై వాదనచేసుకుంటున్నారు. ఏటిమీది రంధ్రంనుంచి కొద్దిదూరం నడిచివెళ్ళి యెవో కొలతలు వేసుకుంటున్నారు. అందులో ఒకడు రంధ్రంచుట్టూ తుపాకిమడమతోకొట్టి వెడల్పుగా చేశాడు.

ఇంతలో ఎవరిదో పాదాలచప్పుడు వినవచ్చింది. సైనికులిద్దరు వెనుకకు తిరిగి చూచారు. కెప్టెన్ 'కర్ట్ వెర్నర్' కనబడటంతోనే అటెన్షన్లో నిలబడ్డారు.

'ఓలెనా'కి చుట్టుపట్ల యేమి జరుగుతున్నదోకూడా తెలియటంలేదు. ఆమె చూపులు మంచులోని రంధ్రంలో కదులుతున్న నీటిమీదనే

లగ్నమై ఉన్నది. 'కర్ట్' ఆమెను కాలితో తోశాడు. అతనివైపు తిరిగి శూన్యదృక్కులతో చూడసాగింది.

"ఏయ్; ఇంకొక క్షణంలో నీపని పూర్తవుతుంది. ఇప్పటికైనా గెరిల్లాలసంగతి చెబుతావా లేదా ?" 'కర్ట్' కోపం పట్టలేకుండా ఉన్నాడు.

'ఓలెనా'ను ఇక్కడికి పంపించిన మరుక్షణంలోనే, ఆ యుద్ధరంగం యొక్క కేంద్ర సైనిక కార్యాలయంనుంచి 'కర్ట్'కి టెలిఫోను పిలుపు వచ్చింది. గెరిల్లాదళంలో ఉన్నవారు చాలామంది 'కర్ట్' ఆధీనంలో ఉన్న గ్రామానికి చెందినవారని పై అధికారులకు తెలియవచ్చిందట. అందువల్ల 'ఓలెనా' నుంచి యేవిధంగానైనా గెరిల్లాదళానికి చెందినవివరాలు తెలుసుకొని తమకు పంపవలసినదని పై అధికారులు ఒక తిడిచేస్తున్నారు. కాని 'ఓలెనా'ను యెన్ని చేసినప్పటికీ నోరు మెదపటంలేదు. లేక లేక పుట్టిన ముద్దుబిడ్డను కళ్ళముందు చంపినా ఆమె చలించలేదు ! 'కర్ట్'కి యేమీ చేయటానికి తోచటంలేదు___

"ఒసే, నిన్నే అడిగేది ! గెరిల్లా లెక్కడున్నారో చెప్పు ?"

'ఓలెనా' జవాబివ్వలేదు. అతని ముఖంలోకి అర్థంలేని చూపులు చూస్తున్నది.

"ఏమిటి, దెయ్యంలాగ చూస్తావు ? గెరిల్లా లెక్కడున్నారని అడుగుతుంటే ?"

ఆ ప్రశ్నలు ఆమె వినిపించుకోటంలేదని గ్రహించాడు. ఆమెను చూస్తుంటే కోపం మితిమీరిపోతున్నది. దాని బిడ్డను చాలా త్వరగా చంపేశానే అని విచారపడుతున్నాడు. ఆమె చూస్తుండగా ఆ శిశువుకళ్ళు పొడిచి, ముక్కు చెవులు కోసి, చర్మం వొలచి దానిని యేడ్పించాలనిపిస్తున్నది. ఇంతకూ తాను, ఒక గెరిల్లా స్త్రీని పట్టుకున్నానని తొందరపడి కేంద్రకార్యాలయానికి తెలియజేయటం తనదే బుద్ధితక్కువ అనుకున్నాడు, 'కర్ట్'. ఒక గెరిల్లా స్త్రీనుంచి ఈమాత్రం వివరాలు లాగలేకపోయాడని తన స్నేహితులంతా యెగతాళిచేస్తారు. కాని అది యెంతటి కష్టమైనపనో వాళ్ళు గ్రహించరు...

హఠాత్తుగా ఒక సైనికుడి చేతిలోంచి తుపాకి లాక్కున్నాడు. భయంతో ఒక్కగంతువేసి వెనక్కి తగ్గాడు ఆ సైనికుడు. 'ఓలెనా' అసలు

'కర్ట్' వైపు చూడనే చూడటంలేదు. మంచులోని రంధ్రంలో కదులుతున్న నీళ్ళమీద ఆమె చూపులు లగ్నమై ఉన్నాయి.

'కర్ట్' ఒక అడుగు వెనక్కి వేసి తన శక్తినంతా వినియోగించి అటువైపు తిరిగిఉన్న 'ఓలెనా' వీపులోకి బాయ్‌నెట్ దిగవేశాడు. మంచులోని రంధ్రంముందు ఆమె బోర్లగిలపడిపోయింది. ఆమె వీపులోంచి విచ్చుకత్తి లాగి మళ్ళీ దిగవేశాడు. కొద్దిసేపు గిలగిల తన్నుకొని ఆగిపోయింది ఆమె. రంధ్రానికి సమీపంలో ఒరిగిపోయింది. ఆమెతల కేశాలు నీటిలో తేలియాడుతున్నాయి....

"దాన్ని లోపలికి తోసెయ్యండి." అని 'కర్ట్' ఆజ్ఞాపించాడు.

సైనికులిద్దరూ ముందుకి ఉరికి తుపాకిమడమలతో 'ఓలెనా' శవాన్ని రంధ్రంలోకి నెట్టటం ప్రారంభించారు. తలమాత్రం చప్పున లోపలికి జారిపోయింది. కాని శరీరంలోపలికి పోవటం కష్టమవుతున్నది.

"వెధవలు! ఈమాత్రం చేయలేరూ?" - అని 'కర్ట్' మొరిగాడు.

సై సైనికులు భయంతో తమ శక్తినంతా ఉపయోగించి శవంయొక్క
పా చేతులు వెనుకకు విరిచి రంధ్రంలోకి తోసేరు. అప్పటికీ నడుముమట్టుకే జారి ఆగిపోయింది. కెప్టెన్ చూస్తున్నాడన్న భయంతో అదరబాదరగా పైకి మిగిలిన భాగంమీద తుపాకి మడమలు పెట్టి మోదారు. బుడుంగున పాదాలవరకు మళ్ళీ జారింది. అప్పటికే గాయాలతో అసహ్యమైపోయి ఉన్న పాదాలమీద చివరితడవ పెద్ద పెట్టున బాదారు. మళ్ళీ బుడుంగుమని 'ఓలెనా' శరీరమంతా నీళ్ళలోకి మాయమైపోయింది. నీటిమీద బుడగలు తేలుతున్నాయి.

కోపంతో తిట్టుకుంటూ కర్ట్ వెళ్ళిపోయాడు, సైనికులిద్దరూ అతి వినయంతో అతని వెనకనే బయలుదేరారు.

రంధ్రంలో నీరు గలగల లాడుతున్నది. నున్నటి మంచుమీద జర్మను సైనికుల బూట్లగుర్తు స్పష్టంగా కనుపిస్తున్నది, 'ఓలెనా' కొడుకు శవం పడినచోట రక్తపు మరకలు మెరుస్తున్నాయి. ఆ తెల్లని మంచుమీద ఎర్రని రక్తపు మరకలు కలకాలం ఉండిపోయేటట్టు ఆ రక్తపు మరకలు - లేకలేక పుట్టిన 'ఓలెనా' ముద్దుబిడ్డని రక్తపు మరకలు - అగ్నికణాల్లాగ కనబడుతున్నాయి. జర్మను మృగాలు శాంతియుతమైన తమ దేశంమీద చేసిన దండయాత్రకు చిహ్నమల్లే కనుపిస్తున్నాయి.

★

6

'ఫ్రుస్సీ' స్నానం చేస్తున్నది. 'ఫెడోసియా' నూనంగా బాల్చీలతో వేడినీళ్ళు తెచ్చిపోస్తున్నది. ఎంతో విలాసంగా సబ్బు పులుముకుంటున్నది. ప్రక్కనే 'కర్ట్' కూర్చుని సిగరెట్లమీద సిగరెట్లు పీలుస్తూ కూర్చున్నాడని సిగ్గయినా వేయటంలేదు. పైగా తన అంగవిలాసమంతా జర్మను మగడికి చూపించాలని ప్రయత్నం చేస్తున్నది.

'ఫ్రుస్సీ' ఒళ్ళు తోముకుంటూ అప్పుడప్పుడు 'కర్ట్' వైపు చూస్తున్నది. 'కర్ట్' ఇవ్వాళ యేమీ సరదాగా కనబడటంలేదు.

"కర్ట్"

'కర్ట్' అతని ఆలోచనా ప్రపంచంలోంచి బయటపడ్డాడు.

"ఏమిటి?"

"ఎందుకిట్లా ఊరికినే కూర్చున్నారు. మాట్లాడటమే కష్టమైపోతుందే!"

"అబ్బే, ఏమీలేదు. ఈ పనితో విసుగుపుట్టిపోతోంది—అంతే"

"మీ కోసం యెంత యెదురుచూస్తూ కూర్చున్నాననుకున్నారు! కాని మీ దర్శనం దొరకటం కష్టమైపోతున్నది"

'ఫ్రుస్సీ' నున్నని వక్షంమీదినుంచి నీరు జారుతున్నది.

"నా మనస్సు ఏమీ బాగుండలేదు" అని విసుక్కున్నాడు 'కర్ట్'. కేంద్ర సైనిక కార్యాలయంనుంచి మళ్ళీ యే సమయంలో 'టెలిఫోను' పిలుపు వస్తుందోనని భయపడుతున్నాడు. 'ఓటెనా' నుంచి యే మాత్రం వివరాలు తీసుకోగలిగావని అడుగుతారు. ఏం సమాధానం చెప్పగలడు? ఎంతో సులభమైన విషయంలాగానే పై అధికారులు మాట్లాడుతారు. కాని ఇక్కడి కష్టాలు వారికి తెలిసియేడిస్తేగా! తనమీద నెట్టేసే బదులు తామే

యెందుకు గెరిల్లాలను పట్టుకోకూడదు ? వారికి చేతగాక యితర్లమీద నెట్టెయ్యటమా ! ఇంతకూ, తనకు మరికొద్దిరోజుల్లో రానున్న ప్రమోషన్ ఆగిపోయేటట్టున్నది. అసలు 'ఓ.లెనా' ను పట్టుకున్న సంగతి పై అధికారులకు తెలియజేయటం తనదే బుద్ధితక్కువపని.

" ఏమిటీ సంగతి ? చెప్పకూడదూ ? " అని అడిగింది 'పుస్సీ' అతని వాలకం గమనిస్తూ.

సిగరెట్టుపొగ నెమ్మదిగా వదులుతూ అన్నాడు "ఇటుచూడూ..."

కళ్ళు చికిలించి 'కర్ట్' చెప్పబోయేది శ్రద్ధగా వినటానికి తయారయ్యింది.

" ఒక్కతడవ మీ అక్కతో మాట్లాడిరాగలవూ ? "

'పుస్సీ' గిరుక్కున ప్రక్కకి తిరిగిపోయింది. అదేసమయంలో 'ఫెడోసియా' బాల్చీలతో నీళ్ళు పట్టుకువచ్చింది.

" ఏయ్ ! నువిక్కడెందుకు ? బైటికియేడువు ?— " అని 'కర్ట్' 'ఫెడోసియా' మీద కేకలేశాడు.

'ఫెడోసియా' మారు పలకకుండా బయటికి వెళ్ళిపోయింది. 'కర్ట్' లేచి తలుపు జాగ్రత్తగా బిగించాడు.

" మా అక్కయ్యతో ఒకమారు మాట్లాడటమా ? "

" ఐతే నా ప్రశ్న విసే వినవన్నమాట... " 'కర్ట్' కి కోపం వచ్చింది.

'ఇంతకూ దానిని కలవటం దేనికీ ?— అని 'పుస్సీ' అతనివైపు చూస్తూ గారాబంగా పలికింది.

" నువ్వు ఈ విషయంలో నాకు సహాయం చేయాల్సి ఉంటుంది. మీ అక్కదగ్గరకి వెళ్ళి మాట్లాడావంటే నాకు అవసరమైన అనేక వివరాలు తీసుకు రా గలుగుతావు "

'పుస్సీ' ఒళ్ళురుద్దుకుంటూ అన్నది—

"అటువంటివి యేవీ నాకు చెప్పదది "

" ఆమె చెప్పేటట్టు చెయ్యటం నీలో ఉన్నది. ఇటువంటి ఆటలేవీ యికముందు సాగవని దానికి బోధపర్చు. నేను మంచికి మంచివాణ్ణే— కాని కోపం వచ్చిందంటే ఇకచూడు— "

"ఆటలుం సాగవంటే ?"

"అదే; ఆ గెరిల్లా వెధవలసంగతి !" అని పట్టలేని కోపంతో గట్టిగా అరిచేడు.

'ఫ్రస్సీ' కి మనస్సు కష్టం వేసింది. ఎగాతిదిగించి చూస్తోము కుంటున్నది.

"మాకు సహాయపడినట్టయితే వృద్ధిలోకి రాగలుగుతుందని నచ్చ చెప్పు. ఎర్ర సైనికులు మళ్లీ వస్తారని భ్రమపడేటంతటి తెలివితక్కువదై ఉండదుతే _"

'ఫ్రస్సీ' జవాబేమీ యివ్వటంలేదు. ఆమె ముఖంచూచి యేదో సంశయిస్తున్నట్టు గ్రహించాడు 'కర్ట్'.

"ఎమిటీ, మాట్లాడవ్ ?"

"అది నాతో మాట్లాడదుగా _"

"ఏమి ?"

'ఫ్రస్సీ' కళ్ళు పైకెత్తి 'కర్ట్' ని చూస్తూ అన్నది—

"ఇక్కడ ఎవ్వరూ నాతో మాట్లాడరన్న సంగతి మీకు తెలియదూ? నన్నుచూస్తే కుష్ఠురోగిని చూసినట్టు దూరంగా తొలగిపోతారు... మీకేం, హాయిగా యెన్నయినా కబుర్లు చెప్పవచ్చు..."

"అదుగో, ఆ అర్థంలేని మాటలే నేను వద్దనేది. బాధ్యతవహించి పనిచేయాలి..." కోపంతో కుమిలి పోతున్న 'కర్ట్' ముఖంచూచి 'ఫ్రస్సీ' భయపడ్డది.

"ఐతే, ఏమి అడగమంటారు దానిని..."

'కర్ట్' ఒకసారి తలుపువైపు చూశాడు.

"గెరిల్లా దళానికి ఆమెతో సంబంధం ఉన్నట్టు తెలుస్తున్నది. వాళ్ళెక్కడ ఉంటున్నదీ తెలియజేయమని అడుగు—"

"అది చెప్పదు..."

"ముందే ఆ మాట యెందుకూ ? అడగవలసినదిగా అడిగితే అదే చెబుతుంది.

'ఫ్రస్సీ' స్నానం చాలించి వళ్ళు తుడుచుకున్నది. కుర్చీమీద ఉన్న సిల్కు గౌను తీసుకున్నది. ఆ సిల్కు గౌను తన భార్యకి పంపుదామని 'ఫ్రాన్సు' నుంచి పట్టుకు వచ్చాడు. కాని భార్యకు యివ్వటానికి ఇంత వరకు అవకాశం దొరకలేదు. ఇప్పుడు దానిని 'ఫ్రస్సీ' ఉపయోగిస్తున్నది.

"ఇక పండుకోరాదూ ?"

"పండుకునేటట్టు లేదిప్పుడు. ఏ విధంగానైనా గెరిల్లాలను పట్టుకొని తీరాలి."

'ఫ్రస్సీ' అతను కూర్చున్న కుర్చీ కోనను కూర్చొని అతని మీదికి వాలింది.

"కర్ట్..."

కోపంతో 'కర్ట్' ప్రక్కకి తిరిగి పోయాడు.

"నీతో యెన్ని చెప్పినా లాభంలేదు !"

"అబ్బ ! రాత్రింబగళ్ళు అదే ఆలోచనా ?"_అని గారాబం నటిస్తూ అన్నది. కాని అంతలోకే 'కర్ట్' ముఖం చూచి అతడు కోపంలో ఉన్నట్టు గ్రహించి తనధోరణి మార్చింది.

"ఐతే, దానికీవిషయాలు తెలుసునన్నట్టు మీకెట్లా తెలిసింది ?"

"అదంతా నీకెందుకు ? నాకు ఆ విషయాలన్నీ బాగా తెలుసు. నాకు ఆమె సంగతి తెలిసిపోయినట్టు చూచాయగా తెలియజెయ్యి. అప్పటికీ చెప్పకపోయిందంటే, దానిని అరెస్టు చేయించి, ఆ తర్వాత పనిచూస్తాను."

"ఏమిటీ ? అరెస్టా ?"

"కాకపోతే యేమిటి? నీకు అక్క అయినంతమాత్రాన మాకు వ్యతిరేకంగా పనిచేస్తుంటే చూస్తూ ఊరుకుంటాననుకున్నావా ?"

'ఫ్రస్సీ' భుజాలు యెగురవేస్తూ అన్నది—

"దానినేంచేసేమాత్రం నాది పోయేదేముంది ? ఇంతకూ మీరు వెళ్ళమని పట్టుబడితే, వెళతాను. కాని అది నన్ను గుమ్మంకూడా యెక్క నివ్వకుండా తరిమివేస్తుంది."

"వీలైనంతవరకు ప్రయత్నించిచూడు."

"నాదేం పోయింది; ప్రయత్నించి చూస్తాను—" అని, మర్నాటి వరకు యేదో విధంగా ఆ ప్రశ్న దాటవెయ్యటానికి చూచింది. 'కర్ట్'తో యిప్పుడు కీచులాడి యేమీలాభం ఉండదని తెలుసుకున్నది.

"రండి పడుకుందాము."

'కర్ట్' ముందుకి రాబోతుంటే బాల్చీలు కాళ్ళకు తగిలి తూలి పోయాడు.

"ఏదీ, ఆముండ? 'ఫ్రుస్సీ', నీకు స్నానానికి ఈస్థలం తప్ప మరేదీ దొరకలేదూ?"

ఇంతలో 'ఫెడోసియా' వచ్చి కోపంతో పండ్లు నూరుతూ బాల్చీలు తీసుకుపోయింది. 'ఫ్రుస్సీ' ఆమె ముఖంకేసిచూచి, 'వాస్యా' సంగతి చెప్పేయాలా అన్నట్టు చిరునవ్వు నవ్వింది. అబ్బే, అప్పుడేకాదు. ఈ ముసలిముండను ఇంకా కొంతకాలం యిలానే ఏడిపించాలనుకున్నది.

* * * *

దీపం ఆర్పి 'ఫ్రుస్సీ', 'కర్ట్'లు పడుకున్నారు. మురికినీళ్ళు బయట పారబోసి రావటానికి 'ఫెడోసియా' బాల్చీలు పట్టుకొని బయలుదేరింది. ద్వారందగ్గర కాపలా కాస్తున్న సైనికుడు ఆమెచేతిలోని బాల్చీలు చూచి ఆటంకం పెట్టకుండా బయటికి పోనిచ్చాడు. గాలి విసురుగా వచ్చి ముఖానికి కొడుతున్నది. ఇంటివెనుక పెంటపోగు దగ్గరికి పోయి బోర్లున బాల్చీలోని నీళ్ళు దిమ్మరించింది.

"అమ్మా!" అని యెక్కడినుంచో సన్నని శబ్దం వినవచ్చింది.

'ఫెడోసియా' ఉలిక్కిపడ్డది. చేతిలోని బాల్చీలు క్రిందికి జారిపోయాయి. మంచువల్ల కలుగుతున్న కొద్ది వెలుగులో తాను యింతకుముందు యెన్నోసార్లు చూచిన టోపీ కనబడి విస్తుపోయింది.

"ఎవరక్కడ?" అని నెమ్మదిగా ప్రశ్నించింది. కాని యెదుటి నుంచి జవాబు రాకముందే, అది యెవరైనదీ గ్రహించుకోగలిగింది. కూలబడి ఆ వ్యక్తిని తడమసాగింది. అతని టోపీలో అయిదు కోణాలుగల నక్షత్రపుగుర్తు చేతికితగిలింది. 'ఫెడోసియా'కి దుఃఖం ముంచుకువస్తున్నది.

"ఏమిటి? అట్లాగున్నారేం? అని ఆ యెర్ర సైనికుడు ఆదుర్దాతో ప్రశ్నించాడు.

"నువ్వేనా...నువ్వేనా, తండ్రీ!..." అని ఆమె స్వరం తడబడుతుండగా అన్నది. ఇదంతా ఒక స్వప్నంలాగా తోస్తున్నది. సంతోషము, దుఃఖము ఒకేసారి, ఒక్కుమ్మడిగా వస్తున్నాయి.

"నువ్వేనా?...నా తండ్రీ, నువ్వేనా..."

ఎర్ర సైనికుడు ఆమెను భుజాలు పట్టుకొని ఊపాడు. ఆ కొద్దికాంతిలోనే ఆమెకండ్లవెంట నీరు జల జల రాలుతుండటం కనుపించింది.

"ఏమిటిది?"

"అబ్బే, ఏమీలేదు...ఏమీలేదు..." అని తన దుఃఖాన్ని ఆపుకోటానికి ప్రయత్నిస్తున్నది 'ఫెడోసియా'. హఠాత్తుగా ఆమెకు ఇంటిముందు కాపలా కాస్తున్న జర్మను సైనికుడి విషయం గుర్తుకొచ్చింది. ఎర్ర సైనికుని చెయ్యి పుచ్చుకొని—"మా యింట్లో జర్మనున్నారు! ... వాళ్ళు గ్రామాన్నంతటినీ ఆక్రమించుకొన్నారు ..." అన్నది.

"అవును; నాకుగూడా తెలుసును. నీతో కొంత మాట్లాటాలి. నువ్వు ఈ గ్రామస్థురాలివేగదూ?"

"అవును—ఇక్కడే పుట్టిపెరిగాను—"

"ఇక్కడి సంగతులెట్లాగున్నవో మాకు తెలియాలి"

"నాయనా, విను. మాయింటిముందు కాపలా సైనికుడు ఎప్పుడూ ఉంటుంటాడు. ఇక్కడ నేను యెక్కువసేపు ఉన్నట్టు గమనించాడంటే కొంపమునుగుతుంది. ఇప్పుడే యింటికి పరుగెత్తి, మళ్ళీ కొద్ది సేపట్లో ఆ జర్మనువాడి కంటబడకుండా వస్తాను. ఈ లోగా నువ్వు ఆ గొడ్లశాల వెనుకకుపోయి అక్కడి గడ్డిచాటున దాక్కొని ఉండు ... నిముషములో వచ్చి కుడతాను."

ఎర్ర సైనికుడు ఆమె వైపు అనుమానంతో చూడసాగాడు. ఆమె దానిలోని భావం అప్పుడే గుర్తించేసింది.

"ఏమిటి నాయనా, అట్లా అనుమానిస్తున్నావు? ఇక్కడి సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో పనిచేసేదాన్నే నేను నా కొడుకుగూడా యెర్ర సైని

కూడే. అదుగో యేటిఒడ్డున అతని శవం ఇంకా పడివున్నది. జర్మను కుక్కలు చివరికి సమాధిఅయినా చెయ్యనివ్వకుండా అట్లాఉంచారు—"

ఆమె కంఠంలో ప్రతిధ్వనిస్తున్న దుఃఖం అతనిలో నమ్మకం కలిగించింది. ఆ విధంగా అనుమానపడ్డందుకు కొద్దిగా సిగ్గుపడ్డాడు.

" అమ్మా, క్షమించు. మేము ఇంత జాగ్రత్తగా ఉంటేగాని వీలు పడదు."

" సరే, నువ్వక్కడికి వెళ్ళు. ఇప్పుడేవస్తాను "

వణుకుతున్న చేతులతో గొళ్ళెలు పుచ్చుకొని ఇంటిముఖం పట్టింది. ద్వారందగ్గర కాపలా కాస్తున్న సైనికుడ్ని చూస్తే నవ్వు వచ్చింది. కాని బలవంతంగా ఆ నవ్వుని ఆపుకున్నది. పాపం! ఇంకా కాపలా కాస్తూనే ఉన్నాడు. ఈ దేశంలో యింకా యెంతకాలం తిష్ఠవేసుకు కూర్చుందామనో! ... దగ్గరికి వచ్చిందిలే మీ గతి. మా ఎర్ర సైనికులు రాబోతున్నారులే ...

' ఫెడోసియా ' లోపలికి వెళ్ళి, చప్పుడు చేయకుండా తలుపు బిగించుకున్నది. పడుకోడానికి సిద్ధమవుతున్నట్లు లోపలి సామాన్లు అటూ, యిటూ కొద్దిసేపు కదిపింది. ప్రక్క గదిలో జర్మను ఆఫీసరు పెట్టే గురకలను బట్టి అతను గాఢమైన నిద్రలో ఉన్నాడని తెలుసుకున్నది.

జాగ్రత్తగా ఇంటివెనుక భాగానికి చేరుకున్నది. అక్కడినుంచి పైకి యెగబ్రాకి, ఇంటికప్పులో ఒకచోట గడ్డి లాగివేసి ఇంటిపైకి చేరుకున్నది. అక్కడ్నుంచి నెమ్మదిగా జారుకుంటూ క్రిందికి దిగింది. అంత ముసలిదైన తాను ఈ విధంగా చేస్తుంటే తన చర్య తనకే నవ్వును తెప్పిస్తున్నది. వెనుకనుంచి బయటికి దారి లేదన్న నమ్మకంతో కాపలా సైనికుడు ఇంటిముందే తలుపుదగ్గర జాగ్రత్తగా కాపలా కాస్తున్నాడు. ఇట్లాయైతే వెనుకనుంచి యెన్నయినా పనులు చేసుకోవచ్చుననుకొని ' ఫెడోసియా ' ధైర్యం తెచ్చుకున్నది.

నెమ్మదిగా ప్రాకుకుంటూ గొడ్లశాల దగ్గరికి చేరుకున్నది. కాని అక్కడా యెవరూ కనబడకపోవటంచూచి వెలవెలబోయింది. గొడ్లశాలలో యెవ్వరూ కనుపించటం లేదే ? ఇదంతా భ్రమఅయి ఉంటుందా ? అబ్బే, యెప్పటికీ కానేరదు—

" అబ్బాయ్, ఎక్కడా ? " అని సన్న స్వరంతో పిలిచింది.

గొడ్లశాలలోని గడ్డి గదిలింది. అదుగో అక్కడున్నాడు ! ఒక్కడే కాదు. ముగ్గురున్నారు !! ఆమెకు పట్టలేని సంతోషం కలిగింది. ఆ ముగ్గురితోపాటు తానుకూడా కూర్చున్నది.

" మీకోసం రాత్రింబవళ్ళు యెంతగా కాసుకు కూర్చుంటున్నాము ! చివరికి వచ్చారు ... వచ్చేశారు " అన్నది ఆనందంతో.

" సరేనమ్మా; ఇంకా మాట్లాడవలసినవి అనేకం ఉన్నాయి. "

" తప్పకుండా అడగండి, చెబుతాను. కాని మీకు ఆకలి వెయ్యటం లేదూ ? " అని హఠాత్తుగా తన అతిథి ధర్మాన్ని గుర్తుకి తెచ్చుకున్నది.

ఎర్రసైనికులు ముగ్గురు నవ్వుకున్నారు.

" నీ ప్రేమకు ధన్యవాదాలుగాని, ఇప్పుడు మేము తింటూ కూర్చోటానికి రాలేదు. "

" అయితే, మీ ప్రశ్నలడగండి. "

" నీది ఈ గ్రామమేగదూ ? "

" అవును; ఇక్కడే పుట్టి పెరిగాను. "

" ఇక్కడి సంగతులన్నీ మాకొక తడవ తెలియజేయాలి ... జర్మన్లు యెక్కడెక్కడ ఉంటున్నారు ? వాళ్ళ మందుగుండు సామాను మొదలైనవి యెక్కడ దాచి ఉంచుతున్నారో తెలియజెయ్యగలవూ ? "

" మనవాళ్ళు వచ్చేటట్టైనా ? " అని సంతోషం పట్టలేక అడిగింది.

" అవును – కాని వివరాలన్నీ ముందు బాగా తెలియాలి. "

" అయితే, వినండి. గ్రామంలో మూడు వందల గడపవరకు ఉంటుంది. నాలుగువైపులకు పోయే రోడ్లు ఈ గ్రామంలోనే ' చర్చి ' దగ్గర కలుస్తాయి. "

" కొద్దిగా, ఆగమ్మా. "

ఒక మ్యాపువిప్పి, ఎర్రసైనికులు ముగ్గురూ దానిమీదికి వంగి వెల్తురు బయటికి కనబడకుండా శ్లేను కోట్లు కప్పి, ఒక టార్చిలైటు వెలిగించారు.

" అవును; రోడ్లు కలుస్తున్నచోటు యిదే ! ఊరిమధ్య ' చర్చి ' అంటే యిక్కడేనన్నమాట ... "

" చర్చిదగ్గరే వాళ్ళ ఫిరంగులు ఉంచుతున్నారు."

" ఎన్నుంటాయి ?"

" ఉండండి చెబుతాను. ఒకటి... రెండు... మూడు... నాలుగు. అవును, నాలుగు. చర్చికి సమీపంలో ఒక పెద్ద యిల్లు ఉన్నది. మునుపది గ్రామ సోవియట్ కార్యాలయంగా ఉంటుండేది. ఇప్పుడు ఐదుగురు జామీను ఖైదీలను అందులో బంధించారు ..."

"జర్మన్లు ఇంకా యెక్కడెక్కడున్నారు ?"

" చర్చికి సమీపంలో అన్ని యిండ్లలోను ఉన్నారని చెప్పాలి. ఊరిచివరి యిళ్ళల్లో అంతగా లేరు. కాని పూర్తిగా లేరనటానికికూడా వీల్లేదు. మాయింటి సమీపంలో అక్కడక్కడా ఉన్నారు. ఇటువైపు కూడా ఫిరంగులు ఉన్నాయిగాని, అవి చాలా చిన్నవి ..."

" మెషిన్‌గన్నులు యేమైనా ఉన్నాయా ?"

" లేకేం ? అటుభాగం - ఎడమవైపు - వాటిని అమర్చారు. ఇండ్ల గోడలకు రంధ్రాలుచేసి వాటి వెనుక మెషిన్‌గన్నులు అమర్చిఉంచారు"

ఎర్రసైనికుల్లో ఒకడు 'మ్యాపు' మీదికి వంగి యేవేవో గుర్తులు పెట్టుకున్నాడు.

" ఆ యిండ్లల్లోంచి ముందున్నవాళ్ళనందర్నీ తోలేశారు. ఇప్పుడు ఒక్క జర్మన్లుమాత్రమే ఉంటున్నారు. ఉండండి. చెబుతాను ... అయి దిళ్ళల్లో యీ విధంగా అమర్చుకొని ఉన్నారు. ఇటునుంచి ఊరిమధ్యకు పోయే మార్గంలో ఒకచోటకూడా ఈ విధంగా ఉన్నారు——"

" చాలామంది ఉంటారా ?"

" చెప్పటం కష్టం ... అక్కడికి వస్తూ, పోతూ ఉంటారు. కెప్టెన్ మాత్రం యెప్పుడూ అక్కడే ఉంటాడు. సుమారు రెండువందల వరకు ఉంటారని వినికిడి."

" గస్తీ సైనికులు చాలమంది ఉన్నారా ?"

" అబ్బే, వాళ్ళ విషయం అంత కష్టంలేదు. మా యింటిముందున్న కాపలా సైనికుడిలాగే ఒక్కడూ గుమ్మంవదిలి దూరంపోడు. అందులోను రాత్రుళ్ళంటే అసలే హడలు. పైగా రాత్రిపడింతర్వాత గ్రామస్థులు

యెవ్వరూ వీధుల్లో తిరుగరాదన్న ఆజ్ఞ ఉండనేఉన్నది. అయినా, వాళ్ళకు భయమే. రాత్రిళ్ళు యెవరైనా కనబడినట్టయితే, "వచ్చేదెవరు" అని అడగనైనా అడగకుండా కాల్చి చంపేస్తారు ... అంత భయం!"

"రోడ్డుకి మధ్య వంతెనలేమైనా ఉన్నాయా?"

"వంతెనలా? ఉహూఁ, సాఫైనరోడ్డే"

"మధ్య యెక్కడైనా చెట్లు దట్టంగా ఉన్నాయా?"

"అబ్బే, యెక్కడివీ? ఉన్న చెట్లుకాస్తా చలిమంటలకోసం జర్మన్లు పడగొట్టనే పడగొట్టేశారు. అక్కడక్కడ పొదలుమాత్రం ఉంటాయి" అని చెబుతూ, యెందుకో జడిసి చుట్టూ, చూడసాగింది.

"ఏమిటీ సంగతి?"

"ఉండండి; కాపలా సైనికుడు ఇటు యింటివెనుకకుగాని వచ్చేడేమో చూస్తాను" అని ఆమె నెమ్మదిగా బయటికి వెళ్ళి జాగ్రత్తగా విన్నది. గాలి జోరుగావీస్తున్నది. కొద్దిగా గాలి తగ్గినప్పుడుమాత్రం కాపలా సైనికుడి బూట్లచప్పుడు ఇంటిముందునుంచి వినిపిస్తున్నది. 'ఫెడోసియా' తిరిగి గొడ్లశాలలోకి చేరుకున్నది.

"ఫరవాలేదు; ఇంకా అటే ఉన్నాడులెండి"

ఎర్రసైనికులు తమ మ్యాపును మడుచుకున్నారు.

"ఇక మేము వెళ్ళాలమ్మా! నీ సహాయానికి చాలా కృతజ్ఞులం"

"ఎందుకూ?...నా కొడుకుమాత్రం ఎర్రసైనికుడుకాదా? మొన్న మొన్ననే యిక్కడ చచ్చిపోయాడు...ఇంతకూ యెప్పుడు వచ్చేటట్టు?"

"ఇంకా మాడాలి ... పరిస్థితులనుబట్టి, ఆ పైన 'కమాండరు' నిశ్చయాన్నిబట్టీ ఉంటుంది."

"పరిస్థితులేమిటి? మీకోసం చూచీ చూచీ మాకండ్లు కాయలుకాసి పోతున్నాయి. మీరు వచ్చే స్థిరంటే ..."

"అంత సులభమైన పనికాదమ్మా."

ఆమెకు హఠాత్తుగా ఒకవిషయం జ్ఞాపకానికి వచ్చింది.

"ఇంకో సంగతి చెప్పటమే మరిచిపోయాను..."

"ఏమిటి?"

"వాళ్ళ 'కమాండరు' తన ఉంపుడుకత్తెతోపాటు నాయింట్లోనే ఉంటున్నాడు. కాపలా సైనికుణ్ణి యిట్టే చంపేసి లోపలికి రావచ్చు. అంతగా కాకపోతే, ఇప్పుడు నేను వచ్చినట్టు ఇంటికప్పులోంచి వెళ్ళి వాడి పని పూర్తిచేయవచ్చు.

ఆ ముగ్గురు ఎర్రసైనికుల్లో చిన్నవాడికి పట్టలేని ఉద్రేకం కలిగింది. కళ్ళు మెరిసినై.

"ఇంకేం, పదండి!"

"ఆగండి! ముందువిషయం యేమైన ఆలోచిస్తున్నారా లేదా..."

"ఇంకా ఆలోచించేదేముంది. ఆ నీచుణ్ణి, అంతమొందించక -"

"మహా తెలివి ఉపయోగించావులే! వాణ్ణి చంపాక? ... మర్నాడు అంతా గందరగోళం - ఇంకా యెక్కువమంది జర్మనులు యీ గ్రామానికి చేరుకోవటం జరుగుతుంది. అంతటితో మనం వేసుకున్న యెత్తు లన్నీ నాశనం ..."

"అదీ నిజమే. ఐతే..."

"ఇప్పుడు వాళ్ళు యెంత జాగ్రత్తలో ఉన్నారో గ్రహించుకోటం లేదూ? ఈ సమయంలోగాని వాళ్ళని గాభరాపెట్టామంటే, అన్నీ మనకు యెదురుతిరుగుతాయి"

"కాని ఆ నీచుణ్ణి చంపితీరాలి!"

"ఇంకొకప్పుడు చంపక మానతామా? ఇప్పటిమట్టుకు జాగ్రత్తగా యింటికి తిరిగిపోవటం మంచిది."

"మీయిల్లెక్కడ?" అని 'ఫెడోసియా' అడిగింది.

"ఏదో మాటవరసకి యిల్లని అంటామమ్మా. అసలు మా యిళ్ళు చాలా దూరదేశాల్లో ఉన్నాయి. ఈ యుద్ధ సమయంలో ఇల్లు అంటే మా సైనిక కార్యాలయమేనని మా అర్థం ... మాకు వెళ్ళిపోవటానికి దారి చూపించు. ఇందాక వచ్చేటప్పుడు మంచులో కూరుకుపోయి నానా అవస్థలు పడ్డాము."

"తప్పక చూపిస్తాను. అదుగో ఆ యేటిఒడ్డునే వెళ్ళాలి. మధ్య యెర్రసైనికుల శవాలు పడిఉంటాయి, జాగ్రత్తగా వెళ్ళండి. ఇంకా ముందుకి పోయారంటే 'ఒఖబి', 'జెలిన్‌టిసి' అని రెండు

గ్రామాలు తగులుతాయి. కాని అక్కడకూడా యిదేవిధంగా జర్మన్లు చేరారు."

"అదంతా మాకు తెలుసులే. ఈ మధ్యలో యెవ్వరూ తటస్థపడకుండా ఉంచాలి."

"ఏమీ భయపడనక్కరలేదు. మా యింటిముందు ఉన్నవాడే గస్తీ సైనికుల్లో ఆఖరివాడు. ఆ తర్వాత యెవ్వరూ ఉండరు. కాని నడవటం మట్టుకు బహు జాగ్రత్తగా నడవాలి"

ఆమెతోపాటు ఆ ముగ్గురు జాగ్రత్తగా బయలుదేరారు.

"అదిగో, అటు దిగిపోవాలి. జాగ్రత్తగా నడవండి. అటు అంతా జారుడుగా ఉంటుంది."

"సరే వెళ్తామమ్మా. నీ సహాయానికి చాలా కృతజ్ఞులం."

"తొందరగా రావాలిసుమా!" —అని తన ఆదుర్దాని కనబర్చింది 'ఫెడోసియా.'

"ఇక యింటికి వెళ్ళమ్మా. చలి యెక్కువవుతున్నది. వీలైనంత త్వరలో వచ్చి వాలుతాము"

"అంతేకాదు; వచ్చితీరాలి"

ఆ ముగ్గురు ఎర్ర సైనికులు వెళ్ళటం చూస్తూ అక్కడే నిలబడిపోయింది 'ఫెడోసియా'. తెల్లనిదుస్తులు ధరించిఉన్న ఆయెర్రసైనికులను మంచుమధ్య గుర్తించడమే కష్టంగా ఉన్నది. కొంత సేపటికి మంచుమధ్య మాయమైపోయారు. వాళ్ళతో గడిపిన ఆ కొద్దినిముషాలు జైలులోంచి బయటపడ్డదానిలాగ ఆనందపడ్డది 'ఫెడోసియా'. వారు వెళ్ళిపోవడంతోటే జైలుగోడలు మళ్ళీ తనచుట్టూ యేర్పడినట్టుగా ఉన్నది.

'ఫెడోసియా' మళ్ళీ యెప్పటివిధంగా యింటికివచ్చి చేరుకున్నది. 'కర్ట్' పెద్దగా గురకలు పెడుతూ నిద్రపోతున్నాడు. 'ఫ్రస్సీ' నిద్రలో యేదో కలవరిస్తున్నది.

'మీకిక మూడిందిలే. మా యెర్ర సైనికులు వస్తున్నారులే' అని తనలోతాను అనుకుని ఆనందపడ్డది.

ఎంత ప్రయత్నించినా 'ఫెడోసియా'కి నిద్రపట్టలేదు. ఎర్ర సైనికులు వచ్చి తమ గ్రామాన్ని జర్మన్లనుండి విడిపించేవరకు ఆమెకు నిద్ర

పట్టేటట్టు లేదు. ఏమో ? ఇప్పుడు వచ్చినట్టు తనకోసం యే సమయంలో వచ్చేస్తారో ? అప్పుడు తను మెలుకువతో ఉండకపోతే యెంత ప్రమాదం వాళ్ళకు తగిన సహాయం చెయ్యకపోతే యెట్లా ?—

'ఫెడోసియా'కి ఇప్పుడు మునుపటికంటే ఆరాటం యెక్కువయింది. ఇంతకుముందు అందరితోపాటు తానుగూడా ఎర్ర సైనికులువచ్చి తమను జర్మన్ల బారినుండి విడిపిస్తారని నమ్మకంగానే ఉన్నది. అంతేగాని, వాళ్ళు యెప్పుడు వచ్చేది తెలియదు. అందరితోపాటు తానుకూడా నిరీక్షిస్తూ ఉండేది. కాని ఇప్పటి సంగతి వేరు. ఎర్ర సైనికులు రావటం నిర్ధారణగా తెలిసిపోయింది. అందులోను రెండుమూడు రోజుల్లోనే రావచ్చునేమో ? ఆమె మనస్సు ఆనందంతో నిండిపోయింది. ఆ వార్త గ్రామస్థులందరికి ఎలుగెత్తి చాటి, తనతోపాటు వాళ్ళందరుకూడా ఆనందపడుతుంటే చూడాలనిపిస్తున్నది. కాని అలా చేస్తే యింకేమన్నా ఉన్నదా ! అన్నీ తలక్రిందులైపోవూ ? ఆ భయంతోనే యెంతో ప్రయత్నంమీద నోరు నొక్కుకు కూర్చుంటున్నది.

...కాని మూడు రోజుల్లోపల ఎర్ర సైనికులు రాగలరా ? అలా వస్తేగాని లాభంలేదు. ధాన్యం యివ్వకపోతే, జామీనుగా బంధించిన అయిదుగురినీ మూడోరోజున చంపేస్తామని ప్రకటించారు జర్మన్లు. అప్పటికల్లా వచ్చెయ్యాలి. లేకపోతే ఆ అయిదుగురు అన్యాయంగా ప్రాణాలు వదలవలసి వస్తుంది...

ఐయినా ఈ మూడురోజుల్లో మాత్రం ఎన్ని జరుగకూడదు? గ్రామస్థులు ఎన్నో బాధలు పడుతూ వారి కొరకు నిరీక్షిస్తున్నారు. వచ్చేస్తే యీ మూడురోజుల్లోపలే వచ్చెయ్యవచ్చు. ఏక్షణాన్న వచ్చి వాలుతారో యెవరు చెప్పగలరు ? కన్ను మూతవెయ్యకుండా యెదురుచూస్తుండాలి ! వాళ్ళు వచ్చేవరకూ వెయ్యికళ్ళు - వెయ్యి చెవులు చేసుకొని పనిచేస్తుండాలి !...

*　　*　　*　　*

ఆనాడు గ్రామాధికారి 'గాప్లిక్' చాలా రాత్రివరకు సైనిక కార్యాలయంలో పనిచేస్తూ కూర్చున్నాడు. సమిష్టి వ్యవసాయక్షేత్రం వారి చిట్టాలను ఆధారంగా చేసుకొని గ్రామస్థులతో యెవరెవరు యెంతెంత ధాన్యం ఇవ్వవలసి వుంటుందో వివరాలు తయారుచేస్తున్నాడు. జర్మను సార్జంటు

అతనికి సహాయం చేస్తున్నాడు. 'గాప్లిక్' కూడికల్లో తప్పులు చేస్తుంటే జర్మను సార్జెంటు తిడుతున్నాడు. దీపం గుప్పు గుప్పు మంటూ పొగ పట్టి పోతున్నది.

తన మనస్సును, తయారుచేస్తున్న ఆ లెక్కలమీద లగ్నంచేయాలను కుంటున్నాడు 'గాప్లిక్'. కాని లాభంలేకుండా ఉన్నది. ఇన్ని లెక్కలూ తయారుచేసి చివరికి వ్యర్థమైపోతుందేమో ననిపిస్తుంది. అతనికి, ఇలాంటి వెన్ని తయారుచేయటమన్నా సులభమే. కాని వీటితో ఈ జర్మను కెప్టెన్ తృప్తిపడడుగా, వాడికి కావలసింది ధాన్యం. గ్రామస్థుల్లో ఒక్కరయినా ధాన్యం యిస్తారని అతనికి నమ్మకం కలగటంలేదు. తాను ఇన్ని చేసిన పిమ్మటగూడా, ధాన్యం దొరక్కపోయిందంటే, దీని కంతటికీగూడా తననే బాధ్యుణ్ణి చేస్తాడు ఆ జర్మను కెప్టెన్. వాడు తలుచుకుంటే యేమైనా చేయగలడు.

ఐదుగురిని అరెస్టుచేసి బెదిరించినప్పటికీ ప్రజలు లొంగివచ్చే సూచన లేమీ కనబడటంలేదు. ఇంతమట్టుకి ఆ పిల్లవాడి శవం యెవడు యెత్తుకు పోయినదిగాని, ధాన్యం యెక్కడ దాచిపెట్టిన విషయంగాని తెలియజేయ టానికి ఎవ్వరూ రాలేదు. ఈ విధంగా ప్రజలు దేనికీ లెక్కచేయకుండా ఉంటే, తానుమాత్రం యేం చేయగడు? అందుకే 'కర్ట్' తనని పట్టుకొని, అన్నిటికీ తననే బాధ్యుణ్ణి చేస్తున్నాడు.

"ఏమిటీ వెధవ వ్రాత? అంతా పాడుచేసి వదిలావు. సరిగ్గా పని మీద మనస్సు ఉందా లేదా?" అని జర్మను సార్జెంటు అరిచేడు.

'గాప్లిక్' దీనికి జవాబుగా విధేయతను సూచిస్తూ ఒక చిన్న నవ్వునవ్వాడు. తన మనస్సు పనిమీద యెందుకు లగ్నం కాలేకపోతున్నదో యేంచెప్పగలడు? కాగితం మీదికి వంగి గబగబ వ్రాసుకొనసాగాడు.

చివరికి లెక్కలన్నీ ముగించారు. ఇంటికి పోవటానికి 'గాప్లిక్' తయారయ్యాడు. బయట గాలి జోరుగా వీస్తున్నది. బయలుదేరటానికి 'గాప్లిక్' సంశయిస్తున్నాడు.

"బయట నన్నెవరన్నా చూస్తారేమో?"—అన్నాడు చివరికి. అతని యింటిముందుగ గస్తీసైనికుడు ఉన్నమాట నిజమే. కాని ఇంటి వరకు వెళ్ళేలోపుగా గ్రామమధ్యస్థం లోంచి కొంతదూరం నడవాలి.

"ఇంటికి పోటానికే భయమా? అయినా 'కెప్టెన్' ఆజ్ఞలేనిదే నీకు సహాయంగా సైనికుల్ని పంపటానికి వీలుండదు" అని భుజాలు ఎగురవేస్తూ జవాబు చెప్పాడు సార్జెంటు.

"పోనీ, అక్కడివరకు మీరయినా—" అని జంకుతూ అన్నాడు 'గాప్లిక్'.

"ఏమిటీ, నన్నే రమ్మంటావూ? కేంద్రకార్యాలయంవారు యే నిముషాన్నయినా టెలిఫోనులో పిలువవచ్చు. నాపని వదులుకొని నీతో వచ్చేదా?—అసలు నీకు భయమెందుకోయ్?... ఈ రాత్రిపూట యెవ్వరూ బయటికి రారులేవోయ్..." అని మండిపడ్డాడు, సార్జెంటు.

మారుమాట చెప్పటానికి ధైర్యం చాలక 'గాప్లిక్' నెమ్మదిగా బయటికి జారుకున్నాడు.

వెలుగులోంచి రావటంచేత అంతా మరీ చీకటిగా ఉన్నది. కండ్లు ఆ చీకటికి అలవాటుపడేవరకు కొద్దిసేపు గడపదగ్గర నిలబడ్డాడు. మసక మసకగా దారికనబడటం ప్రారంభించాక ఇంటివైపు బయలుదేరాడు. చివరికి జర్మన్లు తనను కుక్కకన్నా నీచంగా చూస్తున్నారే అని విచారపడ సాగాడు. ప్రతి జర్మను వెధవా తనమీద కేకలువేసేవాడే! తాను గాడ్దు లాగ పనిచేస్తున్నప్పటికి సాధారణ సైనికుడు మొదలు అందరికీ లోకువే!... భయంతో చీకట్లో చుట్టూ చూచుకున్నాడు.

రాత్రుళ్ళు యెవ్వరూ బయటికి రాగూడదంటూ యెన్ని శాసనాలు ఉంటేమాత్రమేం? ఈ అజ్ఞానపు ఊళ్ళో యెటువంటి ఘోరాలన్నా జరుగుతాయి. చివరికి సార్జెంటుకికూడా భయమే. అది చెప్పలేక పైగా యేదో ఒక సాకుచెప్పి తనతో రాకుండా తప్పించుకున్నాడు.

చప్పుడుకాకుండా జాగ్రత్తగా వెళ్ళటానికి ప్రయత్నిస్తున్నాడు. కాని కాళ్ళక్రింద మంచు నలుగుతున్న చప్పుడు అవుతూనే ఉన్నది. 'గాప్లిక్' ఆ చప్పుడు గ్రామమంతా ప్రతిధ్వనిస్తున్నట్టనిపిస్తున్నది. హఠాత్తుగా యెవరో సందుమలుపులో నిల్చున్నట్టనిపించింది. నిలువునా నీరైపోయి నిల్చుండిపోయాడు. ఆ నీడ కదులుతున్నదేమోనని జాగ్రత్తగా చూడ సాగాడు. ఏమీ చెయ్యటానికి తోచటంలేదు.

తిరిగి సైనిక కార్యాలయానికే వెళ్ళిపోయి రేపు ప్రొద్దుట ఇంటికి వెళదామనుకున్నాడు. కాని వెనక్కి తిరిగితే ఆ నిల్చున్నవారు మీదికి ఉరికితే!...

చివరికి మొండి ధైర్యంతో ముందుకే అడుగువేశాడు. ఆరె!_ ఆనీడ కనుపించేది చెట్టుపొదయేనా? పగలు అనేకసార్లు ఆ దారిని పోతూ ఆ పొదను చూస్తుండేవాడ్ని ఈనాడు జ్ఞాపకం లేకపోయిందే అనుకున్నాడు.

ఇంతలో 'గాప్లిక్' కాలుజారింది. ఏదో భయంకరమైన ముప్పు వచ్చిపడ్డదని ఆ క్షణంలో గుర్తించాడు. ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. నోరు, కళ్ళు బంధింపబడ్డాయి. గట్టిగా కేకలు పెట్టటానికి ప్రయత్నించాడు కాని లాభంలేకపోయింది. నెత్తిమీద ఒక దెబ్బ పడ్డది. తనను అమాంతంగా యెవరో యెత్తుకు పోతున్నట్టు గుర్తించాడు. తలుపు తెరిచిన శబ్దం!...క్రింద దభాలున కూలవేశారు. అంతలోనే కాళ్ళు చేతులు బంధించివేయటం జరిగింది!

'గాప్లిక్' ముఖంమీద కప్పబడ్డగుడ్డ తొలిగిపోయింది. బిత్తరపోతూ అంతా చూడసాగాడు. మిణుగుమిణుకుమంటున్న దీపపుకాంతిలో కొందరు వ్యక్తులు కనబడ్డారు. అందులో గుర్రాలకాపరి అయిన 'అలెగ్జాండర్'ని, 'ఫ్రాన్స్యా గ్రోశాచ్'ని గుర్తుపట్టాడు. నిలువునా వణికిపోవటం మొదలుపెట్టాడు.

'గాప్లిక్'కి తెలియని ఒక స్త్రీ నిశ్శబ్దాన్ని భేధిస్తూ అన్నది:

"అలెగ్జాండర్! నీకు వ్రాయటం వచ్చుగాబట్టి, ఇక్కడ జరుగబోయేవన్నీ వివరంగా వ్రాతలో తీసుకోవలసివస్తుంది."

అందరూ టేబిలుముందు కూర్చున్నారు. భయంతో 'గాప్లిక్' వడవడ వణికిపోతున్నాడు. దీపపుశిఖ కొట్టుకుంటుంటే, వారి ముఖాలమీద నీడలు నాట్యమాడుతున్నాయి.

"ఏయ్, నిలబడు. నువ్విప్పుడు న్యాయాధిపతుల ముందున్నావని తెలుసుకో" _ అని అన్నది అందులో ఒక స్త్రీ.

భయంతో ఛస్తూ ప్రయత్నంమీద లేచి నిల్చున్నాడు.

"సరిగ్గా నిలబడరా, నీచుడా! ... ఎందుకంతభయం? మగాడివి, ఆమాత్రం ధైర్యంలేదూ?"

"అబ్బే, అది వాడి శక్తికి మించిన విషయం" అన్నది 'ఫ్రాన్స్యా'.

"వాడు నిలబడితీరాలి. ఇది న్యాయస్థానంగాని, మరేమీ గాదు. ఆ మాటకువస్తే, ఇందాక అక్కడే చంపపారేస్తే పీడావదిలిపోయేదిగా? అన్నీ న్యాయంగా విచారించదలుచుకున్నప్పుడు, అన్నీ సక్రమంగా జరగాల్సిందే!" — అని 'ఔర్బ్లిషా' పట్టుపట్టింది.

'గ్లాపిక్' మరీ వణికిపోతున్నాడు. జర్మను సైనిక కార్యాలయానికి సమీపంలో ఉన్న ఒక పూరింట్లోనే తనకీగతి పట్టిందే!... అక్కడ చేరిన ఆ నలుగురు స్త్రీలు, ఆ కొంటె గుర్రాలకాపరి న్యాయాధిపతులట!... తనను విచారిస్తారట! జర్మన్లచేత గ్రామాధికారిగా నియమింపబడ్డ తాను, ఈ ఆడముండలముందు నోరు మెదపలేక వణుకుతూ నిలబడవలసి వచ్చింది!...కలగాదు-వాస్తవం!!...

"సరే, నీ పేరేమిటో చెప్పు?" అని 'టుర్బ్లిషా' ప్రశ్నించింది.

జవాబు చెప్పాలనుకున్నాడు 'గ్లాపిక్', కాని గొంతులోనిమాట పెగలటంలేదు. అస్పష్టంగా యేదో గొణిగాడు

"ఏం? ఆటలాడుతున్నావా? ఆ ఆటలన్నీ కట్టిపెట్టి సరిగ్గా జవాబుచెప్పు...అలెగ్జాండర్! నువ్వు అన్నీ వివరంగా వ్రాస్తున్నావా, లేదా?...సరే, చెప్పవోయ్ నీపేరు?"

"మీకు బాగా తెలిసిందేగా..." అని గొణిగాడు 'గ్లాపిక్'.

"అది నిన్నటిదాకా లేవోయ్. ఇది న్యాయస్థానమన్న తర్వాత, అడిగే ప్రశ్నలకన్నిటికీ సరిగ్గా జవాబుచెప్పాలి."

"గ్లాపిక్, పీటర్."

"పీటరేనా?...మా నాన్న పేరుగూడా పీటరే. ఆ పవిత్రనామాన్ని మలినం చేశావుగదా!..."

"ఉండు, 'గార్బినా' అత్తయ్యా! సరిగ్గా వ్రాయనివ్వు..."

"వ్రాయి...త్వరగా వ్రాయి. తర్వాత యేమిటి? ఆ...నీ వయస్సెంత?"

"నలభై యెనిమిది–"

"నలభై యెనిమిదా? ఇంతకాలం నీభారాన్ని భూదేవి యెట్లా మోస్తూవచ్చిందో తెలియదు!... అలెగ్జాండర్, వ్రాశావాలేదా?..."

"అప్పుడే వ్రాశాను. తర్వాత కానివ్వు."

"తర్వాతేమిటి?...ఆఁ...నిన్ను గ్రామాధికారిని చేశారుగదూ!"

"అవును"

"గొప్ప గ్రామాధికారివేలే? ... అంతకుముందు యేం చేస్తుండే వాడివి?"

'గాప్లిక్' దీనికి జవాబు చెప్పలేదు. చూపులు నేలకి వాల్చాడు.

"ఏమీ? చెప్పటానికి సిగ్గువేస్తున్నదా? మునుపు ఇంతకంటేకూడా నీచపుపని చేస్తుండేవాడివన్నమాట."

అప్పటికిగూడా జవాబుచెప్పలేదు. తనబూట్లకేసిచూసుకుంటున్నాడు.

"చెవులు మూలవేసేవరకు మాట్లాడేట్టులేవే? చెబుతావా లేదా?"

"ఉండ త్తయ్యా! నేనడుగుతాను" అని 'అలెగ్జాండర్' మధ్య కల్పించుకొని వచ్చాడు.

"సరే నువ్వే అడాగపడు" అని ఆమె తన కిష్టంలేకపోయినా 'అలెగ్జాండర్' మీద వదిలేసింది.

అతనిని జాగ్రత్తగా పరిశీలిస్తూ నెమ్మదిగా అడిగాడు 'అలెగ్జాండర్'

"జైల్లో ఉన్నావా?"

'గాప్లిక్' చూపులు యింకా భూమిమీదనే వున్నాయి.

"చాలాకాలం ఉన్నావా?"

"ఆఁ. చాలాకాలం."

"ఎంతకాలం?"

మళ్ళీ మౌనమే—

"జైల్లో ఎందుకు పడ్డావు?"

దీనికిగూడా జవాబు రాలేదు.

"నువ్వు రైతువా, కార్మికుడవా లేక యేదైనా ఉద్యోగం చేస్తుండే వాడివా—చెప్పు?"

"రైతుని"

"ఓహో, కులకోవా?"

"ఐతే నువ్వు కులక్ వన్న మాట! ఇంతకు ముందు రైతుల రక్తం పీల్చుకు తాగిందికాక, మళ్ళీ పీల్చుకు తాగవచ్చు ననుకున్నావేం ?"—అని 'టెర్ష్చిలిశా' ఉద్రేకంతో అన్నది.

"కొద్దిగా ఆగవమ్మా ..."

"ఎందుకాగాలి ? ఇది న్యాయస్థానం అయినప్పుడు నీకెంత హక్కున్నదో, నాకూ అంత హక్కు ఉంటుంది"

"అట్లే, నీకు హక్కు లేదని కాదమ్మా. నేను వేస్తున్న ప్రశ్నలు ముందు కానివ్వు."

"సరే అడుగువాడ్ని ..."

"జైలునుంచి యెప్పుడు పారిపోయావు ?"

"యుద్ధం ప్రారంభమైనాక"

"ఇంటికి పోదామనేనా ?"

"అవును"

"ఎక్కడా నీ 'ఇల్లు' ?"

"రోస్టావ్ దగ్గర—"

"ఓహో రోస్తావ్ దగ్గరా?—ఐతే జర్మన్లనెక్కడ కలుసుకున్నావు?"

"అక్కడే, రోస్టావ్ దగ్గర—"

"అక్కడే నిన్ను వాళ్ళు తమలో ఒకడిగా చేర్చుకున్నారన్నమాట"

"అవును"

"ఆగు కొద్దిగా ?... 'అలెగ్జాండర్', వీడు జైల్లో యెందుకు పడిందీ తెలుసుకోవాల్సి ఉంటుంది"

"ఏమోయ్ ? ఎందుకు జైల్లో పడ్డావు ?"

ఈ ప్రశ్నకు గాప్లిక్ జవాబివ్వలేదు.

"కులక్ లహక్కులు తొలగించినకాలంలో నేనా నువ్వుజైల్లోపడింది?"

"అవును"

"అయితే, 'పెట్లియురా'తో నీకు సంబంధం ఉన్నదా ?"

"ఊఁ"

"'పెట్లియురా'తో కూడా సంబంధం ఉన్నదట?" అని 'క్రిస్టలిషా' ఆశ్చర్యపోయింది.

"ఇప్పుడంతా తెలిసిందిలే. 'కులక్' వర్గానికి చెందిన 'పెట్లియూరా' బందిపోటుగాడి అనుచరుడివన్నమాట! మొదటినుంచీ నువ్వు సోవియటు రాజ్యానికి వ్యతిరేకివన్నమాట—"

"ఊఁ" అని అంగీకరించేడు 'గ్రాప్లిక్'.

"చివరికి ఈ జర్మన్లతో చేరావూ..."

'క్రిస్టలిషా' కోపం పట్టలేక ఒక్క గంతువేసి లేచింది.

"వీడిమూలంగానే 'లివాన్స్యుక్' ఉరితీయబడ్డాడు. వీడి మూలంగానే ఆ అయిదుగురు అరెస్టు చేయబడ్డారు. వీడే స్వయంగా అందరి ఇండ్లలోంచి జర్మన్లకోసం పశువులను తోలుకుపోయాడు. నా పిల్లలగతి యేమైతే మాత్రం వీడికేం? ఉన్న ఒక్క ఆవునూ వాడి అబ్బసొమ్ములాగ తోలుకుపోయాడు!"

"జర్మన్లు గ్రామాన్నంతా దోచుకోటానికి సహాయపడ్డవాడు వీడే!"

"సరే, మీ ఉద్రేకాలు అణుచుకోండి. ఇంకా యేమేమి చెప్పదలచుకున్నారో నెమ్మదిగా చెప్పండి" అని అందరికంటె ఎక్కువగా గల్లా చేసిన 'క్రిస్టలిషా'యే చివరికి అన్నది.

"ఇంకా చెప్పేందుకేమున్నది? ... అందరికీ తెలిసిన విషయమే నాయెను. వీడమూలంగా రోజురోజుకి యెంతమంది నాశనమై పోతున్నదీ అందరూ చూస్తున్నదేగా..."

"అయితే, యేమి నిశ్చయించారు?"—అని 'క్రిస్టలిషా" అందర్నీ అడిగింది.

"ఈ విషపాతకుడ్ని చంపెయ్యాలి!"

"వీడి ప్రాణాలు తీసెయ్యాలి!"

"సరే, కామ్రేడ్స్, ఈ విషపాతకుడ్ని చంపివేయాలని ఉపపాదన వచ్చింది. దీనికి యెంతమంది అనుకూలురో చేతులెత్తండి"

అందరిచేతులూ పైకి లేచినాయి.

"ప్రతికూలురు?"

"ఎవ్వరూ లేరు"

"ఐతే నిశ్చయమైపోయినట్లేనన్నమాట. సరే. అలెగ్జాండర్! అంతా పూర్తిగా వ్రాసి చదువు..."

'అలెగ్జాండర్' చాలాసేపటివరకు కాగితంమీద వ్రాస్తూ కూర్చున్నాడు. స్త్రీలందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. చివరకి వ్రాత పూర్తిచేసి నిలబడి చదవటం ప్రారంభించాడు 'అలెగ్జాండర్.'

"అలెగ్జాండర్ ఓదిస్సి, గాబ్రినా కొచ్చలిక్షా, ఫ్రోస్యా గ్రెక్షాక్ ..."

"ఫ్రోస్యా కాదు, యుఫ్రోసినా..."

ఈ పొరపాటు కాగితంమీద సరిదిద్దినాడు 'అలెగ్జాండర్'.

"...యుఫ్రోసినా గ్రెక్షాక్, నటాల్యా లిమెక్ మరియు 'పెలాగియా పుజియర్'లతో కూడుకొన్న ఈ న్యాయస్థానంవారు పీటర్ గ్లాస్క్ అను నేరస్తుని విచారించి, నేరస్తుడని నమ్మకం కలిగినమీదట మరణదండన విధింపవలసినదిగా నిశ్చయించినారు"

ఈ మాటలు వింటుంటే గ్లాపిక్ ముఖం వెలవెలబోయింది. చలనం లేకుండా నిలబడి, అందరివైపూ పిచ్చిచూపులు చూస్తున్నాడు.

"అంతా సక్రమంగా ఉన్నట్టేనా?" అని అడిగింది 'కొచ్చలిక్షా'.

"ఒక్క నిముషం ఆగండి. మరణదండన అయితే విధించాము. కాని అది కార్యరూపంలోకి తేవటం యెలా?"—అన్నది ఫ్రోస్యా.

అందరూ ఒకరిముఖాలు ఒకరు చూచుకున్నారు.

"అవును. యెట్లా?"

"ఉరిపోసి చంపడమే"—అని 'పుజియర్' సలహాయిచ్చింది.

"ఉరితీయడం ఎక్కడ? ఈ యింట్లోనేనా?"

"అంతెందుకు నెత్తిమీద ఒక్క పెట్టుపెడితే వాడే చస్తాడు."

"తుపాకి ఉంటే, కాల్చి చంపేద్దును."

"ఏమిటే, తుపాకితో కాల్చటమా! జర్మన్లు ఆ శబ్దంవిని మనని పట్టుకు పోవటానికేనా?"

'గ్లాపిక్' నిలువునా వణికిపోతున్నాడు. తన ముందే, తన ప్రాణాలు యేవిధంగా తీస్తే బాగుంటుందోయని తర్కించుకుంటున్నారు! నిస్సత్తువతో నేలకి ఒరిగిపోయాడు.

"మీకు పుణ్యంవుంటుంది. నా ప్రాణాలమీద దయచూపండి. మీకు ద్రోహంచేశాను. కాని యింకెప్పుడూ అట్లా చెయ్యనని ప్రమాణం చేస్తాను" అని తల నేలకువేసి కొట్టుకుంటూ యేడ్వటం మొదలెట్టాడు.

"ఊరుకోవోయ్, విశ్వాసఘాతకుడా!"

గాప్లిక్ ఇంకా యేడుస్తున్నాడు.

"మీ పాదాలకు దణ్ణంపెడతాను. ఈసారికి క్షమించండి. వాళ్ళు చెప్పింది చేశాను వాళ్ళ బలవంతంవల్ల నేను చెయ్యక తప్పిందికాదు..."

"పాపం! నీ కేమీ తెలియదేం? వాళ్ళబలవంతంవల్ల చేశావ్రా?... జర్మన్లతో కలిసినప్పుడు ఈ బుద్ధెక్కడికి పోయిందిరా?..."

"నన్ను కరుణించండి. నన్ను రక్షించండి!" అని నేలమీదపడి వలవల యేడుస్తున్నాడు.

అసహ్యించుకుంటూ అందరూ అతనివైపు చూడసాగారు.

"మగాడివై పుట్టినవాడివి మగాడిలాగ చావలేవ్రా?"

"ఇక వీడితో కూర్చుంటే లాభంలేదు, వీడి యేడ్పు విన్నారంటే జర్మన్లు చక్కాగావచ్చి మనని పట్టుకపోతారు. తొందరపడాలి"

అలెగ్జాండర్, గాప్లిక్ వెనక్కివెళ్ళి మెడకు ఒక వుచ్చు తగిలించాడు.

"న్యాయంకోసం!" అని ఒక గావుకేకవేసి చేతులు తుడుచుకొని తనపని పూర్తిచేశాడు.

'గాప్లిక్' గిలగిల తన్నుకున్నాడు. కొద్దిసేపట్లో ప్రాణంపోయింది.

"ఫ్రోస్యా! కొద్దిగా సాయంచెయ్యి—"

ఇద్దరూ కలిసి శవాన్ని క్రిందికి దించారు.

'ఔర్సులిషా' బయటికివెళ్ళి జాగ్రత్తగా పరిశీలించింది. గాలిరొద తప్పితే మరేమీ వినబడటంలేదు.

"త్వరగాపోయి, అక్కడి నూతిలో పారెయ్యాలి."

బయట కొద్దిదూరంలోనే ఒక పాడుబడ్డ నుయ్యి ఉంది. ఇప్పుడది సగంవరకు మంచుతోటి నిండిపోయి వున్నది. 'గాప్లిక్' శవాన్ని అందులో తోసేశారు. పైకి కనబడకుండా మంచులో కూరుకుపోయింది.

ఈ మంచుకాలం పోయిందాకా యిందులోనే పడివుంటుంది. ఆటు తర్వాత అవసరమైతే యింకెక్కడికైనా తీసుకెళ్ళి పారెయ్యవచ్చు. మొత్తానికి పత్తా దొరకదులెండి"

"ఇప్పుడు ఇంటికి చేరుకునేదెట్లా?"

"ఇండ్లకు పోవడమెందుకూ? ఎటుపోయి, యేంవొచ్చినా కష్టం. ఇప్పుడే యింట్లో కావేసినంతస్థలం ఉన్నదిగా... పొద్దుటివరకు యిక్కడే పడుకుందాము. పొద్దు పొడవగానే యెవరంతట వాళ్ళు లేచి వెళ్ళిపోవచ్చు. యెవ్వరికీ అనుమానం కూడా కలగదు."—అని 'అగ్జాండర్' సలహా యిచ్చాడు.

అందరూ స్థలాలు చూచుకొని పడుకున్నారు. కాని యెవ్వరికీ నిద్ర పట్టటంలేదు.

"అలెగ్జాండర్, ఇప్పటి కాగితాలన్నీ జాగ్రత్తగా దాయాలిసుమా, మనవాళ్ళు వచ్చాక చూపించవలసి ఉంటుంది"

"నీకాభయమేమీవద్దు. జాగ్రత్తగా దాస్తానులే"

"అలెగ్జాండర్! అంతా అనుకూలంగానే జరిగిపోయిందిసుమా!" అని కెర్పిలిశా మళ్ళీ అన్నది.

"మనం తలుచుకున్నాక సక్రమంగా జరుగకపోతుందా?" అని ధీమాతో జవాబు చెప్పాడు 'అలెగ్జాండర్'.

★

7

జోరుగా వీస్తున్న గాలికి తలుపు దభాలున కొట్టుకొన్నది. ‘ఫెడోసియా’ ఉలిక్కిపడి, చేతిలో నీళ్ళతో ఉన్న బాల్చీలు వదిలేసింది. ఇంటి నిండా నీళ్ళయిపోయినాయి.

“దరిద్రపుముండ!”—అని కెప్టెన్ ‘కర్ట్’ కోపంతో కేకలేసి గభాలున వెళ్ళి అక్కడే నేలమీదఉన్న తనబూట్లను తెచ్చుకున్నాడు.

‘ఫెడోసియా’ మారు పలకలేదు. ఆమె హృదయం వేగంగా కొట్టుకోసాగింది. ఒక పాతగుడ్డ తీసుకుని క్రిందపడ్డ నీళ్ళను తుడుస్తున్నది. కాని ఆమెచేతులు యింకా వణుకుతూనే ఉన్నాయి. ‘ఫెడోసియా’ ఈ మధ్య యేమాత్రం చప్పుడు విన్నా ఉలిక్కిపడుతున్నది. అవును!—ఎర్ర సైనికులు యే క్షణాన వచ్చేస్తారో!!—జాగ్రత్తగా ఉండొద్దూ?...

ఈ రహస్యాన్ని తనలో దాచుకోవటం మహా కష్టంగా ఉన్నది ‘ఫెడోసియా’కి. అబ్బ! తనమీద యెంతబాధ్యత ఉన్నదీ!!—ఏ క్షణాన వచ్చేస్తారో? బహు జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండాలి. ఏ మాత్రం బద్ధకించినా యేమి ప్రమాదం జరిగిపోతుందో!...

“బహు చాకచక్యంతో పనిచేసుకురావాలి సుమా” అని ఇంకా ప్రక్కమీదనే పడుకొనిఉన్న ‘ఫ్రుస్సీ’ని హెచ్చరించుతూ, తలుపు దభాలున వేసుకొని వెళ్ళిపోయాడు ‘కర్ట్’. తలుపుశబ్దం విని ‘ఫెడోసియా’ మళ్ళీ ఉలిక్కిపడ్డది.

తలక్రింద రెండు చేతులూ పెట్టుకొని, వెల్లకితల పడుకుని పెదవి కొరుక్కుంటూ ఆలోచిస్తున్నది ‘ఫ్రుస్సీ’. వెళ్ళిపోతూ ‘కర్ట్’ పలికిన మాటలు ఆమెకు కష్టమన్పించాయి. ఇంతమంది సైనికుల్ని, సౌకర్యాలని తన ఆధీనంలో ఉంచుకున్న ‘కర్ట్’ ఆ గెరిల్లాలను పట్టుకోలేకపోయాడు. పైగా తనను—

గ్రామస్థులెవ్వరూ మాట్లాడని తనను — ఆ పని చెయ్యటానికి పొమ్మంటు న్నాడు. సిగ్గయినా లేదే! ఈ వెధవయిచ్చిన ఈ సిల్కు గౌను, వీటికోస మేనా, ఈ అధికారం చలాయించటం ?...

తన అక్క దగ్గిరికి వెళ్ళి మాట్లాడినందువల్ల యేమీ లాభం ఉండదని 'ఫ్రుస్సీ'కి నిర్ధారణగా తెలుసు. యుద్ధానికిముందే తన అక్క 'ఓల్గా'తనతో మాట్లాడటం మానేసింది. అనేక పర్యాయాలు తానుఉన్న గ్రామం వచ్చి కూడా తనను చూడకుండా వెళ్ళిపోయింది. వచ్చి, చూచివెళ్ళటానికిగూడా 'ఫ్రుస్సీ' అర్హురాలు కాదని 'ఓల్గా'నమ్మకం. అందరూ తనలాగే యెప్పుడూ పనిచేస్తూ ఉండాలంటుంది 'ఓల్గా'. కాని 'ఫ్రుస్సీ'కి పని చేయటమంటే అసలు గిట్టదు. అందంగా తయారయి, షికార్లు తిరగటమంటే మహా యిష్టం. తనలాగ తిరగనివారెవరైనా సరే 'ఓల్గా' చూచి ఓర్వలేదు. అసహ్యపడు తుంది. అసహ్యపడితేమాత్రం, దానిలాగ యెప్పుడూ పనిచేస్తూ, బండవాని లాగ యెవరుంటారు—

ముందున్న నిలువుటద్దంలో తన రూపం చూచుకున్నది, 'ఫ్రుస్సీ'. తనకు తానే తన అందం చూచుకొని సంతోషపడ్డది. ఇటువంటి శరీరాన్ని, మోటుపనులుచేస్తూ పాడుచేసుకొమ్మంటుంది 'ఓల్గా'. అంతకంటే బుద్ధితక్కువ పని యేమైనా ఉంటుందా ? ... తనకు బిడ్డలు లేకపోతే మాత్రమేమి ? బిడ్డల్ని కని ఇటువంటి అందమైన శరీరాన్ని పాడుచేసుకోటందేనికి ?... ఈ మాత్రందానికే ఓల్గా తనను చూచి అసహ్యించుకుంటుంది—

ఇంతకూ తాను చేసిన తప్పు యేముంది ? తన భర్త 'సిర్యోషా' ఎర్ర సైన్యంలో ఉండి తెచ్చే జీతం తనకు యేమూలకీ చాలదు. అసలు 'సిర్యోషా'కి తన భార్యను ఎంత ముద్దుగా, బొమ్మలాగ తయారుచేసుకో వాలో తెలియదు. తాను యితర పల్లెటూరి పల్లెలాగకాక, యెంతయినా అందంగా తయారు కాగలదు. అయినా 'సిర్యోషా' దగ్గర్నుంచి ఆరునెలల బట్టి ఉత్తరమైనా లేదు. అసలు బ్రతికున్నాడో లేడో తెలియనప్పుడు తాను ఇంకేం చేయగలదు ? ఎక్కడైనా చచ్చిపోయాడో, లేక ఖైదీగ చిక్కాడో తెలియదు. అటువంటప్పుడు అతనికోసం యెంతకాలం తెలిక తక్కువగా యెదురు చూస్తూ కూర్చోవాలి ? అలా తెలివి తక్కువగ కూర్చొని తిండిలేకుండా చావాలా ? బాగానేవుంది ! 'కర్ట్' మాత్ర

మంచివాడు కాదనా ? ఈ మధ్యతప్ప, ఇంతవరకు తనని యెంత ప్రేమతో చూచుకునేవాడని ! అతను జర్మనువాడైనంతమాత్రంలో నష్ట మేముంది ? ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్నవారు వాళ్ళేగా. బోల్షివిక్కులు మళ్ళీ రాజ్యానికివచ్చేమాట నట్టిది. అలాంటప్పుడు తన బాగుకోసం యిలా చేయటంలో తప్పు ఏముంది? 'క్లారా' ఇంతకంటే ఏమి చేయమంటుంది ? తెలివితక్కువగా ప్రవర్తించి తిండికీ, గుడ్డకీ లేకుండా అందరిలాగ యేడవ మంటుంది గాబోలు ...

'ఫ్రుస్సే' ప్రక్కమీదనుంచి లేచి వస్త్రాలు వేసుకోటం ప్రారంభించిం చింది. మనస్సు ఏమీ బాగుండలేదు. 'క్లారా' తన మాట వినదని యెంత చెప్పినా 'కర్ట్' వినకుండా వున్నాడు—

ప్రక్కమీది దుప్పటితీసి అవతల పడేసి, 'కర్ట్' కోటు చిలుక కొయ్యకి తగిలించడానికి తీసింది, 'ఫ్రుస్సే'. కోటుజేబులోంచి యేదో ఉత్తరం ఒకటి క్రింద పడ్డది. అటూ, ఇటూ జాగ్రత్తగా చూచి చటాలున ఆ ఉత్తరాన్ని అందుకున్నది.

ఉత్తరం తెరచి చూచింది. కాగితాలు విప్పగానే అందులోంచి యెండిపోయిన ఒక గులాబీపువ్వు క్రిందికి రాలింది. కోపంతో 'ఫ్రుస్సే' పెదవి కొరుక్కున్నది. ఆ ఉత్తరం జర్మనుభాషలోనే ఉన్నప్పటికీ, అది స్త్రీ దస్తూరి అని మాత్రం స్పష్టంగా తెలిసిపోయింది. పోనీ 'కర్ట్' తల్లి దగ్గర్నుంచి వచ్చిందనుకోటానికి వీల్లేదు. తల్లి వ్రాసినట్టయితే ఆ పువ్వు యెందుకుంటుంది ? తప్పకుండా యెవరో అతని ప్రియురాలు జర్మనీ నుంచి వ్రాసి ఉండాలి!...

'ఫ్రుస్సే'కి యిప్పుడు అనుమానం కలిగింది. 'కర్ట్' దగ్గర ఒక చిన్న పెట్టె ఉన్నది. దానిని యెప్పుడూ తాకనిచ్చేవాడుకాదు. అందులో యేమున్నదో ? 'ఫ్రుస్సే'ని తనదేశం తీసుకువెళ్ళి పెండ్లి చేసుకుంటానని వాగ్దానం చేశాడు 'కర్ట్'. ఆమాటలన్నీ నమ్మింది. కాని అతని జీవిత విశేషాలు మాత్రం యేమీ తెలియవు.

ఇంతవరకు 'కర్ట్' చెప్పేవన్నీ నిజమేననుకుంటూ వచ్చింది. 'కర్ట్' అతని స్వగ్రామం సంగతులు యెత్తితే యెందువల్ల ఆ సంభాషణ మార్చే స్తుంటాడో యిప్పుడు అర్థమవుతున్నట్టుగా ఉన్నది. ఈవిధంగా ఆలోచించు

కుంటూ కూర్చుంటే లాభంలేదనుకున్నది. పైగా ఆ ఉత్తరాన్ని 'కర్ట్' తన చేతిలో చూశాడంటే మండిపడతాడు. ఇందుకే గాబోలు అతని కాగితాలేవీ ముట్టవద్దని కేకలేస్తుండేవాడు!

ఉత్తరం తిరిగి 'కర్ట్' జేబులో పెట్టేసింది. ఆ ఉత్తరం యెవరు వ్రాశారో జాగ్రత్తగా కనిపెట్టి తెలుసుకోవాలని నిశ్చయించుకున్నది.

వంటయింట్లో 'ఫెడోసియా' యేదో సామాను సర్దుతున్న శబ్దం వివచ్చింది.

"గోలలేకుండా పనిచెయ్యలేవూ?" అని 'ఫ్రుస్సీ' కేకలేసింది.

'ఫెడోసియా' ఆమె వైపు తీవ్రంగా ఒక చూపు చూసింది. ఆ చూపు 'ఫ్రుస్సీ' గుండెల్లో జేబారు పుట్టించింది. ఇంతకు మునుపులాగ కాక, ఆ చూపులో ద్వేషంతోపాటు, విజయంకూడా గోచరిస్తున్నది. బహుశా, 'కర్ట్' తనపై చూపిస్తున్న అధికారాన్ని గ్రహించి ఈ ముందు తనను అవమానిస్తుందేమో?... ఐతే దీని సంగతంతా 'కర్ట్'కి చెప్పేసి, దీని మదం అణచివేయాలనుకున్నది.

"ఆగు, నా భర్త రాగానే, నీ సంగతంతా చెప్పేసి, నీ పొగరు అణచివేస్తాను!" అని 'ఫెడోసియా'ను భయపెట్టడానికి చూసింది.

'ఫెడోసియా' నడుంమీద చేతులేసుకుని నిలబడి 'ఫ్రుస్సీ'ని నఖశిఖ పర్యంతం ఒక్కసారి చూచి పకపక నవ్వసాగింది.

"వెళ్ళు; నీ మొగుడితో చెప్పుకో! ఒక్కసారి గాదు, వందసార్లు చెప్పుకో! ఊఁ, పరుగెత్తి వెళ్ళి చెప్పుకో!!..." అని హేళన చేసింది.

ఆ ధోరణి చూచి 'ఫ్రుస్సీ' నిర్ఘాంతపోయింది.

"ఏమిటీ నీ ఉద్దేశం?"

"ఏమీలేదు. చెబుతానని బెదిరిస్తున్నావుగా? చెప్పు—నీ జర్మను మగడికి కావలసిన రహస్యాలన్నీ తీసుకెళ్ళి చెప్పు."

"చెప్పక ఊరుకుంటానా?... చెప్పితీరుతాను!"

"నేనూ చెప్పమనే అంటున్నాను. చెప్పు... ఈ తాటాకుల చప్పుళ్ళకు కుందేళ్ళు బెదురుతాయనుకున్నావా?"

"ఐతే రోజూ అక్కడికెందుకు పోతావు?"

“అది నా యిష్టం! నిన్నెవడు అడగుతున్నాడు? నీజర్మన్లు ఆకాశాన్ని కూడా యెత్తుకుపోతే, ఆ చూడటంకూడా మానుకుంటాను. అంతేనా?”

“ఇది తెలిస్తే ‘కర్ట్’ నిన్ను అరెస్టు చేయిస్తాడని తెలుసునా! ఆ శవాలదగ్గరికి యెవరూ వెళ్ళకూడదని ఆజ్ఞ వున్నదని నీకు తెలుసునా!”

“అబ్బో, యేమి భయంవేసిపోతుంది, నాకు! నీ మాటలకు నాకు వణుకు పుట్టేస్తుంది” అని వెటకారంగా పలుకుతూ ‘ఫెడోసియా’ ‘ఫ్రుస్సీ’ని సమీపించింది. ఆమె కళ్ళు నిప్పుకణాల్లాగ మెరుస్తున్నాయి.

“ఇకమీదట నువ్వే భయంతో వణకవలసిన సమయం వచ్చింది. నువ్వే వలవల యేడ్వవలసిన సమయం వచ్చిందని తెలుసుకో!”

“నేను దేనికిక భయపడాలి?” — అని అన్నదేగాని ‘ఫ్రుస్సీ’ని కొద్దిగా జడిసింది.

“ప్రతిదానికి జడవాల్సిన సమయం వచ్చింది. ప్రజలు నిన్నెప్పటికీ క్షమించరు. ఎక్కడున్నా నిన్ను వెంటాడి చంపుతారు. నువ్వు నీళ్ళల్లో మునిగి చావాలన్నా నిన్ను నీరు స్వీకరించదు — పైకి తోసిపారేస్తుంది! భూమికూడా నిన్ను సహించే సమయం దాటిపోయింది. చివరికి నీ కండ్ల నీరు రక్తపు చుక్కలు కారేటట్లు యేడుస్తావు! — ఈ జర్మన్ల చేతుల్లో చచ్చినవారే ధన్యులని అప్పుడనుకుంటావు...”

‘ఫెడోసియా’ కంఠంలో ద్వేషము, విజయగర్వము ప్రతిధ్వనిస్తున్నాయి. ఎర్రసైనికులు వచ్చేస్తారని తెలిసినతర్వాత ఆమెకింకేంభయం...?

“పో! నా ముందునుంచి పో!” — అని ‘ఫ్రుస్సీ’ అరిచింది.

‘ఫెడోసియా’ మళ్ళీ ఒకసారి పెద్దగా నవ్వింది.

“పోతాను. నీ నీచపుముఖం చూడటం నాకుగూడా అసహ్యంగానే వున్నది. నా ఇంట్లోవుండి నన్నే యీ విధంగా పొమ్మంటున్నందుకు త్వరలోనే పశ్చాత్తాప పడతావులే!”

తలుపు దభాలున వేసుకొని వెళ్ళిపోతూ మళ్ళా యిలా అరిచింది — “వెళ్లు! నీ మొగుడితో ఇక్కడ జరిగిందంతా చెప్పుకో ... కాని వాడికి నీ మీద మోజు తగ్గిపోయిందిలే అయినా వాడి యావ వాడికి పడ్డది ...”

* * * *

నిజంగానే 'కర్ట్'కి తనయావ తనకి పడ్డది. ఏదో విషయమై అతని మనస్సు మథనపడుతున్నది. గబగబా తన ఆఫీసులోకి వెళ్ళాడు. అతనిని చూచి సార్జెంటు కుర్చీమీదినుంచి లేచి నిలబడ్డాడు.

"కేంద్రకార్యాలయంనుంచి ఎవ్వరైనా టెలిఫోనులో పిలిచారా?"

"పిలిచారండీ"

"మరి నాకెందుకు కబురు పంపావుగావు"

"తెలియజేయవద్దని ఆజ్ఞాపించారు"

"ఏమిటీ? తెలియజేయవద్దన్నారా?"

"...చెప్పనవసరం లేదన్నారు"

"మరి యెందుకు పిలిచినట్టు?"

"అరెస్టుచేసిన గెరిల్లా స్త్రీ దగ్గర్నుంచి వివరాలు తీసుకున్నావా లేదా అని అడిగేరు?"

"ఏమి సమాధానమిచ్చావు?"—అని 'కర్ట్' హూంకరించాడు.

"వివరాలేమీ చెప్పలేదని జవాబిచ్చాను"

"ఇంకేం చెప్పావు?"—అని 'కర్ట్' నిదరించుకున్నాడు.

సార్జెంటు వెలవెలబోయాడు.

"అవును సార్ ... ఆ తర్వాత ..."

"ఆఁ, ఆ తర్వాత?"

"ఆ స్త్రీని చంపేశామనికూడా చెప్పాను."

"ఆ సంగతి నిన్నెవరు చెప్పమన్నారు? నీ కెవడు అధికారమిచ్చాడు. ఆ మాట చెప్పటానికి?"—అంటూ 'కర్ట్' కోపంతో సార్జెంటు మీదికి వెళ్ళాడు. సార్జెంటు భయంవల్ల అక్కడినుంచి కదల్లేదు.

"ఆ సంగతి నిన్ను చెప్పమన్నానా?...చెప్పు?"

"లేదు, సార్ ..."

'కర్ట్' తన బలంకొద్దీ సార్జెంటు ముఖంమీద చేతితో చరిచాడు. సార్జెంటు అదిరిపడ్డాడు. కాని ఉన్నచోటునుంచి కదలలేదు.

"నిన్నెవరు చెప్పమన్నారోయ్?" — అని రెండవదెబ్బ వెయ్యటానికి చెయ్యి యెత్తుతూ 'కర్ట్' ఉరిమాడు.

సార్జంటు చెంపమీద అయిదు వ్రేళ్ళ గుర్తులు పడ్డాయి.

"గ్రామాధికారియేడీ ?— వాడు ఇవ్వాళ వచ్చాడా లేదా ?"

సార్జంటు భయంతో రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

"ఇంకా రాలేదండీ"

"ఎంత ధాన్యం చేతికొచ్చింది ?"

"ఇప్పటివరకు యేమీ లేదండి..."

"నిన్న చంపబడ్డ కమ్రేడ్ సంగతేమైనా తేలిందా ?" — అని గద్దించి అడిగాడు.

"ఇంకా ఆ సంగతికూడా యెవ్వరూ తెలియచేయలేదండీ."

'కర్ట' కోపంతో ప్రక్కనున్న కుర్చీ అంతదూరం నెట్టివేసి, టేబిలు మీది కాగితాలు క్రిందికి త్రోసేశాడు. సార్జంటు ఆ కాగితాలన్నీ యేరి, మళ్ళీ టేబిలుమీద పెట్టాడు.

"తక్షణం గ్రామాధికారిని పిలిపించు !"

"మంచిదండీ."

ఈమాట చెప్పి సార్జంటు బయటికి వెళ్ళిపోయాడు. 'కర్ట' కోపంతో దహించుకుపోతున్నాడు. ఎన్ని ప్రయత్నించినా 'ఓలెనా' గెరిల్లాదళపు సంగతుల్లో ఒక్కటయినా చెప్పిందికాదు. అక్కడికి తాను అసమర్థుడై ఆమెనుంచి వివరాలు లాగలేకపోయాడనుకుంటారు కేంద్రకార్యాలయం వారు. కాని యిక్కడి కష్టాలు వారికేమీ తెలియవు. ఆ 'ఓలెనా' ముండ ఒక్కసారికాదుగదా, వందసార్లు చంపినా నోరు మెదిపేరకం కాదు! ఇది ఇట్లావుండగా ధాన్యపు సమస్య మరీ గడ్డుదైపోయింది. ఆ వెధవ 'గాప్లిక్' ధాన్యపు బాధ్యతంతా తాను వహిస్తానన్నాడు. కాని ఇంతమట్టుకి ఒక్క గింజయినా చేతికి చిక్కలేదు. సందట్లోపడ అన్నట్లు, యిదే సమయంలో కేంద్రకార్యాలయంలో తనమీద యేదో కుంభకోణం జరుగుతున్నది! లేకపోతే తనకు తెలియకుండా సార్జంటుని, తన విషయమై ఆరాలన్నీ అడగటమేమిటి ?... ఆ సుద్ద వెధవ 'ఓలెనా'ను అప్పుడే చంపేసినట్టుకూడా చెప్పేవాడు !...

సార్జంటు లోపలికి వచ్చిన చప్పుడయింది.

"ఏమయింది ?"

"క్షమించాలి... గ్రామాధికారి వెళ్ళిపోయాడు"

"వెళ్ళిపోవట మేమిటోయ్? వాడిని పిలిపించమంటే ?"

"తీసుకురావటానికి వెళ్ళానండీ. కాని వాడు వెళ్ళిపోయాడు"

"ఎక్కడకిపోయాడు ?"

"ఎవరికీ తెలియదండీ"

'కర్ట్' కోపంతో మండిపడుతున్నాడు.

"నీకు పిచ్చాయేం?—నీ బదులు నన్ను వెళ్ళి తెమ్మంటావా యేం?"

"అంతా వెతికి చూశామండీ; ఎక్కడా లేడు. రాత్రి చాలా సేపటి వరకు మేమిద్దరం కలిసి రహస్యపు లెక్కలు తయారుచేస్తూ యిక్కడే కూర్చున్నాము. ఆ తర్వాత యింటికి పోతానని వెళ్ళిపోయాడు కాని ఇంటికికూడా చేరలేదట. అప్పటినుంచి ఎక్కడా కనుపించటంలేదు."

"సరిగ్గా అన్నిచోట్లా విచారించావా ?"

"విచారించానండి"

"పారిపోయి ఉంటాడా !"

"అంతే కావచ్చునండీ"

"చచ్చాం ! అంతా తలక్రిందు లయ్యిందే!! ఏందారి ?"

"మీరే ఆలోచించండి."

"పోనీ ! మనకు ఉండి చేసిన లాభమేముంది గనుక ?"

"అవునండీ"

"సరే, కూర్చుని కేంద్ర కార్యాలయానికి ఒక పత్రం వ్రాయి. యిక్కడి గ్రామాధికారి పారిపోయాడని, ఇంకొకడ్ని ఎవరినైనా తెలివైనవాడ్ని పంపించమనీ వ్రాయి."

అక్కడ జరిగిన విషయాలన్నీ వివరిస్తూ సార్జంటు కేంద్ర కార్యాలయానికి ఒక రిపోర్టు వ్రాశాడు. 'కర్ట్' కేంద్ర కార్యాలయానికి తెలియకుండా చేస్తున్న కుతంత్రాలన్నీగూడా దానిలో ఉల్లేఖించాడు.

"సాసీ !" అని సార్జంటుని 'కర్ట్' కేకవేశాడు.

సార్జెంటు 'పాసి' వ్రాస్తున్న కాగితాలు డ్రాయరులోకి తోసేశాడు.

"రాత్రి యెవరెవరు గస్తీలో ఉన్నారో వారి నందర్నీ ప్రశ్నించి చూడు."

"అప్పుడే ప్రశ్నించానండీ. ఎవ్వరూ, ఏమీ చూడలేదంటున్నారు"

"మహావింతగా ఉన్నది! మన గస్తీసైనికులికి తెలియకుండానే మనిషి మాయమయ్యాడు! ఈ విధంగానైతే యేదో ఒకనాడు సుఖం నిద్ర పోతుండగా యెవరైనా వచ్చి గొంతుకలు కాస్తా తెగకోసి వెళ్ళిపోతారు. ఈ కాపలా గాడిదెలందరు యేం చేస్తున్నట్టు? నిద్రపోతున్నారా?"

"అబ్బే, బయట ఆ చలిలో నిద్రపోవటానికిగూడా వీలుండదండీ. అయినా ఈ గాలిదుమారంలో ఎవ్వరికంటా పడకుండా పారిపోవటంకూడా సులభమే. అందువల్ల గ్రామంచుట్టూ కాపలాఉంచితే గాని లాభంఉండదు"

"నీ సలహా కాదు, నే నడిగేది. అంతమందిని గస్తీలో ఉంచటానికి మనుష్యులేరీ? అదీగాక గ్రామాధికారికి తగిన రక్షణ నేర్పాటు చేయాలన్న సంగతి నీకు తెలియదూ?"

రాత్రి 'గాస్లిక్' తనతో యెవ్వరినన్నా తోడుగా పంపమన్న సంగతి సార్జెంటుకి జ్ఞాపకం వచ్చింది. కాని అది తెలిస్తే 'కర్ట్' మండిపడుతాడని చెప్పకుండా ఊరుకున్నాడు. ఆ దరిద్రుడు 'గాస్లిక్' ని ఇంటివరకు విడిచి పెట్టినా పోయేదనిపించింది.

"వట్టి వెధవాయిలంతా చేరారు. ఇలాంటి వాళ్ళతో యుద్ధం చేసి నట్టే—"అని కర్ట్ గొణిగాడు.

సార్జెంటు ఇంకా నిలబడే ఉన్నాడు.

"ఇంకా యెందుకట్లా నిలబడ్డావు? పోయి రిపోర్టు వ్రాయి. నువ్వు కూడా నాకు తగినవాడవే నౌరికావు"

సార్జెంటు వెళ్ళి రిపోర్టు పూర్తి చేశాడు. 'కర్ట్' కోపంతో తనను తిట్టిన తిట్లన్నీ దానిలో వ్రాశాడు. రిపోర్టు వ్రాస్తున్నంతసేపు తట్లు తేసిన తన చెంపను తడుముకుంటూనే ఉన్నాడు.

'కర్ట్' కి చాలా విసుగెత్తిపోయింది.

"ఇక్కడే ఉండవోయ్. నేను కొంచెంసేపు బయటతిరిగివస్తాను"

"బయట చలి అపరిమితంగా ఉన్నదండీ..."

"అది నాకు తెలుసు. నువ్వు చెప్పనక్కర్లేదులే"

'కర్ట్' బయటికి వెళ్ళాడు. గాలి జోరు కొద్దిగా తగ్గింది. కాని చలిమాత్రం అపరిమితంగా ఉంది. గుమ్మంముందు నిలబడి క్రోధం ఉట్టిపడే చూపులతో గ్రామమంతా ఒక్కసారి కలియజూచాడు. అక్కడక్కడ కాపలాకాస్తూ ఉన్న జర్మను సైనికులు తప్ప మరెవ్వరూ కనబడటంలేదు. సాధారణంగా వీధుల్లో కనబడుతుండే కుక్కలన్నా యెక్కడా కనబడటం లేదు. గ్రామంలోని యిండ్లు దోచుకుంటుంటే వాళ్ళమీదికి ఉరుకుతుండటం చేత జర్మను సైనికులు కుక్కలన్నింటినీ వచ్చిననాడే తుపాకులతో కాల్చి చంపేశారు. 'వీటి యజమానుల్లాగే యివికూడా మొండిపుట్టుక పుట్టాయి' అని జర్మను సైనికులు వాటినిచూచి మండిపడేవారు.

భయంకరమైన ఆ ప్రశాంత వాతావరణం 'కర్ట్'కి భయం పుట్టిస్తున్నది. ఇటువంటిచోట ఉండేకంటే నడి యుద్ధరంగంలో పోరాడుతూ ఉండటమే హాయి అనిపిస్తుందతనికి. అక్రమిత గ్రామాల్లో శాంతి నెలకొల్పటానికి యీ విధంగా ఉండటం విశ్రాంతి సమయమని కొందరు భావిస్తారు. కాని నిజానికొస్తే యిదే భయంకరమనిపిస్తుంది. బోల్షివిక్కులను తరిమివేసి దాదాపు నెలకావస్తున్నది. అయినా గ్రామస్థుల్లో ఒక్కడయినా తమ స్వాధీనంలోకి రాలేదు. ధాన్యంకోసం యెన్ని చేసినా వాళ్ళకి చీమకుట్టినట్టయినా అనిపించడం లేదు. ధాన్యం యివ్వకి తప్పదన్న ఆలోచనే లేదు. మళ్ళీ బోల్షివిక్కులు తిరిగివస్తారని వాళ్ళకి పెద్ద ఆశ.

ఇంతలో ఆకాశంనుంచి యేదో శబ్దం వినవచ్చింది. తల పైకెత్తి చూచాడు 'కర్ట్'.

"అదుగో!" — అన్నాడు గుమ్మందగ్గరఉన్న కాపలా సైనికుడు ఆకాశంవైపు వేలు పెట్టి చూపిస్తూ.

"మనదేనా, విమానం?" — అటువైపు చూస్తూ అడిగాడు 'కర్ట్.'

సైనికుడు శ్రద్ధగావిని అన్నాడు:

"శబ్దాన్నిబట్టి చూస్తే మనదానిలాగ కనబడటంలేదండి."

'కర్ట్'కి ఆరాటం యెక్కువయింది. రష్యను విమానాలు గ్రామం మీద కనబడి నెలరోజులవుతుంది. మళ్ళీ యివ్వాళ కనబడుతున్నది!—

ఎర్ర సైనికులు వస్తున్నారేమో ?...

లోపలినుంచి మరికొందరు సైనికులు బయటికివచ్చి చూడసాగారు.

"బోల్షివిక్కుల విమానమే !" అన్నాడు అందులో ఒకడు.

ఇంతవరకు నిర్మానుష్యంగా ఉన్న వీధులు, నేల ఈనిందా అన్నట్టు ప్రజలతో నిండిపోయున్నాయి. పసిపిల్లలతో సహా అందరూ వచ్చి చూడసాగారు.

"అదుగో, మన విమానమే !" — అని 'మాల్యుచికా' సంతోషం పట్టలేక అన్నది.

మంచు ప్రతిబింబిస్తున్న వెలుతురులో విమానంమీది యెర్ర నక్షత్రం కనబడసాగింది.

"మనది ! మన విమానం !!" — అంటూ పిల్లలు అన్నీ మరిచిపోయి సంతోషంతో గంతులు వేస్తున్నారు. స్త్రీ జనం కండ్ల వెంట అశ్రువులు రాలాయి. పిల్లోళ్ళకి మళ్ళీ యీనాడు ఎర్రసైన్యపు విమానం గ్రామం మీద యెగురుతున్నది. స్వతంత్ర దేశంనుండి స్వాతంత్ర్య సందేశం తెచ్చినట్టు ఆ విమానపు రెక్కలమీదున్న యెర్ర నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయి.

కెప్టెన్ 'కర్ట్' ఆ సమయంలో వీధుల్లో చూచినలాంటి దృశ్యం తాను గ్రామం వచ్చిన తర్వాత ఇంతవరకు యెన్నడూ చూచి ఉండలేదు. వీధులన్నీ ప్రజలతో కిటకిటలాడిపోతున్నాయి! ఊరపిచ్చుకల్లాగ స్వేచ్ఛగా కలకిల నవ్వుతూ వీధుల్లో పరుగులెత్తుతున్నారు పిల్లలు ! ఈ దృశ్యం చూచి 'కర్ట్' కోపంతో ఊగిపోతున్నాడు.

"ఈ గుంపుని తోలెయ్యండి !" — అని తన సైనికులను చూచి కేకలు పెట్టాడు తన పిస్తోలు తీసి పిల్లల గుంపులోకి రెండు సార్లు పేల్చాడు. కాని కోపంతో చెయ్యి వణుకుతుండటముచేత రెండు దెబ్బలూ గురితప్పినాయి. తక్షణమే పిల్లలంతా పిట్టల్లాగ యెగిరిపోయారు. తల్లులందరూ వాళ్ళ వెనకాల పరుగెత్తి తలుపులు మూసుకున్నారు. కొద్దిసేపట్లో మళ్ళీ అంతా నిశ్శబ్దం. 'కర్ట్' కళ్ళముందు మళ్ళీ యెప్పట్లాగే గ్రామం శ్మశానవాటికలాగ కనబడసాగింది.

"మన్నుపోతుల్లాగ నిల్చుని చూస్తారేం ? కళ్ళు మూసుకుపోయినాయా ? ఎగురుతున్నది కనబడటంలేదూ ? విమాన ఫిరంగు లేమయినై ?

ఆ వెధవలేంచేస్తున్నారు?"—అని అవమానం భరించలేక 'కర్ట్' కిందుమీదై పోతున్నాడు. తన సైనికులనుంచి, అంత దగ్గర్లో, గాదుపొద్దు గురి తప్పటమా!...

ఇంతలో విమాన ఫిరంగుల పేలుడు శబ్దం వినవచ్చింది. కాని విమానానికి దెబ్బమాత్రం తగలలేదు. గుండ్ల మ్రోత మోగింది. విమానం తప్పించుకొని దూరం వెళ్ళిపోయింది.

"ఏంచేస్తున్నారింతవరకు? నిద్రపోతున్నారా, లేక ఆడుకొంటున్నారా?"—అని విమాన శతఘ్నులు అమర్చి ఉన్న వైపు పరుగెత్తాడు.

"మొదట్లో మనవే ననుకున్నామండీ..."

"ఈ ఊరి ఆడముండల కందరికీ ఆ విమానం యెవరిదైనదీ తెలిసింది గాని మీకుమాత్రం తెలియలేదే? వెధవలు... శుద్ధ వెధవలు" అని అరుచుకుంటూ తన ఆఫీసులోకి వెళ్ళిపోయాడు. కోపంతో శరీరమంతా వణికి పోతున్నది.

"గ్రామాధికారి పత్తా దొరికిందా?"

సార్జెంటు భయంతో లేచి నిలబడ్డాడు.

"లేదండీ..."

'కర్ట్' కుర్చీమీద కూలబడ్డాడు. మనస్సు అంతా వికలమైపోయింది. ఈ వెధవలకేం పోయింది? ఏ విషయంలోనూ కల్పించుకోరు. ఎవ్వాన్స్ పూచీ అంతా తన నెత్తిమీద పడుతుంది. కేంద్ర కార్యాలయంలో ఉన్న తన 'మిత్రులు' దీని బాధ్యతంతా తన నెత్తినే రుద్దుతారు. ఇకనుంచి 'ఫ్రస్సీ' తో తిరగటం కూడా మంచిది కాదేమో ననిపించింది. ఇలాంటి విషయాలు కేంద్రకార్యాలయంవారికి తెలిస్తే అతనిమీద మరీ అనుమానపడతారు. అందువల్ల తనకు అంతగా యిష్టంలేకపోయినా 'ఫ్రస్సీ'ని వదుల్చుకోటానికి నిశ్చయించుకొనక తప్పిందికాదు.

ఏమి చెయ్యటానికి తోచటంలేదు. తన స్థితి చాలా చిక్కుల్లోపడి పడిపోయిందనిపించింది. కేంద్ర కార్యాలయంవారు తనకు పనిగాని పనిని తెచ్చిపెట్టారు. లేకపోతే సైనికులకు కావలసిన ధాన్యము, మాంసము సంపాదించవలసిన బాధ్యత తననెత్తిన పెట్టడమేమిటి? 'గార్లిక్', సార్జెంటుకలసి యెన్ని లెక్కలు తయారు చేసినా ఫలితమేమీ కనుపించలేదు. బోల్షివిక్కులు

పోయిన వసంతకాలంలోనే ఇక్కడి పశువుల నన్నింటినీ యెక్కడికో తోలుకపోయారు. ఇక ధాన్యం సంగతి ఆ బ్రహ్మదేవుడికూడా తెలియనట్టు ఉన్నది. ఇంతవరకు ఒక్క గింజ అయినా చేతికి చిక్కలేదు!

"నిన్న అరెస్టుచేసిన అయిదుగురు ఖైదీలసంగతి యేమయింది?"

"ఆ గదిలోనే పెట్టి ఉంచామండీ"

"తినడానికేమన్నా యిస్తున్నారా?"

"ఊఁహూఁ లేదండీ"

"నీళ్ళు..."

"అదీ లేదండీ"

"మంచిపనిచేశారు. ఇంత రొట్టెముక్క కావాలన్నా, ఒక్క నీటిచుక్కయినా వాళ్ళకివ్వకండి. మనకు వాళ్ళు తిండి ఇవ్వనప్పుడు మనము కూడా వాళ్ళకు తిండి పెట్టగూడదు___హ-హ-హా. చస్తే చావనివ్వు. నష్టమేమీ లేదు."

'కర్ట్'కి ఏమీ తోచటంలేదు. ఇంటికి పోదామనుకున్నాడు. కాని 'ఫ్రుస్స్'ని కలవవలసి వస్తుందని అక్కడికి వెళ్ళటంకూడా మానుకున్నాడు. ఎటూతోచక, విమాన ఫిరంగులు అమర్చి ఉంచిన చోటుకివెళ్ళి అక్కడి సైనికులమీద కేకలు వెయ్యటం మొదలుపెట్టాడు.

ఆఫీసులోని సైనికులు కొంత ధైర్యంగా మాట్లాడుకొనసాగారు.

"చాలా కోపంమీద ఉన్నాడునుమా___"

"ఇంకేం చేస్తాడు? ధాన్యం దొరకటంలేదు. దానికితోడు గ్రామాధికారికూడా పత్తాలేకుండా దాటిపోయాడు."

"మొత్తానికి వాడు భలేపనిచేశాడు"

ఈ మాటలుఅన్న సైనికుడివైపు సార్జంటు అనుమానంతో చూస్తూ అన్నాడు: "ఏమిటీ, నీ ఉద్దేశం?"

"అబ్బే, పారిపోయినా యెక్కడికి పోగలడు లెండి. ఎక్కడికి పోయినా మనవాళ్ళ చేతుల్లో చిక్కక మానడుకదా?" అని తన పొరపాటును సర్దుకోటానికి ప్రయత్నించాడు ఆ సైనికుడు.

"రష్యన్ల అధీనంలో ఉన్న స్థలానికి పారిపోతేనో?"—అని ఇంకొక సైనికుడు ప్రశ్న వేశాడు.

"బోల్షివిక్‌లు అసలే చంపేస్తారు"

"ఏమో? ఇక్కడి గ్రామస్థులే చంపేశారేమో."

"ఏడిశారు. రాత్రంతా వాడిక్కడే ఉన్నాడు. అదీగాక చీకటి పడ్డాక యెవ్వరూ బయట తిరగకూడదని ఆజ్ఞకూడా ఉన్నది." అని సార్జెంటు కోపంతో అరిచేడు.

అంతకుముందురాత్రే ఒక కుర్రవాడు 'ఓలెనా'కి రొట్టె అందివ్వటానికి ప్రయత్నించటమూ, ఆతనిని జర్మను సైనికులు కాల్చి చంపేయటమూ, ఆ తర్వాత యెవరో అతని శవాన్ని రహస్యంగా యెత్తుకు పోవటము బహుశా సార్జెంటు మరచిపోయి ఉండడు. కాని అతనికి బదులు చెప్పటానికి ధైర్యం చాలక సైనికులు ఊరుకున్నారు.

"అయినా సోమరిపోతుల్లాగ యిక్కడ కూర్చుని యీ బాతాఖాని అంత యెందుకంటా? వెళ్ళి మీపని మీరు చేసుకోండి—" అని సార్జెంటు వాళ్ళను మళ్ళీ మందలించేడు.

సైనికుడు మారుపల్కలేదు. తనక్రింద పనిచేసేవారిని కొట్టటంలో సార్జెంటుకూడా ఏమీ తీసిపోయినవాడు కాదు. 'కర్ట్' అతనికి వేసిన చెంపకాయ గుర్తు ఇంకా ఎర్రగా కనబడుతూనే వున్నది. ఆ కోపంలో ఏ క్షణాన్నైనా తనమీదపడి కొడతాడని ఆ సైనికులు మౌనంవహించి ఊరుకున్నారు.

"న్యూమన్ యేడీ"

"మాంసం సంపాదించుకురావటానికి పోయాడండీ."

సార్జెంటు ఈ మాటలు విని భుజాలు యెగురవేస్తూ అన్నాడు:

"ఏం? ఆవులెక్కడ ఉన్నవో తెలియదా?"

"ఆవులన్నీ అప్పుడే అయిపోయినైకదండీ. నిన్న కేంద్ర కార్యాలయంవారికి పది ఆవుల్ని పంపించాము. ఇప్పుడు కోళ్ళయినా దొరుకుతాయేమోనని వెతకటానికి పోయారు."

సార్జెంటు టేబిలుముందు కూర్చొని యేవో కాగితాలు తిరగవేస్తున్నాడు. కోపంతో అతని వొళ్ళు దహించుకు పోతున్నది. ఇందాక చెంప

మీద పడ్డ వ్రేళ్ళ గుర్తులు తడుము కుంటున్నాడు. చెంప బాగా మండు తున్నది. వెధవ చెంపమీద కొట్టటంమాత్రం చేతనవుతుంది. గెరిల్లాదళాన్ని పట్టుకునే సమర్థతమాత్రం లేదు. ఇన్ని రోజులబట్టి తల పగులగొట్టుకుంటు న్నాడు గాని ఒక్క ధాన్యపు గింజయినా సంపాదించలేక పోయాడు. పైగా తనకంటే గొప్పవాడు లేడని మిడిసి పడతాడు.

ఈ గ్రామానికి వచ్చినది మొదలు సార్జెంటుకి 'కర్ట్' మీద మరీ కోపంగా ఉన్నది. వచ్చిననాడు ఇద్దరూ ఒకేసారి ఒకేయింట్లో చొరబడటం తటస్థించింది. ఆ యింట్లో దొరికిన ఒక చక్కని గౌను తీసుకొని తనభార్యకు పంపిద్దామని ఎంతో సర్దాపడ్డాడు సార్జెంటు. కాని 'కర్ట్' కళ్ళుకూడా దానిమీదనే పడ్డాయి. సార్జెంటు దగ్గర్నుంచి అది లాక్కుపోయి తన ఉంపుడుగత్తెకు యిచ్చుకున్నాడు. ఆ విషయం తలుచుకుంటుంటే సార్జెంటుకి 'కర్ట్' మీద అమిత కోపం కలుగుతుంది. వెధవ! అక్కడికి తానే గొప్పవాడనుకుంటాడు. కాని తెలివిమాత్రం శూన్యం...

దూరంనుంచి 'కర్ట్' కేకలు వినబడసాగినాయి. "అరువు! నీ యిష్టం వచ్చినట్టు అరువు. ఎంత అరిచినా అంతేలే —" అని సార్జెంటు తనలో తాను అనుకున్నాడు.

*　　*　　*　　*

జర్మను సైనికులు గుంపుగా ఇంటింటికీ బయలుదేరారు. పట్టపగలైనా ఆ గ్రామంలో ఒంటరిగా తిరగటమంటే వారికి హడలు.

'గ్రోషాచ్' ఇంటితలుపుకొట్టారు. పిల్లలు భయంతో ఒక మూలకి నక్కారు. 'గ్రోషాచ్' భార్య తలుపుతీసి జర్మను సైనికులను రుస రుస లాడుతూ చూచింది.

"ఏం కావాలి. మీకు!"

"కోడి, కోడి...కోడికావాలి"

"ఉన్నవన్నీ మీ పొట్టనే పెట్టుకున్నారుగా...ఇంకెక్కడిది?

భాష అర్థంకాకపోయినా వాళ్ళు ఆమె భావం గుర్తించగలిగారు. అయినా ఆమె మాటల్లో నమ్మకం కలగక, లోపలికిపోయి ఇల్లంతా వెతికి చూచారు.

"ఊఁహూఁ—ఏమీ లేవు" అన్నాడు అందులో ఒక సైనికుడు.

అక్కడ ఇక లాభం లేదని తెలుసుకొని, ప్రక్క యింట్లో జొర బడ్డారు.

'బన్యాచికా' ఇంతకాలమూ బహు జాగ్రత్తగా దాచుకుంటూ వచ్చిన ఒక కోడిపిల్ల వాళ్ళ కంటపడింది. ఒక జర్మను దానిని పట్టుకోబోతుం డగా రెపరెప కొట్టుకుంటూ కిటికీలోంచి బయటికి గంతేసింది.

“అటు — బయటికిపోయి పట్టుకోవోయ్...”

సైనికులు దానివెంటపడ్డారు. అది చేతికి చిక్కకుండా గెంతులు వేసు కుంటూ తప్పించుకుంటుంది. ఇక చాలలేక ఒక సైనికుడు పిస్తోలు తీసి దానికి గురిపెట్టి కాల్చాడు. దెబ్బతో అది చచ్చి పడిపోయింది. ఎంతో జయం పొందినవాడిలాగ దానిని కాళ్ళతో పట్టుకొని అటూ, ఇటూ ఊపు కుంటూ పోబోతున్నాడు ఆ సైనికుడు.

గ్రామంలో ఈ వార్త తెలియగానే అందరూ తమ తమ కోళ్ళను వీలైనట్లల్లా దాచేశారు. జర్మను సైనికులు కుక్కలకమల్లే పసికట్టి కొన్ని టిని బయటికి లాగుతున్నారు. అప్పటికిగూడా వారికి తృప్తి కలుగ లేదు. చివరకి గ్రామంలో 'లోకాటికా' యింట్లో మిగిలిన ఒక్క ఆవుని తోలుకు పోవటానికి నిశ్చయించుకున్నారు. కాని ఆవు యే మాత్రం కదలటంలేదు.

ఆవుని తోలుకుపోతూవుంటే చూడలేక 'లోకాటికా' కండ్లవెంట నీళ్ళు పెట్టుకుంటూ — “పెస్టూర్స్కా! పెస్టూర్స్కా” — అని గోల పెట్టింది. సైనికులు ఆమెను మొరటుగా క్రింద పడదోశారు.

ఆవు జాలిగొలిపే చూపులతో ఆమెను చూడసాగింది. బలవంతంగా లాక్కుపోవటానికి యెంత ప్రయత్నిస్తున్నా కదలటం లేదు. గుమ్మం దగ్గర జారిపడిపోయింది. ఒక సైనికుడు తోక పుచ్చుకొని లేవనెత్తి ముందుకి తోశాడు.

“అయ్యో! అయ్యో! దాన్ని అవస్థపెట్టకండి... సూడితో వుంది. సూడితో వున్నది...”

“అమ్మా, గోల చెయ్యకు!” అని ఆమె పది సంవత్సరాల కొడుకు 'సావ్కా' గంభీర స్వరంతో ఆమెను మందలిస్తున్నాడు.

“అయ్యో తండ్రీ, ఇంక మీకేం పెట్టేది? ... నా బిడ్డల గతి ఇంకేంకాను?...

"ఊరుకోవమ్మా !" అని 'సాషా' జర్మను సైనికులవైపు ద్వేషంతో చూస్తూ తల్లిమీద కేకలు పెట్టాడు.

సైనికులు ఆవుని వెనకనుంచి బలవంతంగా తోయటం మొదలు పెట్టారు. 'లూకుటికా' ఆవు ప్రక్కకి పరుగెత్తింది. ఒక సైనికుడు ఆమెను త్రోసివేశాడు. నేలమీద దభీలున పడిపోయింది. చెమ్మగిల్లిన కండ్లతో జాలిగా ఆమెవైపు చూస్తూ పోతున్నది ఆవు...

"అమ్మా, గోలచెయ్యొద్దంటే వినావ్వూ ? దీనివల్ల వచ్చిన బాధ మేమిటో చెప్పు?—పద. చలివేస్తుంది...లోపలికిపద—" అని 'సాషా' తల్లిని ఓదార్చుతున్నాడు.

'లూకుటికా' ఇంకా యేడుస్తూనే ఉన్నది.

"ఇక మనగతి యేమైపోతుంది ? ఈ పిల్లల్ని పెంచటం యెట్లా ?"

"ఇక చాలించు ! ఊళ్ళో ఇందరి ఆవుల్ని తోలుకుపోతుంటే యెవ్వరైనా నీలాగ గోలచేశారా ?" అని 'సాషా' తల్లిని కసురుకున్నాడు.

"మా అయిదుగురి కేం పట్టింది తండ్రీ !...

"ఇంతకంటె యెక్కువమంది పిల్లలున్నవారు లేరూ ?"

"ఏడిశావు. నువ్వటరా గుంటసన్యాసి. నాకు చెప్పవచ్చావ్ — —" అని తల్లి ఆ దుఃఖంపట్టలేక కొడుకుని కసురుకోసాగింది.

"సరేలే, చెల్లి యేడుస్తున్నది—వెళ్లు."

"చెల్లి యేడుస్తున్నదా !" అంటూ 'లూకుటికా' యింట్లోకి పరుగెత్తింది.

జర్మను సైనికులు ఆవుని తోలుకుపోయి కోసేశారు. తోలు తీసి మాంసాన్ని ఒక దండానికి వేళ్లాడదీశారు. ఇంతలో, ఫిరంగులదగ్గిర సైనికులమీద కేకలువేస్తూ విసిగిపోయిన 'కర్ట' తిరిగివచ్చాడు.

"ఒక ఆవుని తీసుకొచ్చామండీ —" అని సార్జెంటు అతనికి తెలియజేశాడు.

అసలే 'కర్ట'కి మనస్సు చీకాకుగా వుంది. ఈ వార్త వినేటప్పటికి దుర్నికారమనిపించింది. ఏ గ్రామంలో ఉన్న సైన్యం ఆ గ్రామంలోనే ఆహారపదార్థాలు సంపాదించుకోవాలని పైనుంచి ఆజ్ఞ వచ్చింది. నెల

రోజులింకా తిరగనేలేదు. అప్పుడే కోళ్ళు మొదలైనవన్నీ అయిపోయినాయి. ఇక మహా మిగిలితే ఒకటి, రెండు ఆవులు మిగిలి ఉండవచ్చు. అవికూడా అయిపోతే యేమి చెయ్యాలో తెలియక తికమకలు పడుతున్నాడు 'కర్ట్'.

"పైనుంచి యేమైనా తినుబండారాలు వచ్చాయా?"

"చాక్లెట్లూ, కొద్దిగా సారాయి మాత్రం పంపించారండి—"

"అంతేనా? ఇంక యేమీ పంపలేదూ?"

"అంతేనండీ, ఇంకేమీ రాలేదు. ఎవరి గ్రామాల్లో వారు ఆహారం సంపాదించుకోవాలని మొన్ననే ఆజ్ఞాపించారు కదండీ ... ఇప్పుడు వచ్చినది ఇంటికి పంపించమంటారా?"

"పంపేను. కాని మధ్యలో మాయం కానివ్వకుండా చూడు."

"అట్టే; సీలు వేసిన పెట్టెలండి—అలా యెవ్వరికీ దొరుకదు."

'కర్ట్' కోటుగుండీలు సరిగ్గా సవరించుకొని, సిగరెట్టు వెలిగిస్తూ అన్నాడు. "సార్జెంటు: ఇంకొకమాట..."

"ఏమిటండీ?"

"ఇవ్వాళ్ళటినుంచి ఆహారపదార్థాల విషయమై బాధ్యత నీ మీద పెడుతున్నాను."

"సరేనండీ—" అన్నాడేగాని భయంతో ముఖం చిన్నబోయింది. 'కర్ట్' బయటికి వెళ్ళిపోబోతున్నాడు.

"సార్!"

"ఏమిటోయ్?"

"అవసరమైన వస్తువులు ప్రక్క గ్రామాలనుంచి తెప్పించుకోటానికి అనుమతిస్తారా?"

"ఏడిసినట్టువుంది! ఇతర గ్రామాలు, యితర సైనిక భాగాల ఆధీనంలో ఉంటున్నాయని తెలియదూ? అంటుంటప్పుడు అక్కడినుంచి యెలా తెస్తావోయ్?"

"మరి—ఈ గ్రామంలో ఆహారపదార్థాలు దొరకడంలేదండి..."

"దొరకకేం? ... సరిగ్గా వెతికితే చాలా చక్కగా దొరుకుతాయి. ఒళ్ళువంచి పనిచేస్తే అవి దొరుకుతాయి లేకపోతే..."

అంటూ తలుపు దబాలున వేసుకొని వెళ్ళిపోయాడు, 'కర్ట్'.

★

8

‘ ఫ్రుస్సీ ’ ఇల్లు బయలుదేరింది. కాని యెటుపోవటానికీ తోచటం లేదు. ‘ కర్ట్ ’ చేస్తున్న బలవంతంవల్ల తప్పితే, తాను వెళుతున్న పని సఫలమవుతుందన్న నమ్మకంతో మాత్రం వెళ్ళటంలేదు.

“ఎంతయినా నీ అక్కే కదా ... ఆ మాత్రం మాట్లాడలేవూ ? ... ఇంతకూ నీకిష్టంలేనట్టు కనబడుతున్నది. సరే, నా సమయం వచ్చినప్పుడు నేనూ, చూసుకుంటాను ” అన్న ‘ కర్ట్ ’ మాటలు ఇంకా ఆమెకు వినిపిస్తున్నట్టుగానే ఉన్నది.

‘ ఫ్రుస్సీ ’కి భయం పట్టుకున్నది. ‘ కర్ట్ ’ తనని వదలివేస్తే తనగతి యేమవుతుంది ?

కాని తన అక్క ‘ ఓల్గా ’ తో మాట్లాడినందువల్ల యేమాత్రమూ లాభం ఉండదని ఆమెకు నిశ్చయంగా తెలుసు. ఇంతకు మునుపు ఒకతడవ ‘ కర్ట్ ’కి తెలియకుండానే ‘ ఓల్గా ’ తో కలిసి మాట్లాడింది. ‘ ఓల్గా ’ ‘ ఫ్రుస్సీ ’ మీద కోపంతో ముఖంమీద ఉమ్మేసి అనేకంగా తిట్టింది. ఎర్ర సైనిక యోధుడైన ‘ వ్యాసా ’ తల్లి యింట్లో ఉంటూ ‘ ఫ్రుస్సీ ’ ఆ యింటిని మలినం చేస్తున్నదని తిట్టింది. ‘ ఫ్రుస్సీ ’ కి అప్పుడే ‘ వ్యాసా ’ సంగతి తెలియవచ్చింది... ఇంకా ఈ విధంగా యెన్నెన్నో తిట్టిపోసింది ‘ ఓల్గా ’. అలాంటి అక్కతో ఇంకేంముఖం పెట్టుకు మాట్లాడగలదు ?...

‘ ఓల్గా ’ ఇల్లు దగ్గరలోనే ఉన్నది. ఇంటిముందు నిలబడి ‘ ఫ్రుస్సీ ’ తీవ్రంగా ఆలోచిస్తున్నది. ఏ ముఖం పెట్టుకొని యింట్లోకి పోవటం ? తలుపుకొట్టి పిలవాలా ? కాని ఇంతకూ ‘ ఓల్గా ’ ముఖంముందు యెలా నిలవటం ? మొన్ననే అంత అల్లరిచేసి తిట్టిపోసింది ! మళ్ళీ ఆ పరిస్థితికి నిలవలేననుకున్నది ‘ ఫ్రుస్సీ ’. ‘ కర్ట్ ’ యేమి చేసినాసరే ‘ ఓల్గా ’ కళ్ళ

ముందు మళ్ళీ పడలేచుకున్నది. చటాలున తిరిగివెళ్ళిపోతున్నది. కాని కొంతదూరంపోయి మళ్ళీ ఆగింది. అబ్బ ! ఏం వచ్చేది. 'ఓలెనా' ను చంపినట్టు 'ఓల్గా' ను చంపివేసినా తీరాపోయేది. తన కెందుకొచ్చిన బాధయిది ?

'ఓల్గా' ఇంటి తలుపు తెరుచుకుంటున్నది. ఎవరొవచ్చేది ? ... ప్రుస్సీ హృదయం వేగంగా కొట్టుకోసాగింది. 'ఓల్గా' యేనా ?... కాదు, కాదు,—ఇంకెవ్వరో... ఆం 'ఫెడోసియా' యేనా ? ... ఇక్కడి కెందు కొచ్చింది ?...

'ఫెడోసియా' బయటికివచ్చి చూచి లోపలివారికి ఆత్రంగా యేదో కేకపెట్టి చెప్పింది. అందరూ గబగబ బయటికివచ్చి, వెలుగుకి చేతులు అడ్డంపెట్టుకొని యేదో చూస్తున్నారు. 'ప్రుస్సీ' అటు మళ్ళేటప్పటికి యెవరో బారులుతీరి వస్తుండటం కనిపించింది. ఆ బారులుదీరి వస్తున్నవారికి రెండు ప్రక్కలా విచ్చుకత్తులు తళతళ లాడుతున్నాయి...

"జర్మన్లేనా వచ్చేది ?..." ఎవరో ప్రశ్నవేశారు.

"ఇక్కడ ఉన్నవాళ్ళు చాలకనా ?"

"ఇంకా యేం తినిపోదామనో !..."

"కాదు, కాదు ! జర్మన్లుకాదు ... సరిగ్గా చూడండి ..." అని గుంపులోంచి బన్యూచికా ఉద్రేకంతో అరిచింది.

"నీకు పిచ్చా, యేమి ? వాళ్ళుగాక యింకెవరవుతారు ?"

"అయినా మన సైనికులు పట్టపగలు ఈవిధంగా వస్తారా ?..."

"అమ్మా ! వాళ్ళ టోపీలకు నక్షత్రాలు ఉన్నాయే !" — అని 'గ్రీషా' తల్లి చెయ్యిపుచ్చుకు ఊపాడు.

"నిజంగానా ! నీకు కనుపిస్తున్నాయా"

మంచంమీద ప్రతిఫలించుతున్న కాంతికి కళ్ళు జిగేలుమంటున్నాయి. అయినా ఆ వచ్చేదెవరో తెలిసికోటానికి, అందరూ తమ కళ్ళు ఇంతింత లేసి చేసుకొని పరీక్షగా చూస్తున్నారు.

"జర్మన్లా ? మనవాళ్ళా ?

"అచ్చే, మనవాళ్ళయితే ఇక్కడి జర్మన్లు ఇట్లా చేతులు ముడుచుకు కూర్చుంటారా — చూడండి రోజుకూ తుపాకులు పేల్చను గూడా పేల్చటంలేదు —"

"'గ్రీషా' మాటనిజమే! అదుగో ఆ టోపీలు మనవాళ్లవే కనబడుతున్నాయి .." అన్నాడు 'అలెగ్జాండర్'.

"మనవాళ్లేనా ?"

"అవును...మనవాళ్ళే! కాని సంతోషించవలసిన సమయంకాదు. అదుగో, చూడండి అటు..."

అందరి ముఖాలలో విచార ఛాయలు క్రమ్ముకున్నాయి అతి కష్టంతో కొందరు యెర్రసైనికులు నడుచుకుంటూ వస్తున్నారు వారికి రెండు ప్రక్కలా సాయుధులయిన జర్మను సైనికులు కాపుగా కాస్తూ నడుస్తున్నారు.

"మనవాళ్ళే ..కాని ఖైదీలు..."

అప్పటికప్పుడే ప్రజలందరూ వీధుల్లోకి చేరుకున్నారు. భయంతో నోళ్ళువెళ్ళబెట్టి ఆ వచ్చే సైనికులవైపు చూడసాగారు. ఎర్ర సైనికులు ఆయాసంతో నడుస్తుండటం కనిపిస్తున్నది వేగిరం నడువమని జర్మను సైనికులు కేకలు పెడుతున్నారు.

"అయ్యో దేవుడా! దెబ్బలు తిన్నవారుకూడా ఉన్నారు!"

"వాళ్ళ బూట్లుకూడా గుంజుకున్నారు! ... కాళ్ళు పగిలి ఎట్లా నెత్తురు కారుతున్నాయో !!..."

గుమిగూడుతున్న ప్రజలమీద హూంకరించాడు ఒక జర్మను సైనికుడు కాని యెవ్వరూ అతనిని లక్ష్యపెట్టలేదు అందరిచూపులు తూలిపోతూ నడిచివస్తున్న యెర్రసైనికులమీద నిలచిపోయినై.

"అయ్యో, దేవుడా!"

ఆ యెర్రసైనికులబారు గ్రామాన్ని చేరుకున్నది. వెలవెలబోతూ బాధ గోచరిస్తున్న వారి ముఖాలు స్పష్టంగా కనబడుతున్నాయి. అంతలో ఒక యెర్రసైనికుడు తూలి ప్రక్కకు పడిపోయాడు

"ఏయ్, సరిగ్గా నడువ్!" అని కాపలా సైనికుడు గర్జించాడు. ఎర్రసైనికుడు లేచి నడవటానికి ప్రయత్నిస్తున్నాడేగాని మళ్ళీ తూలిపో

తున్నాడు. ఖైదీలలో ఒకడు ఆ సైనికునికి చేయూతనిచ్చి నడిపించ బోయాడు. జర్మను సైనికుడు తుపాకి మడమతో టపీమని అతనిచేతి మీద మోదాడు. విరిగిన కొమ్మలాగా ఆ సైనికుని చేయి వేళ్ళాడ వేసుకొని నడువసాగాడు.

"అయ్యో, తండ్రీ !"

అతిప్రయాసతో కాళ్ళీడ్చుకుంటూ పోతున్నారు. చలికి విచ్చిపోయిన వారి కాళ్ళనుండి రక్తం ప్రవహించి మంచుమీద మరకలు కడుతున్నది. మాటి మాటికి తూలిపోతూ, జర్మను సైనికులు తుపాకి మడమలతో పొడిచే పోట్లు భరించలేక మళ్ళీ లేచి తూలుతూ నడుస్తున్నారు.

అందరితోపాటు 'ఫ్రుస్సీ' కూడా అక్కడనిలబడి బాధతో క్రుంగి, క్రుశించిపోతూ నడుస్తున్న ఆ సైనికులను తనకు సహజమైన చికాకు చిరు నవ్వుతో చూడసాగింది.

"చాలించిక నీ యికిలింపు !"—అని ఒక కంఠం కటువుగా పలికింది. 'ఫ్రుస్సీ' తిరిగి చూచేటప్పటికి పెదిమలు బిగించి, కనుబొమలు ముడు వించి కోపంతో చిడిచిడిలాడుతున్న 'ఓల్గా' ప్రత్యక్షమయింది. సుద్దలాంటి 'ఫ్రుస్సీ' తెల్లని ముఖమూ, రంగువేసిన ఆ పెదిమలూ, గాలికి ఊగిసలాడే ముంగురులు చూచి 'ఓల్గా' సహించలేకపోతున్నది.

"చాలించు, నీ యికిలింపు !"

'ఫ్రుస్సీ' ఒక అడుగు వెనక్కి వేసింది. నిప్పుల్లా మెరుస్తున్న కళ్ళతో 'ఓల్గా' తన మీదికి ఉరుముతుందనిపించింది.

"నే నేమన్నాను ?"—అని గాభరాపడ్డది.

"ఏమీ అనలేదూ ?" — అంటూ 'ఓల్గా' ఫ్రుస్సీ చెంపమీద ఫెడేలున వేసింది. ఇక అక్కడ నిలబడటానికి ధైర్యంచాలక 'ఫ్రుస్సీ' చరచరా వెళ్ళిపోయింది.

ఎర్రసైనికుల బారు ప్రజలను సమీపించింది. జాలిగొలుపే చూపులతో ప్రజలను చూడసాగారు.

"రొట్టె..." అన్నాడు ఒక ఖైదీ. కాపలాకాస్తూ నడుస్తున్న జర్మను సైనికుడు అతని తలమీద తుపాకిమడమ ప్రయోగించాడు. అయినా ఊరుకోక ప్రక్కనున్న ఖైదీ అందుకున్నాడు.

“రొట్టె...వారం రోజులబట్టి యేమీలేదు...”

పైట నిల్చొని చూస్తున్న స్త్రీలందరు ఒక్కసారిగా లోపలికి పరుగెత్తారు. వణుకుతున్న చేతులతో, రహస్యంగా దాచి ఉంచిన రొట్టెలన్నీ తెచ్చారు.

‘బన్యాచికా’ తన బిడ్డలకోసం అతిరహస్యంగా దాచిఉంచిన రొట్టె ముక్క పుచ్చుకొని, జర్మను కాపలా సైనికులమాట మరిచిపోయి ఎర్ర సైనికులవైపు పరుగెత్తింది.

“దూరంపో!” అని కాపలా సైనికుడు అరిచాడు. కాని ఆమెకు ఆ మాటలు వినబడనేలేదు. కాపలా సైనికుని తొలగించుకొని ముందుకి ఉరికి ఒక యెర్ర సైనికుని చేతిలో రొట్టెముక్క పెట్టబోయింది.

“దూరం పో!”— అని జర్మను సైనికుడు కేక వేస్తూ తుపాకి మడమతో బలంగా ఒక దెబ్బ వేశాడు. ‘బన్యాచికా’ నేలకి ఒరిగిపోయింది. ఆమె చేతిలోంచి రాలిన రొట్టెను జర్మను సైనికుడు కాలితో రోడ్డుప్రక్కకు తన్నేశాడు. ఒక ఖైదీ దానికోసం ముందుకి ఉరికాడు. తుపాకి పేలింది... మరుక్షణంలో ఆ ఎర్ర సైనికుడు నేలకి ఒరిగిపోయాడు.

స్పృహతప్పి పడిపోయిన ‘బన్యాచికా’ని యెవ్వరూ చూడనన్నా చూడలేదు. ఎవరంతట వారు తెచ్చిన రొట్టెముక్కలు ఎర్ర సైనికులకు యివ్వటానికి ముందుకి ఉరుకుతున్నారు.

ఇంతలో జర్మను సార్జెంటు సైనిక కార్యాలయంనుంచి తన సైనికులతో తయారయ్యాడు.

“పోండీ, ఇక్కడ్నుంచి!” అని ఒక గావుకేక పెట్టాడు.

జర్మను సైనికులు తమ తుపాకి మడమలతో స్త్రీలనందర్నీ తరిమివేయటానికి ప్రయత్నింపసాగారు. కాని స్త్రీలు తమ మోచేతులతో దెబ్బలు ఆపుకుంటూ, ఖైదీలమధ్యకి రొట్టెముక్కలు విసురుతున్నారు. ఒక ఎర్ర సైనికుడు రొట్టెముక్కకోసం వంగేడు. జర్మను సైనికుడు తుపాకి పేల్చేసరికి క్రిందపడిపోయాడు.

“కామ్రేడ్స్! లాభంలేదు. అనవసరంగా మీ ప్రాణాలు పోగొట్టుకోకండి. ఈ నీచులు మమ్మల్నెట్లాగూ తిననివ్వరు. ఎందుకు ప్రాణాలు

పోగొట్టుకుంటారు తల్లుల్లారా" ... అని ఒక ఖైదీ యెలుగెత్తి దీనంగా అరిచాడు.

ఇక నేమీ లాభంలేదనుకున్నారు స్త్రీలు. రొట్టెముక్కలు అందుకోటానికి ప్రయత్నించిన ఇద్దరు యుద్ధ సైనికులూ రోడ్డు ప్రక్కన చచ్చి పడి వున్నారు. తుపాకిమడమ దెబ్బతిన్న 'బన్యాచికా' అమితాయాసంతో లేవటానికి ప్రయత్నిస్తున్నది. ఏమిచేయటానికీ తోచక స్త్రీలందరూ చేతిలో రొట్టెముక్కలు పట్టుకుని విచారవదనాలతో యుద్ధ సైనికులవైపు చూస్తూ నిలబడిపోయారు.

"సాషా!"

'మాల్యూచికా' కొడుకు ముందుకువచ్చి నిలబడ్డాడు.

"ఇక మనం యిక్కడ యేమి చేసినా లాభం ఉండదు. తక్కిన పిల్లల్ని వెంటవేసుకొని పరుగెత్తుకెళ్ళి అక్కడే రోడ్డు మలుపులో జర్మన్ల కంటపడకుండా ఈ రొట్టెముక్కలు పడేసిరండి. జర్మన్లు పసికట్టకుండా పడేసిరావాలిసుమా... అక్కడైనా మన సైనికులు ఇన్ని రొట్టెముక్కలు అందుకోగలుగుతారు..." అని 'మాల్యూచికా' తన కొడుక్కి చెప్పింది.

ఏదో పెద్ద గాలివచ్చి కొట్టుకుపోయినట్లుగా, మరుక్షణంలో వీధిలోని పిల్లలందరూ అంతర్ధానమయ్యారు. స్త్రీలందరూ తమ ఇండ్ల గుమ్మాలదగ్గరికి చేరుకుని, తలకు కట్టుకున్న గుడ్డలకొంగులు మునిపళ్ళతో కొరుక్కుంటూ కండ్ల వెంట నీరు పెట్టుకున్నారు...

"ఎట్లాగున్నది?" — అని 'ఫ్రోస్యా' 'బన్యాచికా'ను ఆదరంతో పరామర్శ చేసింది. ఒక గ్లాసుతో నీళ్ళు తెచ్చిపెట్టింది. ఇంత మంచుతీసి ఆమె కణతలమీద రుద్దింది. 'బన్యాచికా' లేచి కూర్చుని చేతులతో ముఖం కప్పుకున్నది.

"ఏం? బాధగా వుందా?"

"అబ్బే, యేమీలేదు — యేమీలేదు, ఫ్రోస్యా..."

"ఫరవాలేదు... కొద్దిసేపు పడుకుంటే నెమ్మదిస్తుందిలే. బెంగపడకు."

"పిచ్చిదానా, నన్నుగురించికాదు భయపడటం. యేదో కొద్ది దెబ్బ తగిలినంతమాత్రాన నేను భయపడతానా?... ఫ్రోస్యా! ఇటువైపు యుద్ధ రంగంలో పనిచేస్తున్న మా ఆయన యెప్పుడైనా ప్రమాదంవల్ల ఇలాంటి

బాధల్లో చిక్కుకునేకంటే, ఒక బాంబుముక్క తగిలి చచ్చిపోతేనే మేలు కదా అని ఆలోచిస్తున్నాను. ఈ యమబాధలు పడేకంటె అదే నయం కదూ?..." అని 'ఫ్రోస్యా' చలిలో నెమ్మదిగా తన హృదయంలో చెలరేగిన ఉద్రేకాన్నంతటినీ ఆ మాటల్లో ఇమిడ్చి చెప్పింది.

"శాంతించు... శాంతించు"

"ఏమంటావు? ఈ బాధలకంటే ప్రాణత్యాగం చేసుకుంటే మంచిది కదూ!"

"సరే, సరే... లోపలికి పద... ఈ చలిలోవుంటే బండబారి చచ్చిపోతావు రా, నే సహాయం చేస్తాను."

'బన్యూచికా' ప్రయాసతో లేచి 'ఫ్రోస్యా'ను ఆనుకుని నెమ్మదిగా యింటికి చేరుకున్నది. 'గ్రీషా' తల్లినిచూచి బిక్కమొగం వేశాడు. పెద్దగా మూల్గుతూ ప్రక్కమీద పడిపోయింది 'బన్యూచికా'. అమితంగా బాధపడుతున్నది. కాని ఆమె మనస్సు మాత్రం ఇంకేదో విషయంమీద లగ్నమయి ఉన్నది.

"'గ్రీషా', ఇటురా నాయనా!"

కొడుకు తల్లి సమీపంలోకి వెళ్ళి నిల్చున్నాడు.

"గ్రీషా! నేను చెప్పేది శ్రద్ధగావిను నాయనా"

"ఏమిటో చెప్పు; వింటాను"

"ఎప్పుడైనా జర్మన్ల చేతిలో చిక్కేకంటే చావేమేలని తెలుసుకో"

"నీకు పిచ్చాయేం? పసివాడితో ఆశేం మాటలు?" — అని 'ఫ్రోస్యా' 'బన్యూచికా'ను మందలించింది.

'గ్రీషా' భయపడి యేడవటం ప్రారంభించాడు.

"చూశావా పిల్లాడెట్లా యేడుస్తున్నాడో, అయినా ఈ మాటలన్నీ వాడికెందుకు. వాడు పెరిగి పెద్ద అయ్యేలోగా ఈ జర్మన్లెవ్వరూ ఇక్కడుండరు."

"అవును. ఈ నీచుల్లో ఒక్కడుగూడా లేకుండా నాశనమైతేగాని ప్రపంచానికి తిరిగి శాంతి కలుగదుసుమా!" అంటూ 'బన్యూచికా' కడుపు అదుముకుంటూ మూల్గింది.

"అబ్బ! ఈ దెబ్బ నన్ను చాలాకాలంవరకు మంచాన్ని పట్టించేటట్టున్నది."

"సరే, ఊరుకో; తగ్గిపోతుందిలే ... నేను మంచినీళ్ళు తెచ్చి పెడతాను"

'ఫ్రోస్యా' మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది. నీళ్ళలో గుడ్డ తడిపి 'బన్యాచికా' దెబ్బమీద వేసింది. ఇంతవరకు యేదో ధ్యాసలో ఉన్న 'బన్యాచికా' కు తన కొడుకు యేడుస్తుండటం హఠాత్తుగా కనిపించింది.

"ఎందుకలా యేడుస్తున్నావూ? చూశావా 'ఫ్రోస్యా' వాళ్ళ తండ్రికిమల్లే వీడుకూడా యెంతటి జాలిగుండెవాడో! అంతా వాళ్ళ తండ్రే."

"వాడిసంగతి యెత్తబోకమ్మా. పసివాణ్ని పట్టుకుని భయపెట్టేస్తున్నావు. అనవసరంగా... వాళ్ళ తండ్రికి వచ్చిన లోటేమిటి?"

"అబ్బె యేమీలేదు. ఏదైనా జరిగితే, నే నిందాక అనుకున్నట్టు చేస్తారో లేదోనని..."

"ఆయనసంగతి ఆయనకు తెలియదా యేం—"

"అదికాదు. ఇక్కడున్నప్పుడు ఇతర్లు అన్నీ చెప్పి మాపలిస్తుంటే గాని యేమీ చేసేవాడుకాదు. ఇప్పుడక్కడ ఆయనకు యేదైనా చెప్పేవారెవరా అని..."

"సరే లేవమ్మా... అతనిప్పుడు సైన్యంలో ఉన్నాడుగద. అధికారులిచ్చే ఆజ్ఞలను పాలిస్తుంటాడు" — అని పలుకుతూ, 'ఫ్రోస్యా' 'బన్యాచికా' కడుపుమీద దెబ్బతగిలినచోట తడిగుడ్డ వేసింది.

"అవును, అవును" అన్నది 'బన్యాచికా'

"'గ్రీషా', ఇలారా; నీ చేతులు కడుగుతాను — చూడు, యెంత మైలగా ఉన్నాయో... ఎందుకేడుస్తున్నావు... మీ అమ్మ చూడు, ఎంత దెబ్బ తగిలినా యేడవటంలేదు —"

'గ్రీషా' ముక్కులో వ్రేలుపెట్టి తిప్పుకుంటూ తల్లి ముఖంవైపు తదేకదృష్టితో చూస్తున్నాడు.

"ఛీ, ఛీ, ఆ వేలు తీసెయ్యి. ఎర్ర సైనికుడి కొడుకు ఇలాంటి పన్లు చేస్తాడా?..." అంటూ 'బన్యాచికా' ఒక మూల్గు మూలిగి 'ఫ్రోస్యా'

నుద్దేశించి మళ్ళీ అన్నది: "...అయ్యో ! ఒక్కరికైనా యింత రొట్టెముక్క దొరకలేదు...పాపం ! అంతా చచ్చిపోతారు—చూడు ! మన దేశంలోనే; ఒక్కరికైనా వాళ్లకు సహాయం చేయలేకపోయాం ... ఇంత రొట్టెముక్క యివ్వలేకపోయాం...మనదేశంలోనే మనం సహాయం చేయలేకపోయాం. ఎక్కడికి తీసుకపోతున్నారో వాళ్లను..."

"'రుడీ'లో ఒక జైలు ఉన్నదిగా; అక్కడికే కాబోలు"

"'రుడీ' దాకా యేం పోతారు, ఇక్కడే నిలవలేని స్థితిలో ఉంటే ? 'రుడీ' ఇంకా యెంతదూరం ఉన్నదో తెలుసునా ? అక్కడివరకూ నడవలేరు సరిగదా, మధ్యలోనే జర్మన్లు ఇందాకటి యిద్దరు సైనికుల్ని చంపినట్టు చంపిపారేస్తారు."

"మనపిల్లలు రొట్టెలతో రోడ్డు మలుపుకి పరుగెత్తారులే. అక్కడ పడేస్తే, ఒకవేళ మనవాళ్లు జర్మన్ల కంటపడకుండా తీసుకోగలగవచ్చు"

"ఏం చేస్తారో మనపిల్లలు ! అదీగాక మన సైనికులు ముందు నడుస్తున్నారు ... ఆ వెనక జర్మను సైనికులు. మనవాళ్ళు ఆ రొట్టెముక్కల్ని చూస్తారో లేదో ?..."

"ఆ భయం నీకేమీవద్దు. మనపిల్లలు సామాన్యులు కారు. సాధించుకు వస్తారులే..."అని 'ఫ్రాన్స్యా' 'బన్యూచికా'కి ధైర్యం చెప్పింది.

మౌనంగా తల ఊపింది, 'బన్యూచికా'. శరీరం నీరసించిపోయి, నిద్ర ముంచుకువచ్చేస్తున్నది. కాని ఆమె కళ్ళముందు ఆ దృశ్యం — ఎర్ర సైనికుడు రొట్టెకోసం ఒక్కగంతువేసి పరుగెత్తిన దృశ్యం—కదులుతున్నది.

"అబ్బా !"

"ఏమిటి ? బాధా ?"—అని 'ఫ్రాన్స్యా' అడిగింది.

"లేదు...నిద్రపోవాలనిపిస్తున్నది"

"చక్కగా నిద్రపో...బాధకూడా తగ్గుతుంది"

'బన్యూచికా' కళ్లు మూసుకున్నది. కాని ఇంకా ఆ దృశ్యం — పాలిపోయిన ముఖంతో, వెర్రి ఆశతో రొట్టెముక్క కోసం పరుగెత్తుతున్న ఆ సైనికుని ముఖం—ఆమె కళ్ళకు కనిపిస్తూనే ఉన్నది. మృత్యుముఖంలో తూలిపోతూ నడుస్తున్న ఆ ఖైదీలను, చిన్న రొట్టెముక్క కోసం వెర్రిగా

పరుగెత్తుతున్న 'ఆ' సైనికుని పాలిపోయిన ముఖము, తన జీవితంలో మొన్నటికీ మరువలేననుకున్నది. 'బన్యాదికా'.

*　　*　　*　　*

పిల్లలంతా కట్టెలు పుచ్చుకొని ఉరకలు వేస్తున్నారు. గ్రామం దాటేవరకు త్రోవబాగానే ఉన్నది. ఆ తర్వాత మంచు ఎక్కువైపోయింది. చుట్టుపట్ల ప్రదేశమంతా యేమీ తెలియకుండా మంచుతో కప్పుకు పోయి ఉన్నది. 'ఓస్కార్ చెకోర్' భుజాలవరకు మంచులో దిగబడిపోయాడు.

"సాషా ! సాషా !"

"నోరుమూయ్యి ! జర్మన్లు వింటారు. నువ్వు చాలా చిన్నవాడివి... వెళ్ళిపో !"

"ఇందులోంచి పైకి రాలేకుండా ఉన్నాను"

"ఎలాగో నువ్వే తంటాలుపడు. నేగాటానికి వీల్లేదు. పదండి... పదండి" — అని 'సాషా' తక్కిన పిల్లల్ని హెచ్చరించుకుంటూ వెళ్ళిపోతున్నాడు.

ఆ ప్రదేశమంతా మిట్టపల్లాలతో కూడికొని ఉన్నది. కాని అవేమీ కనబడకుండా మంచు నిండుగా కప్పుకుపోయి ఉన్నది. ఎక్కడ యేమున్నదీ తెలియటంలేదు. నడుస్తూ నడుస్తూనే పిల్లలు పల్లం ఉన్నచోట్ల మంచులోకి దిగబడిపోతున్నారు. గట్టిపడిన మంచు పై భాగంమీద నడుస్తూ, నడుస్తూ హఠాత్తుగా లోపలికి క్రుంగిపోతుండేవారు. చేతుల సహాయంతో ముందుకి పోదామంటే, రెండు చేతుల్లోను కట్టెముక్కలు ! మంచుముక్కలు గాజు పెంకుల్లాగ కాళ్ళకు గుచ్చుకుంటున్నాయి. పిల్లలు ఒకొక్కరే వెనుకకు దిగబడిపోయారు. చివరికి 'సాషా,' 'సావ్కా లోకట్' లు మాత్రం ప్రయాసపడుతూ ముందుకి పోతూనే ఉన్నారు.

"తొందరగా ! తొందరగా !" — అని 'సాషా' చెప్పుతూ పరుగెత్తుతున్నాడు. శరీరమంతా చెమటలు కారుతున్నాయి. బురదమీద నడుస్తున్నట్లు కాళ్ళు జారిపోతున్నాయి. ఎన్నోసార్లు క్రిందపడిపోయి చేతులు మోపుకుని మళ్ళీ లేవసాగడు. గాజుముక్కలాంటి మంచు ముక్కలు గుచ్చుకొని చేతులు రక్తం కారుతున్నాయి ! అదృష్టవశాత్తు, జర్మన్లు రాక

మునుపు తాను బడికి వెళ్ళేటప్పుడు పుస్తకాలు వేసుకుంటూ వచ్చిన సంచి వెంట పట్టుకొచ్చాడు. అదిప్పుడు చాలా ఉపయోగపడ్డది. రొట్టె ముక్కలతో సంచి భుజానికి తగిలించుకొని, చేతుల సహాయంతో ముందుకి పోతున్నాడు. అతని వెనుకనే 'సాష్కా' నాలిక బయటికి వెళ్ళబెట్టి పరుగెత్తుతున్నాడు. 'సాషా' నడచిన త్రోవనే జాగ్రత్తగా పోతున్నాడు లేకపోతే బలహీనుడైన 'సాష్కా' యేనాడో వెనుకబడిపోయేవాడు.

ఆ మంచు బయలు అంతులేనట్టే కనబడుతున్నది. ఎండాకాలంలో పచ్చని గడ్డితో నిండి పశువులు మేస్తూ ఉండే ఈ బయలు, అటునించి, ఇటు ఇట్టే దాటవచ్చు. నడక వచ్చింది మొదలు ఇదే బయలులో ఆడుకునే అలవాటుగల ఆ పిల్లలకు ఆ ప్రాంతమంతా చక్కగా తెలుసు. కాని ఇప్పుడది కొత్తగాను, అపరిచితంగాను కనబడుతున్నది. ఆటలాడుకుంటూ దూకిన గుంటలు, ఎక్కిన దిబ్బలు, అన్నీ మంచుతో కప్పుకుపోయి ఉన్నాయి. ఇప్పుడు ఎంత ప్రయత్నించినా ఆ ప్రదేశపు రహస్యాలు తెలియటం లేదు. ఆ యిద్దరు పిల్లలు పడిపోతూ, మంచులో భుజాలవరకు కూరుకుపోతూ ప్రయాసపడి ముందుకిపోతున్నారు. ఎప్పటికీ ఆ దారి తరుగుతున్నట్టే కనబడటం లేదు.

"తొందరగా!" — అని నోట్లోకి పోయిన మంచుని ఉమ్మేస్తూ, 'సాషా' అన్నాడు

భుజానికి తగిలించుకున్న రొట్టెల సంచి మంచులో తడిసిపోయి అంతకంతకూ బరువెక్కిపోతున్నది. తడిసిపోయిన గుడ్డలు శరీరానికి కరుచుకొని, ఆపైన వీచే చల్లనిగాలికి శరీరం బండబారిపోతున్నది. ఆ అలసటలో కళ్ళముందు యేమీ కనుపించటంలేదు. ఎర్రగాను, నల్లగాను యేవో వలయాకారంలో కళ్ళముందు లీలగా కదులుతున్నాయి. కణతల్లో రక్తం సమ్మెట్లతో మోదినట్టుగా కొట్టుకుంటున్నది ఏ క్షణాన ఆ రక్తనాళాలు బద్దలైపోయి రక్తం మంచుమీదికి వొలికిపోతుందో అనిపిస్తున్నది.

"తొందరగా! తొందరగా!!"...అని 'సాషా' మళ్ళీ మూలిగేటప్పటికి 'సాష్కా' కొరడాతో కొట్టినట్టు ఇంకా వేగంగా ఉరకలు వేయసాగాడు. కాని 'సాషా'కి ఆ స్థితిలో తన వెంట యెవ్వరు ఉన్నదీ కూడా తెలియటం లేదు. తనకు తెలియకుండానే యేక్షణాన క్రిందపడి పోతానో అన్న భయంతో ఆ విధంగా తనలో తాను గొణుక్కుంటున్నాడు.

‘సాష్కా’ చాలా వెనుకబడిపోయాడు. కాని యేమైనా సరే, ఆ రొట్టెలు రోడ్డు మలుపులో పడేసి రావాలని ‘సాషా’ పట్టుదల. ఆ ఖైదీలకు రొట్టె అందించే మార్గం యిదితప్పితే వేరులేదు. తాను ఆ పనిలో యేమాత్రం విఫలుడైనా సరే ఆ ఖైదీలు, వందలకు వందలుగా ఎర్ర సైనికులు ఇంతరొట్టె ముక్కకు గాని, ఒక్క నీరుచుక్కకు గాని, నోచుకోక నులమల మాడి చస్తున్న ‘రుడీ’ క్యాంపులోకి — మృత్యుద్వారంలోకి—తోలుకొని పోబడతారు! ఆ మృత్యుద్వారానికీ, ఎర్ర సైనికులకీ, తాను — ‘సాషా’ అడ్డు నిలవాలి!!...తన సంచిలో ఉన్న నాలుగు ముక్కలు వారి ప్రాణాలు రక్షించగలవని అతని ఆశ!!

ఆ ఒక్క దిబ్బ దాటిపోతే అదే రోడ్డు. అంతకంతకూ శక్తి సన్నగిల్లి పోవటం గుర్తించి ‘తొందరగా, తొందరగా’ పోవాలని అవస్థపడుతున్నాడు. తల దిమ్మెత్తిపోతున్నది. ‘తొందరగా, తొందరగా’ పోవాలని హఠాత్తుగా ఒక పల్లంలో తల్లక్రిందులుగా పడిపోయాడు. గబ గబ మంచు దులుపుకుని కాళ్ళు చేతులతో ప్రాకుకుంటూ దిబ్బపైకిచేరుకున్నాడు. అదుగో, రోడ్డు!...

అవును, రోడ్డు కనబడుతున్నది. జర్మను సైనికులు కాపలాతో ఎర్ర సైనికులను తోలుకపోతున్నారు! ‘సాషా’కి అదంతా ఒక కలలాగ ఉన్నది. తలకు అగుపడుతున్నది నమ్మగలుగుతో లేదు; నమ్మలేకుండా ఉన్నాడు. కాని అది నిజంగానే తన కళ్ళముందు జరుగుతున్నది! దిబ్బ మీదికి యే విధంగానైతే కాళ్ళు, చేతులమీద ప్రాకుకుంటూ వచ్చాడో, అలానే ఆ కటిక మంచులో ఉండిపోయాడు. ఖైదీలు దాటిపోతున్నారు. మోపయిన దెబ్బలతో నున్నవారు త్రాగినవాళ్ళలాగ తూలిపోతూ నడుస్తున్నారు. జర్మను సైనికులు వారిమీద పొలికేకలు పెడుతున్నారు. ఒక ఖైదీ క్రిందపడి లేవలేకపోతున్నాడు. తుపాకి మడమల దెబ్బలతోను, తిట్లతోను లేచి తూలిపోతూ నడుస్తున్నాడు. ఈ విధంగా ఖైదీలు పోతున్నారు ... పోతున్నారు. ఇంత శ్రమా వృథా! ‘సాషా’ ఆలశ్యమైపోయాడు — రెండు, మూడు నిముషాల్లో! ఖైదీలకు ముందు అంతా శూన్యం—రొట్టె ముక్కలతో తాను వెనుకబడిపోయాడు. ఇక యెర్ర సైనికులకు రొట్టె అందే ఆశలేదు — తాను రెండు నిముషాలు ఆలశ్యమైనందువల్ల — తాను అసమర్థుడైపోయినందువల్ల? ... అన్న ‘మిష్కా’ జ్ఞాపకానికి వచ్చాడు. అవును, ‘మిష్కా’ అయితే యెంతో సమర్థతతో నెరవే

ర్చేవాడు. సమయానికి చేరుకునేవాడు ... ఇక జర్మన్లు ఆ ఖైదీల నందర్నీ 'రుడీ' జైల్లోకి తోలుతారు. అంతా ఆకలికి, చలికి చచ్చిపోతారు ... కేవలం, తాను, 'సాషా' ...

'సాషా' మంచుమీద తల ఆన్చి యేడుస్తున్నాడు. కండ్లవెంట నీరు జలజలా రాలిపోతున్నది. తడిసిపోయిన గుడ్డలు శరీరానికి చల్లగా అంటు కుంటున్నాయి. ఒళ్ళంతా బండబారిపోతున్నది. కాని అక్కడినుంచి కదల టానికి యిష్టంలేదు. కదలలేదు కూడాను. ఖైదీలు వెళ్ళిపోయారు ... కేవలం తాను రెండు నిముషాలు ఆలస్యమైనందువల్లనే! ...

చలి — భయంకరమైన చలిగా ఉన్నది. ఆ చలిలో తూలిపోతూ నడుస్తున్న యెర్రసైనికులను తలుచుకొని 'సాషా' వలవల యేడ్చాడు. తన అన్న 'మిష్కా'ని, గెరిల్లాదళంలో ఉన్న తనతండ్రిని తలుచుకొని దుఃఖిం చాడు. తన అపజయం తలుచుకొంటుంటే అన్నిటికంటే యెక్కువగా దుఃఖం కలుగుతున్నది ...

చలి అంతకంతకూ యెక్కువైపోతున్నది. కాని 'సాషా' లెక్క చేయటంలేదు. అక్కడినుంచి కదల బుద్ధికావటంలేదు.

"'సాషా', లెగు! లెగు!..."

'సాషా' ఉలిక్కిపడి ముఖం మంచులోకి ఇంకా అదుముకున్నాడు.

"లే నాయనా లే! ... చాలా చలిగాఉంది ఏడవకు. నీవు చేయ గలిగిందేదో చేశావు ..."

'మాల్యూచికా' కొడుకు ప్రక్కనకూర్చుని ప్రేమతో తల నిమిరింది.

"చూడు, నీ గుడ్డలన్నీ తడిముద్దలైపోయినాయి. ఇక్కడికి నే వచ్చే టప్పటికి యెంత బ్రహ్మాండమైపోయింది! — నా గుడ్డలు గూడా తడిసి పోయినాయి. పద పోదాము ..."

అతని ముఖం తనవైపు తిప్పుకొని కండ్లలోకి చూచింది. ఏడ్చి, ఏడ్చి అతని కళ్ళు వాచిపోయినవి.

"మనమేమి చేస్తాము తండ్రీ ... యెంతచేసి కూడా లాభం లేకపో యింది" అని విచారంతో అన్నది.

"చా... ఆలశ్యమైపోయింది..."అని వెక్కుతూ అన్నాడు 'సాషా'

“అవును నాయనా! కాని యేం చేస్తాము? దారి సరిగ్గా లేదు. అందులోను అమితమైన మంచు, గాలి. నాలాంటిదాన్ని రావటమే కష్టమై పోయింది. పద ఇంటికి పోదాము —” అంటూ చేతులు పట్టుకుని లేవ నెత్తింది ఇష్టంలేకపోయినా అతడు లేవక తప్పిందికాదు.

“అసలివ్వాళ మనం పొరపాటుచేశాము. అందరం అట్లా వీధుల్లో తొక్కిళ్ళదకుండా ముందే యిక్కడికివచ్చి రొట్టెముక్కలు పడేసి ఉంచితే బాగుండేది. కాని ఇలా జరుగుతుందని యెవరికి తెలుసు... ఈసారి సమయం పడితే జాగ్రత్తపడాలి...”

తల వంచుకొని తల్లి పక్కనే నడుస్తున్నాడు ‘సాషా’.

“ముక్కున ప్రాణాలు పెట్టుకొని ఇంటికివచ్చిపడ్డాడు ‘సాష్కా’ ‘సాషా’ యేడీ అని అడిగాను. నువ్వు మంచులో పడిపోయి ఉన్నావని చెప్పాడు. ఆ మాట వింటూనే అన్నీ వదిలేసి పరుగెత్తుకు వచ్చాను. ఏడవకు ... ఏం చేస్తాములే ... మంచు యిట్లావుంటే ...”

తనంతటతాను నడవటానికే ‘మాల్యూచికా’కి కష్టంగా ఉన్నది. కొడుకుని మాట్లాడించుకొంటూ తీసుకుపోతున్నది — “నా వెనకాతలే నడుచుకుంటూరా. అది సులభంగా వుంటుంది...”

‘సాషా’ ఇందాకా అక్కడికి పోతున్నప్పుడు మంచులోపడ్డ దారి వెంటనే మళ్ళీ తిరిగివస్తున్నారు. దారి సరిగ్గానే కనబడుతున్నప్పటికి ‘సాషా’ నడువలేకుండా ఉన్నాడు. బూట్లు ఒక్కొక్కటే వందపౌన్లు బరువు ఉన్నట్టనిపించింది. కాళ్ళు, చేతులు ఉక్కువాటిలాగ మహా భారంగా ఉన్నాయి. శరీరమంతా పోటుపొడుస్తున్నది.

నడుస్తూ నడుస్తూ ‘సాషా’ తూలిపోయాడు. తల్లి పట్టుకుని ఆపింది.

“ఏం? ఎట్లాగున్నది బాబూ?”

“ఏంలేదు-ఏంలేదు-” అని గొణిగాడేగాని కళ్ళు గిర్రున తిరిగి పోతున్నాయి. ప్రపంచమంతా తలక్రిందులైపోతున్నట్టున్నది.

‘మాల్యూచికా’ వంగి కొడుకుని చేతుల్లోకి తీసుకున్నది.

“వద్దు...వద్దమ్మ...” అని నిరాకరింపబోయాడు. కాని అంతలోనే మగత నిద్రలో పడిపోయాడు. కొడుకు ముఖంమీద కనబడే చిరునవ్వు చూచి తాను కూడా నవ్వుకున్నది ‘మాల్యూచికా’.

"ఏమిటిది ?... ఏమీ జరిగిందీ ?" అని కట్టెలమోపు మోసుకొస్తున్న 'ఔర్ఫిలిశా' గాభరా పడుతూ అడిగింది.

"అబ్బె, యేమీలేదు. ఈమంచులో ఆ యెత్తుపల్లాల్లో పరుగెత్తే టప్పటికి అలసి పోయాడు."

"సమయానికి అందుకున్నాడా ?"

"వుఁహూఁ... అందుకోలేకపోయాడు. అసలు పెద్దవాళ్ళు చేరుకో టమే బ్రహ్మాండమై పోతున్నప్పుడు పసివాడికి యేమి సాధ్యమవుతుంది ?"

ఇద్దరూ మాట్లాడుకొంటూ 'మాలుష్యాచికా' ఇంటికి చేరుకున్నారు.

"కొద్దిగా తలుపుతీసి పెట్టమ్మా... చేతిలో పిల్లాడున్నాడు..."

'ఔర్ఫలిశా' తలుపు తెరిచింది.

"అమ్మా ? అన్నయ్యకేమయ్యిందే ?" - అని చిన్నబిడ్డ 'జినా' యేడ్వసాగింది.

"ఏంలేదు_ఏంలేదు. అల్లరి చెయ్యక. నిద్రపోతున్నాడు... లేచి పోతాడు..."

నిద్రపోతున్నాడా !" - అని పిల్లలు ఆశ్చర్యంగా అడిగారు. 'సాషా'ని ప్రక్కమీద పరుండబెట్టి తడిగుడ్డలు విప్పేసి, ఒళ్ళంతా తుడుస్తుంటే పిల్లలు తిల్లిచుట్టూ చేరి చూస్తున్నారు.

"నువ్వెళ్ళి కళ్ళావమ్మా. నీ గుడ్డలుగూడా తడిసిపోయినాయి". అని 'సోన్యా' అడిగాడు.

"ఆరిపోతాయిలెండి... ఈ సంచి అవతల పెట్టండి..."

"ఏమున్నాయమ్మా, సంచిలో ?"

"రొట్టెలు ... బయటికి తియ్యండి"

"తడిసి పోయినాయి_"

"ఫరవాలేదు తినెయ్యండి"

"తినవా? _ అని 'జినా' ఆకలి ద్యోతకమయ్యే చూపులతో అడిగింది.

"తినండి 'సోన్యా' అందరికీ పంచిపెట్టునాయనా 'సాషా' కి కొద్దిగ వుంచండి. లేచినాక తింటాడు."

"అమ్మా నీకో ?"

"నాకవసరంలేదు తల్లీ...ఆకలి వెయ్యటంలేదు..."

ఆత్రంతో రొట్టెముక్కలు తింటున్న పిల్లలవైపు చూడసాగింది. చివరికి ఆ రొట్టెముక్కలు ఖైదీలకు అందలేకపోయినాయే అని బాధపోయింది. 'సాషా' యెంత ప్రయాసపడ్డా లాభంలేకపోయింది...

'సాషా' అమాయకంగా నిద్రపోతున్నాడు. మళ్ళీ అతని బుగ్గలు యెప్పటిలాంటి రంగుకి తేరాయి.

పిల్లలందర్నీ చూస్తుంటే 'మిష్కా' జ్ఞాపకానికి కొచ్చాడు.

'మాల్యావికా'కి హృదయంలో బల్లెపుపోటు, తగిలినట్టయింది. అయ్యో ! ఇంకెక్కడి 'మిష్కా'!...

'మిష్కా' చనిపోయాక యెన్ని ఘోరాలు జరిగాయి?...... పాలిపోయిన ముఖాలతో తూలిపోతూ నడుస్తున్న ఖైదీలు ఆమె కళ్ళ ముందు కనబడసాగారు. ఆకలితో ఆ యిద్దరు యెర్రసైనికులు వెఱ్ఱిగా రొట్టెముక్కలకోసం పరుగెత్తుతూ జర్మను సైనికుల తుపాకి దెబ్బలకు గురిఅయి రోడ్డుప్రక్కన దొర్లిపోతున్న దృశ్యం ఆమె కండ్లల్లో మెదల సాగింది.

'మాల్యావికా' రెండుచేతులతోను కళ్ళుమూసుకున్నది. ఏరోజు కారోజు కష్టాలు అధికమైపోతున్నాయి. ఏక్షణాన యేమిఘోరం జరుగు తుందో తెలియటంలేదు ... తన భర్త 'ప్లాటన్' యెక్కడున్నాడో ? ఎప్పటికైనా తనకు మళ్ళీ కనబడతాడా ? అసలు బ్రతికి ఉన్నాడోలేడో ? 'ఓలెనా', 'లివాన్యుక్' ల లాగ యే మంచుక్రింద యెక్కడ పడు న్నాడో ! ... జర్మన్లు వచ్చి ఒక నెల ఇంకా తిరగనప్పటికీ ఒక యుగం ఒక జీవితం గడిచినట్లుగా, అనేక సంవత్సరాలు, అనేక కష్టాలు దొర్లి పోతున్నట్టుగా ఉన్నది. పూర్వపు రోజుల్లో ఆ పాలాలు, ఆ కోతలు, కళ్ళాలతో నెలలు సంవత్సరాలుగూడా నిముషాల్లో గడిచిపోయినట్టుగా ఉండేది. కాని ఇప్పుడు – ఈ నెల – తన జీవితంలోని ఇతర కాల మంతటిలోగూడ లేనటువంటి కష్టాలతోను, దుఃఖాలతోను, హృదయంలోని గాయాలతోను, తన జీవితంలో యెన్నటికీ మరుపుకి రానటువంటిదై పోయింది...

'సాషా' హఠాత్తుగా మేల్కొన్నాడు. తాను ఇంట్లో ఉండటం చూచుకుని ఆశ్చర్యపోయాడు. తాను స్పృహతప్పి పడిపోవటమూ, తల్లి యింటికి యెత్తుకొనిరావటము అతనికి గుర్తులేదు. ఇంటి కప్పువైపు చూచాడు. వాళ్ళ యిల్లే! చెల్లెలు 'జినా' యేదో మాట్లాడుతున్నది. తల్లి ఒక మూల కూర్చుని యేదో ఆలోచిస్తున్నది. 'సాషా' తన కాళ్ళను కప్పుకున్న గొంగడిలో నెమ్మదిగా చాచుకున్నాడు. కాలివేళ్ళు నొప్పి పెట్టసాగాయి.

"ఏమిటమ్మా, ఆలోచిస్తున్నావు?" – అని అడిగాడు.

'మాల్యాచికా' చటాలున ప్రక్కకు తిరిగింది.

"లేచావూ?"

"ఆఁ ఇక నిద్రపోను."

"అప్పుడే పక్కమీదనుంచి లేవకు. శరీరం చాలా అలసిపోయి ఉన్నది."

గొంగడి సరిగ్గాకప్పి అతని ప్రశ్న అప్పుడే విన్నదానిలాగ యిలా అన్నది :

"మనవాళ్ళు యెప్పుడువస్తారో అని ఆలోచిస్తున్నాను."

కళ్ళు పెద్దవిచేసి తల్లివైపు చూచాడు 'సాషా'.

"ఇక్కడికి, మన ఊరికేనా?"

"అవును, మనఊరికే"

" 'రుడీ'కి గూడానా?" అని ఇంకా ఆశతో అడిగాడు.

"అవును. 'రుడీ'కి గూడా...అన్నిచోట్లకి వస్తారు. జర్మన్లు యెక్కడెక్కడయితేచేరి ప్రజల్ని నానాహింసలు పెడుతున్నారో అన్ని చోట్లకూ—"

"నాన్నగూడా యింటికివస్తాడా, అమ్మా?"

"అవును...గెరిల్లాలతోపాటు మీ నాన్నగూడా తిరిగివస్తారు."

"మళ్ళీ అంతా మునుపటికిమల్లే అవుతుందా?"

"మునుపటికిమల్లే ... కాకపోతే అంతకంటే సుఖంగాకూడా ఉంటాము."

ఆమె మాట్లాడటం మానివేసి, మళ్ళీ మునుపటి విధంగా అంతా సౌఖ్యవంతం కావటం సాధ్యమేనా అని ఆలోచించసాగింది ... మళ్ళీ యింటిచుట్టూ చక్కని తోట పెరుగుతుంది. వన్నెవన్నెల పువ్వులు పూస్తాయి. కిలకిలలాడుతూ పిల్లలు బడికి పరుగెడుతారు. రొట్టె పాలు మొదలైనవన్నీ కావలసినన్ని. సాయంత్రంపూట గ్రామస్థులందరూ క్లబ్బుకి చేరి పత్రికలు చదువుకుంటుంటారు...

జర్మన్లు యెన్ని చేసినా, యెన్ని కష్టాలు కలిగించినా మళ్లీ యివన్నీ తప్పక చేకూరుతాయి. నిజమే! 'మిష్కా' మళ్లీ బడికి పరుగెత్తక పోవచ్చును: 'లివాన్యుక్' మళ్లీ పొలాల్లో ఆనందంతో పాటలు పాడక పోవచ్చు; తిరిగి 'ఓలెనా' ట్రాక్టరు నడుపకపోవచ్చు. కాని జీవితం మళ్ళీ యెప్పటివిధంగా గంతులువేసుకుంటూ పురోభివృద్ధికి పోకమానదు: ఒక సంవత్సరాన్ని మించి మరొక సంవత్సరం పంటలు పండుతాయి; ఆవులు పాల నిస్తాయి; పిల్లలు చదువులకు పట్టణాలకి పోతారు. ఇవన్నీ జరుగకమానవు – తాను యెన్ని ప్రమాదాలు వచ్చినా, చలనం లేకుండా ధైర్యంగా నిలిచిఉంటే – ఇవన్నీ జరిగితీరుతాయి...

సూర్యుడు అస్తమిస్తున్నాడు. బంగారు వన్నెకాంతితో ఇల్లంతా నిండిపోయింది. అంతకంతకు చీకటి చిక్కబడిపోయింది. మంచులాంటి తెల్లదనంతోను, చల్లదనంతోను చంద్రుడు నెమ్మది నెమ్మదిగా ఆకాశం లోకి వచ్చి చేరుకున్నాడు.

గ్రామమంతా అశాంతితో కూడుకున్న భయంకరమైన నిద్రలో మునిగిపోయింది.

'సాషా' తన పక్కలో ఒత్తిగిలి యేదో కలవరించటం ప్రారంభించాడు.

'మాల్యూచికా' లేచి కొడుకు దగ్గరికి వెళ్ళింది.

“నాయనా, 'సాషా' ...!”

“ఏమిటి?” అని 'సాషా' ఉలిక్కిపడి లేచాడు.

“ఏమిటో కలవరిస్తున్నావు ... చెడ్డకల పడ్డట్టుంది —”

'సాషా' తల్లివైపు చూచాడేగాని ఆమె అన్నమాటలు యేమిటో తెలియలేదు. మళ్ళీ నిద్రలో మునిగిపోయాడు. కాని అంతలోనే మళ్ళీ యేదో భయంతో కలవరించటం ప్రారంభించాడు.

*   *   *   *

జర్మన్లు బంధించిన అయిదుగురు ఖైదీలలో 'గ్రోషాచ్' తప్ప అందరూ మేలుకొనే ఉన్నారు. 'మలాషా' ఇంకా ద్వేషాగ్నిలో మండి పోతూ, గంభీరంగా ఆలోచిస్తూనే ఉన్నది. మరొకరోజు గడిచిపోయింది! కాని యేమీ మార్పులేదు. దాహంతో గొంతు ఆరిపోతున్నది. కాని ఆమె కళ్ళముందు 'ఆ'రోజు కనిపిస్తూనే ఉన్నది ... గ్రామంలో యేదో జరుగు తున్నది. ప్రజలు జీవిస్తున్నారు — చస్తున్నారు. పగటివేళ యేవో తుపాకి గుండ్ల శబ్దాలు వినుపించాయి. సాధారణంగా జర్మన్లు తమ గుండ్లను వృథా చెయ్యరు. ఎవరో చస్తున్నారన్నమాట! అందరూ చస్తున్నారు. కాని తాను- 'మలాషా'— మాత్రం తన గర్భంలో జర్మను శిశువుని, జర్మను పెంటను, పెంచుకొంటూ జీవిస్తున్నది ...

'యాడోకిమ్' తాత దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచాడు.

"ఏం? నిద్రరావటంలేదూ?"—అని 'చెకోరికా' అడిగింది.

"నిద్ర యెట్లా వస్తుంది? నీకు మాత్రం నిద్రవస్తున్నదా చెప్పు?"

"అదికాదు ... ఇంథాక వీధిలో వినబడ్డ తుపాకి కాల్పులు యెవరి మీద కాల్చివుంటారా అని ఆలోచిస్తున్నాను ... దగ్గరలోనే కాల్చినట్లు వినబడినవి కదూ!"

"దగ్గరో, దూరమో చెప్పటం కష్టం. ఇక్కడ ఉంటే యేదీ సరిగ్గా తెలియదు. చర్చికంటే దగ్గరో మాత్రం అయి ఉండదనుకుంటాను."

"ఏమో, యేం చెప్పగలం?"

"మనం బయటపడ్డాక తెలుస్తుందిగా"—అని 'ఓల్గా' నెమ్మదిగా అన్నది.

"అవీ నిజమేలే—"

వాళ్ళంతా విముక్తిపొంది మళ్ళీ బయటకి పోతామని యితరుల నోటి వెంట వినాలని 'ఓల్గా' కుతూహలం. లేదు ... తాము తప్పక విముక్తి

పొంది స్వేచ్ఛగా వుండే గ్రామస్థులతో మళ్ళీ స్వేచ్ఛగా తిరగ గలమని ఆమె వెర్రి నమ్మకం ... ఒక నిట్టూర్పు విడిచింది.

"తాతయ్యా! నిద్ర యెలాగూ రావటంలేదు. కాలం గడపటానికి యేదైన ఒక కథ చెప్పరాదూ?..."

"ఏం కథ చెప్పను? ... ఏమో ... కథ చెప్పబుద్ధి పుట్టటం లేదు" అన్నాడు 'యూడోకిమ్' తాత.

"పోనీ, యేదైనా పాటపాడు" అని 'ఓల్గా' మళ్ళీ అడిగింది.

"ఏమిటి? పాడటం? ఇక్కడ?"

"ఫరవాలేదు. మెల్లిగా పాడుదూ...వాళ్ళకేమీ వినబడదులే..."

'యూడోకిమ్' తాత తల ఊపుతూ అన్నాడు;

"సరే పాడతాను...కాని నాకు కొత్తపాటలేమీరావు. మా తాత యీ పాట పాడుతుండేవాడు. అది నాకగూడా కంఠతా వచ్చింది. చాలా పాతపాటలే..."

ముసలితనంలో వణుకుతున్న కంఠంతో ఇలా ప్రారంభించాడు.

"అవనిలో నెల్లెడా
అన్యాయమేగూడె
న్యాయంబు నెలకొల్ప
లేలెండీ, రారండీ..."

"ఊఁ హుఁ ... ఈ విధంగా పాడలేను. పూర్వం పాట చక్కని వాయిద్యాలతో పాడేవారు..."

"ఫరవాలేదు బాగానే వుంటుంది పాడు తాతయ్యా!"

"కరుణింపుమో ప్రభూ!
దీవింపుమయ్యా!
న్యాయంబు నెలకొల్ప
పోరాడు వీరుల ..."

"ఓ ప్రభూ! న్యాయం కోసం, ధర్మం కోసం పోరాడుతున్న వారిని దీవించు—" అని 'చెకోరికా' తనలోతాను అనుకున్నది.

పూర్వకాలంలో "ఉక్రేనియను' ప్రజలు బానిస జీవితాలు గడుపుతూ, యుగయుగాలుగా కన్నీటికాల్వల దాటివచ్చినప్పుడు ఈ విషాద గీతిక ఉద్భవమయింది. సర్వమానవ స్వాతంత్ర్యాన్ని కలిగించి, అన్ని దేశాలను నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా చేసిన సోవియటు ప్రభుత్వం వచ్చినతరువాత ఈ మాటలందరూ మరచిపోయారు. కాని నాజీపిశాచం ప్రళయతాండవ మాడుతున్న యీనాడు ప్రజలకు మళ్ళీ ఆవిషాదగీతిక వినపడసాగింది. యుగయుగాల వెనుక కనబడిన మానవత్వమే మళ్ళీ కనపడసాగింది.

"కరుణింపుమో ప్రభూ !
దీవింపుమయ్యా—
న్యాయంబు నెలకొల్ప
పోరాడువీరుల..."

'యశాడోకిమ్' తాత కంఠం కంపిస్తూ ఆగిపోయింది. నిద్ర కమ్ముకొని తలలు ఒరిగిపోయాయి.

9

నిద్రపోతున్న 'ఫెడోసియా' ఉలిక్కిపడిలేచి కూర్చున్నది. ఎవరో ఆమెను ఊపి మేల్కొల్పినట్లయింది. హృదయం దడదడ కొట్టుకొనసాగింది. గాభరాపడుతూ చుట్టూ చూచుకున్నది.

ఎవరు లేపారు? ఎప్పుడు నిద్ర ముంచుకొచ్చేసింది? అసలు నిద్ర రానే రాదనుకున్నది. అటువంటిది యెలా నిద్రముంచుకువచ్చేసింది? కాని యెవరు లేపినట్లు? ఎట్లా మెలుకువ వచ్చేసింది!...

పోనీ యేదైనా శబ్దంవల్ల మెలుకువ వచ్చిందంటే అదీలేదు. అంతా నిశ్శబ్దంగావుంది. చివరికి రోజూ వినబడే 'కర్ట్' గురక అయినా వినిపించటంలేదు. 'కర్ట్' ఇంకా యింటికి తిరిగిరానేలేదు. అయినా తనంతట తనకు మెలుకువరాలేదు కూడాను. తప్పకుండా యేమిటో, యేదో ఆమెను మేల్కొల్పి వుంటుంది. అందుకే ఆమె హృదయం అలా దడదడ కొట్టుకొంటున్నది.

ఆమె మళ్ళీ పడుకొనలేదు. జాగ్రత్తగా వింటున్నది. ఇంటిలోను; బయటాకూడా అంతా నిశ్శబ్దంగా ఉన్నది. సాయంకాలానికే గాలి జోరు తగ్గిపోయింది. రాత్రి ప్రశాంతంగావుంది. చంద్రుడు ఆకాశంలో నెమ్మదిగా ప్రయాణం సాగిస్తున్నాడు. అతని చుట్టూ ఒక వలయాకారం యేర్పడింది. కిటికీగుండా చంద్రుని చల్లని వెలుగు లోపలికి పడుతున్నది.

హఠాత్తుగా కిటికీ అవతల యేదో అలికిడయింది. ఏదో చిన్న మూల్గు, బలవంతంగా గొంతు నొక్కినట్టు వినిపించింది. 'ఫెడోసియా' చటాలున లేచి రిక్తపాదాలతోనే నడవలోకి పరుగెత్తింది. తలుపు గొళ్ళెం మీద చెయ్యివేసి చూసేటప్పటికి అది తగిలించిలేదు. 'కర్ట్' ఇంకా యింటికి రాలేదన్నమాట... రాత్రుళ్ళు యింటికి తిరిగివచ్చినప్పుడు తలుపు జాగ్రత్తగా బిగించుకుంటాడు...

నెమ్మదిగా తలుపు తెరిచింది. ఏవో నీడలు కదులుతూ కనుపించినై.

"ఎవరిది ?"

అని యెవరో ఆమెను ప్రశ్నించారు. తక్షణం ఆమె గుర్తుపట్టేసింది. గుండె దడదడ కొట్టుకుంటుంటే రెండు చేతులతోను హృదయం గట్టిగా అదుముకున్నది.

"నేనే...వాడింకా యింటికి చేరుకోలేదు—నెమ్మదిగారండి" అని ఆమె నెమ్మదిగా అన్నది.

నడవలోకి చేరుకున్నారు. మొన్నటి ఎర్రసైనికుని ముఖం ఆమె గుర్తుపట్టింది.

"ఇంకా వాడు రాలేదు. సైనిక కార్యాలయంలో ఉండవచ్చు."

"అయితే యిక్కడికెందుకు? సైనిక కార్యాలయం దగ్గరికే పోదాం పదండి!"

"ఒక్క నిముషం ఉండండి...అది ఇక్కడే ఉన్నది-" అని తన లోని ఉద్రేకాన్ని అణుచుకుంటూ నెమ్మదిగా అన్నది 'ఫెడోసియా'.

"అదంటే?" - నెళ్ళిపోవటానికి ఆత్రం కనబరుస్తూ కమాండరు అడిగేడు.

"వాడిముండ-"

"దానిపని రేపు చూడొచ్చులే-ఆ జర్మను దాని పని రేపు..."

"అబ్బే, జర్మనుది కాదు. మనదేశపుదేను." అన్నది 'ఫెడోసియా'

"అలాగునా? ఏదీ, యెక్కడున్నది?"

"ఆ గదిలో నిద్రపోతున్నది."

"ఒకసారి చూద్దాము...ఏదైనా వెలుగు చూపించగలవూ?"

"అమ్మో, కాపలా సైనికుడు కనిపెట్టెయ్యడూ!"

"ఎక్కడి కాపలా సైనికుడు...వాడిపని అప్పుడే పూర్తిచేశాం"

"అలాగైతే దీపం వెలిగిస్తాను"

అగ్గిపెట్టెకోసం వణుకుతున్న చేతులతో చీకట్లో వెదకసాగింది. వచ్చేశారు!...చివరికి మనవాళ్ళు వచ్చేశారు...

అందులో ఒక సైనికుడు ఆమెకు అగ్గిపెట్టె అందిచ్చాడు. దీపం వెలిగించి వత్తి యెక్కిచ్చింది.

"మనవాళ్ళు అయిదుగుర్ని జామీనుగా తీసుకెళ్ళి సైనిక కార్యాలయంలో ఖైదు చేశారు!"

"ఇక భయం లేదమ్మా ... మనవాళ్ళు అప్పుడే సైనిక కార్యాలయం దగ్గరికిగూడా చేరుకొన్నారు. ఆ ఖైదీలను విడిపించేస్తారు. గల్లంతులేకుండా యీ కెప్టెన్‌ని పూర్తిచేసిపారేద్దామని ఇక్కడికి వచ్చాను."

"ఊఁహూఁ వాడింకా తిరిగి యింటికి రాలేదు. అక్కడేపనిమీద ఉండి వుంటాడు" అని చెప్తూ 'ఫ్రుస్సి' పడుకున్నగది తలుపు నెమ్మదిగా తెరచింది. ఎర్రసైనికులు జాగ్రత్తగా మునివేళ్ళమీద నడుచుకుంటూ లోపలికి వెళ్ళారు. 'ప్రుస్సి' మీద వెలుగుపడేటట్లు 'ఫెడోసియా' దీపం పైకి యెత్తింది.

'ప్రుస్సి' లేచి, ఆ లోపలికి వచ్చినది. 'కర్ట్' అనుకని నిద్రమత్తుతోనే యేదో గొణిగింది. కాని జవాబురాలేదు. ప్రక్కకు తిరిగి, ముఖం మీదపడి ఉన్న జుత్తు తొలగించుకొని చూచింది.

ఎర్రసైనికుల్లో ఒకడు 'ఫెడోసియా' చేతిలోంచి దీపం హఠాత్తుగా గుంజుకుని ముందుకి ఉరికి యిలా అరిచాడు:

"ఎవర్తె యిది?"

"జర్మను కెప్టెన్ పట్నంనుంచి తెచ్చుకున్న ముండ" అని 'ఫెడోసియా' అతనికి తెలియజేసింది.

'ప్రుస్సి' నిర్ఘాంతపోయి ఆ సైనికుణ్ణి చూడసాగింది. తొడుక్కున్న సిల్కుగౌను ఒక ప్రక్కకు తొలగిపోయి ఆమె వక్షం బయటికి కనుపిస్తున్నది. భయంతో మంచం కొనకు పిచ్చిక పిల్లలాగ ముడుచుకుపోయింది. ఆ యెర్ర సైనికుడు కంపించిపోతున్నాడు. దీపపుకాంతిలో ఎర్రరంగువేసుకున్న 'ప్రుస్సి' గోళ్ళు, తళతళలాడే పళ్ళు మెరుస్తున్నాయి.

"నిర్ల్యేషా"

ఆమె కంఠం విని ఎర్రసైనికుడు తేరుకున్నాడు. శరీరమంతా వణకసాగింది. తనను కాపాడుకోటానికి కన్నట్టు బలహీనంగా, సన్నగావున్న తనచేతిని అడ్డం పెట్టుకున్నది 'ప్రుస్సి'. రంగువేసిన గోళ్ళు యెర్రగా

మెరుస్తున్నాయి. ఆమె గుండ్రని కళ్ళు భయంతో నిండిపోయినై. జారిపోయిన సిల్కు గౌనులోంచి వక్షం అసహ్యంగా బయటికి కనుపిస్తున్నది.

బయటినుంచి తుపాకి శబ్దం వినిపించింది.

"సైనిక కార్యాలయందగ్గరే..." అన్నది 'ఫెడోసియా'.

ఇంకా కొన్ని తుపాకి గుండ్లశబ్దాలు అనేక వైపులనుంచి వినవచ్చినాయి.

'సిరోష్కా' తనచేతిలోకి పిస్తోలు తీసుకున్నాడు.

పరిచితమైన 'ఫ్రుస్యా' కండ్లలోకి రెప్పవాల్చకుండా చూచాడు. గుండు పేలింది. 'ఫ్రుస్యా' ఉలిక్కిపడింది. నోరు వెళ్ళబెట్టేసింది. కోరలలాంటి పళ్ళు ధగధగ మెరుస్తున్నాయి. గుడ్లు యింతింతలు చేసింది. అలానే నిలిచిపోయినై.

"పదండి సైనిక కార్యాలయానికి"—అని 'సిరోష్కా' ఆజ్ఞ నివ్వటమే తరువాయిగా సైనికులందరూ బయటికి ఉరికారు.

సంఘర్షణ ప్రారంభమైంది. జర్మన్ల ఫిరంగులను స్వాధీనం చేసుకోటానికి నియోగించబడ్డ సైనికభాగంలోని ఒక యెర్ర సైనికుడు యిందాకటి మొదటిగుండు పేల్చాడు.

జర్మను కెప్టెన్‌ని తుదముట్టించటానికి 'సిరోష్కా' కొంతమంది సైనికులతో వస్తుండగా, మరికొంతమంది జర్మను ఫిరంగులను స్వాధీనం చేసుకోటానికి అతిరహస్యంగా ప్రాకుకుంటూ వెళ్ళసాగారు. తెల్లని మస్తుల సహాయంతో ఆ మాచుగా కనబడకుండా ఫిరంగుల దళం ఉన్నచోటికి చేరుకున్నారు. సార్జెంటు 'సెర్‌డ్యూక్' ఆ దళాన్ని నడుపుతున్నాడు. తెల్లనిమంచు వాతావరణంలో ఫిరంగులు నల్లగా నోళ్ళు తెరచుకుంటూ కనబడుతున్నవి. ఆ సమీపంలో ముగ్గురు జర్మను సైనికులు ఒక దగ్గర కూర్చుని నెమ్మదిగా యేదో మాట్లాడుకుంటున్నారు. గస్తీ సైనికుడు ఫిరంగులముందు అటూ, ఇటూ తిరుగుతున్నాడు.

'సెర్‌డ్యూక్' ఊపిరి బిగబట్టుకని కాచుకు కూర్చున్నాడు. గస్తీ సైనికుడు ఆ సమీపం వరకు వచ్చి వెనక్కి తిరిగాడు. అతని వీపు, ఆ పెనుతుపాకిలోని విచ్చుకత్తి మసకగా కనుపిస్తున్నాయి. 'సెర్‌డ్యూక్' నెమ్మదిగా అటు కదిలి వాడిమీదికి లంఘించాడు. ఇద్దరూ మంచుమీదికి

దొర్లిపోయారు. గస్తీ సైనికుడు ఏం పెట్టేలోగా, ' సెర్ డ్యూక్ ' అతని గొంతు నొక్కేశాడు. కాని తను తోడి సైనికుడు కనబడకపోవటం తక్కిన జర్మను సైనికులకు అనుమానం కలిగించింది.

"ఓయ్, హేన్స్ !" — అని వారిలో ఒకడు గాభరాపడి కేక వేశాడు. అదేసమయంలో ఒక యెర్ర సైనికుడు అజాగ్రత్తగా ఒక యెండు కట్టెపుల్లమీద కాలువేశాడు, శబ్దమయింది. అది విని జర్మను సైనికులు తుపాకులు తీసుండటం చూచి, ఆ యెర్ర సైనికుడు తత్తరపడిపోయి, తనకు సమీపంలో ఉన్న ఒక జర్మను సైనికుడిమీదికి తుపాకి పేల్చాడు. తక్షణం వాడు క్రింద కూలిపోయాడు. ఎర్ర సైనికులకే ఆశ్చర్యం కలిగేటట్టు మరుక్షణంలో తక్కిన యిద్దరు జర్మను సైనికులు నేలకు కూలటమూ, ఫిరంగులు యెర్ర సైనికుల వశంకావటమూ జరిగిపోయింది. ఇంతలోనే జర్మను కార్యాలయం వైపునుంచి వారివైపు తుపాకులు పేలసాగినై.

"పదండి త్వరగా !"—అని ' సెర్ డ్యూక్ ' అరిచేడు. అంతలోనే తమముందు నీడలు పరుగెత్తుకు రావటం కనిపించింది.

ఎర్ర సైనికులు కొద్దిగానే ఉన్నారని గ్రహించి జర్మను తుపాకులు పేల్చుకుంటూ ముందుకి ఉరికి వస్తున్నారు. ' సెర్ డ్యూక్ ' క్రిందపడి పోయాడు. కుడికాలు బ్రహ్మాండంగా నొప్పిపెట్టింది.

"ఏం జరిగింది ?"

"ఏం లేదులెండి ... ఇక కాల్చండి !"

ఒక జర్మనుసైనికుడు కూలిపోయాడు. ఐనా అంతటితో తక్కిన వాళ్ళు ఆగిపోలేదు. తెరిపిలేకుండా తుపాకులు కాలుస్తున్నారు.

"భూమిమీద పడుకొని కాల్చండి !"

ఎర్ర సైనికులు ఫిరంగుల వెనుక నక్కారు. తెల్లని మంచు వాతావరణంలో నల్లగా అగుపడుతున్న జర్మన్లను గుర్తుపట్టి కాల్చటం సులువై పోయింది. ' సెర్ డ్యూక్ ' జాగ్రత్తగా గురిపెట్టి కాల్చుతున్నాడు. మందుగుండు సామాను వృథా చేయగూడదని అతని పట్టుదల. అతని నుదురు, ముక్కు, బుగ్గలు చల్లబడిపోయినాయి. తిరిగి తుపాకీలో తోటాలు నింపుకుంటూ ప్రక్కకి చూచుకునేటప్పటికి కాళ్ళదగ్గర మంచులో నల్లటి మడుగు కనబడ్డది.

"కాల్చండి! ఒక్కుమ్మడిగా — నేరుగా కాల్చండి!"

ఏమిటి? తన కాళ్ళదగ్గర ఉన్న మడుగు? లాగూ అంతా తడిసి పోయింది. అలాంటి మంచులో కూడా మీద యెవరో నీళ్ళు గిమ్మరించి నట్లు యీ మడుగేమిటని ఆశ్చర్యం వేసింది.

జర్మన్లు రోడ్డు కటువైపు ఉన్న కందకంలో చేరి యేకధాటిగా కాలుస్తున్నారు. 'సెర్ డ్యూక్' తల కొద్దిగా పైకెత్తి చుట్టూ కలియజూచాడు. కందకంలోంచి ఫిరంగుల దగ్గరికి, ఫిరంగుల దగ్గర్నుంచి కందకంలోకి రివ్వున పోతున్న ఆ తుపాకి కాల్పులకు యెడతెరిపి లేకుండా వుంది. ఈ లోగా గ్రామమంతటా తుపాకి కాల్పులు మిన్నుముట్టేలా అందుకున్నాయి. ఏది యెట్లా పరిణమించేది తెలియటం లేదు. కాని తనయొక్క, తనతో పాటు ఉన్న ఆ అయిదుగురు సైనికులయొక్క అవసరం యితరచోట్ల యెంతయినా ఉంటుందని 'సెర్ డ్యూక్' నిశ్చయించుకున్నాడు.

"కామ్రేడ్స్! ఇట్లా కాల్చుస్తూ కూర్చుంటే లాభంలేదు. ముందుకి ఉరుకుదాం పదండి! దేశమాతకోసం; స్టాలిన్ కోసం!! ముందుకిఉరుకుదాం పదండి—"

ఒక్కుమ్మడిగా అందరూ ముందుకి ఉరికారు. ముందుకు వంగి విచ్చుకత్తులతో కందకంవైపుకి తుపాకిగుండ్ల వర్షంలో పరుగెత్తుతున్నారు. నాలుగు అంగల్లో కందకంలోని జర్మనులమీద దూకేరు. కందకంలోని తుపాకుల శబ్దం ఆగిపోయింది—మరుక్షణంలో జర్మను సైనికుల శవాలు దొర్లాడ సాగినాయి.

"ఇక యెక్కడికిపోదాము?"—అని ఒక యెర్రసైనికుడు రొప్పు కుంటూ ప్రశ్నించాడు.

కాని 'సెర్ డ్యూక్' నుంచి జవాబురాలేదు. అందరూ ఆశ్చర్యంతో వెనక్కి తిరిగి చూచారు.

"కామ్రేడ్, 'సెర్ డ్యూక్' ఎక్కడున్నాడు?"

"ఏదో ప్రమాదం జరిగింది" అని సెర్ డ్యూక్ ప్రాణమిత్రుడు 'అలెగ్జి' భయపడ్డాడు.

"మనతోపాటు వచ్చాడా?"

"పచ్చాయేం నీకు ? మనతోపాటు పరుగెత్తుకొస్తేను"

"మరి గస్తీమనిషి ?"

"ఇదిగో, యిక్కడున్నాడు !" అని 'వన్యా' కేకపెట్ట ——

'అలెగ్జి' అటువురికాడు

'సెర్‌ద్యుక్' ఫిరంగులున్న స్థానానికి కిందకానికి మూర్ఛపడిపోయి ఉన్నాడు తుపాకి యింకా పిడికిట్లోనే వున్నది.

"ఏం జరిగింది ?" అని 'వన్యా' నెమ్మదిగా అడిగేడు

'అలెగ్జి' మాట్లాడకుండా నేలవైపు చూడసాగాడు. కొద్దిదూరంలో ఒక రక్తపుమడుగు, అక్కడినుంచి 'సెర్‌ద్యుక్' పడివున్న చోటువరకు రక్తపుధారమంచుమీద చంద్రుని కాంతిలో కనపడుతున్నాయి.

"దెబ్బ యెక్కడ తగిలిందో ?"

'అలెగ్జి' ఇంకా మౌనంతోనే 'సెర్‌ద్యుక్' కాలివైపుచూపించాడు. కుడికాలు వికృతంగా విరిగిపోయి కనిపిస్తున్నది. దాని చుట్టూ నల్లనిమడుగు యేర్పడ్డది

"కాలు పూర్తిగా విరిగిపోయింది..."

"చూడండి ! అప్పటికీ ఇంతదూరంవరకు పరుగెత్తుకువచ్చాడు !!"

"ఇక నాలస్యంచేసి లాభంలేదు. పదండి ! సైనికకార్యాలయం దగ్గర పరిస్థితులు విషమిస్తున్నట్టున్నాయి"

అందరూ ముందుకి ఉరికారు. ఈ సారి 'అలెగ్జి' నాయకత్వం వహించాడు చలిబాధ శరీరంమీద కత్తివేట్లు వేస్తున్నట్టుగా ఉన్నది. ఊపిరి పీల్చటంకూడా బాధగా ఉన్నది.

* * * *

మొదటి తుపాకిగుండు మ్రోగినప్పుడు 'కర్ట్' సైనిక కార్యాలయం లోపల నిద్రపోతున్నాడు. కేంద్ర సైనిక కార్యాలయంనుంచి యేక్షణంలో టెలిఫోనులో పలుస్తారోనన్న భయంచేత ఇంటికైనా పోకుండా అక్కడే పడకవేశాడు పూర్తి దుస్తులతోనే కంబళి కప్పుకొని నిద్రపోతున్నాడు. గదికి అటువైపు సార్జెంటు పడుకుని గాఢంగా నిద్రచేస్తున్నాడు. ప్రక్క గదిలో సైనికులు దొరికినచోట్లల్లా పడుకొని గురకలుపెట్టి నిద్రపోతు

న్నారు. చాలా సేపటికి 'కర్ట్' టెలిఫోను పిలుపుకోసం కాచుకుని కూర్చున్నారు. చివరికి నిద్రపట్టింది. ఆ తర్వాత తుపాకి దెబ్బ విని మెలుకువ వచ్చింది.

'వెధవలెవరో గ్రామస్థులు బయట తిరిగారు గాబోలు' అనుకున్నాడు. అలా తిరుగుతుంటే తన సైనికులు వాళ్ళని కాల్చి చంపివుంటారని ఉద్దేశపడ్డాడు. తన ఆజ్ఞలను లెక్కచేయకుండా గ్రామస్థులిలా తిరుగుతున్నారని కోపంకూడా వచ్చింది.

కాని అంతలోనే మరొకకాల్పు, ఆ తర్వాత ఇంకొకకాల్పు యీ విధంగా వినపడసాగాయి. 'కర్ట్' ఉలిక్కిపడి లేచాడు.

" 'సాసీ' ! లెగు !"

సార్జెంటు 'సాసీ' అప్పటికే లేచిపోయాడు. కొందరు సైనికులు లోపలికి పరుగెత్తుకుంటూ వచ్చారు.

"బోల్షివిక్కులు గ్రామంలోకి వచ్చేశారు !"

"తలుపులు బిగించెయ్యండి ! దీపం ఆర్పెయ్యండి !"—అని 'కర్ట్' తక్షణం ఆజ్ఞాపించాడు. తలుపులు బిగించటానికి సైనికులు ఉరికారు.

టెలిఫోను ఉన్న గది ఆ యింట్లోకల్లా పెద్దది. ఆత్మరక్షణకు అనుకూలమైనది. ఈ విధంగా తాను ఆత్మరక్షణ చేసుకోవలసి వస్తుందని 'కర్ట్' అనుకోనప్పటికీ, యథావిధిగా ఆత్మరక్షణకు అవసరమైన యేర్పాట్లన్నీ చేసుకునే ఉన్నాడు. పెద్దదిగానూ, బలంగానూ ఉన్న తలుపులకు యినుప బద్దీలు కూడా వేయించాడు. గోడలకు క్రింది భాగంలో కన్నాలు వేయించి ఉంచాడు. పురాతనపు కట్టడమవటంచేత ఆ భాగం చాలా దిట్టంగా ఉన్నది. సైనికులు పడుకునే భాగము, ఖైదీలను ఉంచినభాగము ఈ మధ్య కట్టించినవి. ఈ యిల్లు గ్రామసోవియటు కార్యాలయంగా ఉంటున్నప్పుడు యీ క్రొత్తగా కట్టిన భాగాన్ని "రెడ్ కార్నర్" (ఎర్రమూల) అని పిలుస్తూ ఉండేవారు. ఇక్కడే గ్రంథాలయం ఉంటుండేది. ఈ భాగం సర్వసాధారణంగా ఉన్నది. కాని టెలిఫోను గదిమాత్రం దిట్టంగా ఒక కోటలాగ ఉన్నది.

"గోడల కన్నాలు తెరువండి"

సైనికులు గబగబ గోడలకన్నాలను తెరిచి, ఇసుక బస్తాలను అమర్చారు. కన్నాలగుండా చల్లని గాలి వీస్తున్నది. బోర్ల పడుకుని కన్నాలగుండా తుపాకులు పేల్చటం ప్రారంభించారు.

“కేంద్ర కార్యాలయానికి టెలిఫోను చెయ్యండి ! త్వరగా !” — అని ‘కర్ట్’ యింకొక ఆజ్ఞనిచ్చాడు.

ఇందాక బయటనుంచి పరుగెత్తుకుంటూవచ్చిన కాపలా సైనికులలో ఒకణ్ని ప్రశ్నించాడు.

“గెరిల్లా దళమేనా ?”

“కాదు—ఎర్ర సైనికులు”

“చాలామంది ఉన్నారా ?”

“ఏమో, తెలియదండీ ! అన్ని వైపులనుంచీ కాల్పులు జరుగుతున్నాయి. చుట్టూ ముట్టడించి ఉండవచ్చు”

“కేంద్ర కార్యాలయానికి తెలియపర్చారా లేదా ?”—అని ‘కర్ట్’ మండిపడుతున్నాడు.

“లేదండీ—టెలిఫోను చెడిపోయింది”

‘కర్ట్’ కోపంతో టేబిలుదగ్గరకి ఉరికి టెలిఫోను రిసీవరు ‘సాని’ చేతిలోంచి గుంజుకొని నోరు చింపుకొంటూ కేకలు వెయ్యటం ప్రారంభించాడు. కాని యేమీ లాభంలేకపోయింది. జవాబు రావటంలేదు.

“గాడిదకొడుకులు—తీగలు తెంపేసినట్టున్నారు”—అంటూ రిసీవరు అవతలికి విసిరేశాడు.

“ఇది లేకపోతే మంనెతె...అది లేకుండానే గడుపుదాం”

వీధుల్లోంచి కాల్పులు తీవ్రంగా సాగుతున్నాయి. తుపాకిగుండ్లు గోడలకు తగులుతున్న, చప్పుడు వినుపిస్తున్నది. ప్రక్కగదిలోంచి, తుపాకి మడమలతో తలుపుమీద బాదుతున్న శబ్దమువుతున్నది. కాని తలుపు కదలటం లేదు.

“బాదండి—మీయిష్టం వచ్చినట్టు బాదండి !” అని ‘కర్ట్’ గొణిగాడు. తలుపులు చాలా దిట్టమైనవని అతని ధైర్యం—

* * * *

సైనిక కార్యాలయంపై దాడి లెఫ్టినెంటు 'షెలావ్' నాయకత్వం లో సాగుతున్నది. మొదటి ద్వారం పగలకొట్టుకొని సైనిక కార్యాలయపు భవనంలోకి అడుగుపెట్టేలోగా, ఇందాక ఫిరంగులు వశపరుచుకొన్న సైనికులు పరుగెత్తుకుంటూ వచ్చారు.

“ ‘సెర్ డ్యూక్’ యేడీ ?”

“చచ్చిపోయాడు—ఫిరంగులు వశపర్చుకున్నాము”

మొదటి గదిలో చిందరవందరగా పడివున్న సామాన్లు తప్ప జర్మను సైనికుల జాడ యేమీ కనుపించలేదు.

“పిరికిపందలు ఆ గదిలో దాక్కున్నారు”

“ఇంకెక్కడికి తప్పించుకు పోగలరు—”

గోడలలోని కన్నాలగుండా, యెర్ర సైనికులు వశపర్చుకున్న గదిలోకి జర్మన్లు తుపాకులు పేల్చసాగారు.

“బయటికి పదండి ! అక్కడినుంచే వీళ్ళపనిపడదాము !”

బయటికిపోయి ఇంటిని చుట్టు ముట్టడించారు. కాని యిల్లు చాలా దిట్టంగా కోటలా ఉన్నదన్న విషయం త్వరగానే గ్రహించారు. తుపాకి గుండ్లు తగిలి చిన్న చిన్న పెళ్ళలు ఊడటం తప్ప భవనం దుర్భేద్యంగా ఉన్నది. గోడల కన్నాలలోంచి తుపాకి గుండ్లు యేకధాటిగా ప్రవహిస్తున్నాయి.

“ఇష్టంవచ్చినట్లు కాల్చేస్తున్నారు”—అన్నాడు ‘షెలావ్’.

“ఆత్మరక్షణకి బాగా తయారైనట్టున్నది, కామ్రేడ్”

గ్రామమంతటా తుపాకుల కాల్పులు ప్రతిధ్వనిస్తున్నాయి. ఒక్కొక్క యెర్రసైనిక భాగమే తమ నియమిత స్థానాల్లో పోరాటం సాగిస్తున్నాయి. ముట్టడింపబడ్డ సైనికకార్యాలయంనుంచి వచ్చేకాల్పులు మాత్రం అన్నిచోట్లకంటే తీవ్రంగా ఉన్నాయి,

“కామ్రేడ్స్ ! ప్రొద్దుపొడిచేలోగా పని పూర్తయిపోవాలి. లేకపోతే యీలోగా వీరి సహాయానికి మరికొంత సైన్యం రావచ్చును—మన శ్రమంతా వ్యర్థమైపోతుంది...”

ఏ అడ్డుగోడకి తే దానిని ఉపయోగించుకొని, తుపాకి మూతులు దూర్చి కాలుస్తున్న సైనికకార్యాలయపు గోడలలోని కన్నాల్లోకి గురి చూచి కాల్చనారంభించారు. కాని యేమీ లాభంలేకుండా ఉన్నది. ఎదుటి నుంచి వస్తున్న గుండ్లవర్షం ఒక్క నిముషమైనా ఆగటంలేదు.

*   *   *   *

'లివాన్స్యక్' ఇంటిలో నిద్రపోతున్న జర్మన్లపైకి అకస్మాత్తుగా యెర్రసైనికులు ఉరికారు. ఆ గలభాకి జర్మన్లు ఉలిక్కిపడుతూ లేచి తుపాకులకోసం వెతుకుతున్నారు.

"నేలకి కరచిపెట్టుకు పడుకో!" నిర్ఘాంతపోయి చూస్తున్న 'లివాన్స్యక్' నుద్దేశించి ఒక యెర్రసైనికుడు కేకవేశాడు. 'లివాన్స్యక్' తన చిన్న కొడుకుతోపాటు మంచంకిందకి నక్కింది. కాని యేమి జరుగుతున్నదో ఆమె గ్రహించేలోగా మళ్ళీ అంతా నిశ్శబ్దమైపోయింది. మంచం క్రిందనుంచివచ్చి చూచుకొనే సరికి జర్మను సైనికులు నేలమీద చచ్చిపడి ఉండటమూ, యెర్రసైనికులు మాయం కావటమూ కనిపించింది.

"నాయనా, 'వాస్యా' ఇటొచ్చి సాయంచెయ్యి; ఈ పీనుగల్ని అవతల పారేద్దాము." అని ఇంకా వణుకుతూనే అన్నది. ఇద్దరూ కలిసి ఆ పీనుగల్ని బయటికి ఈడ్చివేయసాగారు. ఆయాసపడుతూ రెండుకాళ్లూ పట్టుకొని శవాలను ఈడ్చుతున్నారు. 'వాస్యా' పన్నెండేళ్ళ బాలుడు. 'లివాన్స్యక్' కి నెలలు నిండినగర్భం.

"నెమ్మదిగా...ఎందుకంత తొందర?" – కొడుకుతో అన్నది.

కాని 'వాస్యా' కి నిజంగానే తొందరగావుంది. ఇందాకనే యెర్ర సైనికులతోపాటు వీధుల్లోకి ఉరకాలనుకున్నాడు. కాని యీలోగా యీ పీనుగల్ని యీడ్చేపని తగులుకున్నది. వీధుల్లో పరుగెడుతూ అంతా చూడాల్సిన సమయంలో ఈ పీనుగల్ని యీడ్చుకుంటూ కూర్చోవడమేమిటి? అక్కడికిపోతే తనకుగూడా ఒక తుపాకి యిస్తారేమో? ఏమో, యివ్వవచ్చుగూడా...

ఇంతకాలమూ ఆవహించిఉన్న భయంకర నిశ్శబ్దం, తుపాకి కాల్పులతో పటాపంచలై పోయింది. మునుపటి విధంగాకాక ప్రజలందరూ నిర్భయంగా వీధుల్లో ఉరుకులాడుతున్నారు.

"కామ్రేడ్స్! ఒక్క జర్మనువాడైనా తప్పించుకు పోకుండా చూడాలి. జాగ్రత్త"–అని యెర్రసైనికులు భాగాలుగా విడిపోయి గ్రామం లోకి వస్తున్న సమయంలో వాళ్ళ 'కమాండర్' అన్నాడు. తమ విజయ మంతా దానిమీదనే ఆధారపడి వుందని ఎర్రసైనికులకు తెలుసు.

ఒక్కొక్క స్థలంలో ఉన్న జర్మన్లు ఒక్కొక్కవిధంగా ప్రవర్తిం చారు. కొందరు యిండ్లలోచేరి ఆత్మరక్షణ చేసుకొనసాగారు. మరికొందరు యిండ్లలోంచి బయటికి ఉరికివచ్చి, దొరికినమాటునల్లా ఉపయోగించుకొని తుపాకులు తీవ్రంగా కాల్చనారంభించారు.

"మాకు అడ్డు తగలకండి, ప్రక్కకుతొలగండి" అని 'సిర్గ్యేషా' స్త్రీలను అదిలించాడు. నేల యీనినట్టుగా స్త్రీలందరూ వీధుల్లో గుంపులు గుంపులుగా తిరగనారంభించారు.

"కామ్రేడ్స్! నాయింట్లో ఆరుగురు జర్మన్లున్నారు. తొందరగా రండి!" అని 'పెల్‌చారికా' ఉద్రేకంతో ఒక యెర్రసైనికుని చెయ్యి పట్టుకొని చెప్పింది.

"ఎక్కడది?"

"ఇక్కడే... నాతోరండి చూపిస్తాను..." అని అమిత ఉత్సా హంతో అన్నది.

ఎర్రసైనికులు కొందరు ఆమెవెంట వెళ్ళారు. కాని అప్పటికే జర్మనుసైనికులు, యింతకుముందే గోడలలోవేసి ఉంచిన కన్నాలలోంచి తుపాకులు పెట్టి పేల్చసాగారు. ఎర్రసైనికులు గూడా అటుతుపాకులు పేల్చనారంభించారు.

ఎర్రసైనికులతోపాటు 'పెల్‌చారికా' గూడా భూమిమీద పడుకుని చూడసాగింది. ఆమెకు సమీపంలో ఉన్న ఒక యెర్రసైనికుడు చేతితో గుండె అదుముకుని మూల్గుతూ పడిపోయాడు.

"కామ్రేడ్స్! ఇట్లా లాభంలేదు. అనవసరంగా అందరూ చచ్చి పోవలసివస్తుంది. ఇంటికి నిప్పు అంటించివెయ్యండి. వదిలిపోతుంది!"

"ఇల్లు నీదేనా?"

"అవును నాదే! తగలబెట్టెయ్యండి!"

"లోపల యింకెవ్వరూ లేగా ?"

'పెల్‌చారికా' పిడికిలి బిగిస్తూ అన్నది.

"పెద్దపిల్లలంతా పారిపోయారు. పసిబిడ్డ......పసిబిడ్డ మాత్రం ఉయ్యాలలో ఉండిపోయింది."

"మరి తగులబెట్టటం యెట్లా ?...నీకు పిచ్చెక్కింటాయేం?

"ఫరవాలేదు...ఫరవాలేదు. నా బిడ్డకోసం మీ రందరూ చావటానికి వీల్లేదు...సంశయించకండి... నేచెబుతున్నాగా?తగుల బెట్టెయ్యండి"

"ఏమిటమ్మా ! బిడ్డతో పాటే తగులబెట్టెయ్యమంటావా ?"

"తగులబెట్టెయ్యండి ! నేను ఒప్పుకున్నతర్వాత మీ కేం భయం ? తగులబెట్టెయ్యండి."

ఇంకొక యెర్ర సైనికుడు చేతికి దెబ్బతగలగా కట్టు కట్టుకుంటు న్నాడు. కట్టులోంచి రక్తం చిమ్ముతున్నది.

ఎర్ర సైనికులు 'పెల్‌చారికా' మాటలు వినిపించుకోకుండానే తుపాకులు పేలుస్తున్నారు. కాని ఆమెమాత్రం ఆ మాట వదలటంలేదు.

"ఇక నువ్వు యిక్కడ్నుంచి తప్పుకోవమ్మా, అనవసరంగా నువ్వు కూడా చచ్చిపోతావు. ఇటు కాలుస్తున్నారు గమనించటంలేదూ ?"

"ఏడిశారు...ముసిలిముండను నన్నేంచంపుతారు..."

ఒక కన్నంలోంచి వచ్చే తుపాకిగుండ్ల ధార ఆగిపోయింది.

"అదుగో ! చూశావా ? సరిగ్గా గురిచూచి కాల్చినట్టయితే అంతా సక్రమంగానే జరిగిపోతుంది."

"పోనీ, యిల్లు తగలబెట్టదలుచుకోకపోతే, పై కెక్కి కప్పులోంచి దిగితేనో ?"

"నిజమే ; అది బాగుంది_ ఎటునుంచి దిగాలో చూపెట్టగలవమ్మా"

కొందరు వెనుకనే ఉండిపోయి, మునపటికంటే రెండింతలు బలంతోటి తుపాకులు పేలుస్తున్నారు. తక్కినవాళ్ళు 'పెల్‌చారికా' వెంట వెళ్ళారు. కొద్దిసేపట్లో జన్మన్నను ముఖాముఖీగా యెదుర్కొన్నారు.

'పెల్‌చారికా' తలుపుతెరిచి కేకవేసింది.

"ఇక కాల్చండి!"

బయటనున్నవారుకూడా లోపలికి ఉరికారు. జర్మన్లలో ఒకడు తుపాకిదెబ్బకు గురి అయి చచ్చిపోయాడు. తక్కినవాళ్ళు ఎర్రసైనికుల పిచ్చుకత్తులకు యెర అయి ప్రాణాలు విడిచారు.

"'సిర్యోషా' చూశావా! వీడ్ని సరిగ్గా తలకు గురిపెట్టి కాల్చాను" అని ఒక యెర్రసైనికుడు విజయగర్వంతో ఉప్పొంగిపోతున్నాడు.

'పెల్‌చారికా' ఉయ్యాలదగ్గరకి పరుగెత్తింది.

"బిడ్డను చంపేశారు?"—ఆమె రుద్ధకంఠంతో అన్నది.

పసిబిడ్డ రక్తపు మడుగులో పడివున్నది. తల పగులగొట్టబడ్డది.

"భయపడి యేడ్చి వుంటుంది...పశువులు తల పగులగొట్టి చంపేశారు..."

'పెల్‌చారికా' తనబిడ్డ శవం చేతుల్లోకి తీసుకొని నిర్జీవమైన చూపులతో చూస్తూ, గంభీరంగా అన్నది:

"చూశారా? ఈ బిడ్డకోసం యిల్లు తగలబెట్టమన్నారు...అందుకొరకు అనవసరంగా యిద్దరు సైనికులు గాయపడవలసివచ్చింది."

"ఊరుకో, అమ్మా...ఊరుకో..."

"ఉహుఁ నేను దుఃఖపడను. కాని నాకుగూడా ఒక తుపాకి యివ్వాలి..."

గ్రామంలో తుపాకి కాల్పులు తగ్గుతూ వచ్చినై. సైనిక కార్యాలయందగ్గర తప్ప తక్కినచోట్ల పోరాటం ముగిసిపోయింది. అప్పుడే చంద్రుడు ఆకాశంలోంచి తప్పుకుంటున్నాడు. తెలతెలవార నారంభించింది. ప్రపంచమంతా నీలిరంగు ముద్దలాగ కనుపిస్తున్నది. ఆ నీలి వాతావరణంలో సైనిక కార్యాలయందగ్గర పేలుతున్న తుపాకుల కక్కే మంటలు మాత్రం యెర్రగా అగుపడుతున్నాయి.

"కామ్రేడ్స్! ఇట్లా లాభంలేదు. కిటికీలు అంతబలంగా ఉండక పోవచ్చు. వాటిమీద ఒక చేతిబాంబు విసిరితే తీరిపోతుంది!"

"కాని అట్లా తెరిపిలేకుండా కాలుస్తుంటే కిటికీదగ్గరకి చేరుకునేదెట్లా?"

నిజంగానే తుపాకిగుండ్లు వర్షధారలాగ యెడతెరపిలేకుండా వస్తు న్నాయి. ఆ గుండ్లవర్షంలో మంచు మేఘాల్లాగ పైకి లేస్తున్నది.

"తెల్లవారేటట్టున్నది" అన్నాడు 'షెలావ్', ఆకాశంవంక చూస్తూ. ఆకాశంలో అప్పుడే అరుణఛాయ సన్నసన్నగా అగుపడసాగింది. పోరాటం తాను అంచనా వేసుకున్నదానికంటే యెక్కువ కాలం తీసుకుంటు న్నది. తెల్లవారిపోతే జర్మన్లకు సహాయం కూడా రావచ్చును. చీకటి సమయంలో యెన్ని విషయాలైనా మరుగుపర్చి ఉండవచ్చు. తెల్లవారిం దంటే, తక్కువగా ఉన్న యెర్రసైనికులగుట్టు బయటపడిపోయి జర్మన్లకు ధైర్యం కలుగుతుంది కేంద్ర కార్యాలయంవారు యేమాత్రం శ్రద్ధ వహిం చినా టెలిఫోను తీగెలు తెగిపోయి ఉన్నట్టు గ్రహించగలరు. ఆ తర్వాత పరిస్థితులన్నీ తారుమారై పోగలవు—

"సరే, యేం చేద్దామంటారు కామ్రేడ్స్?"

"చేతిబాంబు విసిరితేగాని మనం యేమీ చెయ్యలేము."

"అయితే ప్రయత్నిద్దాము"—అని 'సిరోట్కిన్' అన్నాడు.

"కాని ప్రయత్నించేదట్లా?"

"నేను ప్రయత్నిస్తాను..."

'సిరోట్కిన్' రెండవవైపుకి తిరిగివెళ్ళాడు. గోడకు కన్నాలులేని వైపు ప్రాకుకుంటూ వెళుతున్నాడు. తుపాకి గుండ్లు అతనికి తగులుతాయన్న భయంతో యెర్రసైనికులు కాల్చటం ఆపేశారు.

"ఏమిటీ, అతని ఉద్దేశం?" — అని తనలో తాను అనుకున్నాడు 'షెలావ్' భయపడుతూ. 'సిరోట్కిన్' అతి జాగ్రత్తగా ప్రాకుకుంటూ పోతున్నాడు.

తెలతెలవారుతున్న వెలుగులో గోడ కన్నంలోంచి ఒక మెషిన్‌గన్ ఇటూ, అటూ కదులుకుంటూ గుండ్లవర్షం కురిపిస్తున్నది.

'సిరోట్కిన్' ఒక్క గంతువేసి ముందుకు ఉరికాడు. ఎర్ర సైని కులు అతడు యేమిచేస్తున్నాడో అర్థం చేసుకునే లోగానే, యెదుటినుంచి వస్తున్న గుండ్లవర్షానికి, యెర్రసైనికులకు మధ్య పరుగెత్తి చేతిబాంబుల కట్ట నొకదానిని కిటికీమీదికి జోరుగా విసిరాడు. గలగలమన్న శబ్దము, ఆ

తర్వాత బ్రహ్మాండమైన ప్రేలుడు కలిగి పొగతో మేఘాలు యేర్పడ్డాయి. పెద్దమంట లేచింది. కిటికీముందున్న 'సిరోశ్యా', గాలిలోకి యెగిరి, కొంతసేపటికి భూమిమీద పడ్డాడు. భగ భగ మండుతున్న ఆ మంట వెలుగులో, అతని శరీరం నల్లగా అగుపడుతున్నది. కొన్ని క్షణాలు కాళ్ళు చేతులు కొట్టుకొని ప్రాణాలు విడిచాడు.

"పదండి, ముందుకి!"—అని 'షెలాన్' ఆజ్ఞనిచ్చాడు.

కిటికీవైపుకి ఉరికారు. మెషిన్‌గన్ ఒక మూల పడిఉన్నది. దాని నిండా రక్తం! దానిని ఉపయోగిస్తూ ఉండిన సైనికులు చచ్చిపడిఉన్నారు. చేతిబాంబులు వాటిపని అవి చేసినాయి.

"పదండి—పదండి!"

కిటికీ అద్దాల పెంకులు గీసుకుంటున్న సంగతి గుర్తించనయినా గుర్తించకుండా, చేతిబాంబులవల్ల యేర్పడ్డ సందుల్లోంచి లోపలికి దూకారు. మంటలు పైకి లేస్తూనే వున్నాయి.

"మన మనుష్యులు లోపలున్నారు!" - అని 'మాల్యూచికా' యెలుగెత్తి కేక వేసింది.

సైనిక కార్యాలయంలో ఉన్న అయిదుగురు ఖైదీలసంగతి అప్పుడు అందరికీ గుర్తొచ్చింది.

ఆ అయిదుగురు ఖైదీలు చీకటిగదిలో అత్రంలో యెదురుచూస్తూ కూర్చున్నారు. వారికి నిద్ర పట్టకపోవటంచేత మొట్టమొదటి తుపాకికాల్పు గూడా విన్నారు. కాని దడదడ కొట్టుకునే వారి గుండెచప్పుడుకూడా వినబడే ఆ నిశ్శబ్దంలో అదికూడా తమ గుండెచప్పుడే అనిపించింది వారికి. ఒకక్షణం నిరీక్షించారు. మళ్ళీ ఒకకాల్పు వినబడింది. సర్వసాధారణంగా వినబడే గస్తీసైనికుని తుపాకిమోతకూడా కాదది.

"మనవాళ్ళు వచ్చేశారు?" అని 'చెకోరికా' ఉద్రేకంతో అన్నది.

"అవును, మనవాళ్ళే?"—'ఓల్గా' ఉత్సాహపడింది.

'మలాషా'లో మాత్రం యెలాంటి చలనమూ కలుగలేదు. మునుపటి విసంగానే నిశ్శబ్దంలోకి అర్ధంలేని చూపులు చూచుకుంటూ కూర్చున్నది.

"చర్చిదగ్గర..."అన్నాడు 'యకొడోకిమ్' తాత.

"ఫిరంగుల దగ్గరేకదూ..."

గోడప్రక్కనే ఒక తుపాకీ కాల్పు వినబడింది. 'ఓల్గా' భయంతో కేక పెట్టింది.

బోనులో చిక్కుకున్నట్లున్నది వారి పరిస్థితి. ఆ చీకట్లో యేమీ కనబడడంలేదు. బయటనుంచి తుపాకి ప్రేలుడు శబ్దాలు, ప్రజల సందడి వినబడుతున్నాయి. కాని యేమి జరుగుతున్నదీ వారికి తెలియటంలేదు.

ఎర్రసైనికులువచ్చి విడిపించేలోగా జర్మన్లు తమను తుద ముట్టిస్తారనుకున్నాడు 'గోషాంచ్'. కాని స్త్రీలు భయపడతారని పైకి అనలేదు. బయట జరుగుతున్న గందరగోళం ఉద్రేకపూరితుడై వింటున్నాడు. తుపాకి దెబ్బల ధాటికి యేదో తలుపు విడిపోవటము, ఆతర్వాత ప్రక్కగదిలో కాళ్ళచప్పుడు వినుపించాయి. తలుపుమీదపడి దబదబ కొడుతూ 'గ్రోషాన్' అరవటం ఆరంభించాడు.

"ఓయ్! ఎవరక్కడ? మమ్మల్ని విడిపించండి — మమ్మల్ని విడిపించండి!"

కాని బయటి గందరగోళంలో అతనికేకలు యెవరికీ వినబడలేదు.

"రండి! మీరుకూడారండి! లేకపోతే మనమాటే మరచిపోతారు; ఇంకెంతసేపు యిక్కడుండగలం..."

'ఓల్గా' ఒక్కగంతులో వెళ్ళి తలుపుమీదబాదటం ప్రారంభించింది. 'చెకోరికా' కూడా ఆమెతో కలిసింది.

"ఎవరక్కడ? మమ్మల్ని విడిపించండి!"

బయటి తుపాకి కాల్పులు; కేకలు మొదలైన గలభాలో వారి కేకలు యెవ్వరికీ వినిపించటంలేదు.

"గట్టిగా బాదండ్రా! గట్టిగాబాదాలి. లేకుంటే వాళ్ళకసలు వినబడదు."

"ఏమిటది? మనను గురించి గ్రామస్థులెవ్వరూ చెప్పలేదా యేం? మనసంగతి అసలుకే మరిచిపోయారా యేం?"

తలుపుమీద విరామంలేకుండా బాదుతున్నారు. ఇంతలో మళ్ళీ ప్రక్కగదిలో కాళ్ళచప్పుడు వినుపించింది. కాని యెర్రసైనికులు బయటి

వెళ్ళిపోతున్న చప్పుడది! కొంతసేపటికి వరకు అంతా నిశ్శబ్దం. ఖైదీలకు వాళ్ళ పాదాలక్రింద పెద్ద అఘాతం తెరచుకున్నట్లయింది! విముక్తిపొంద గలమన్న ఆశ మటుమాయమై పోయింది!

"ఏమిటది? మనవాళ్ళు పారిపోతున్నారా యేం?" అని ఆశ్చర్య పోతున్నాడు 'యూడోకిమ్' తాత.

'ఓల్గా' యేడుస్తున్నది.

"నోరుముయ్యి! యేడవటానికి సిగ్గులేదూ? ... 'యూడోకిమ్' తాతా, నువ్వింత ముసలివాడి వయ్యావుగాని నీకు బుద్ధిలేదు. అటుప్రక్క నుంచి దాడిసాగిస్తున్నట్టు తెలియటంలేదా?"

ఎవ్వరూ మాట్లాడలేదు. రెండవప్రక్కనుంచి తుపాకులు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

"ప్రక్కవీధిలోంచి రావటానికి ప్రయత్నిస్తున్నారు."

"ఆ మ్రోగేది యెవరి మెషిన్‌గన్ అయివుంటుంది?"

"జర్మన్లది...అదాం ఇప్పుడు మ్రోగేది మనవాళ్ళది...వినబడటం లేదూ?"

అందరూ ఒకచోటచేరి వింటున్నారు. 'మలాషా' మాత్రం తన స్థలంనుంచి కదలకుండా, అక్కడ జరుగుతున్న వేవీ తనకు సంబంధించినవి కానట్టు కూర్చున్నది.

"ఓ ప్రభూ! ఏంచేస్తావో?" — అని 'యూడోకిమ్' తాత నిట్టూర్చాడు.

"ఏమిటి? నీవూ, నీ ప్రార్ధనాను?" — 'గ్రోశాచ్' అతనివైపు తీవ్రంగా చూస్తూ అన్నాడు.

"అతనికి యిష్టముంటే ప్రార్ధన చేసుకుంటాడు. దానికి ఆటంకపర్చ టానికి నీ వెవ్వరు?" అని 'చెకోంకా' 'యూడోకిమ్' తాత తరఫున పలికింది.

'యూడోకిమ్' తాత తలుపుదగ్గర మోకరిల్లి వణుకుతున్న కంఠంతో ప్రార్థిస్తున్నాడు—

"ఓ ప్రభూ! ఈ ప్రమాదంనుంచి మమ్ము రక్షించు!!"

గ్రోశాచ్ అది వింటూ భుజాలు యెగరవేశాడు. బయట తుపాకి కాల్పులు జోరుగా సాగుతున్నాయి. హఠాత్తుగా ఒక బ్రహ్మాండమైన ప్రేలుడు వినిపించింది.

"ఓ-ఓ-ఓ-" అని 'ఓల్గా' కేక పెట్టింది.

బయట యెవరివో మాటలు వినపడసాగినాయి. అంత కంతకూ యెక్కువైనవి. ఎవరో ఒక స్త్రీ అరుస్తున్నది. మరుక్షణంలో తుపాకి మడమలతో తలుపుమీద మోదటం ప్రారంభించారు.

"తలుపుదగ్గర్నుంచి తొలగండి!" అని 'గ్రోశాచ్' అరిచాడు.

వెనుకకు తగ్గారు. పెద్ద శబ్దంతో తలుపు కొట్టుకొని వచ్చేసింది, ప్రక్కగదిలో తగలబడుతున్న కాంతి లోపలికి వచ్చి అంతా పట్టపగలుగా చేసేసింది. 'మాల్యూచికా' రొప్పుకుంటూ లోపలికి ఉరికింది.

"మనవాళ్ళు వచ్చేశారు, రండి!...నీ పిల్లలు నాదగ్గరే ఉన్నారు. భయపడకు"—అని 'చకోరికా'తో యేడుపు, సంతోషము కలిసిన స్వరంతో చెబుతున్నది.

"ఎందు కంత గోల? నెమ్మదిగా పోదాంపదండి" అని గ్రోశాచ్ ఆమెను మందలించాడు.

'మలాషా' యెవ్వరితోను మాట్లాడకుండా బయటికి ఉరికింది. ఒక యెర్రసైనిక యువకుడు గుమ్మంమీద కూర్చుని తన గాయాలకి కట్లు కట్టుకుంటున్నాడు. అతనిప్రక్కనున్న తుపాకి చటాలున అందుకున్నది 'మలాషా'.

"అఁ! అది యిచ్చెయ్యి-" అంటూ 'మలాషా' దగ్గర తుపాకి గుంజుకోబోయాడు ఆ యెర్రసైనికుడు. కాని రక్తపుజోతులై మెరుస్తున్న ఆమె కళ్ళు చూడగానే ఆగిపోయాడు.

"పిచ్చిది!"

"ఫరవాలేదు, ఆ తుపాకి తీసుకోనీ...చచ్చిన జర్మన్లవి యింకా దొరుకుతాయిలే..."అన్నాడు 'గ్రోశాచ్' మధ్య కల్పించుకుని.

ఇంటివెనుకనుంచి కేకలు చెలరేగినై.

"తప్పించుకు పోయాడు! జర్మను కమాండరు తప్పించుకు పోతున్నాడు!"

* * * *

కెప్టెన్ 'కర్ట్' పొగలో ఉక్కిరిబిక్కిరి కాసాగాడు. గది అంతా చీకటిమయంగా వుంది. ద్వారాలన్నీ పూర్తిగా బిగించి వేయబడ్డాయి. అందువల్ల తుపాకి కాల్పులవల్ల కలుగుతున్న పొగ గదిఅంతా చుట్టిచేస్తున్నది.

గాయపడ్డ ఒక జర్మను సైనికుడు పెడబొబ్బలు పెడుతున్నాడు. వాడి ముఖంలోకి తుపాకితో కాల్చాలన్నంత కోపం వచ్చింది, 'కర్ట్'కి. కాని తన మెషిన్‌గన్‌ని ఒక్క క్షణమైనా వదలటానికి అవకాశంలేదు. గాయపడ్డవారంతా గదినిండా చిందరవందరగా పడివున్నారు. ప్రాణాలతో బయటపడలేదనిమాత్రం 'కర్ట్'కి తెలుసు. ముట్టడికి అవకాశమే లేదను కుంటున్న సమయంలో యిది జరగటం చాలా ఆశ్చర్యకరంగా ఉన్నది. కేంద్రకార్యాలయం వారికి, ఆహారపదార్థాలు కావాలన్న ఆదుర్దాయేగాని, రక్షణమాట మాత్రం అవసరంలేదు. లేకుంటే రోడ్లు సరిగ్గా కాపలా కాయించుకోలేరూ ? గెరిల్లాలంటే గడగడ వణుకుతారు. పైగా యెంతో జాగ్రత్తతో ఉన్నట్టు అగుపడుతారు. తీరాచూస్తే తమచుట్టూ యేమి జరుగుతున్నదిగూడా తెలియదు. బోల్షివిక్‌ల కిలకస్థానా లెక్కడున్నవీ తెలియదు.

కెప్టెన్ 'కర్ట్'కి యేమీతోచటంలేదు. వచ్చిన వార్తలప్రకారం యుద్ధరంగం యెంతో దూరంలో వుండిఉండాలి. కాని యిప్పుడు హఠాత్తుగా సైనిక కార్యాలయం ముట్టడింపబడ్డది! పోనీ గెరిల్లాదళాలంటే అదీ కాదు ... యెర్రసైన్యమేవచ్చి ముట్టడించింది! ... వెధవలికి, కేంద్ర కార్యాలయంవాళ్ళకి ధాన్యం కావాలట! ఇక తింటారులే...

గాయపడ్డ సైనికుడు ఇంకా యెక్కువగా గాండ్రిస్తున్నాడు — తుపాకిగుండు సరిగ్గా శరీరంలోంచి దూసుకుపోయింది. ఇక్కడ జరుగు తున్నది పై వారి కెవ్వరికీ తెలియటంలేదేలేదా? శబ్దంతో చెవులు చిల్లులు పడి పోతున్నాయి. తల బ్రద్దలైపోయే టట్టున్నది. ఎంతకాలం యీ విధంగా సాగించటం? టెలిఫోనుతీగలు తెంపబడ్డాయి. ఇతర్ల సహాయం అర్థించటానికి అవకాశమేలేదు. గ్రామంలోని ఇతరచోట్ల తుపాకికాల్పులు తగ్గిపోయినాయి. క్రమేపి, సైనిక కార్యాలయందగ్గర అధికంకాజొచ్చాయి. తన సైన్యమంతా నాశనమైపోయిందనీ, సైనిక కార్యాలయమే యింతవర కైనా నిలిచి పోరాడుతున్నదనీ 'కర్ట్' గ్రహించాడు.

హఠాత్తుగా ఒక బ్రహ్మాండమైన ప్రేలుడు ప్రేలి భూమినంతా దద్దరిల్లజేసింది. ఆ విసురు 'కర్ట్'ని ఒక గోడకు గుద్దేసింది. కేకలు వినిపించాయి. కిటికీ ముక్కముక్కలైపోయింది. చేతిబాంబులు కిటికీమీదికి వేసినట్లు గ్రహించుకున్నాడు. చుట్టూ మంటలు లేచినాయి. భుజం చాలా బాధపెట్టసాగింది. మాంసపుముద్దలు, తెగిపోయిన కాళ్ళు, చేతులు నేలమీద అంతా పడివున్నాయి. లేదు! ఇక నిక్కడ యేమిచేయటానికీ వీల్లేదు. ప్రక్కనున్న చిన్న గదిలోకి ఉరికాడు. ఆ గదికి ఒకటే కన్నం వేసి వుంచారు. అక్కడ కొంత నయంగావుంది. ఒక సైనికుడు మెషిన్ గన్‌ని పేలుస్తున్నాడు. కాని బయటినుంచి వచ్చే తుపాకిగుండ్లుమాత్రం ఆగిపోయినై. అటువైపునుంచి యెర్రసైనికులు తప్పుకున్నట్లున్నారు. 'కర్ట్' తలుపు హఠాత్తుగా తీసి, అటు యెవరైనా వుండి తుపాకితో కాల్చు తారేమోననైనా లెక్కచేయకుండా మంచులోకి దూకాడు. మంచు మీద ప్రతిఫలించే వెలుగుకి కళ్ళు జిగేలుమన్నాయి. అతని వెనుక, అడుగులచప్పుడు, కేకలు వినబడసాగినై. యెర్రసైనికులు అప్పుడే సైనిక కార్యాలయంలోకి చేరుకున్నారన్నమాట. కొద్దిదూరంలోవున్న ఇంకొక యింటికి 'కర్ట్' ఉరకబోయాడు.

కాని హఠాత్తుగా 'మలాషా' వచ్చి అతని దారికి అడ్డుపడ్డది. భయంకరమైన రూపంతో, చేతిలో తుపాకి పుచ్చుకుని నిల్చున్నది. నిప్పు కణాల్లాగ ప్రకాశిస్తున్నాయి కళ్ళు. ముంగురులు ముఖంమీదికి వాలినై. తనలో కల బలమంతా క్రోడీకరించుకొని తుపాకియెత్తింది 'మలాషా'. 'కర్ట్' తక్షణం తనచేతిలోని పిస్తోలు పేల్చాడు. ఆ గుండు ఆమెకు తాకే లోగా 'మలాషా' యెత్తిన తుపాకి వచ్చి 'కర్ట్' తలను పగులగొట్టింది. పెద్ద కేకపెట్టి క్రిందపడిపోయాడు. ముక్కు, నుదురు చిత్తుచిత్తు అయిపోయి రక్తం చిమ్ముతున్నది. తన రక్తంలో తానే ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. కండ్లల్లోకి గొంతుకలోకి పోతున్నది. ఊపిరి పీల్చటానికి అవస్థపడు తున్నాడు.

రెండడుగులు అవతల 'మలాషా పడివుంది. తుపాకి దెబ్బతోపాటు, 'కర్ట్' తల పక్కుమనటంకూడా విన్నది. శరీరంలోంచి దూసుకుపోయిన తుపాకిగుండు ఆమెకు బాధయేమీ కలిగించలేదు. ఎక్కడైతే అవసరమో

అక్కడనుంచే దూసుకుపోయిందా గుండు. లేదు – బాధలేదు. సంతోషమే! ఆమె పెదవులమీద చిరునవ్వు చిందులాడింది. గత నెలరోజులుగా ఆవరించివున్న జరాభారమంతా మటుమాయమై పోయింది. నవయౌవనంతో తొణికిసలాడుతూండే మునుపటి 'మలాషా' మంచులో పడివున్నది. పిడికిటిలో యింకా తుపాకీవున్నది. ఆమెస్మృతి తెలతెలవారుతున్న ఆకాంతిలో యెక్కడికో, యెక్కడికో తేలిపోతున్నది.

అనునుకాంతి ఇంద్రధనస్సును మళ్ళీ మేలుకొల్పింది. దానిఛాయ రాత్రికూడా కనబడుతునే ఉన్నది. ఇప్పుడు సూర్యకాంతి మళ్ళీ దానిలో జీవం పోసింది. వన్నెవన్నెల వెలుగులతో ప్రకాశిస్తున్నది.

'మలాషా' కళ్ళు ఆ కాంతి పుంజంమీద నిలచిపోయినై. రక్తంతో పాటు ఆమె ప్రాణంగూడా ప్రవహించి పోతున్నది. శరీరమంతా బండబారి పోసాగింది. కాని ఆకాశవీధిలో కనబడుతున్న ఆ రాజబాట – వన్నెవన్నెల ఇంద్రధనుస్సు – చూచుకొని ఆమె మనస్సు తృప్తిగావున్నది. తాను కాంతిమయమైన రాజబాటకుండా, ప్రయాణంచేస్తున్నది. గ్రామంలోకల్లా అందమైనపిల్ల, సమిష్టి వ్యవసాయక్షేత్రంలో కల్లా చురుకైనపిల్ల, మధురమైన పైరులలో విహరించినపిల్ల వెళ్ళిపోతున్నది......

మంచు తుపానులు యికలేవు. సువాసనలు వెదజల్లే గడ్డి ఆమెపడక. ఎక్కడనో గలగలమంటూ జీవనది ప్రవహిస్తున్నది బాలబాలికలు కిలకిల నవ్వుకుంటున్నారు...ఇంద్రధనుస్సుకోసం ఆమెకళ్ళు వెతికినై. కాని ఇంద్రధనుస్సు లేదు...వసంతకాలం...ఐవన్ పకపక నవ్వుతూ తన కళ్ళల్లోకి చూస్తున్నాడు...అదిగో, అతని ముద్దుగొల్పే నేత్రాలు...మళ్ళీ ఆ దృశ్యమంతా చీకటిలో మునిగిపోయింది...ఏది? ఇందాకటి ఆ ఇంద్రధనుస్సు ఏదీ?...'మలాషా' కళ్ళు వెతికినాయి ఆ ఇంద్రధనుస్సు కొరకు... ఆ వన్నెవన్నెల కాంతులతో కండ్లు నింపుకోవాలని...

మోచేతులమీద లేవటానికి ప్రయాసపడ్డది. దుర్భరమైన బాధ గర్భంలో కలిగి, నేలమీద పడిపోయింది. చచ్చిపోతున్నానని తెలుసు... ఇంద్రధనుస్సుని అందుకోటానికి – ఆరాజబాటను అందుకోటానికి చేతులు చాచింది. చీకటిలో చేతులు తడుములాడుతున్నాయి. ఆమె నిలువుగుడ్లు

ఆకాశంలోకి చూస్తూనే ఉన్నాయి. సగం తెరిచివున్న నోటిలోపళ్ళు తళతళ మెరుస్తున్నాయి. పెదవులమీద చిరునవ్వు అట్లానే నిలచిపోయింది.

* * * *

గ్రామమంతా సందడిగావుంది. స్త్రీలందరూ, మూలమూలలా దాగి ఉన్న జర్మన్లను వెతికి పట్టుకువస్తున్నారు. 'పెర్శిలిఖా' దొడ్లో ఒకడు పట్టు పట్టాడు. వాడు తుపాకి ఒకమూల పారేసి- దొడ్డితలుపు తెరిచివుంటే లోపలికి పరుగెత్తికెళ్ళి గడ్డివాములో ఒకమూల దాక్కున్నాడు. మంచులో పడ్డ వాడి అడుగుజాడతో ఉనికి బయటపడ్డది. 'పెర్శిలిఖా' యెర్రసైనికుల సహాయంకొరకు కూర్చోలేదు. 'గ్రోశాచ్' కూతుళ్ళ నిద్దర్ని సహాయంగా తీసుకుని, పలుగులు, పారలు పుచ్చుకొని గడ్డివాము దగ్గరికి జాగ్రత్తగా వెళ్ళింది.

"ఒరే! జర్మనువాడా! బయటికిరా...'ఫ్రోస్యా' చూశావా వాడు గడ్డిలో యెట్లా నక్కి కూర్చున్నాడో?"

"ఉండండి... నేను పలుగుతో పొడుస్తాను"

"గోడవైపునుంచి వెళ్ళు... లేకుంటే వెనక కాల్చగలడు"

ఆ జర్మనువాడికి వారిమాటల్లో ఒక్కముక్కయినా అర్థంకావటం లేదు. అయినా పలుగుతోటి పొడవటానికి ప్రయత్నిస్తున్నారని మాత్రం గ్రహించాడు. గడ్డివాములోంచి దులుపుకుంటూ బయటపడ్డాడు. చినిగపోయిన మిలిటరీదుస్తులు శరీరంనుంచి వ్రేలాడుతున్నాయి. ఎక్కడ సంపాదించాడో - ఒక గౌను తలకు చుట్టుకున్నాడు.

"వహవ్వా! మొగాడు యెట్లాగున్నాడో చూడండి!... ఒరే, నడువరా ... నడువ్..."

జర్మను సైనికుడు గాబరాపడుతూ గబగబ నడిచాడు. గుమ్మం తగిలి క్రిందపడ్డాడు.

"చూడండి! ... యెట్లా పారాడుతున్నాడో! ... 'ఫ్రోస్యా', గడ్డివాము దగ్గరకి వెళ్ళి చూచిరా...వీడి తుపాకి అక్కడున్నదేమో... మనకు పనికివస్తుంది...."

'ఫ్రోస్యా' వెళ్ళి గడ్డివాములో అంతా వెతికింది.

"ఇక్కడ లేదు...ఇంకెక్కడో పారేసివుంటాడు."

"వీరాగ్రేసరుడు యెట్లాగున్నాడో చూశారా ?...వాడి పాదరక్షలు యెంత అద్భుతంగా వున్నవో చూడండి!" – అన్నది 'ఔర్ఫిలిషా.'

బూట్లకి బదులు వాడు కాళ్ళకు గుడ్డలు చుట్టుకున్నాడు.

"పాపం! కాళ్ళు బండబారి పోయినట్టున్నాయి...అందుకే అలా పాగాడుతున్నాడు."

"అవును మరి; వాడిని యిక్కడికెవరు రమ్మన్నారు? వాడి దేశంలో వాడు వోయిగా కూర్చోకపోయాడూ ? ... పరాయి దేశాలు తేరగా వున్నాయని వచ్చిపడితే యేమవుతుంది..."

వీధిలోని ప్రజలందరూ వారిచుట్టు చేరారు.

"వీడెక్కడ దొరికాడు !"

"ఔర్ఫిలిషాకి ఒక వింతజంతువు దొరికిందే !"

"సరే-సరే... ఖైదీకి కాపలా కాస్తున్నానని తెలియదూ ? మీ మీ యిళ్ళకుపోయి చూచుకోండి. ఇట్లా యెంతమంది దాక్కుని వున్నారో... వెళ్ళండి ఒక్కడుకూడా మిగలకుండా చెయ్యాలి"

"అవును – 'ఔర్ఫిలిషా' మాట వాస్తవం. పదండి పోయి వెతుకుదాము" అన్నాడు కుంటి 'అలెగ్జాండర్'.

అందరూ పలుగులు, పారలు, గొడ్డళ్ళు మొదలైనవి పుచ్చుకుని వచ్చేశారు.

"అందరం కలిసి వెళదాము !"

"ఎంతమందివుంటే అంత సరదాగా వుంటుంది !"

"ఓహ్! జర్మను వాడిని తొక్కేస్తానేమోనని 'లెనాక్' భయ పడుతున్నది..."

"అలా అనుకుంటున్నారా ? అవసరమైతే నోరెత్తకుండా అణిగి చచ్చేటట్టు తొక్కేస్తాను. నాకు భయమనుకుంటున్నారేం ?"

"సరె-సరె, మాటలకంటే పని యెక్కువచెయ్యాలి మనం-పదండి" అంటూ అలెగ్జాండర్ అందరినీ హెచ్చరించాడు.

అందరూ కలిసి యింటింటికి బయలుదేరారు. ప్రతి దొడ్డి, గడ్డివాము, గొడ్లశాల వెతుకుతున్నారు. పిల్లలు కేరింతలు పెడుతూ తిరుగుతున్నారు. 'సాషా' రొప్పుకుంటూ వచ్చి అన్నాడు - "మా దొడ్లో ఒక జర్మనువాడు దాక్కుని వున్నాడు."

ఒకరిని తోసుకుంటూ, ఒకరు 'సాషా' యింటివైపు పరుగెత్తారు. భయంతో నిలువునా వణికిపోతున్న ఒక జర్మనువాడిని బయటికి లాక్కొచ్చారు. జర్మన్లకోసం అంతా వెతుకుతున్న యెర్రసైనికులు, ఆ స్త్రీలను చూచి మందహాసం చేశారు. కాని గ్రామం నలుమూలలు బాగా తెలిసిన ఆ స్త్రీలు యెర్రసైనికులకంటే గూడా యెక్కువమంది ఖైదీలను పట్టుకున్నారు.

"మీరా లెక్కువమంది ఖైదీలను పట్టుకున్నారా, మేమా ?" అని స్త్రీలు యెర్రసైనికుల్ని గర్వంతో అడిగారు.

"మీరే యెక్కువమందిని పట్టుకున్నారు". అని యెర్రసైనికులు స్త్రీల ఉత్సాహం చూచి నవ్వారు.

"జర్మను కెప్టెన్ యేడీ ? వాడు పారిపోయి వుండడే..." అని 'ఫెలాప్' అడిగాడు.

చచ్చి పడివున్న జర్మన్లనందర్నీ పరిశీలించారు. సాధారణ సైనికులు తప్ప కెప్టెన్ కనపడలేదు.

"కెప్టెన్ యెక్కడున్నదీ కనుక్కోవాలి !"

కాని కెప్టెన్ 'కర్ట్' ధాన్యపుకొట్టు వెనుక పడివున్నాడు. తల పగిలింది. ఒక కన్ను చిదికిపోయింది. రెండవకన్ను అనంతాకాశంలోకి చూస్తున్నది. తలలో బాధ దుర్భరంగా గొడ్డళ్ళు పెట్టి మోదినట్టుగావుంది. రక్తం ధారలుకట్టి ప్రవహిస్తున్నది. చిదిగినకన్ను భగ్గున మండుతున్నది. గొంతుకలోకి రక్తం జారుతున్నది. ఎడతెరపిలేకుండా ప్రవహిస్తున్న ఆ రక్తం గుటకలు మింగుతూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. మళ్ళీ మళ్లీ గుటకలు మింగుతున్నాడు. అలా మింగకపోతే ఆ ప్రవహించే రక్తంలో మునిగిపోతా డనిపిస్తుంది. గొంతు నొప్పిపెడుతున్నది. ఇక మింగలేకపోతున్నాడు. ఒళ్ళంతా నొప్పితో చుట్టివేసేస్తున్నది. తన నెవరైనా చూచి సహాయం చేయకపోతే అలానే, మంచులో బందబారిపోయి చచ్చిపోవటం

తప్పదనుకున్నాడు. భయంతో శరీరం వణికిపోయింది. ఎవరు రక్షిస్తారు తనని ? ఎవరున్నారు ? తాను నానాయాతనలు పెట్టిన ఈ ప్రజలు ? త్వరగా ప్రాణాలు పోకపోతే, ఈ రైతు స్త్రీల గడ్డపారలకు గురికావలసి వస్తుందేమో! బోల్షివిక్‌ల చేతుల్లో పడవలసివస్తుందేమో !! అంతా నిశ్శబ్దం. తుపాకిమోతలు లేవు. అతడు మోసపోలేదు. తన సైన్యం నాశనమైపోయింది. విరోధులు గెలిచారు. హృదయంలో యేదో పోటు పొడిచినట్టు బాధపెట్టింది. తాను - తాను - కెప్టెన్ 'కర్ట్' - ఇంత అవమానకరంగా ఓడింపబడ్డాడు! - ఎలా జరిగింది ?...

తన ప్రశ్నకు జవాబు అడుగుతున్నట్టు, మిగిలిన ఒక్క కన్నుతోను వినీల ఆకాశంలోకి చూడసాగాడు. భూమ్యాకాశాలను కలుపుతూ, బ్రహ్మాండమైన అర్ధచంద్రాకారంలో వన్నెవన్నెల ఇంద్రధనుస్సు ప్రకాశిస్తున్నది. చెదిరిపోతున్న 'కర్ట్' మనస్సుకి ఆ ఇంద్రధనుస్సు యింతకు ముందుచూచినట్లు గుర్తొచ్చింది. అవును; గాలి దుమారం వచ్చేముందు గానిని చూచాడు. అప్పుడా రైతు స్త్రీ యేమన్నది ?...ఇంద్రధనుస్సు శుభశకునమట...

'కర్ట్' పెద్దగా మూల్గాడు. ఇంద్రధనుస్సు అతనినిచూచి నవ్వింది. శుభశకునమే కాని తనకు గాదు. ఇంద్రధనుస్సు ఆహ్లాదకరంగా ప్రకాశిస్తున్నది. కాని అతనిదృష్టి కగుపడటంలేదు - అంతా చీకటి...

10

చనిపోయిన వారినందర్నీ 'చర్చి' దగ్గర సమాధిచేశారు. ఇంత కాలమూ మంచులో నోల్లాడిన శవాలకుగూడా ఆనాడు సమాధి చేయబడే అదృష్టం కలిగింది.

తనకొడుకు శవాన్ని తేవటానికి 'ఫెడోసియా' సహాయంచేసింది. బండబారి, శిలలాగ మారిపోయిఉన్న 'వాస్యా' ముఖంలోకి చూస్తూ అతని జుత్తు నిమిరింది. 'వాస్యా' సమాధిలేకుండా యింతకాలం ఉన్నా నష్టం లేదనుకున్నది. తక్కిన యెఱ్ఱసైనిక సోదరులతోపాటు, యెఱ్ఱసైనికుల చేతిలో సమాధి చేయబడే భాగ్యం కలుగుతున్నది.

నది వొడ్డునుంచి బండిలో తీసుకువస్తుంటే కొడుకుశవం మళ్ళీ మంచులో పడిపోతుందేమోనన్న భయంతో జాగ్రత్తగా బండి ప్రక్కనే నడుచుకుంటూ వచ్చింది. తన కొడుకుతోపాటు ఇంతకాలమూ మంచులో పడివున్న పరాయివాళ్ళ శవాలను కూడా నూత్నప్రేమతో నెమ్మదిగా అమర్చింది.

"ఈ కన్యగూడా సైనికయోధుడిలాగ విరోధులతో పోరాడుతూ ప్రాణాలువిడిచింది. కాబట్టి సైనికులతోబాటే సమాధిచేద్దాము" అన్నాడు. 'షెలాప్,' 'మలాషా' శవాన్నుద్దేశించి,

"కన్యకాదు వివాహితురాలే - భర్త యెఱ్ఱసైనికుడు" అన్నది 'మాల్యూచికా'. మంచులోపడివున్న 'మలాషా', వివాహానికి పూర్వం యేవిధంగానైతే యౌవనంతో తొణికిసలాడుతుండేదో అదేవిధంగా వున్నది.

"చాలా అందమైనది -" అని ఒక యెఱ్ఱసైనికుడు విచారంతో అన్నాడు.

అవును. గ్రామంలోకల్లా అందమైన పిల్ల 'మలాషా'. ఆమె పెద్ద కనురెప్పలు బుగ్గలమీద నీడలను కల్పిస్తున్నాయి. పొడుగైన కేశాలు

ముఖం చుట్టు అలల్లాగ అమరినాయి. విశాలమైన నుదుటిమీద తీర్చి దిద్దిన నట్టున్నాయి కనుబొమలు. పెదవులమీద చిరునవ్వు చిందులాడుతున్నది.

నెలరోజులబట్టి ఉరికంబంనుంచి వ్రేలాడుతున్న ‘లివాన్స్యాక్’ శవాన్ని క్రిందికిదించారు. అప్పటికే ప్రసవవేదన పడుతున్న అతని తల్లి, అందరూ వద్దంటున్నా గూడా వినకుండా వారితో కలిసి పనిచేయసాగింది. బండబారిపోయి నెలరోజులపాటు గాలిలో వ్రేళ్ళాడిన తనకొడుకు శవాన్ని మృదువుగా చేతుల్లోకి తీసుకున్నది.

“జాగ్రత్త...జాగ్రత్తగా దించండి” — తన కొడుకు శవానికి యెక్కడ దెబ్బ తగులుతుందోనని భయపడుతున్నట్టు అన్నది.

ఒక పెద్ద సమాధితోడి అందరినీ – ‘సిర్యోషా’ ‘సెర్డ్యూక్’ ‘మలాషా’ – మొదలైన వీరుల నందర్నీ అందులో వరుసగా ఉంచారు. వారంతా గాఢనిద్రలో ఉన్నట్టు కన్పిస్తున్నాయా శవాలన్నీ. ‘షెలాప్’ ఆ వీరులను స్మరిస్తూ ఉద్రేకంతో మాట్లాడాడు. అతని గంభీరవాక్కులు ఆ ప్రదేశమంతా ప్రతిధ్వనిస్తూ ఇంద్రధనుస్సులో కలిసిపోతున్నాయి.

గ్రామస్థులందరు – స్త్రీలు, పిల్లలు, ముసలివాళ్ళు – సమాధిచుట్టు నిలబడి చనిపోయిన యెర్రసైనికులను, వారితోపాటున్న ‘మలాషా’ను చూస్తూ వింటున్నారు. ఎవ్వరూ విలపించటంలేదు. విచార వదనాలతో తలమీది టోపీలు తీశారు. ‘ఫెడోసియా’ తన ఒక్కగాను ఒక్క కొడుకును భూదేవి కర్పిస్తున్నది. ముసలి ‘పారిశా’ తన ముద్దుబిడ్డ ‘మలాషా’ను మాతృభూమి కౌగిట్లోకి పంపుతున్నది. ఇతరులు అనేకమంది కూడా వున్నారు. కాని వారందరికిగూడా తమ పుత్రులను, భర్తలను సోదరులను సమాధిచేస్తున్నట్టుగా ఉన్నది.

అనాడు, అక్కడ సమాధి అవుతున్న వీరులకంటె ప్రియతమమైన వారు, సన్నిహితులు, వేరెవ్వరూలేరు వారికి. వారు యెర్రసైన్యానికి—తమ సైన్యానికి – చెందినవారు !

“దేశమాత ఈ వీరుల నెప్పటికీ మరువదు !” అని ‘షెలావ్’ ఉద్రేకంతో అన్నాడు.

అవును ! దేశమాతే కాదు. దేశస్థులుగూడా ఆత్యాగమూర్తులను యెప్పటికీ మరువలేరు వారిని సమాధిచేసిన ఆ దినంకూడా వారి స్మృతి

పథంలో యెన్నటికి నిలిచివుంటుంది. మొదటినాడు గ్రామాన్ని రక్షిస్తూ ప్రాణాలు విడిచిన వారిని, నేడు గ్రామాన్ని విముక్తిచేస్తూ చనిపోయిన వారిని ఆ సమాధి యేకం చేస్తున్నది.

గ్రామస్తుల ముఖాలలో గంభీరఛాయలు కనిపిస్తున్నాయి. ఇది యుద్ధం. రక్తపాతంతోను, అగ్నితోను గ్రామానికి తన ముద్ర వేసింది. కాని యెట్టి భయంకర పరిస్థితులలోకూడా సన్నగిల్లని ప్రజల నమ్మకము, ధైర్యము అచంచలములు. తమ సమయం రాకతప్పదని నమ్మారు. తమకు విజయం కలిగి తీరుతుందని నమ్మారు...

'షెలాన్' పిడికెడు మట్టితీసి గోతిలో వేశాడు. అతనితోపాటు అందరూ తమ దోసిళ్ళతో తమ ఆత్మబంధువులైన ఆ వీరులమీద, మట్టి వేశారు.

"నువ్వుకూడా వెయ్యి తల్లి! అని ఒక తల్లి తనబిడ్డతో అన్నది. ఆ పిల్ల తన చిట్టిచేతులతో యింత మట్టితీసి ఆ యోధులమీద వేసింది. తర్వాత యెర్రసైనికులు పారలతో మట్టి నింపేశారు. గోతినిండా, చివరికి ఆ యోధులు తమ స్వతంత్ర మాతృదేశంలో సమాధి అవుతున్నారుగదా అని అందరూ సంతృప్తిపడ్డారు.

"ఈ స్థలంలో పూలతోట వేద్దాము" అన్నది 'మాల్యావికా'.

అందరూ ఆనందంతో ఒప్పుకున్నారు.

నెమ్మదిగా యెవరిత్రోవను వారు పోసాగారు. వారి ముఖాలలో విచారంలేదు. విజయచ్ఛాయలు ద్యోతకమవుతున్నాయి. ఆ చనిపోయిన వారు తమ మాతృదేశంకోసం ప్రాణాలు అర్పించారు. ఈ విధంగా చరిత్రలో యెన్నోసార్లు, ఈ భూమిమీద పుట్టి పెరిగినవారు, ఈభూమిని రక్షించటానికి తమ ప్రాణాలను బలిచేయవలసి వచ్చింది. అది సర్వసాధారణమైన విషయమే!

కొద్దిసేపట్లో గ్రామమంతా కోలాహలంగా కళకళలాడసాగింది. స్త్రీలందరు యెర్రసైనికులకు అతిథి సత్కారము చేయాలని పట్టుపట్టారు. వారిని ఆహ్వానించి విందులు జరుప నిశ్చయించుకున్నారు. గ్రామం తరఫున కొందరు ప్రతినిధులు 'షలాన్' దగ్గరికివెళ్ళారు.

"కామ్రేడ్, 'షెలావ్' మాదొక మనవి. మా అతిథులైన మీకు విందుచేయాలని మాకందరికీకుతూహలంగావుంది. కాని ఆహారపదార్థాలు ..."

షెలావ్ నవ్వాడు.

"ఐతే నేనేం చేసేది ?"

"మొత్తంమీద ఆహారపదార్థాలు వున్నాయి. కాని కొంతసహాయం అవసరం. జర్మన్లు ఈ ప్రాంతాలకు వస్తారనగానే అన్నీ భూమిలో పాతిపెట్టి దాచేశాము. మీరు కొద్దిగా సహాయం యిప్పిస్తే అన్నీ త్రవ్వుకుంటాము."

"సరే; సహాయం చేస్తాము ... ఎవరు వెళ్తారయ్యా సహాయం చెయ్యటానికి" అని 'షెలావ్' తన సైనికులను అడిగాడు.

అనేకమంది ముందుకువచ్చారు. స్త్రీలు వారిని చాతీవరకు దిగబడే మంచులో పొలాల్లోకి తీసుకు వెళ్ళారు.

"ఇదిగో యీ పొదదగ్గిర !"

"అబ్బే కాదు ... అదిగో, అక్కడమ్మా !"

"చాల్లే మహా తెలిసినట్టు చెబుతున్నావు. ఇక్కడేగా పాతింది—"

ఈ విధంగా అందరూ సందడిపడుతున్నారు. 'అలెగ్జాండర్' ఆనందానికి మేరలేకుండా వుంది.

"ఇవ్వాళ గొఱ్ఱెనుకోసి వండుదాము" అన్నాడుయెర్రసైనికులతో

"మరి నీ దగ్గర ఉన్నదే ఒకటిగా ?"

"అవును ఒకటే... ఇంతకుముందు చాలా వుండేవి. కాని జర్మన్లు అన్నింటిని తినేశారు. ఇదొక్కటే మిగిలింది."

"మిగిలిన ఆ ఒక్కగొఱ్ఱెనూ మేము తినేస్తేయెట్లా ? అలా యెప్పటికీ జరుగదు."

"మీ రట్లాఅంటే నామనసుకి కష్టంగా వుంటుంది, ఏమాత్రం ఆటంక పెట్టబోకండి...ఇంతకంటే యే మివ్వగలను ?... నామనస్సు కష్టపెట్టకండి" అని అలెగ్జాండర్ ప్రాధేయపడసాగాడు.

స్త్రీలు భూమిలో దాచిన ఆహారపదార్థాలన్నీ త్రవ్వి పైకితీసారు. ఆవులు యింకా మిగిలివున్నవారు గాయపడ్డ సైనికులకోసం గబగబ పాలు పితకనారంభించారు.

గాయాలు తగిలినవారిని గ్రామ సోవియటు కార్యాలయంలోని రెండు గదులలో ఉంచారు. ప్రథమ చికిత్స నేర్చుకున్న 'ఫ్రోస్యా' అందరికీ కట్లుకడుతూ ఊపిరాడకుండా పనిచేస్తున్నది. తక్కిన యువతులందరు కిటికీల దగ్గర నిలబడి అది చూస్తూ ఈర్ష్య పడుతున్నారు.

"ఏం కావాలిమీకు ?" అని నవ్వుతూ ఒక డాక్టరు ఆ యువతులను అడిగాడు. రాత్రి సైనిక కార్యాలయంమీద జరిగిన పోరాటంలో పాల్గొన్నాడీ డాక్టరు. ఇప్పుడు గాయపడ్డవారికి వైద్యం చేస్తున్నాడు."

"మీకు హాస్పటల్‌లో సహాయం చేద్దామని వచ్చాము"

"సహాయం అక్కరలేదు. అవసరంపడ్డ యిద్దరి యువతుల్ని తీసుకొన్నాము. కట్లుకట్టటానికి మా స్వంతమనుషులే వున్నారు.

"పోనీ,...ఇల్లంతా చెత్తగావుంది...తుడవమంటారా ?" — అని ఒక యువతి అడిగింది.

"నిజమే...శుభ్రం చేయండి"

ఒక్క క్షణంలో ఆ యువతులందరూ పాతగుడ్డలు పుచ్చుకుని పరుగెత్తుకువచ్చారు.

"ఏమిటి ! ఇంతమందా యిల్లు తుడవటానికి ?"

గాయపడ్డవారు లేచిపోతారన్న భయంతో గుసగుస లాడుకుంటూ పేచీలు పడ్డారు. చివరికి నేలను భాగాలుగా పంచుకుని, యెవరిభాగంవారు తుడుచుకొనసాగారు.

"అదిగో, వాళ్ళకు కప్పిన దుప్పట్లు తొలిగిపోతున్నాయి. కనబడటంలేదూ ?" అని గాయపడ్డవారికి కప్పిన దుప్పట్లు జారిపోతుంటేచూచి 'ప్చిచికా' 'ఫ్రోస్యా' ను కసరుకొన్నది.

"జారిపోతున్నవని చూస్తూ కేక లేసేబదులు తిరిగి కప్పరాదూ ?" అన్నది 'ఫ్రోస్యా' గాయాలు కడిగిననీళ్ళు బయట పారబోయటానికి వెళుతూ.

'స్పిచికా' వెళ్ళి జారిపోతున్న దుప్పట్లను తిరిగి జాగ్రత్తగా కప్పి అక్కడే వుండిపోయింది.

"అక్కడేంచేస్తున్నావు ?"—అన్నాడు డాక్టరామెను గమనించి.

"దుప్పట్లు మాటిమాటికి జారిపోతున్నాయి. తిరిగి కప్పుతున్నాను" అంటూ వెళ్ళి యింకొక సైనికుడి తల క్రింద తలగడ సర్దుతున్నది.

"సరే, నీకంత సర్దాగావుంటే చెయ్యి, ఎవరొద్దనగలరు"—

నిజంగానే ఆమెకు చాలా సర్దాగావుంది. ఆమెకేకాదు అందరు యువతులకీ అట్లాగేవుంది. గాయపడ్డ యెర్రసైనికులకు పరిచర్యలు చేయటానికి అందరూ ఉత్సాహపడుతున్నారు.

గ్రోశాచ్ కూతురు 'లిడా' మునివేళ్ళమీద నడుచుకుంటూ నిశ్శబ్దంగా లోపలికి వచ్చింది.

"ఏమిటి ? నువ్వుగూడా సహాయం చేయడానికేనా"? అని డాక్టర్ అడిగాడు.

కాదన్నట్టు ఆమె తల ఊపింది.

"ఊహుఁ...ఒక స్త్రీ ప్రసవవేదనపడుతున్నది...మీరు డాక్టర్లు... కొద్దిగా రాగలిగితే..." అన్నది నెమ్మదిగా.

"కాని..." డాక్టర్ దేనికోసందేహిస్తున్నాడు.

"ఫరవాలేదు రండి. చాలా ప్రమాదస్థితిలోవుంది. ప్రొద్దుట వచ్చిన జర్మన్లను ఈడ్చివేయటానికి సహాయంచేసింది...అప్పటినుంచి నొప్పులు మొదలైనాయి..."

"సరే, వస్తాను—ఒక నూతన పౌరుడు పుట్టబోతున్నాడు. నేను సహాయం చేయటానికి వెళ్ళాలి. ఇంతలో మీరు చూచుకుంటూ వుండండి" అని అక్కడివారికి చెప్పి 'లిడా' వెంట బయలుదేరాడు.

'లిడా' అతనిని గబగబా 'లివాన్యుక్' యింటికి తీసుకుపోతున్నది. డాక్టరు చేతికి తొడుక్కోటానికి యేమీలేక చలికి, ఒకదానికొకటివేసి రుద్దుకుంటున్నాడు.

"ఇలాంటి చలిలో మీరు చేతులకి 'గ్లోవ్'లు తొడుక్కోవలసింది."

"గ్లోవ్‌లు వుండేవి. కాని రాత్రి పోరాటంలో యెక్కడో జారి పోయినాయి"

'లిడా' అతనివైపు సిగ్గుతో ఒక చూపుచూచి తన చేతులకున్న గ్లోవ్‌లు లాగేసి అతని కివ్వబోయింది.

"వద్దు. వద్దు...మరి నీకో ?"_ అన్నాడు డాక్టర్.

"నాకు వేరే ఒకజత వుంది. జాగ్రత్తగా దాచి ఉంచుకున్నాను, జర్మన్ల కండ్లబడకుండా. అయినా మీరు డాక్టర్లు... చేతుల విషయం చాలా శ్రద్ధగావుండాలి..."

ఆమె పెదవులు కంపించడం డాక్టర్‌కి కనుపించింది. కండ్లల్లో నీళ్ళు తిరగడమే తరువాయి.

"సరే, నువ్వింత పట్టుబడితే తప్పక తీసుకుంటాను" అని నవ్వాడు.

'లివాన్యుక్' యింటి నడవలో స్త్రీలందరు గుమిగూడారు. డాక్టర్‌నిచూచి ప్రక్కకు తొలిగారు. అప్పుడే అతడు అందరికీ పరిచయమై పోయాడు.

"అప్పుడే కన్నది_" అన్నది ఒకామె.

"ఐతే యిక నేనెందుకూ ?"

"అలాకాదు. ఆమె నొకసారి చూడాలి. చాలా అవస్థపడ్డది. బహు నీరసంగా వుందికూడాను."

"అత్తయ్యా, నీకోసం డాక్టర్‌ని తీసుకొచ్చాను" అని 'లిడా' బాలెంతరాలికి తెలియజేసింది.

"ఈమాత్రం దానికి డాక్టర్‌గార్నెందుకు తీసుకొచ్చావ్ ?...పోనీ బిడ్డను చూస్తారేమో చూడనివ్వు..."

డాక్టర్ ఉయ్యాలదగ్గరికి వెళ్ళి చూచాడు.

"మగబిడ్డేనా ?"

"అవును, కొడుకే...ఒక్కతే కూతురు నాకు...తక్కిన వారంతా మగపిల్లలే..."

"అందంగా వున్నాడు...యేం పేరు పెడతావు ?"

"ఆ విషయమే యిందాక అనుకుంటున్నాము. వాడి అన్న 'మిట్యా' పేరు పెట్టాలనివుందినాకు. కాని వాడిపేరు పెడితే వాడిలాగే వీడుకూడా దురదృష్టవంతు డౌతాడేమో నంటున్నారు వాళ్ళంతా... "

"వీళ్ళ అన్న యేడీ ?"

"జర్మను ఉరితీసేశారుకాదూ ... నెలరోజులబట్టి ఉరికంబంనుంచి వ్రేళ్ళాడుతునే వున్నాడు. ప్రొద్దుటేకదూ, సమాధిచేసింది." అని డాక్టర్ కి అంతా తెలియజేసింది.

డాక్టర్ ముఖంలో విచారం కనబడుతున్నది.

"అలానా ? ఆ పిల్లవాడు నీకొడుకేనని యింతవరకు తెలియదు."

"అవును ! నాకొడుకే...ఇంకా పదహారేళ్ళయినా నిండలేదు. గెరిల్లాదళంలో చేరటానికి వెళుతుంటే జర్మను పట్టుకొని ఉరితీశారు... వాడిపేరే యిప్పుడు పుట్టినవాడికి పెడదామని వుంది. కాని వీళ్ళందరూ ఆ పేరొద్దంటున్నారు..."

"మనకు విజయం కలిగిననాడు పుట్టాడుకదూ ... అందుకని 'విజయుడు' అని పిలిస్తే బాగుంటుంది." అన్నాడు డాక్టర్.

"విజయుడు !...బాగానేవుంది...ఏమంటావు 'లిడా' ?"

"డాక్టర్ గారు పెట్టినపేరు చాలాబాగుంది."

"ఇంకా సందేహమేమిటి ... అదే బాగుంది. డాక్టర్ గారు, కూర్చోండి."

"ధన్యవాదాలు. కాని కూర్చోటానికి సమయంకాదు. దెబ్బలు తిన్నవారిని చూడటానికి పోవాలి."

"ఉఁహుఁ...అలా వల్లకాదు. గాయపడ్డవారి కందరికీ కట్లు కట్టేశారుగా—కూర్చోండి. అందరూ యెఱ్ఱసైనికులకు ఆతిధ్యం ఇస్తున్నారు. కాని నేను యీ అవస్థలో వుండిపోయాను...'లిడా' ! ఆ బీరువాలో 'ఓడ్కా' వుంది, డాక్టరుగారికి తెచ్చియివ్వు..."

"అబ్బే, యెందుకూ అవవసరంగా..."

"వైద్యం చేయటం తెలిస్తే తెలియవచ్చు మీకు. కాని మా స్త్రీల హృదయాలసంగతి తెలియదు...మీరు పుచ్చుకోకపోతే నా హృదయం చాలా బాధపడుతుంది."

డాక్టర్ మారుమాటాడలేకపోయాడు. 'లిడా' గ్లాసునిండా ఓడ్కా పోసి యిచ్చింది.

"నీకొడుకు అదృష్టవంతుడవుతాడు ఇవ్వాళటిలాగానే జీవితంలో యెల్లప్పుడూ విజయాలు పొందాలని దీవిస్తున్నాను..." అని దీవిస్తూ డాక్టర్ 'ఓడ్కా' పుచ్చుకున్నాడు.

డాక్టరు చాలా అలసిపోయి వున్నాడు. ఎన్నో రోజులబట్టి నిద్ర లేదు. 'ఓడ్కా' పుచ్చుకునే టప్పటికి హాయియనిపించింది. కుర్చీమీద అలా కూర్చునివుంటే యుద్ధరంగానికి యెంతోదూరంలో తన యింట్లో కూర్చుని వున్నట్టనిపించింది. 'లిడా' అతనివైపుచూచి మందహాసం చేస్తున్నది. ఈ యుద్ధం ప్రారంభమయినది మొదలు తాను అనుభవిస్తూ వచ్చిన కష్టాలన్నీ వట్టి కల అనిపించింది.

"లిడా, ఆ ఫోటో తీసుకురా... డాక్టరుగారు చూస్తారు"

మాసిపోయిన ఆ ఫోటో పుచ్చుకొని డాక్టర్ చూడసాగాడు. చిరునవ్వు నవ్వుతూ అమాయకంగా కనిపిస్తున్నది ఒక బాలుని ముఖం.

"నిన్న ఉరికంబంనుంచి వ్రేళ్ళాడుతున్నప్పుడు చూచినట్టయితే. యేమీ పోలికవుండదు, కాని బ్రతికున్నప్పుడు యిలాగే వుండేవాడు..." అని ఆమె డాక్టర్‌గారికి నెమ్మదిగా చెప్పసాగింది.

ఆమెను చూస్తుంటే డాక్టర్‌కి తన తల్లి జ్ఞాపకానికి వచ్చింది. తల్లిని విడిచి వస్తున్నప్పుడు విచారంతో ఆమె చూచినచూపు గుర్తుకొచ్చింది. గాయపడ్డవారిని, ఆ రక్తపాతాన్నిచూచి అనేకరాత్రులు అతనిహృదయం పడ్డబాధ మళ్ళీ గుర్తుకొస్తున్నది. ఇంతవరకూ అతని హృదయంయొక్క ఆ బలహీనతపోలేదు. పైగా రోజురోజుకి యెక్కువవుతున్నది.

పసిబిడ్డ ప్రక్కన పడుకున్న 'లివాన్యుక్' తల్లిని చూచాడు. ఆమె ముఖం యెంతో ప్రశాంతంగావుంది. నెలరోజులపాటు కొడుకు ఉరికంబం నుంచి గాలిదుమారంలో వ్రేళ్ళాడుతుంటే చూస్తూ గడిపింది. నెలరోజులు తన బిడ్డలతోబాటు తిండిలేక మలమల మాడిపోతూ గడిపింది. నిండు చూలాలైకూడా తనకొడుకుని ఉరికంబంనుంచిదింపి సమాధివరకు మోసుకు

వచ్చింది. ఇప్పుడు యింటికివచ్చి దుర్భర ప్రసవవేదనపడి బిడ్డనుకన్నది. అవన్నీ జరగనట్టే, తనతో ప్రశాంతంగా మాట్లాడుతూ జర్మన్ల కండ్లబడ కుండా అతి జాగ్రత్తగా దాచుకున్న ఆ కొద్ది 'ఓడ్కా' ను తాగమని బలవంతం చేస్తున్నది.

పొరుగునవున్న స్త్రీ లందరు వచ్చి డాక్టరుచుట్టూ కూర్చున్నారు. వారినందరిని క్రీగంట చూచాడు. వాళ్ళందరు జర్మను నరకంలో నివ శించారు. వారి భర్తలు, పుత్రులు యుద్ధరంగంలోఉన్నారు. కాని వాళ్ళు బ్రతికున్నారో, లేదో తెలియదు. ఆ స్త్రీలకు, జర్మన్లు తెచ్చిన కరువుని, గాలిదుమారాన్ని అనుభవించారు. జర్మన్లు తుపాకి మడమలతో పొడిచిన గాయాలు ఇంకా అనేకమందికి మానలేదు. ఇవన్నీ యెరుగున్న వారికితప్ప, యితరుల కెవ్వరికీ వారి ముఖాలలో ఆ ఛాయలేమీ అగుపడవు. వారి ముఖాల్లో ప్రశాంతము, హృదయకుహరాల్లోంచే ప్రవహిస్తున్న గాంభీర్యము ద్యోతకమవుతున్నది. !

'రైతు స్త్రీలు !' అనుకున్నాడు, తనలో తాను. ఆ మాటల్లో యేదో కొత్తఅర్థం స్ఫురించింది.

"ఓడ్కా ఇంకా వుంటే 'లివాస్యుక్' జ్ఞాపకార్థం అందరమూ తాగుదుము"—అన్నది 'లివాస్యుక్' తల్లి ప్రశాంతంగా.

"అవసరంలేదు. అదిలేకపోయినా 'లివాస్యుక్' ని మేము యెల్లప్పుడూ జ్ఞాపకం పెట్టుకునేవుంటాము...అవునా, కాదా ?" అని తక్కిన స్త్రీలవైపు చూచింది 'టెర్బిలకా.'

"అవును—తప్పక గుర్తుంటాడు. అందరికీ"

"ఇప్పుడు అతని స్థానాన్ని 'విజయుడు' తీసుకుంటాడు. వాళ్ళ అన్నలాగే పెరిగి పెద్దవాడై అవసరమైతే మాతృభూమికి ప్రాణాలను గూడా అర్పిస్తాడు !"

ఓడ్కా డాక్టర్ మనస్సుని మత్తుతో నింపేసింది. ఆ స్త్రీలతో-స్నేహభావంతో, ఆత్మీయతతో యేదో మాట్లాడాలనిపించింది. ఉరికంబం మీద నశించిపోయిన ఆ బాలుని, అతనిని ఉరికంబంనుంచి దించి తెచ్చి సమాధిచేసిన ఆ తల్లిని తలంచుకుంటుంటే అతని హృదయం కృంగిపోతున్నది.

'మత్తులోవున్నావు' అని తనని తాను సంబోధించుకున్నాడు. కాని అతని కండ్లల్లో నీళ్ళు తిరగక తప్పలేదు.

"ఏమిటి, అలావున్నారు?" అని ఆదుర్దాతో అడిగింది 'లిడా'.

"మనస్సు ఖేదపడుతున్నది."—తన్ను తాను సంబాళించుకోటానికి ప్రయత్నిస్తూ నసిగాడు.

'లివాన్స్క్' తల్లి అతనివైపు తన ప్రకాశవంతమైన కండ్లతో చూచింది.

"ఖేదపడవలసిన అవసరంలేదు. విచారింపవలసిన సమయంకాదిది.

'లివాన్స్క్' పోయాడని విచారించటానికి బదులు, విజయుడు పుట్టాగని సంతోషించవలసిన సమయం. మన ప్రజలు బలంగా ఈ మాతృభూమిలో నాటుకుపోయివున్నారు. ఒక చెట్టు నరికితే యింకొక మొక్క అదేసమయంలో మర్నాడు లేస్తుంది...'లివాన్స్క్,' ఇంకా యెందరో నశించిపోయారు. కాని మన మాతృభూమి యిక్కడేవుంది. మన ప్రజలూ యిక్కడే వుంటారు. మన సైనికులు వచ్చేలోగా ఒక్కరైనా మిగలకుండా మమ్మల్నందరినీ జర్మన్లు హతమార్చేస్తారని అనేకసార్లు అనుకున్నాము మేము. కాని మిమ్మల్ని చూడటానికి యింకా బ్రతికివున్నాము మేము...ప్రజలు ఎన్నయినా భరించగలరు. ప్రజాశక్తికి ఎదురులేదు.. జర్మన్లు తమ తలకు మించినపనికి ప్రయత్నించారు—"

డాక్టర్ కండ్లముందునుంచి తెర తొలగిపోయింది. అతని మనస్సుని చీకాకుపరుస్తూ బాధపెట్టిన సమస్యలకు ఆ రైతుస్త్రీలు యెంతో సులభంగా, వారికి సహజమైన పద్ధతిలో సమాధానమిచ్చారు! తనను చూచుకుంటే తనకే సిగ్గువేసింది.

"అవును—మీ రన్నది ముమ్మాటికీ నిజం!"

"నువ్వింకా చాలా చిన్నవాడివి. కష్టాలుపడి యెరుగవు. అందువల్లనే నీకు అట్లా అనిపిస్తుంది. కొంతకాలానికిదంతాపోతుంది. అప్పుడు యెటువంటి మనక్లేశమూ లేకుండా రక్తపాతం చూడగలుగుతావు. మనస్సు యేమాత్రమూ బాధపడకుండా క్షతగాత్రులకు వైద్యం చేయగలుగుతావు.."

ఈమాటలు వింటుండేటప్పటికి హాస్పటల్లో గాయపడి వున్న వారిసంగతి స్ఫురణకొచ్చింది. చటాలున లేచి బయలుదేరాడు.

గ్రామమంతా ఆనందగీతాలతో ప్రతిధ్వనిస్తున్నది. చలికిగూడా లెక్కచేయకుండా యువతులు పాటలు పాడుతూ తిరుగుతున్నారు. యువ

కులు తమ గొంతులెత్తి ఆ పాటలకు శృతికలుపుతున్నారు. చీకటికోణంలో పడివున్న యీ నెలరోజులవిలువ ఆనాడు తీసుకుంటున్నారా అనిపిస్తుంది.

సంగీతంలో ఓలలాడటం గ్రామస్థులకు అనాదినుంచి పరిపాటి. గానంతో పగలు నాహ్వానించి, గానంతో సాగనంపేవారు. పొలాలు దున్నటానికి, విత్తు నాటటానికి, కోతలు కొయ్యటానికి గానం తోడ్పడేది. పిల్లలు పాటలతో గొడ్లను కాస్తుంటారు. వివాహ సమయంలో గానం — చావు తోడుకుపోవటానికి గానం! యుగయుగాలనాటి పాతపాటలు — నవయుగపు కొత్తపాటలు వారి జీవితాలలో అనేకం. జీవితంతో పాటలు — పాటలతో జీవితం పెనవేసుకు పోయున్నాయి...

నెలరోజులు మూగవారై వున్నారు. ఈ నెలరోజులు గీతమైనా ఒకసారి పెదవులుదాటి రాలేదు. ఇండ్లు, వీధులు, అన్నీ మూగనోముపట్టినవి!

కాని యిప్పుడు మళ్ళీ పాడుకునే అవకాశం కలిగింది. తమ మనస్సులను చూరగొన్న జానపదాలను గొంతెత్తి ఆకాశమంతా ప్రతిధ్వనించేటట్టు పాడుతున్నారు బాలికలు. పాటతర్వాత పాట — ఎటుచూచినా పాటలే ప్రతిధ్వనిస్తున్నాయి.

కుంటి అలెగ్జాండర్ గ్రామసోవియట్ బోర్డును తగిలిస్తున్నాడు. పిల్లలంతా సంతోషంతో చుట్టుచేరి తలలెత్తి చూస్తున్నారు. యుద్ధచిహ్నాలైనవన్నీ తొలగించివేస్తున్నారు. జర్మన్లు గోడలకు వేసిన కన్నాలన్నీ పూడ్చేస్తున్నారు. ఇసుకబస్తాలు బయట పారేశారు. స్త్రీలందరుచేరి నేలమీదవున్న జర్మన్ల రక్తం శుభ్రంగా తుడిచివేయసాగారు.

“ఏమీ వుండకూడదు. సాయంత్రంకల్లా వాళ్ళచిహ్నమైన దేదీ లేకుండాచెయ్యాలి” అని ఒక స్త్రీ అన్నది. అందరూ సమ్మతించి తలలూపారు.

గ్రామస్థులందరూ దానినే ఆశిస్తున్నారు. చీకటితో కూడుకున్న జర్మన్లయొక్క ఆ ముప్పైరోజుల పరిపాలనకు సంబంధించిన చిహ్నమేది మన్నాటికి లేకుండా చేయాలని వారికుతూహలం. ఎవరో వెళ్ళి ‘చర్చి’ దగ్గిర ఉరికంబాన్ని కూలద్రోశారు. జర్మన్లు నివసించి అసహ్యంచేసిన ఇండ్లకన్నింటికీ అప్పుడే సున్నంవేస్తున్నారు. పంటల నూర్పుకాలంలో వున్నంత సందడిగా వున్నారందరు.

"ఏమీ వుండకూడదు. వాళ్ళకు సంబంధించిన దేమీ వుండకూడదు" అంటూ స్త్రీలు పనిచేస్తున్నారు.

"వాళ్ళకు సంబంధించింది యేమీ ఉండకూడదు!" అని మారు పలుకుతూ పిల్లలు పూర్వపు సైనిక కార్యాలయంచుట్టూ తిరిగి జర్మన్ల గుడ్డ పేలికలు, ఖాళీ తోటాలు మొదలైనవి ఏరితీసి పారేస్తున్నారు.

ఎర్ర సైనికులు ఖాతీవరకు ఉన్న మంచులో దిగి టెలిఫోను తీగలు వేశారు. 'షెలాప్' టెలిఫోనులో యితర ప్రాంతాలతో సంబంధం కలిగించుకుంటున్నాడు. స్కూలు భవనంలో జర్మను ఖైదీల విచారణ సాగుతున్నది. ఆ విచారణలో పాల్గొనాలని గ్రామస్థుల కెంతో కుతూహలంగా వుంది. కాని అది సైన్యానికి సంబంధించిన విషయమని తెలుసుకొని జోక్యం కలిగించుకోలేదు.

"ఇంకా ఆ వెధవల్ని ప్రశ్నలు వేయటంకూడాదేనికి? వరుసగా నిలబెట్టి కాల్చేయక –" అని 'పెర్ఫిలిఖా' గొణిగింది.

"నీకు తెలియదు ఊరుకో ... ఆ వెధవలదగ్గర్నుంచి తెలుసుకో గలిగిదంతా తెలుసుకోవాలా లేదా?"

"ఐతే ముందు తెలుసుకొని ఆ తర్వాతనైనా ఆ పని చెయ్యాలి"

"ఏమిటీ! యుద్ధఖైదీలను చంపటమా! ఎక్కడైనావుందీ ఆ మాట".

'పెర్ఫిలిఖా' త్రోకతొక్కిన త్రాచల్లే లేచింది.

"యుద్ధఖైదీలేమిటి? యుద్ధ ఖైదీలట! మనవాళ్ళను ఖైదీలుగా పట్టుకున్నప్పుడు వాళ్ళేంచేశారో మరచి పోయావా? నాకు వదిలేస్తే బ్రతికుండగానే చర్మంవొలుస్తాను. సలసలకాగే నీళ్ళల్లో వేసిఉడకబెడతాను... కాని మనం అలాంటి పాతకపు పనులుచేయము. మర్యాదస్థులం కాబట్టి వాళ్ళనుగూడా మర్యాదగా చూస్తాము...అంతే..."

"వాళ్ళేమీచేసినా మనకది అనవసరం. యుద్ధనిబంధనల ప్రకారం యుద్ధఖైదీలను చంపరాదు..."అని 'పెల్‌చారికా' అన్నది.

"యుద్ధ నిబంధనలట! నీవూ, నీ యుద్ధనిబంధనలూ బాగున్నాయి! ఈ రోజుల్లో యెక్కడ పాటిస్తున్నారో చెప్పు? పూర్వం ఎప్పుడో వుండి వుండవచ్చు, కాని యిప్పుడు కాదు. పిల్లల్ని, స్త్రీలను చంపటమేనా యుద్ధ నిబంధనలంటే?"

'పెల్‌చారికా' దీర్ఘంగా నిట్టూర్చింది.

"నువ్వు నాకు చెప్పాలా ? నా విషయంలో యేమిచేశానో నీ వెరుగున్న దేగా..."

"అందుకే నేను నీ మాటలు విని ఆశ్చర్య పడుతున్నాను. యుద్ధం చేసేవాళ్ళకి యుద్ధనిబంధనలు పాటిస్తాయి. కాని ఈ వెధవలు చేసేదికూడా యుద్ధమేనా ? వట్టి బందిపోటు ముండాకొడుకులు..."

'పెల్‌చారికా' జవాబు చెప్పలేదు. అందరి విధంగానే ఆమె హృదయంలోకూడా ద్వేషం ప్రబలిపోతున్నది. కాని జర్మన్లు చేసినట్టే తాము కూడా చేయటం సిగ్గుచేటని తెలుస్తున్నది.

"కూరొస్సెట్టి బాగామేనండి ! దుక్కల్లాగ బలిసించి యుద్ధమై పోగానే చెక్కు చెదరకుండా యిండ్లకు పంపించండి..." అని 'కెరికా' కోపం పట్టలేక గొణిగింది.

"ఆ సంగతులన్నీ మనకెందుకు—" అన్నాడు స్త్రీల కీచులాటలో కల్పించుకొని, 'అలెగ్జాండర్'

"నేను మాత్రం యేమన్నాను గనుక..."

"ఏమీ అనకుండావుంటే చాలు"—అని కుంటుకుంటూ 'అలెగ్జాండర్' వెళ్ళిపోయాడు, స్కూలుబోర్డుతగిలించటానికి. పూర్వం ఉన్నంత అందంగా వుండకపోవచ్చు యీబోర్డు కాని జర్మన్ల పరిపాలన చిహ్నాలేమీ లేకుండా చేయడానికి అదికూడా ఒక ముఖ్యావసరం.

కిలకిలమంటూ మహదానందంగా వున్న ఆ వాతావరణంలో హఠాత్తుగా యేదో ప్రేలుడుశబ్దం వినవచ్చింది. గానం ఆగిపోయింది. వీధుల్లో ఆడుకుంటున్న పిల్లలు రాళ్ళయి నిలిచిపోయారు.

"ఏమిటది ?"

చెవులు చిల్లులుపడిపోయే శబ్దం మళ్ళీ వినిపించింది.

"ఫిరంగి కాల్పులు !"

" 'ఓఖ్రై' గ్రామంలో..."

"జలిన్‌ట్సీ గ్రామంలో..."

"మన ఫిరంగుల మోతేనా ?"

అందరూ జాగ్రత్తగా వినసాగారు. ఫిరంగిశబ్దాలు మారుమ్రోగు తున్నాయి. కొంతసేపటివరకు యెవ్వరూ నోరు మెదపలేదు.

"మళ్ళీ యేమిటిది?"

"పోరాటం సాగుతున్నది..."

"మన తుపాకులే వినబడుతున్నాయి. మన తుపాకులే..."

"తుపాకులగురించిన ఈ నేర్పు నీ కెప్పుడు అబ్బింది?"

"మన సైన్యం యెక్కడైయితే వుందో అటునుంచేకదూ తుపాకులు వినిపిస్తున్నాయి..."

గ్రామస్థులు యెర్రసైనికుల ముఖాలకేసి చూచారు. అవి ప్రశాంతంగా వున్నాయి. అందులో ఒక సైనికు డన్నాడు "అవును; మన తుపాకులే. ఇక మన యుద్ధరంగాన్ని విస్తరించాలి."

"ఏమిటి?"

"ఈ ప్రాంతంలో మేము జర్మన్లను హతమార్చాము. కాని తక్కిన ప్రాంతా లెన్నిట్లోనో యింకా వున్నారు. వాళ్ళ నందర్ని నలువైపుల నుంచి తరిమికొట్టాలి."

"నేను మొదట్లోనే చెప్పలేదూ ... అన్నివైపులనుంచి తరుము కొస్తున్నారని?"

"నువ్వు అలాంటిదేమీ చెప్పనేలేదుగా, అత్తయ్యా"

"నేను చెప్పలేదూ? నువ్వు వినకపోతే చెప్పనట్టేనా? జర్మన్లను నలువైపులనుంచి తరుముకొస్తున్నారని అప్పుడే చెప్పాను.."

"ఇక చూడండి జర్మన్లు ఏవిధంగా పలాయనమంత్రం పఠిస్తారో!"

"ఇటునుంచే పారిపోతారా? – 'ఓల్గా' ముఖకళవళికలు అప్పుడే మారిపోయినై.

"వస్తే యేం? రానివ్వు...యిక్కడ మనం పని పట్టొచ్చు"— నడుంమీద దర్జాగా చేతులు వేసుకుని నిలబడి 'ఔర్చైలిఖా' అన్నది.

"పారిపోయేవారు యెట్లానూ పారిపోతున్నారు. ఇదేదారిని పారి పోవాలా? ఇంకా మనను పట్టుకు పీడించాలా?"

"ఇంతకూ వాళ్ళు బ్రతికి యిటువచ్చినప్పటి మాటగద..."

అందరూ చెవులు నిక్క పొడుచుకొని వింటున్నారు. ఫిరంగులు గాలిలో ప్రతిధ్వనిస్తున్నాయి. జర్మన్ల నాశనంకొరకు యుద్ధరంగం విస్తరించుకు పోతున్నది.

'షెలావ్' స్కూలుభవనంలో జర్మను ఖైదీలను ప్రశ్నలు వేస్తున్నాడు. ఆ వెచ్చనిగదిలోకూడా జర్మన్లు భయంతో వణికిపోతున్నారు చిక్కిపోయి, చినిగిపోయిన దస్తులతో, శరీరమంతా దుర్గంధ పూరితమైన దెబ్బలతో వున్నారు వంటినిండా చీకపేళ్ళు కుడుతుంటే 'షెలావ్' మీదినుంచి దృష్టి మరల్చకుండా గోక్కుంటున్నారు. కెప్టెన్ 'కర్ట్' సైన్యంలోనివారు అయిదుగురు మాత్రం బ్రతికున్నారు.

"మనతోపాటు యుద్ధరంగంలో వీళ్ళెందుకు ? వెనక్కి పంపెంచేద్దాము" అని 'షెలావ్' నిశ్చయించాడు.

"వెనక్కి పంపటమా ! ఇక్కడే కాల్చి పారెయ్యక..."అన్నాడు ఒక యెర్ర సైనికుడు.

"చాల్లే, ఊరుకో !"

"వీళ్ళతోపాటు సైనికుల్ని కాపలా పంపటంగూడా అనవసరం. మన ప్రజలకు అప్పజెప్పితే వాళ్ళే తరుముకు వెళతారు..."

"పోయి సార్జెంటుని పిలుచుకురా ?" అని అక్కడితో ఆ సంభాషణకు అడ్డువేశాడు 'షెలావ్'.

స్వచ్ఛమైన గాలి పీల్చుకోటానికి నడవలోకి వెళ్ళాడు. పూర్తిగా ఒక గంటసేపు ఖైదీలతో ఆ గదిలో ఉన్నాడు. తన శరీరంనిండాకూడా చీడపేళ్ళు ప్రాకుతున్నట్లు గుడ్డలన్నీ ఛండాలపు వాసన కొడుతున్నట్టూ అనిపించింది.

తనివిదీరా స్వచ్ఛమైన గాలి పీల్చుతున్నాడు. సూర్యుడు బంగారు ఛాయతో ప్రకాశిస్తున్నాడు. గ్రామమంతా గానంతో ప్రతిధ్వనిస్తున్నది. ప్రశాంతమైన అడవిలో వీచేగాలి నాదంలాగ, కొండకోనల్లో ప్రవహించే జీవనది గలగలలాగ హృదయానికి హాయిగొల్పుతున్నదా గానం. గ్రామ ప్రజల హృదయాల్లో తొణికిసలాడుతున్న ఆనందం ఆ గానంలో ప్రతిధ్వనిస్తున్నది.

"ఫెడోసియా చెప్పింది అద్భుతంగావుంది" అంటూ స్త్రీలందరు ప్రక్కకు తొలగిపోయారు.

ఇద్దరు యెర్రసైనికులు ఖైదీలను తీసుకుపోసాగారు. 'పెర్సిలీషా' చేష్టలుడిగి వారు పోతుంటే చూస్తున్నది.

"హా-ఎంతో మహా చేసేవాళ్ళలాగ లేనారు. ఇంతేనా..." అని చేతులు తిప్పుకుంటూ చీదరించుకున్నది.

"ఫెడోసియా ఇంతసేపూ చెప్పింది అర్థంకాలేదూ ?"

"నిజంగానే 'ఫెడోసియా' మాటలు నాకు అర్థంకాలేదు. ఆ జర్మను మృగాన్ని చేతులారా చంపితేగాని నాకు తృప్తికలుగదు." అంటూ కొద్దిసేపు జాగ్రత్తగా విని మళ్ళీ ఇట్లాఅన్నది : "ఫిరంగిమోతలుఆగిపోయి నట్లున్నాయి వినండి."

అందరూ శ్రద్ధగావిన్నారు.

"అవును - ఆగిపోయినై. ఈ గలభాలో మనం దాన్ని గమనించనే లేదు."

"ఏం జరిగుంటుందో ? పోరాటం ఆగిపోయినట్లా, లేక యింకే మైనా జరిగుంటుందా ? ఎవరినడిగితే తెలుస్తుంది ?"

"మన కమాండర్ కి తప్పకుండా తెలుస్తుంది"

ఈ విధంగా తుపాకులు హఠాత్తుగా ఆగిపోవటంచూచి స్టెలావ్ కూడా గాభరాపడుతున్నాడు. మాటిమాటికి టెలిఫోనుదగ్గిరకివచ్చి చూస్తు న్నాడు ఫోనుదగ్గర ఒక సైనికుడు రిసీవరు పుచ్చుకుని కూర్చున్నాడు.

"మళ్ళీ పిలిచిచూడు - జవాబురావటంలేదా ?"

"లేదు !"

"తీగలెక్కడైనా తెగిపోయినవేమో ... ఎవరినైనా తీగెల వెంట వెళ్ళమను ఈ లోగా నువ్వు జాగ్రత్తగా ప్రయత్నిస్తుండు"

చివరికి టెలిఫోను పలికింది. యెర్రసైనికుడు కాగితంమీద గబగబ యేదో గీకాడు.

"మనవాళ్ళు 'ఓఖభి' 'జలన్ట్స్' గ్రామాలు పట్టుకున్నారట !"

షేలాప్ బయటికివెళ్ళాడు. 'టెర్పిలిశా' మొదటగా కనుపించింది. ఆమెతో అన్నాడు :

"ఓఖబి, జలన్‌ట్స్ గ్రామాలు మన వశమైనాయి"

ఆమె సంతోషం పట్టలేకపోయింది.

"అందుకేనా తుపాకికాల్పులు ఆగిపోయినై."

"అందుకే –"

'టెర్పిలిశా' 'నటల్కాను' కలుసుకోటానికి ఆనందంతో వీధి వెంట పరుగెత్తింది.

"నటల్కా! విన్నావా? ఓఖబి జలన్‌ట్స్ మన వశమైపోయినాయి! కామ్రేడ్ షేలాప్ నాకు స్వయంగా చెప్పాడు—" టెలిఫోను రావటంతోటే బయటికివచ్చి నాతో చెప్పాడు..."

"మనవశమైపోయినవన్నమాట!"

"మొట్టమొదటే చెప్పలేదూ నేను? తుపాకికాల్పులు యెప్పుడైతే ఆగిపోయినవో అప్పుడే మనవశమైపోయినవన్నమాట"

"ఏమో? యెవరుగెలుస్తారో యెట్లా చెప్పగలంముందు?"

"తెలియకేం? చుట్టూ ముట్టడించాక జర్మను ఇంకేం చెయ్యగలడు? ఎప్పుడైతే ముట్టడింపబడ్డారో అప్పుడేవాళ్ళపని అయిపోయిందన్నమాట"

"సైనిక వ్యవహారాలు బాగా తెలుసునుమా, నీకు!

టెలిఫోను ఒకటే మ్రోగటం మ్రోగుతున్నది. షేలాప్ రిసీవరు పుచ్చుకుని – "ఎక్కడికి? యే దిశకు?"–అని గట్టిగా అడుగుతున్నాడు.

గ్రామంలోని ప్రజలందరు నిముషంలో అక్కడికి చేరుకున్నారు. ఎర్రసైనికులందరు అప్పుడే తయారవుతున్నారు.

"ఎక్కడికి బయలుదేరుతున్నారు? ఎక్కడికి?" అని స్త్రీలందరు ఆశ్చర్యంతో అడిగారు.

"ఆజ్ఞలు వచ్చినై, వెళ్ళిపోతున్నాము"

"ఎక్కడికి?"

"పడమటికి"

స్త్రీ లందరు నిరుత్సాహపడిపోయారు, ఆవిధంగా జరుగుతుందని కలలోనైనా అనుకోలేదు. 'ఫెవోసియా' వారి దగ్గరికి వచ్చి అన్నది :

"ఇదేమిటి? విందుకోసం వంటలన్నీ తయారుచేసి వుంచాము. అదీగాక యింతవరకు మీరు భోజనాలైనా చేయలేదు..."

"పరవాలేదమ్మా, ఇప్పుడు మాకేమీ ఆకలిగాలేదు. ముందుకి పొమ్మని ఆజ్ఞ లువచ్చినై, వెళ్ళిపోక తప్పదు. మరొక సైనికభాగం మీ రక్షణకోసం వస్తున్నది. మీరు వండినది వాళ్ళు తింటారులెండి..."

"అయ్యో ఇంకొక్క రోజైనా ఉండకపోతిరే!" అని ఒక స్త్రీ నిట్టూర్పు విడిచింది.

"పరవాలేదు, మీరు చూపించిన దయకు ధన్యవాదాలర్పిస్తున్నాము మళ్ళీ మావెనక వచ్చేవారు మీ రక్షణకోసం యిక్కడేవుంటారు. మేము మాత్రం వెళ్ళిపోక తప్పదు...జర్మన్లను తరిమెయ్యాలి."

"ఆమాట నిజమేలెండి"–అని స్త్రీలు నిట్టూర్చారు. ఎర్రసైనికులు బారులు తీర్చుకొని నిలుస్తుంటే గ్రామస్థులందరూ వారిని సాగనంపడానికి చేరుకున్నారు. కొందరు కండ్లనీళ్ళు పెట్టుకుంటున్నారు.

షెలాప్ గబగబా బయటికివచ్చాడు. ఎర్రసైనికులందరూ బారులు తీర్చి సిద్ధంగా నిల్చున్నారు.

"పదండి – ముందుకి"

"ఇక మేము వుంటాము సురక్షితంగా తిరిగిరండి. జర్మన్లను ఒక్కడుగూడా లేకుండా తరిమివెయ్యండి" అని గ్రామస్థులు కేకలువేశారు.

ఎర్రసైనికులు ముందుకి సాగిపోతున్నారు. పిల్లలందరు వారి ప్రక్కనే పరుగెత్తుతున్నారు. స్త్రీలందరూ వారిని సాగనంపటానికి వెళు తున్నారు.

ఎర్రసైనికులు ప్రజలతోపాటు నెమ్మదిగా నడుచుకుంటూ గంట స్తంభంవరకు వచ్చి ఆగారు.

ఎటుచూచినా మంచుతో నిండిపోయివున్న బయలు ముందు కని పిస్తున్నది. జర్మన్లు తగులబెట్టిన 'లివనెవ్కా' గ్రామందగ్గర నెమ్మదిగా పొగలు లేస్తూ కనబడుతున్నది.

గంట స్తంభం దగ్గరినుంచి 'షెలాప్' ఒకసారి పడమటిదిశగా చూశాడు. జర్మన్ల పాదాలక్రింద నలిగిపోతున్న ఉక్రేనియన్ బయళ్ళు. తెల్లని మంచుతో కప్పబడివున్న విశాలమైన బయళ్ళు – కనబడుతున్నాయి జర్మన్ల యినుపబూట్లక్రింద నలిగిపోయి, రక్తసిక్తమయి, మారణ హోమంలో మండిపోతూ సంకెళ్లలో ఉండికూడా యెదురులేని శక్తితో అంతులేని ధైర్యంతో పోరాడుతున్నది 'ఉక్రేనియను' దేశం ?

తర్వాత ఆకాశంలోకి చూచాడు. వన్నెవన్నెల ఇంద్రధనుసు భూమ్యాకాశాలను కలుపుతూ, తూర్పునుంచి పడమటికి విస్తరిస్తూ జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్నది.

షెలాప్ తన సైనికుల వైపు తిరిగాడు.

"పదండి ముందుకి ?– పదండి !"

సైనికులు క్రమబద్ధమైన అడుగులతో ముందుకి పోతున్నారు. గ్రామస్థులు వెనుక దిగబడిపోయారు. ఎవ్వరూ మాట్లాడలేదు. ఇంద్రధనుస్సు వెలుగులో, మంచుబయళ్ళలో సాగిపోతున్నారు.

దూరంలో కాలిపోతున్న 'లివనెవ్కా' గ్రామానికి, జర్మన్ల మొరటు పాదాలక్రింద క్రుంగిపోతున్న తదితర గ్రామాలవైపుకి వెళ్ళిపోతున్నారు. జర్మన్ల భయంకర పాలనలో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయిపోతూగూడా లొంగక పోరాడుతున్న 'ఉక్రేనియన్' భూతలంమీద సాగిపోతున్నారు.

గ్రామస్థులు మౌనముద్రితులయ్యారు. ఎర్రసైన్యం ఆ అనంతమైన మంచుబయళ్ళలో, ఇంద్రధనుస్సు తోరణంక్రింద చూపుమేరదూరం పోయేవరకూ, కండ్లు నొప్పులు పెట్టి నీళ్ళు వచ్చేటంతవరకు అలా చూస్తూ నిలబడిపోయారు.